ఆగష్టు 2013

₹ 5

ఆంధ్రప్రదేశ్

అందరికీ నచ్చే మాసపత్రిక



శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు


అజ్ఞాత కలం యోధులు...









ఈ సంచికలో . . .









శాలివాహన శకం
1935 శ్రావణం 10 – భాద్రపదం 9

సంపుటి : 57 సంచిక : 2

ఆంధ్రప్రదేశ్

(తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషు భాషలలో ప్రచురితం)

కమీషనర్ & పబ్లిషర్
ఎం. దానకిషోర్, ఐ.ఎ.ఎస్.

ప్రధాన సంపాదకులు
జి. వల్లీశ్వర్

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్
కె.ఎస్. శాస్త్రి

సహ సంపాదకులు
చెన్నూరి గణేశ్, రాజఫణి వి.
ప్రసాద్ గోసాల, ఎ. మధుసూదన రెడ్డి

ముఖచిత్రం
శ్రీకృష్ణాష్టమి
(చిత్రం : జి. శేషగిరిరావు)

రెండవ కవర్
అజ్ఞాతం కలం యోధులు

మూడవ కవర్
బోనాల వేళ . . .

నాల్గవ కవర్
ఈద్ ముబారక్

ప్రతి :రూ. 5/- ఏడాది చందా :రూ. 50/-

ప్రచురణ
సమాచార, పౌర సంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి. గార్డ్స్
హైదరాబాద్ - 500 028
ఫోన్ : 040-23300258

ముద్రణ
కార్ల్టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

పాఠకుల స్పందన

పోరాటయోధుడు దాశరథి

'**ఆం**ధ్రప్రదేశ్' జూలై సంచికలో మహాకవి దాశరథి గురించి శ్రీమతి గనిపాక పద్మగారు మంచి వ్యాసం అందించారు. ఆయన కవితా తత్వం గురించి ప్రశస్తంగా ప్రస్తావించి ఆనందింపచేశారు. దాశరథి అందరిలాంటి కవి కాదు. ఆయన ఇంట్లో కూర్చొని విప్లవ కవిత్వం రాసినవాడు కాదు. నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ విముక్తి పోరాటంలో ప్రాణాలు పణమొడ్డి ప్రత్యక్షంగా పాల్గొన్న దాశరథి జయంతి సందర్భంగా చక్కని వ్యాసాన్ని ప్రచురించిన సంపాదక వర్గానికి నమోవాకాలు.

– ఇ. వెంకటేశ్వరరావు, ఏలూరు, ప.గో.జిల్లా

'ఆంధ్రప్రదేశ్' పత్రిక వెబ్‌సైట్ మారింది.
ఇటుపై **www.ipr.ap.nic.in** లో చదవండి

అక్షరసత్యం

'**ఆం**ధ్రప్రదేశ్' జూలై సంచిక 'ముందు మాట' లో 'అమ్మా, నాన్న ఏం చేయాలి?' మకుటంతో కమీషనరుగారు రాసింది అక్షర సత్యం. నేడు చిన్నపిల్లల దగ్గర నుంచి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లకు అతుక్కుపోతున్నారనేది యధార్థం. పుస్తకాలు చదవటం, చేత్తో రాయటం జరగటం లేదు. తెలుగు భాషను మరచి పోతున్నారు. ఇటువంటి తరుణంలో అమ్మా, నాన్న ఏం చేయాలో బాగా తెలియ చేశారు. 'బంగారు తల్లి' గురించిన వ్యాసం బాగుంది. ఆడపిల్ల పుడుతుందంటేనే అందరికీ భయం. 'బంగారు తల్లి' పథకం ద్వారా ప్రభుత్వం ఆ భయాన్ని పోగొట్టింది. ఇకపై ఆడపిల్లల కొరత తీరుతుంది. కవితలు, కార్టూన్లు, సూర్యకాంతం పై వ్యాసం చాలా బాగున్నాయి.

– సూర్యదేవర గిరిజా ప్రసాద్
వైకుంఠపురం, తిరుపతి

విజయవాడలో 3వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

విజయవాడలో సెప్టెంబర్ 20 నుంచి మూడో రోజుల పాటు '3వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు' జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో కృష్ణాజిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్తంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నాయి. యువతరంలో తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక వికాసం కోసం 'సాహిత్యం, సమాజం–యువత' అనే అంశం లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహించనున్నారు.

రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలలో చదువుకొనే సాహిత్యాభిలాష కలిగిన వారిని ఎంపిక చేసి, తమ విద్యాలయాల నుంచి పరిచయ పత్రాలతో ఈ మహాసభలకు పంపవలసిందిగా విద్యాసంస్థల అధిపతులు, ఉపాధ్యాయులకు మహాసభల నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

యువ రచయితల కథలు, కవితలూ, వ్యాసాలు, గేయాలు, కార్టూన్లతో కూడిన 'మన యువత' అనే గ్రంథం ఈ మహాసభల ప్రత్యేక సంకలనంగా వెలువరించనున్నారు.

ఇందుకుగాను యువ రచయితలందరినీ తమ రచనలు పంపవలసిందిగా నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు. ఇదే సందర్భంలో 'మినీ కవితా ప్రదర్శన' కూడా నిర్వహించనున్నారు. యువకవి సమ్మేళనాలలో పాల్గొనదలచిన యువకవులు 2013 ఆగస్టు 15లోగా తమ పేర్లు తెలియజేయాల్సిందిగా సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి. పూర్ణచందు ఓ ప్రకటనలో కోరారు.

ఇతర వివరాలకు:
గుత్తికొండ సుబ్బారావు (అధ్యక్షులు): 9440167697
డాక్టర్ జి.వి. పూర్ణ చందు (ప్రధాన కార్యదర్శి) : 9440172642 లను సంప్రదించవచ్చు.
కార్యాలయం చిరునామా :
సత్యంటవర్స్, బకింగ్‌హోమ్ పేట, పోస్టాఫీసు ఎదురుగా, గవర్నరుపేట, విజయవాడ –520 002

తెలుగుదనానికి నిలువుటద్దం

ముఖచిత్రం నుంచి ముగింపు పుట వరకూ తెలుగు వారి జీవనశైలికి నిలువుటద్దం మన 'ఆంధ్రప్రదేశ్' పత్రిక. కథలు, కవితలు, వ్యాసాలు, వ్యాఖ్యానాలు, వార్తలు, ప్రభుత్వ పథకాలు, ఉత్తర్వులు, సంగీత, సాహిత్య విషయాలు... ఇలా రకరకాల శీర్షికలతో అలరిస్తున్న 'ఆంధ్రప్రదేశ్' ప్రతిక అందరికీ ఆస్వాదయోగ్యం. ముందుమాట, సంపాదకీయం, 'లోకాయుక్త'పై వ్యాసం బాగున్నాయి. ప్రతి శీర్షిక ఛాయాచిత్రం ప్రశంసనీయం. జూలై సంచికలో దాశరథి గారిపై వ్యాసం బాగుంది.

– కాటేపల్లి లక్ష్మీనరసింహమూర్తి,
మిర్యాలగూడ

'బంగారు తల్లి' : ఓ సూచన

'**ఆం**ధ్రప్రదేశ్' జూన్ సంచికలో 'బంగారుతల్లి' పథకం ప్రాధాన్యతను చక్కగా వివరించారు. ఈ పథకం ప్రవేశ పెట్టడంవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆడపిల్లల నిష్పత్తి పెరగడంతోపాటు, వారి అక్షరాస్యతకు దోహదం చేస్తుంది. పేద ప్రజల పిల్లలు విద్యనభ్యసించడానికి ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. అయినా, ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల నమోదు తక్కువగా ఉంటోంది. ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించాలన్నా, 'బంగారు తల్లి' పథకం విజయవంతం కావాలన్నా ఈ పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు మాత్రమే వర్తింపజేస్తే బాగుంటుందని నా అభిప్రాయం.

–జె. నారాయణ,
ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా

చైతన్య పరచే వ్యాసం

'**భ**ర్త వల్ల ఆమె డాక్టరైంది.' మకుటంతో 'ఆంధ్రప్రదేశ్' జూలై సంచికలో 'ఎందరో సైన్స్ మహానుభావులు' శీర్షికన ప్రచురించిన వ్యాసం ఎంతో బాగుంది. ఆనంది గోపాల్ జోషి చరిత్ర చాలా ఆశ్చర్యం కల్గించింది. 125 సంవత్సరాల క్రితం ఆచారాలు, కట్టుబాట్లు, మూఢ విశ్వాసాలు బలంగా ఉన్న రోజుల్లో, వాటన్నింటిని అధిగమించి, భర్త సహకారంతో డాక్టరై, విక్టోరియా మహారాణి ప్రశంసలు అందుకోవడం సామాన్యమైన విషయం కాదు. ఇలాంటి వ్యాసాలు ప్రజలను చైతన్యవంతం చేస్తాయి.

–గుగ్గిలం శ్రీహరి
వేటపాలెం, శ్రీకాకుళం జిల్లా

'ఆంధ్రప్రదేశ్' పత్రికకు చందా

అన్ని వర్గాల ప్రజలను అలరించే విధంగా, వినూత్నంగా, విజ్ఞానదాయకంగా వెలువడుతున్న 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక ఇంటింటా చదవవలసిన ఒక విశిష్ట పత్రిక. ఈ పత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును '**అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌరసంబంధాల శాఖ, హైదరాబాద్**' పేరిట పంపాలి. పూర్తి చిరునామాతో సహా ఈ క్రింది చిరునామాకు ఎం.ఓ. పంపించాలి.

అకౌంట్స్ ఆఫీసర్
సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఏ.సి. గార్డ్స్,
మాసాబ్‌ట్యాంక్, హైదరాబాద్ –500 028

ముందుమాట

ఆత్మహత్యే పరిష్కారమా!

ఒక పత్రికలో వార్త :

"కాకి రెండు సార్లు తలమీద తన్నిందని యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య..."

"భర్త కేకలేశాడని భార్య ఆత్మహత్య"...

"ప్రేమ విఫలమైందని ఆత్మహత్య...

– ఇలాంటి వార్తలు చదువుతుంటే ఎక్కడ్నుంచి ఎక్కడికి వెళ్తున్నాం అనిపిస్తుంది.

ప్రతి సమస్యకి ఆత్మహత్యే పరిష్కారం అయితే ఈ దేశంలో 122 కోట్ల ఆత్మహత్యలు జరగాలి. అది మన జనాభా సంఖ్య. ఈ జనాభాలో సమస్యలు లేని వాళ్ళెవరన్నా వుంటారా?

పంచాయతీ బంట్రోతు దగ్గర్నుంచి భారత రాష్ట్రపతి దాకా అందరికీ సమస్యలున్నాయి. అందరి అన్ని సమస్యలు బయటికి కనిపించకపోవచ్చు. నిజానికి కనిపించవు.

మనం రోజూ కలిసే మనుషుల్లో స్నేహితులు, బంధువులూ కూడా చిరునవ్వు నవ్వుతూనే వుంటారు. ఆఫీసులో, వ్యాపారంలో సహోద్యోగులు కూడా నవ్వు మొహంతోనే పలకరిస్తుంటారు. మానవ సంబంధాల శిక్షకులు (Counsellors) కూడా చిరునవ్వు అనేది ఖర్చులేని ఒక ఆభరణం అనీ, దాన్ని బాగా వాడుతుండాలని చెబుతుంటారు.

ఇలాంటి చిరునవ్వు పరదా వెనకాల ఎవరికి ఏ సమస్యలున్నాయో మనకి తెలుసా? మనకున్న సమస్యల్ని మాత్రమే మనం భూతద్దంలోంచి చూస్తాం. కుటుంబ తగాదాలు, చదువులో వెనకబడటం, పిల్లలకి పెళ్ళిళ్ళు ఆలస్యమవటం, ఆర్థిక సమస్యలు, ఊహించని విధంగా అనారోగ్యం వెంటాడటం... ఇలా సమస్యలు అనేవి అనేక రకాలున్నాయి.

మనకి ఉద్యోగంలో పెద్ద సమస్య ఎదురయినా, కుటుంబంలో మనం ప్రేమించేవాళ్ళకి కష్టమొచ్చినా – ఎక్కడలేని దు:ఖంలో మునిగిపోతాం. కనబడిన ప్రతి మనిషికి మన కష్టం చెప్పుకోటానికి ఆత్మగౌరవం అడ్డుపడుతుంది. అందుకని మన విచారాన్ని దాచుకునేందుకు ముఖానికి చిరునవ్వు అనే పరదా తగిలించుకుంటాం.

ప్రతి మనిషీ ఇలాగే చేస్తాడు. కాని మనం మాత్రం ఎదురుగా వున్న ప్రతి మనిషి (ఆ మొహంలో చిరునవ్వుని బట్టి) సుఖంగా వున్నాడనీ, కష్టాలన్నీ మనకే వచ్చి పడ్డాయని భ్రమలో మునిగిపోతాం.

కాని మనం పలకరించి చూస్తే మనం పరామర్శించడానికి కావలసినన్ని సమస్యలు అవతలి వ్యక్తిని వెంటాడుతూ వుంటాయి.

నాకు తెలిసిన ఒక జర్నలిస్టు మిత్రుడి తల్లికి క్యాన్సర్. బావగారు చనిపోవడంతో అతని అక్క వితంతువైంది. ఇంట్లో వుంది. ఆమెకీ క్యాన్సర్ సోకింది. అతని కుటుంబం అతనికి వుంది. పిల్లల చదువుల సమస్య. వీళ్ళందర్నీ అతనొక్కడి జీతమే ఆదుకోవాల్సిన కుటుంబ పరిస్థితులు. ఈ సమస్యలు జీవితంలో ఎప్పటికి పరిష్కారమవుతాయో తెలీదు. కాని, అతను సమస్యల్ని ఎదిరించి నిలబడ్డాడు. ఢిల్లీలో సమర్థుడైన పాత్రికేయుడిగా ఎదిగాడు.

వరంగల్లు జిల్లాలో పది హేనేళ్ళకే పెళ్ళయి, పది హేడేళ్ళకే ఇద్దరు ఆడపిల్లలకి తల్లయి, దుర్భర దారిద్ర్యం, చివరికి ఉమ్మడి కుటుంబంలో సమస్యలు తట్టుకోలేక ఆత్మహత్యకి ప్రయత్నించిన ఒక గ్రామీణ యువతి చివరి క్షణంలో మనసు మార్చుకుని "జీవితం అంటే ఏమిటి?" అని తెలుసుకునే ప్రయత్నం చేసింది. ఇప్పుడా అమ్మాయి అమెరికాలో 500 మిలియన్ డాలర్ల టర్నోవర్ గల మానవ వనరుల కన్సల్టెన్సీకి మేనేజింగ్ డైరెక్టర్.

తాత్కాలికమైన ఆవేశంలో ప్రపంచంలో అందరూ సుఖంగా వున్నారనీ, కష్టాలు మనకే వున్నాయనీ మన కష్టాలు ఇక తీరేవి కావనీ... భ్రమించి, ఆత్మహత్య చేసుకోవటం ద్వారా శాశ్వత పరిష్కారం సాధిస్తున్నామనుకోవటం ఎంత భ్రమ!

నిజానికి ఆత్మహత్యలకి పాల్పడటం ద్వారా మనల్ని అల్లుకుని, మన చుట్టూ వున్న తల్లిదండ్రులు, పిల్లలు, తోబుట్టువులూ, ఆత్మీయులు... వీళ్ళందరికీ ఎంతటి మానసిక వ్యధని కలిగిస్తున్నాం...!

స్వామి వివేకానంద మాటల్లో చెప్పాలంటే – సమస్యలు కోతిమూకల్లాంటివి. మనం పారిపోవాలనుకుంటే వెంటబడి తరుముతాయి. ఎదురుతిరిగి కర్ర చేతపట్టుకుంటే పారిపోతాయి.



కమీషనర్

సంపాదకీయం

సిగరెట్టూ - సుప్రీంకోర్టూ

“సిగరెట్ త్రాగటం వల్ల క్యాన్సర్ వస్తుంది.”

(లేదా)

“పొగత్రాగటం మీ ప్రాణాలు తీస్తుంది.”

ఇలాంటి హెచ్చరికని ప్రతి సిగరెట్‌ల, సిగార్‌ల ప్యాకెట్‌ల మీదా చూస్తుంటాం.

అయితే ఈ పొగాకు ఉత్పత్తులను తయారుచేసే కంపెనీలు వీటి ప్రచారం కోసం వినియోగించే బోర్డుల మీద, ప్రకటనలలోనూ ఇలాంటి హెచ్చరికలను ఎంత ప్రస్ఫుటంగా వేస్తున్నారు?

సిగరెట్ పెట్టెల మీద చిన్న అక్షరాలలో కనిపించే ఈ హెచ్చరికని ఇప్పుడు మన సుప్రీంకోర్టు చాలా పెద్ద సమస్యగా నిర్ధారించింది.

సిగరెట్ ఉత్పత్తులకి సంబంధించిన ప్రకటన బోర్డుల మీద “పొగ త్రాగడం మీ ప్రాణాలు తీస్తుంది” అనే హెచ్చరికని ఎంత పరిమాణంలో ముద్రించాలి. అన్న అంశం విషయంలో పొగాకు ఉత్పత్తుల ప్రకటనలకు సంబంధించి 2004లోనూ తిరిగి 2005 లోనూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల మీద “తాత్కాలిక” ‘స్టే’ని బొంబాయి హైకోర్టు 2005, 2006లలో జారీ చేసింది. ఇందువల్ల ఆ నిబంధనలు మహారాష్ట్రలో అమల్లోకి రాలేదు.

దీనిమీద ‘లక్షలాది ప్రజల ఆరోగ్యం కోసం’ అనే ఒక స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో వ్యాజ్యం వేసింది. గత జనవరి 3న సుప్రీంకోర్టు - బొంబాయి హైకోర్టు ‘స్టే’ ఉత్తర్వుల్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ జూలై 22నాటి ఉత్తర్వులో పూర్తిగా రద్దు చేసింది.

ఇంతకీ ఆ నిబంధనలు ఏం చెబుతున్నాయి? పొగాకు ఉత్పత్తుల ప్రకటన బోర్డుల పరిమాణం 90 సెం.మీ. x 60 సెం.మీ.లకు మించి వుండకూడదు. పైగా ఆ బోర్డులో నాల్గవ వంతు పరిమాణంలో ‘పొగత్రాగటం వల్ల క్యాన్సర్ వస్తుంది’ అని కానీ, ‘పొగత్రాగటం ప్రాణాలు తీస్తుంది’ అని కానీ వుండాలి. ఆ ఉత్పత్తి ‘గొప్పతనాన్ని’ ప్రచారం చేసే వాఖ్యలేవీ వుండకూడదు.

ప్రకటనల బోర్డు మీద హెచ్చరిక పరిమాణం ఎంత వుండాలీ అన్నది చాలా చిన్న విషయం కదా - అని అనిపించవచ్చు. నిజానికి అది అంత చిన్న విషయమే అయివుంటే సిగరెట్ ఉత్పత్తిదారులు దాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఏముంటుంది !

ప్రకటన బోర్డుల మీద నాల్గవవంతు పరిమాణంలో హెచ్చరికని ముద్రించటం అంటే చూపరుల దృష్టిని ఆ హెచ్చరిక వైపుకి విశేషంగా ఆకర్షించటమే. ఈ అంశానికి ఎందుకు సుప్రీంకోర్టు ఇంత ప్రాధాన్యతనిస్తోంది?

అభివృద్ధి చెందుతున్న దేశాలలో జనాభా మీద ఈ పొగాకు ‘ఉత్పత్తుల దుష్ప్రభావాన్ని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ - వీటి వినియోగాన్ని నిరోధించేందుకు ప్రపంచ దేశాలన్నింటినీ ఒక వేదిక మీదకు చేర్చి, 2005లో 168 దేశాల సంతకాలతో ఒక ఒప్పందాన్ని ఖరారు చేసింది.

ఈ ఒప్పందం స్ఫూర్తి ఏమిటంటే పొగాకు ఉత్పత్తుల ప్రకటనలు, ప్రచారాల మీద నిషేదాలు / ఆంక్షలు విధించేలా చట్టాలు చేయటం, సిగరెట్ ప్యాకెట్‌ల మీద ఏమార్చే పద ప్రయోగాలు లేకుండా చూడటం, సిగరెట్ పెట్టెల మీద ప్రస్ఫుటంగా కనబడేలా హెచ్చరికల్ని ప్రచురింపజేయటం, ప్రజారవాణా వ్యవస్థలోనూ ప్రజలు గుమికూడే ప్రదేశాల్లోనూ పొగ త్రాగేవారి ప్రభావం నుంచి ఇతరులను కాపాడటం... వగైరా.

ఈ ఒప్పందానికి భారత ప్రభుత్వం కూడా అంగీకరించింది.

ఈ అంశాన్ని కూడా ఉటంకిస్తూ సుప్రీంకోర్టు ఇలా హెచ్చరించింది: “ఏటా 10 లక్షల మంది గొంతు క్యాన్సర్‌తోనూ ఊపిరితిత్తుల క్యాన్సర్‌తోనూ మరణిస్తున్నారు. 2015 నాటికి ఈ సంఖ్య 85 లక్షలకి చేరుతుందని అంచనా. ఇది ఉపేక్షించదగిన విషయం కాదు.”

ఇదంతా కేవలం ‘లక్షలాది ప్రజల ఆరోగ్యం కోసం’ అనే ఒక్క స్వచ్ఛంద సంస్థ సొంత విషయం కాదు. మనందరి విషయం. కోట్లాది భారతీయుల ఆరోగ్యానికి సంబంధించిన విషయం. పొగత్రాగటం హానికరం అని భావించే ప్రతి ఒక్కరూ ఒక స్వచ్ఛంద సంస్థలా పనిచేస్తేనే ఈ తీర్పు యొక్క ప్రపంచ దేశాల ఒప్పందం యొక్క స్ఫూర్తి సత్ఫలితాలనిస్తుంది.



కథ

నాన్నకోసం....

– మల్లేపల్లి ప్రమోద్ కుమార్

ఎండవేడిమిని కూడా లెక్కచేయకుండా వడివడిగా అడుగులు వేస్తూ, మధ్యమధ్యలో కండువాతో చెమట అద్దుకుంటూ ముందుకు సాగిపోతున్నాడు చక్రపాణి. అతని కళ్ళ ముందు కనిపిస్తున్న గమ్యం ఒక్కటే! తొందరగా వృద్ధాశ్రమం చేరుకోవాలి.

తల వంచుకొని నడుస్తున్న చక్రపాణి ఒక్కసారి తలెత్తి చూశాడు. ఎదురుగా తాను చేరుకోవాల్సిన గమ్యం కనిపించగానే మనసుకు కాస్త ఊరట కలిగింది. మరోసారి చెమటతో తడిసిన ముఖాన్ని తుడుచుకొని వృద్ధాశ్రమంలోకి అడుగుపెట్టాడు.

లోపలికి వెళ్ళగానే ఆ వృద్ధాశ్రమ నిర్వాహకుల్లో ఒకరైన కృపాకర్ కనిపించి, “నమస్కారం చక్రపాణి గారూ! మీరేంటి ఇలా వచ్చారు?” అంటూ పలకరించాడు.

“నమస్కారమండీ! మరేంలేదు. నేను మీ వృద్ధాశ్రమంలో చేరాలనుకుంటున్నాను. ఫార్మాలిటీస్ ఏమేం ఉంటాయో కనుక్కుందామని వచ్చాను.”

కృపాకర్ ఆశ్చర్యపోతూ “మీకేం ఖర్మండీ వృద్ధాశ్రమంలో చేరడానికి. మంచి భార్య, సంస్కారవంతుడైన కొడుకు, మనవలు ఇంతమందిని వదిలేసి ఇక్కడికి రావడమేంటి?” అన్నాడు.

చక్రపాణి బాధగా నిట్టూరుస్తూ, “నా భార్య ఈ మధ్యే చనిపోయిందండీ! ఈ రోజు ఆమె దశదినకర్మ” అన్నాడు.

కృపాకర్ బాధపడుతూ. “అయ్యో నాకీ విషయం తెలియదండీ! ఎలా జరిగింది?” అన్నాడు.

“ఆరోగ్యంగానే ఉండేది. ఉన్నట్టుండి నిద్దట్లో పోయింది. అయినా ఇంతకాలం ఆమె పడిన కష్టానికి దేవుడు కరుణించి, సేద తీర్చాలనుకున్నాడు కాబోలు తన వద్దకు తీసుకెళ్ళాడు” అన్నాడు బాధగా.

కృపాకర్ నొచ్చుకుంటూ, “జరిగిందేదో జరిగిపోయింది. ఇక మీ శేష జీవితం మీ మనుమలతో ఆడుతూపాడుతూ బాధల్ని మరిచిపోయి గడిపేయండి. భార్య పోగానే ఒంటరితనంతో మీరిక్కడ చేరాలనుకుంటున్నారేమో, మీ కొడుకు బాధ పడతాడని ఒక్క క్షణం కూడా అనిపించలేదా?” అన్నాడు.

జీవంలేని నవ్వొకటి పెదాలపై కదిలింది, “రేపు సాయంత్రమే వాడు భార్యా పిల్లలతో అమెరికా వెళుతున్నాడు” అన్నాడు బాధగా.

“అయ్యో! అదేంటి? మిమ్మల్ని ఇలాంటి పరిస్థితిలో ఒంటరిగా వదిలేసి అతనలా వెళ్ళడమేంటీ? మీరు వద్దనలేకపోయారా?”

“అయ్యయ్యో! వాడి ఉద్దేశ్యం అదికాదు. వాడికి ఎప్పటినుండో అమెరికా వెళ్ళాలని కోరిక. సంవత్సరం నుండి కష్టపడితే ఇంతకాలానికి ఆ అవకాశం వచ్చింది. మొన్ననే వెళ్ళాల్సింది. ఈ కార్యక్రమం కోసం ఈ రోజు వరకు ఆగాడు. అందుకే ఎప్పుడూ మనుషుల మధ్యే ఉన్న నేను ఆ లంకంత కొంపలో ఒంటరిగా ఉండలేక మీ ఆశ్రమంలో చేరాలనుకుంటున్నాను. దయచేసి వివరాలు చెప్పండి” అన్నాడు.

చక్రపాణి ఎలాగైనా వృద్ధాశ్రమంలో చేరాలనే నిర్ణయించుకున్నాడని అర్థమై అందులో చేరడానికి కావలసిన వివరాలన్నీ చెప్పి పంపించాడు కృపాకర్.

చక్రపాణి ఇంటికి వెళ్ళేసరికి అతనికోసం కొడుకు నీరజ్ ఎదురు చూస్తు ఉన్నాడు. “ఏంటి నాన్నా ఈ సమయంలో ఎక్కడికి వెళ్ళారు? అక్కడ పూజకన్నీ రెడీ చేశారు రండి” అంటూ తండ్రి సమాధానం కోసం కూడా చూడకుండా లోపలికి నడిచాడు.



చక్రపాణి లోపలికి వెళ్ళి స్నానం చేసివచ్చి భార్య ఫొటో ముందు పూజకు కూర్చున్నాడు. బ్రాహ్మణుడు పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు. ఆ ఫోటోనే తదేకంగా చూస్తున్నాడు చక్రపాణి. ఆ ముఖంపై చిరునవ్వు అందంగా కనిపిస్తుంది. ఫొటోలోనే కాదు ఎప్పుడూ ముఖంపై చిరునవ్వు చెరగనిచ్చేది కాదు. ఆమె ముఖం అతని కళ్ళముందు కదలాడుతోంది. మనసు ఆమెతో మాట్లాడుతోంది.

'విజయా! నన్ను ఒంటరివాణ్ణి చేసి నీవు మాత్రం ప్రశాంతంగా దిగంతాలకు సాగిపోయావా! జీవితమంతా ప్రేమను పంచడమే తప్ప మరోటి తెలియని నీవు నాకు ఆత్మీయతనే అందించావు. అనురాగాల్నే పంచావు. ఉదయం కళ్ళజోడు అందించడం నుండీ రాత్రి నాకు దుప్పటి కప్పే వరకు అన్ని పనులూ నీవే చేసేదానివి. నా పనులు నాకే తెలియకుండా చేశావు. ఇప్పుడు ఆ పనులన్నీ కొత్తగా ఎలా అలవాటుచేసుకోను? ఈ జీవితచరమాంకంలో నీ తోడు లేకుండా ఎలా జీవించను? కనీసం మనవలతోనైనా గడుపుదామంటే వాళ్ళు కూడా నాకా అవకాశమివ్వకుండా రేపే వెళ్ళిపోతున్నారు. విజయా! వాడికి నీవైనా చెప్పొచ్చుగా! మీ నాన్న ఒంటరిగా ఉండలేడు. అలాంటిది నేను కూడా లేని ఈ సందర్భంలో అతన్ని వదిలేసి వెళ్ళకు అని. అమెరికా వెళ్ళాలన్న వాడి చిరకాల వాంఛను తీర్చుకోకూడదని నేననుకోవడం లేదు. కానీ నా చేతుల్లో పెరిగిన నా బిడ్డ నాకు కాకుండా దూరంగా పోతున్నందుకు నా మనసు ఎంత ఆక్రోశిస్తుందో వాడర్థం చేసుకోలేదు. నాకూ ఎలాగూ వయసైపోయింది. ఇంకొంత కాలంలో నేనూ నిన్ను చేరుకుంటాను. నేను కూడా పోయాక ఇక వాడికి అడ్డు చెప్పేవారెవరూ ఉండరు కాబట్టి అప్పుడే వెళ్ళొచ్చుగా! అయినా నా బాధ వాడికెలా అర్థమౌతుందిలే! రేపు వాడి కొడుకు వాడిని వదిలిపోతుంటే అప్పుడర్థమౌతుంది ఈ రోజు నేను పడే బాధేంటో! ఈ బంధువులైనా కొన్నిరోజులు వుంటారేమో అని అనుకుంటే నిన్ను సాగనంపడానికి వచ్చారు, రేపు వాడిని సాగనంపి వెళతారు. అంతేకదా విజయా! నీవు అనంతలోకాలకు పోయినా, వాడు అమెరికాకు వెళ్ళినా మీరిద్దరూ నాకింకెప్పుడూ కనిపించరుగా!'

"అయ్యా! ఏడుస్తూ పూజా కార్యక్రమం చేస్తే ఫలితముండదు" అన్న పురోహితుడి మాటలకు అప్పుడర్థమయ్యింది చక్రపాణికి తన కళ్ళ నుండి నీరు ధారాపాతంగా కారిపోతున్నాయని. వెంటనే కండువాతో కన్నీళ్ళు తుడుచుకున్నాడు. ఎలాగోలా కర్మకాండలు ముగించి, అందరూ బలవంతం చేస్తే ఏదో కాస్త తిన్నాననిపించి తన పడకగదిలోకి వెళ్ళాడు. బలవంతంగా కళ్ళుమూసుకున్నాడు.

భార్య పోయిందన్న బాధో లేక తన కొడుకు తనను వదిలి పోతున్నాడన్న భయమో తెలియదుగానీ అతని హృదయం వేగంగా కొట్టుకుంటోంది. గొంతు మధ్యలో ఏదో అడ్డు పడ్డట్టుగా అనిపిస్తోంది.



మాటిమాటికీ కళ్ళలోకి నీళ్ళొస్తున్నాయి. 'భగవంతుడా! రేపటి రోజును కాస్త నిదానంగా రప్పించరాదూ!' అనుకుంటూ లేచి గదిలో అటూ ఇటూ పచార్లు కొడుతున్నాడు. బిగ్గరగా ఏడవాల నిపిస్తోంది. ఒక్కసారి తన కొడుకు ఒడిలో తలపెట్టి పడుకోవాలనిపిస్తోంది. నిద్ర రావడంలేదు. ఇలాగే ఉంటే తనకు పిచ్చి పడుతుందేమోనని నిద్రమాత్ర వేసుకొని నిద్రాదేవిని ఆహ్వానించాడు. కొడుకు, కోడలు సామానులు సర్దుతున్న శబ్దం వినిపిస్తుండగా నిద్రలోకి జారుకున్నాడు చక్రపాణి.

చక్రపాణి రాకూడదనుకున్న ఉదయం రానేవచ్చింది. నిద్రమాత్ర మత్తు ఇంకా దిగలేదేమో, తన భార్య లేని విషయం మరిచిపోయి "విజయా!" అని కేకేశాడు.

అంతే... టక్కున కళ్ళజోడుతో ఆ గదిలోకి పరిగెత్తుకొచ్చి "ఇదిగో నాన్నా కళ్ళజోడు" అంటూ అందించాడు నీరజ్. అప్పుడు గుర్తుకొచ్చింది తన భార్య తనను వదిలిపోయిందని.

సమయం చూసుకున్నాడు. ఉదయం ఏడయ్యింది. అంటే ఇక తన కొడుకు తనతో ఉండేది కేవలం పన్నెండు గంటలేనన్నమాట! సాయంత్రం ఏడు గంటలకు ఫ్లైట్. వాడు ఇంట్లోంచి ఐదు గంటలకే వెళ్ళాలి. ఇక క్షణాల్ని లెక్క పెడుతూ గడపాల్సిందేనా తను.

చక్రపాణి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు. గీజర్‌లోంచి వేడినీళ్ళు ఒంటిపై పడుతున్నాయి. ఒళ్ళంతా సబ్బుతో రాసుకున్న చక్రపాణి వీపు రుద్దుకోవడానికి ఎంతో ఇబ్బందిపడుతున్నాడు. 'ఎంత పని చేశావు విజయా! నా వీపే నాకందకుండా చేశావు కదా! ఎప్పుడూ నీవే నా వీపుకు సబ్బు రుద్ది స్నానం చేయిస్తే ఇక నా చేతులకి నా వీపెలా అందుతుంది?' అనుకుంటూ వీపుకు సబ్బు రుద్దుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఇంతలో ఓ మెత్తటి చేతి స్పర్శ అతని వీపుపై తాకింది. ముఖానికి సబ్బు ఉండడం వల్ల కళ్ళు తెరవలేకపోయాడు. ఒక్కక్షణం తన విజయే వచ్చి వీపు రాస్తున్న భావన కలిగింది. ఆహా ఆ భావన నిజమైతే ఎంత బాగుండును? అనుకుంటూ కళ్ళు కడుక్కొని వెనక్కి తిరిగి చూశాడు. ఎదురుగా కనిపించిన దృశ్యానికి అప్రతిభుడైపోయాడు.

తన వీపు రాస్తున్నది తన కొడుకు... నీరజ్...! "ఏంట్రా నీవు నా వీపు రాయడమేంటీ?" అన్నాడు ఆశ్చర్యంగా.


"అదేంటి నాన్నా అలా అంటావు? ఎప్పుడూ అమ్మే మీకు వీపు రాయడంవల్ల మీకు వీపు అందదని నాకు తెలుసు. అయినా నేను మీకు వీపు రాయడం తప్పా నాన్నా? నా చిన్నప్పుడు నాకెన్నిసార్లు స్నానం చేయించి ఉంటావు? ప్రతి వేసవిలో మనిద్దరం కలిసి ఎన్నిసార్లు స్నానం చేయలేదు నాన్నా! పరమ పవిత్రమైన మీ చేతులతో నా పాదాలను తాకి షూస్ వేసిన దానికంటే ఎక్కువా నాన్నా ఇది? బురదలో ఆడి వస్తే అమ్మ నేను కడగను పోరా అని కోపగించుకున్నప్పుడు నన్ను బాత్‌రూమ్‌లోకి లాక్కెళ్ళి స్నానం చేయించిన దానికంటే ఎక్కువా నాన్నా ఇది? కనీసం ఈ ఒక్కరోజైనా మీ సేవ చేయనివ్వండి నాన్నా!" అన్నాడు కన్నీళ్ళతో.

చక్రపాణికి దు:ఖం ఆగడం లేదు. కారి పోతున్న కన్నీళ్ళు కనిపించకుండా ముఖంపై నీళ్ళు పోసుకున్నాడు. 'ఈ ప్రేమ ఈ ఒక్కరోజే కాక నేను బ్రతికున్నన్నిరోజులు ఇస్తావా!' అతను అడగలేదు... అతని మనసు ఆక్రోశిస్తోంది.

ఎలాగోలా స్నానం ముగించి బయటికి వచ్చాడు. వచ్చేసరికి డైనింగ్ టేబుల్ మీద టిఫిన్ రెడీగా ఉంది. కోడలు "రండి మావయ్యా టిఫిన్ చేద్దురుగానీ!" అంటూ ప్రేమగా పిలిచింది. విజయ గుర్తుకు రాకుండా తాను చేసే పనులన్నీ వీళ్ళే ఎంత చక్కగా చేస్తున్నారు. దేవుడా! ఈ రోజునిలాగే ముగియనీయకు స్వామీ! అంటూ కోటి దేవుళ్ళకు మొక్కుకుంటున్నాడు చక్రపాణి.

టిఫిన్ చేసి మనవడిని, మనవరాలిని తన ఒళ్ళో

ఎత్తరా మన జాతి జెండా



ఎత్తరా మన జాతి జెండా
చిత్తమే ఉప్పొంగుచుండా
గాలి తరగలు తేలియాడే
మూడు రంగుల పూల దండా.

మాననీయుల త్యాగశక్తికి
ఆనవాలుగ నిల్చినట్టిది
శాంతి మార్గం వీడకుండా
శ్వేతజాతిని గెల్చినట్టిది...

దిక్కుతోచని భారతీయులు
ధీరవరులుగ మార్చినట్టిది
దేశభక్తిని గుండె గుండెను
మోసు లెత్తగ చేసినట్టిది.

– ఈదుపల్లి వెంకటేశ్వర రావు

కూర్చోబెట్టుకొని, "ఏరా మీరు కూడా నన్ను వదిలేసి పోతున్నారా?" అన్నాడు బాధగా.

"ఎక్కడికి వెళుతున్నాం తాతయ్యా?" అన్నారు పిల్లలు అమాయకంగా.

అయ్యో పిల్లలకెలా చెప్పాలి? తాను చూడాలనుకున్నప్పుడు చూడలేనంత దూరం వెళుతున్నారని! వారు రావాలనుకున్నప్పుడు రాలేనంత దూరం వెళుతున్నారని!

టైం చూద్దామంటేనే భయం వేస్తోంది. కానీ మాటిమాటికీ గడియారం వంకే వెళుతున్నాయి. పది గంటలు దాటుతోంది. ఇంకా ఈ పిల్లలతో గడిపేది తొమ్మిది గంటలేనా అనిపించి ఇద్దరినీ గాఢంగా తన గుండెలకదుముకున్నాడు. ఒక జీవిత కాలపు ప్రేమనంతా ఈ ఒక్కరోజే అనుభవించాలన్నట్టుగా ఉంది. మనసంతా తన కన్నకొడుకు ప్రేమ కోసం ఆర్తిగా ఎదురు చూస్తోంది. హృదయమంతా తన మనవల ప్రేమకోసం అలమటిస్తోంది.

ఇంట్లో హడావిడి ప్రారంభమయ్యింది. అన్నీ సర్దుతున్నారు. ఆ దృశ్యాలు చూడలేక బయటికి వెళ్ళాడు చక్రపాణి. బయట కూడా ఎక్కువసేపు ఉండలేక మళ్ళీ ఇంట్లోకి వచ్చాడు. మధ్యాహ్న భోజనాలయ్యాయి. అతనిలో బాధ ఇంతకింతకూ పెరిగిపోతోంది. ఆ బాధను తట్టుకోలేక మళ్ళీ ఒక నిద్రమాత్ర వేసుకొని పడుకున్నాడు.

లేచి చూసేసరికి సమయం ఆరవుతోంది. అంతే... టక్కున లేచి బయటికి వచ్చాడు. ఎక్కడివారక్కడే ఉన్నారు. నీరజ్ ఇంట్లో లేడు. బయట ఏదో పని పడి వెళ్ళాడు కాబోలు. 'ఏంటీ రెడీ కావడం లేదు?' అని అడగాలనిపించింది కానీ మాట గొంతు దాటి రాలేదు. గొంతుకు ఏదో అడ్డు పడ్డట్టయ్యింది. ఇంతలోనే ఫ్లైట్ లేటేమోననే సమాధానం తానే చెప్పుకొని సర్దుకున్నాడు. ఏమీ తోచక ఇంట్లో అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఓ అరగంటాగి నీరజ్ వచ్చాడు. కొడుకు వంక చూస్తేనే చక్రపాణికి దు:ఖం ఉబికి వస్తోంది. కన్నీరు కనిపించకుండా కళ్ళజోడు సరిచేసుకుంటూ మరోవైపుకు కదిలాడు.

సమయం ఏడు... ఏడున్నర.. ఎనిమిది కూడా దాటుతోంది. కానీ ఎవరిలోనూ హడావుడి కనిపించడం లేదు. నీరజ్ తాపీగా టీవీ చూస్తున్నాడు. కోడలు వంటగదిలో పని చేసుకుంటోంది. మనవలు బయట ఆడుకుంటున్నారు.

'కొంపదీసి ప్రయాణం రేపటికి పోస్ట్‌పోన్ అయ్యిందేమోననిపించింది' ఆ ఊహే అతని మనసుకు ఎంతో ఆనందాన్నిచ్చింది. చక్రపాణి మనసంతా గజిబిజిగా ఉంది. ఇక ఆగలేకపోయాడు.

"ఏంట్రా ఏమయ్యింది. బయలుదేరడం లేదు? ఫ్లైటేమైనా లేటా?" అన్నాడు తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో. తన మాట వినబడనట్టుగానే నీరజ్ టీవీలో లీనమైపోయాడు. "నిన్నేరా అడిగేది?" అన్నాడు మళ్ళీ.

నీరజ్ ఒక్కసారి తండ్రివైపు తిరిగి చూశాడు. అతని కళ్ళు ఎర్రగా ఉన్నాయి. చక్రపాణి కాస్త ఆశ్చర్యపోయినా వెంటనే సర్దుకొని. "ఏంటి ఆలస్యం?" అని అడిగాడు.

"ఈ మాట మీరు మనస్ఫూర్తిగా అడుగుతున్నారా నాన్నా!" అన్నాడు తండ్రివైపు తిరిగి.

కొడుకు గొంతులోని మార్పును గమనిస్తూ, "నిజమేరా!" అన్నాడు ఆశ్చర్యంగా.

అంతే... కూర్చున్నచోటినుండి ఒక్క ఉదుటున లేచి, తండ్రిని గాఢంగా ఆలింగనం చేసుకొని, "లేదు నాన్నా నిన్ను వదిలి వెళ్ళను. నిన్ను ఒంటరివాన్ని చేసి మేము వెళ్ళలేము నాన్నా! అమ్మ తోడు లేని మిమ్మల్ని మరింత కృంగదీసి మేమెలా వెళ్తామనుకున్నావు నాన్నా! నాకు మీకన్నా అమెరికా ప్రయాణమేమీ ముఖ్యంకాదు. మీ గుండెలపై ఆడుకున్న నేను ఆ గుండెకు గాయమెలా చేయగలరనుకున్నారు నాన్నా! నా వేలు పట్టి నడక నేర్పిన మీ చేతిని వదిలి వెళ్ళలేను నాన్నా! అటు అమ్మ లేక ఇటు మేమూ లేక మీరు ఒంటరిగా ఎలా ఉండగలరు నాన్నా! మీ పనులు మీరే సరిగ్గా చేసుకోలేరు కదా! అలాంటి మిమ్మల్ని మేము కూడా వదిలి వెళ్ళిపోతే మీరెంత తల్లడిల్లిపోతారు! మీరెంత కష్టపడితే నేనీరోజు ఈ స్థాయికి వచ్చానో నాకు తెలుసు. అవన్నీ మరిచిపోయి జీవిత చరమాంకంలో ఉన్న మీకు ఆనందం, మనశ్శాంతి ఇవ్వకుండా మిమ్మల్ని ఒంటరిని చేసి నేను వెళ్ళలేను నాన్నా! నేను అమెరికాలో చేసే ఉద్యోగమేదో ఇక్కడే చేస్తాను. ఇక్కడ వచ్చిన సంపాదనతో మనమంతా హాయిగా బ్రతకగలం. ఎట్టి పరిస్థితుల్లోనూ మేము మిమ్మల్ని వదిలి వెళ్ళే ప్రసక్తే లేదు నాన్నా!" అంటూ తండ్రిని వదిలి కళ్ళు తుడుచుకున్నాడు నీరజ్.

చక్రపాణి సత్తువ లేనట్టుగా కుర్చీపై కూలబడ్డాడు. అందరి కొడుకుల్లాగే తన కొడుకూ అనుకున్న తన అజ్ఞానానికి సిగ్గుపడ్డాడు.

కొడుక్కి ఎంతో మంచి పెంపకం ఇచ్చానని నిన్నటిదాకా అనుకున్న ఆ మనసుతోనే ఆ కొడుకుని ఇవ్వాళ 'కృతఘ్నుడ్ని' చూసినట్లు చూడబోయాడు.

ఎలాంటి విత్తనానికి సకాలంలో నీరు పోసి పోషణ చేస్తామో (సంస్కారం ఇస్తామో) అలాంటి మొక్కే పెరిగి సత్ఫలాలనిచ్చే చెట్టవుతుందన్న జ్ఞానాన్ని కోల్పోయాడు.

ఒక్కసారిగా ఏదో పెద్ద నేరం చేశానన్న భావన చక్రపాణిని చుట్టుముట్టేసింది. కళ్ళల్లో నీళ్ళు నిండిపోతుంటే, కొడుకుని దగ్గరకి రమ్మని సైగ చేశాడు.

నీరజ్ దగ్గరికి రాగానే చేతులు పట్టుకుని "క్షమించరా నాన్నా" అన్నమాటల్ని గొంతులోనే మింగేస్తూ ఆ చేతుల్లో మోహం దాచుకున్నాడు.

☆

తెలుగు వెలుగులు

- జి. వెంకట రామారావు

ఆయన అడ్డుకోకపోతే అనంతపురం జిల్లా లేదు

1885 డిసెంబరు 28న బొంబాయిలో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు తొలి సమావేశానికి రాయలసీమ నుంచి ఏకైక ప్రతినిధిగా హాజరైన యువకుడు గుత్తికేశవ పిళ్లై. 1917-18లో జాతీయ కాంగ్రెస్‌కు అనీబిసెంటు అధ్యక్షురాలుగా ఉన్నప్పుడు కేశవపిళ్లై సహాయ కార్యదర్శిగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. అనంతపురం నుంచి గంజాం వరకు గల 11 జిల్లాల ప్రతినిధిగా 1908లో మద్రాసు శాసన మండలికి ఎన్నికై 22 సంవత్సరాలు ఆ సభ సభ్యుడుగా ఉంటూ, 1919లోను, 1926లోను రెండు సార్లు శాసనమండలి ఉపాధ్యక్షుడుగా పనిచేసిన కేశవపిళ్లై శాసన మండలి పితామహుడుగా పేరుగాంచారు. 1923లో మత ధర్మదాయ బిల్లును శాసనమండలిలో ఆమోదింపచేయడంలో ఆయన కృషి ఎంతో ఉంది.



గుత్తికేశవ పిళ్లై

రాయలసీమ ఆణిముత్యం అనిపించుకున్న గుత్తికేశవ పిళ్లై తమిళనాడులోని ఉత్తర ఆర్కాట్ జిల్లా గుడియాత్తం తాలూకాలోని పట్టు అనే గ్రామంలో 1860 అక్టోబర్ 18వ జన్మించారు. చిత్తూరు హైస్కూలులో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. తిరుత్తణిలో న్యాయవాద పరీక్షలో ఉత్తీర్ణులైనారు. గుత్తి (గుంతకల్)లో న్యాయవాద వృత్తిని ప్రారంభించి అక్కడే స్థిరపడ్డారు. పట్టు గ్రామంలో జన్మించినందున పట్టు కేశవ పిళ్లై అని, గుత్తిలో స్థిరపడినందున గుత్తి కేశవ పిళ్లై అని ఆయన ప్రచారంలోకి వచ్చారు.

ప్రజా సేవా రంగంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న కేశవపిళ్లై 1884లో గుత్తి జన సంఘాన్ని స్థాపించారు. దీనికి 25 సంవత్సరాలు కార్యదర్శిగా, మరో 20 సంవత్సరాల పాటు అధ్యక్షుడుగా ఉంటూ, స్థానిక సమస్యలను ప్రజల తరఫున ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళుతూ వాటి పరిష్కారానికి కృషి చేశారు. మద్రాసు జనసభకు గుత్తి జనసంఘం అనుబంధ సంస్థగా ఉండేది. అనంతపురం జిల్లాకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆనాటి ప్రజలు కేశవపిళ్లైను 'అనంతపురం నానాసాహెబ్' అని ఆప్యాయంగా పిలుచుకునేవారు.

1925లో దత్త మండలాల నీటిపారుదల కమిటీకి సభ్యుడుగా తుంగభద్ర ప్రాజెక్టు కోసం కృషి చేశారు. 1931లో అప్పటి ప్రభుత్వం అనంతపురం జిల్లాను రద్దు చేసి పరిసర జిల్లాలలో కలిపివేయాలని ప్రతిపాదనలు చేయగా అందుకు వ్యతిరేకంగా కేశవపిళ్లై ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి పెద్ద ఆందోళన జరిపి అడ్డుకోగలిగారు.

1884లో గుత్తిలో నీటి కరువు ఏర్పడింది. అనంతపురం జిల్లా కలెక్టరు పరిస్థితులను పరిశీలించడానికి గుత్తికి వచ్చారు. ఆ సమయంలో కేశవపిళ్లై తన మిత్రులతో కలెక్టరుని దర్శించుకొని గుత్తి పట్టణ అవసరాలను తీర్చేందుకు జిల్లా బోర్డు నిధులు కేటాయించాల్సిన అవసరాలను గురించి వివరించారు.

కేశవపిళ్లై విషయ పరిజ్ఞానానికి, వాగ్ధాటికి ముగ్ధుడైన కలెక్టర్ ఆయనను జిల్లా బోర్డు మెంబరుగా నియమించారు. గుత్తి తాలుకా బోర్డు, అనంతపురం జిల్లా బోర్డు అధ్యక్షులుగా ఒక దశాబ్దం పాటు జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి పనిచేసే అవకాశం ఆయనకు లభించింది. జిల్లా బోర్డు అధ్యక్ష పదవి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ మద్రాసు కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్ర నాయకులయ్యారు. దీనితో ఆయన ప్రతిష్ఠ, గుత్తి ప్రతిష్ఠతో కూడా పెరిగింది.


కేశవపిళ్లై ప్రభుత్వ సహకార ధోరణి అవలంబించి నప్పటికీ ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు ప్రభుత్వంతో పోరాడటానికి జంకలేదు. 1893 అక్టోబరు 4 నాడు ఈ ప్రాంతంలో కొందరు ఆంగ్లేయ సిపాయిలు హిందూ మహిళలను బలాత్కరించడానికి ప్రయత్నించారు. వారి మాన సంరక్షణార్థం ఆంగ్లేయ సిపాయిలనడ్డుకొని అశువులు బాసిన గూళపాళెం హంపన్న ఉదంతాన్ని పత్రికల కెక్కించి సంచలనం సృష్టించారు. ఆ కేసును హైకోర్టు వరకు తీసుకువెళ్లి నిందితులకు శిక్షపడేలా చేశారు. ఈ సంఘటన చిరకాలం గుర్తుండేటట్టుగా హంపన్న స్మారక ఫలకాన్ని నెలకొల్పారు. ఆ స్థూపాన్ని అక్కడి నుండి తొలగించేందుకు ఆంగ్లేయులు కృషిచేయగా, ఆ ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. నేటికీ ఆ స్థూపం గుత్తిలో స్థిరంగా ఉంది. 1921లో బ్రిటీష్ గయానాకు వెళ్లిన భారత ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించారు.

కేశవపిళ్లై జర్నలిస్టుగా హిందూ పత్రికకు పనిచేశారు. జాతీయ ఉద్యమాన్ని గురించి తన అభిప్రాయాలను నిర్భయంగా రాసేవారు. సేలంలో హిందూ -ముస్లింల తగాదాలు వచ్చినప్పుడు హిందూ పత్రిక ప్రత్యేక విలేఖరిగా అక్కడికి వెళ్లి విషయాలను కూలంకషంగా రాశారు. ఆ పత్రికకు రాసిన వ్యాసాలు ఆయనకు విశేషకీర్తిని తెచ్చిపెట్టాయి.

కేశవపిళ్లై విద్యావేత్త. అనంతపురం జిల్లాలో విద్యావ్యాప్తికి, పాఠశాలల స్థాపనకు ఎంతో కృషి చేశారు. హరిజనోద్ధరణకు పాటుపడ్డారు. ఆయనకు ప్రభుత్వం 'దివాన్ బహద్దూర్' అనే బిరుదు నిచ్చి సత్కరించింది.

దేశ సేవలో తొలితరం నాయకులలో ఒకరైన గుత్తి కేశవపిళ్లై తన 73వ ఏట 1933 మార్చి 28న గుత్తిలోని స్వగృహంలో మరణించారు. ఆయన స్మృతి చిహ్నంగా 1935లో డా॥ రాజేంద్రప్రసాద్ 'కేశవ విద్యానికేతన్' పేర హరిజన హాస్టల్‌కు అనంతపురంలో ప్రారంభోత్సవం చేశారు.

1984 అక్టోబరు 8న పిళ్లై 128వ జయంతిని పురస్కరించుకొని భారత ప్రభుత్వం పిళ్లై పేరుతో తపాలా బిళ్ళను విడుదల చేసింది. ☆





ఎప్పటి శ్రీకృష్ణుడు? ఎప్పటి గీత!

అయిదు వేల సంవత్సరాలు గడిచిపోయాయి.

ఇప్పుడింకా ఆ 'గీత' మన గీతల్ని మెరుగుపర్చగలదా?

నిజమే, యుగం మారింది.

అవసరాలు మారినయ్.

వాటిని బట్టి విలువలు రూపాంతరీకరణం చెంది, కాలగమనంలో పలచబడి, మనిషిని గందరగోళంలో పడేస్తున్నాయ్. ప్రాపంచిక సంపదలెన్నివున్నా, విజ్ఞాన శాస్త్రం అంతరిక్షాన్ని అరచేత నిలిపినా, అన్వేషణలన్నీ జీవించటానికి అక్కరకొచ్చే రీతిలో సాగుతున్నా, ఆనందం అందని పండై వేదననే మిగుల్చుతున్నది.

సమాజ గమనం మందగించి, మానవుడిలో దీనత్వ, దానవత్వాలు పెచ్చరిల్లి, ఆదర్శాలను ఆశలు ప్రతిఘటిస్తున్న నేపథ్యంలో, ద్వాపరాంతంలో, రణభూమికలో జ్ఞాన శంఖాన్ని పూరించి, పూర్ణ మానవత్వాన్ని ఆవిష్కరించే దిశలో నల్లనయ్య పలికిన చల్లని మాటలే ఈ నాటికీ మానవాళికి సాంత్వన కలిగిస్తాయి. దిశానిర్దేశం చేస్తాయి. మనిషి, మనిషిగా మనవలసిన అవసరాన్ని స్పష్టం చేస్తాయి.

అనంత ముఖీనంగా సాగిన కృష్ణ గీత ఒక తాత్త్విక విభూతి. సమన్వయము-సంఘర్షణ, లాలిత్యం-కాఠిన్యం, మాధుర్యం - విషాదం, మోహం- మోహనం పరమ రమణీయంగా కలబోసుకున్న అచ్చమైన మానవ మాధవీయమే శ్రీకృష్ణ సంచారం.

అప్పటి 'గీత' ఇప్పటి గీతల్ని మారుస్తుందా?

ఆయన అందించిన బోధ, మానవ హృదయాంతర్గత చైతన్యాన్ని మేల్కొలిపి, మనిషిని కర్తవ్యోన్ముఖుణ్ణి చేయగల శక్తివంతమైన ప్రబోధం.

అది సార్వకాలికం. సార్వజనీనం !

- "ధర్మాన్ని స్మరించు - ధర్మాన్ని ఆచరించు" అన్న బోధ మనిషికి ఆనంద మార్గాన్ని సిద్ధం చేస్తుంది. ఎవరు చేయవలసిన పనిని వారు సక్రమంగా, సులక్షణంగా, సర్వజన హితంగా చేయటమే ధర్మం.
- సమస్త మానవజాతి, పరస్పరం యోగక్షేమాలను వహిస్తూ, ప్రేమ-సేవలను సమన్వయం చేసుకోగలిగితే జీవితం నందనవనం అవుతుంది.
- కష్టం ఒక కర్మనిష్ఠ. మనిషిని జాగృతం చేసే మహత్తర భూమిక. తనను తాను నిగ్రహించుకుని, సంస్కరించుకోగల అవకాశం లభించినప్పుడు, ఎంతటి కష్టమైనా ఒక యోగమై నిలుస్తుంది.
- కర్మలు చేస్తూ వుండాల్సిందే. కర్మానుభవాలు నిలబడాలి. కర్మల వలన లభించే లాభాలను వదులుకోవాలి. అపేక్షనుండీ ఉపేక్ష వైపు మనసును మళ్ళించాలి. అది శాంతిని ప్రసాదిస్తుంది.
- కోరికలు తగ్గించుకుంటుంటే మనసు నెమ్మదిస్తుంది. అది స్థితప్రజ్ఞను అనుగ్రహిస్తుంది.

ఆగస్టు 29 శ్రీకృష్ణాష్టమి

- మనిషి ఉత్తముడు, ఉన్నతుడు కావాలి. ఆలోచన-ఆదరణల మధ్య సమన్వయం వుండాలి. సంఘర్షణ లేని జీవితం, ఇతరులకు ఆనందాన్ని, ఆదర్శాన్ని అందిస్తుంది.
- మానవజన్మ కర్మల వలన ఏర్పడింది. సత్కర్మలతో దాన్ని మరింత సుందరతమం చేయాలి. మనం మంచిని ఆచరిస్తే ఫలితం లోకానికంతటికీ చెందుతుంది.
- వైరాగ్యమే అసలు సంపద. వైభోగం నశించవచ్చు. అది దు:ఖకారిణి. అన్నీ వున్నా, ఏవీ తనవి కావన్న భావనలో వుండటమే వైరాగ్యం.
- సుఖం, సంతోషం తాత్కాలికమైనవి. ఆనందమే శాశ్వతమైనది.
- బ్రహ్మనిష్ఠ గల వాడే బ్రాహ్మణుడు...

  అసత్యాన్ని ధిక్కరించు వాడు క్షత్రియుడు...

  నిరంతరం కృషి సలుపువాడు వైశ్యుడు...

  కర్మనిష్ఠాపరుడే శూద్రుడు...

  ఈ నాలుగు స్థితుల సమగ్రత్వమే మానవత్వం.
- తత్త్వవేత్త, దేహాభిమానంలేని వాడు, నిత్యత్యాగి, శాంతం, వైరాగ్యం, కరుణ, మధుర వాక్కు, సచ్చరిత్ర కలవాడే గురువు.
- సమర్పణ, శరణాగతి, వినయం, శ్రద్ధ, ఏకాగ్రత-ఓర్పు కలవాడే శిష్యుడు.
- అధ్యయనం, అభ్యాసం, ఆదరణ వుండే లోకంలో అసాధ్యమన్నది లేదు.
- అంతర్గత శక్తే గురువు. దానిని ఎల్లవేళలా గుర్తెరిగి వర్తించాలి. ధ్యాన, జ్ఞాన, యోగాల ద్వారా శక్తిని వృద్ధి చేసుకోవాలి. ఆ శక్తిని సమాజహితం కోసం వెచ్చించాలి.
- ఉత్తమ భావం, ఉత్తమ రూపం, ఉత్తమ కర్మలే దైవం. దేవ అంటే ఆట. దైవం అంటే ఆడించే వాడు. ఆడుకునేవాడు. దైవంతో ఆడగలిగిన వాడు మానవుడు. ప్రజ్ఞకున్న రెండు కోణాలవి.
- మంచి మాటలను వినటం శ్రవణ సత్యం.



ఒక్క చెయ్యా? ఊహలు, లక్ష చేతులు

ఒక మనిషి ఒక చేత్తో సహాయం చేస్తుంటే చేతికి ఎముక లేకుండా సాయం చేస్తున్నాడంటాం. రెండు చేతుల్తో చేస్తుంటే-ఒక చేత్తో చేసింది ఇంకొక చేతికి తెలియకుండా సాయం చేయాలంటారు. ఇంకా సాయం చేస్తుంటే మనసు దొడ్డదే కానీ, చేతులే చాలడం లేదంటారు........ఒక మనిషికి రెండుచేతులే ఉంటాయి కనుక ఈ సూక్తులన్నీ ఈ రెండింటి చుట్టూనే తిరుగుతుంటాయి.

జిల్లాల నుంచి...

అదే సాయం వెయ్యి చేతులతో, లక్ష చేతులతో చేస్తుంటే అది ఎవరికి సాధ్యం అనంటాం. ఎవరికి సాధ్యమంటే....మంచి మహారాజులకు, సుపరిపాలన అందించే ప్రభుత్వాలకు మాత్రమే సాధ్యం అని చెప్పుకుంటాం. ప్రభుత్వం చేసే సాయానికి కూడా అన్ని చేతులు అవసరమవుతాయా ! ! !

ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే ఒక్క వెంకటేశ్వర్లును అడిగితే చాలు..మన అనుమానాలు పటాపంచలవుతాయి.ఇంతకీ ఎవరాయన ?

దైనంపల్లి వెంకటేశ్వర్లు మాజీ మావోయిస్టు. వరంగల్ జిల్లా రేగొండ మండలంలోని వెంకటేశ్వర పల్లి అనే గ్రామానికి చెందినవాడు. 2000 సంవత్సరంలో లొంగిపోయాడు. 2001లో పెళ్ళి చేసుకున్నాడు. ఇల్లలకగానే పండగకాదు కదా! పొట్టకూటికోసం కూలీకి పోయేవాడు. ఆ కూలీకి, కూటికీ లెక్క కుదరకపోవడంతో చేతిలో పనే కదా అని సొంతంగా వ్యవసాయం చేద్దామనుకున్నాడు. కానీ పొలం అనేది లేకుండా ఎలా అని కాళ్ళు బారజాపి కూర్చోలేదు. ప్రయత్నాలు మొదలెట్టాడు.

లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సాయం చేస్తుందని తెలిసి, వెళ్ళి అడిగితే ఐదెకరాల పొలం చేతికిచిక్కింది. పొలం ఉంటే సరా, దాన్ని సాగుకు సిద్ధం చేయాలంటే కాసులు రాల్చాలి. ఎలా ? అయినా అడుగు ముందుకే వేశాడు. మళ్ళీ ప్రభుత్వం కనబడింది. ఉపాధిహామీ పథకంలో చదును చేయడం పూర్తిచేశాడు. మరి నాటడానికి మొక్కలో ? ఉద్యానవనశాఖ వచ్చి పూర్తి సబ్సిడీతో (కానీ ఖర్చు లేకుండా) 350 మొక్కలిచ్చి పోయింది. నాలుగు చినుకులు పడితే నాలుగు రాళ్ళు వెనకేసుకోవచ్చనుకున్నాడు. కానీ రెండే చినుకులు పడ్డాయి. కూలీకెళ్లకుండా తప్పు చేశానా, అనుకుంటూంటే తత్వం బోధపడింది. నీళ్లు లేకుండా వ్యవసాయం చేయలేం కదా ! మరి వాటిని పట్టేదెలా !!! ప్చ్ !

అయినా అడుగు వెనకకుపడలేదు. మళ్ళీ ప్రభుత్వమే ఎస్.సి కార్పొరేషన్ రూపంలో కనబడింది. పూర్తి సబ్సిడీతో(పైసా విదల్చకుండా) బోరుపడింది. అంతే......శనగ, మొక్కజొన్న, మిర్చి బండెనక బండికడుతున్నాయి.

బలహీనవర్గాలుకదా అని దూరంగా ఉంచినంత కాలం వారు బల'హీనం'గానే ఉంటారు. వారి అవసరమెరిగి ఎక్కడికక్కడ చేయి అందిస్తే వారు వెంకటేశ్వర్లులాగా మంచి రైతులవుతారు. వారింత పండించుకుంటూ, దేశానికి కూడా అంతకంత పండించి ఇస్తారు.

ఇది కథ కాదు-వరంగల్ జిల్లాలోని పర్వత గిరి, సంగెం, వర్ధన్నపేట, రేగొండ, నల్లబెల్లి, భూపాలపల్లి మండలాల్లో లబ్ధిపొందిన 84 కుటుంబాల్లో మన వెంకటేశ్వర్లుది కూడా ఓ చిన్న కుటుంబం. ఇలా రాష్ట్రంలోని లక్షలాది లబ్ధిదారుల వెనుక లక్ష చేతులతో ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన అది.

-కె. వెంకటరమణ, వరంగల్

మంచినే చూడగలగటం దృష్టి సత్యం.

- జీవితం నియమబద్ధం కావాలి. మానవుడు మర్యాదలను అతిక్రమించకూడదు. ఆక్రమణ చేయకూడదు. తన పరిధిలో తానువుంటూ, కర్తవ్య నిర్వహణ చేయాలి.
- నూనె, వత్తి, ప్రమిద లేకుండా దీపం వుండదు. దేహం, మనసు, హృదయం లేకుండా మనిషిలేడు. పరస్పరం, ఒక దానిపై ఒకటి ఆధారపడినట్లు, వ్యక్తి లేకుండా సమాజం లేదు. సమాజబలం లేకుండా వ్యక్తి రాణించదు.
- విధ్వంసాన్ని విడనాడాలి. విధాయకాన్ని మరువరాదు. అయితే చెడును విధ్వంసం చేయాలి. మంచిని పెంచి, పోషించాలి.

ధ్యాయతో విషయాన్పుంస : సఙ్గాస్తేషూపజాయతే ।
సఙ్గాత్సఞ్జాయతే కామ: కామాత్ క్రోధోభిజాయతే ॥ 2-62

క్రోధాద్భవతి సమ్మోహ: సమ్మోహాత్ స్మృతివిభ్రమ: ।
స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥ 2-63

(కోరికలు కోపానికి దారితీస్తాయి. కోపం వల్ల మనిషి విచక్షణాశక్తిని కోల్పోతాడు. అందువల్ల బుద్ధి నశిస్తుంది. అది మనిషి పతనానికి హేతువవుతుంది)

ఇలాంటి సందేశాల్ని కాలం, మతం, దేశం, జాతి వంటి భావాల చట్రంలో బిగించి ఉపేక్షించగలమా !

అందుకే శ్రీకృష్ణుని గీత కాలానికి అతీతమైంది. సమస్త ప్రజానీకానికి అవసరమైంది.

కాస్త జాగ్రత్తగా గీతాబోధను ఆచరించటం ప్రారంభిస్తే మనిషి మనసు శాంతి ధామమై ప్రశాంతి నిలయమై, ఆనందకాసారమై స్థిమితంగా వుంటుంది.

ప్రపంచ శాంతి వ్యక్తి శాంతితో మొదలౌతుంది.

సమస్తలోకాస్సుఖినోభవన్తు!

- వి.యస్.ఆర్.మూర్తి, ఆధ్యాత్మిక శాస్త్రవేత్త
94406 03499



అమ్మాయే పుట్టాలి, ఆసుపత్రిలో పుట్టాలి ...!

ఒక ఆలోచన...

సమాజాన్నే మార్చేస్తోంది!

నిన్నటి వరకూ ఆడపిల్ల పుట్టుక 'నేరం'గా, 'శాపం'గా, 'భారం'గా భావించిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో క్రమక్రమంగా మార్పువస్తోంది.

'పుడితే ఆడపిల్లగానే పుట్టాలి. అదీ ఆంధ్రప్రదేశ్‌లోనే పుట్టాలి' అనే మాటలకు బలం చేకూరుతోంది. 'బంగారు తల్లి' పథకం ద్వారా ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించడం పట్ల సర్వత్రా, ముఖ్యంగా మహిళాలోకం ఆనందం వ్యక్తం చేస్తోంది.

ఆడపిల్లలంటే సమాజంలో ఇప్పటివరకూ ఉన్న చులకన భావాన్ని తొలగించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా కల్పించడానికే 'బంగారు తల్లి' పథకాన్ని ప్రవేశపెట్టామని ముఖ్యమంత్రి శ్రీ యన్. కిరణ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

'బంగారుతల్లి' పథకం జూలై 2 నుంచి అధికారికంగా అమలులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని 'లలిత కళాతోరణం'లో జూలై 2న ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చెక్కులను అందించారు.

ఎవరు అధికారంలో ఉన్నా విధిగా ఈ 'బంగారుతల్లి' పథకాన్ని అమలు చేసేలా దీనికి చట్టబద్ధత కల్పించామని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ...

"భారతదేశంలో గత 20 సంవత్సరాలలో పుట్టిన తరువాత, పుట్టకముందు తల్లిగర్భంలో కోటి మంది ఆడపిల్లలు బలవన్మరణానికి గురయ్యారు. మన రాష్ట్రంలో 2005 నుంచి 2011 వరకు 70 వేల మంది ఆడపిల్లలు మరణించారు. ఆడపిల్లలను చంపే హక్కు తల్లిదండ్రులకు ఎవరిచ్చారు? ఆడపిల్లలను చంపుకోవడం సమాజానికి శ్రేయస్కరం కాదు" అన్నారు.



ఆడపిల్లలంటే భారంగా భావించి కొంతమంది తల్లిదండ్రులు పిండస్థదశలోనే త్రుంచివేసి, భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆడపిల్లల పుట్టుక తల్లిదండ్రులకు భారం కాకూడదనే, పుట్టిన రోజు నుంచి వారి యోగక్షేమాలు, విద్యావసరాలు ప్రభుత్వమే చూసుకొనేలా 'బంగారుతల్లి' పథకాన్ని రూపొందించామన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమానికి అమలు పరుస్తున్న పలు పథకాలను, వాటి ప్రయోజనాలను గ్రహించిన ఓ మహిళ 'పుడితే ఆడపిల్లగానే పుట్టాలి. అదీ ఆంధ్రప్రదేశ్‌లోనే పుట్టాలి' అని చేసిన వ్యాఖ్యలే ఈ 'బంగారు తల్లి' పథకం రూపకల్పనకు స్ఫూర్తినిచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడించారు.

గత మే 1వ తేదీ తరువాత జన్మించిన ఆడపిల్లలకు ఈ 'బంగారు తల్లి' పథకం వర్తింపజేస్తున్నందున, ఇకపై ఏటా మే 1న 'బంగారు తల్లి' వేడుకలు నిర్వహిస్తామని, ఎంతమంది ఆడపిల్లల పేర్లు ఇందులో నమోదు అయ్యాయి, ఎంతమేరకు నిధులు కేటాయించాం, తదితర అంశాలను ఈ సందర్భంగా సమీక్షిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

ఆస్పత్రిలో కాన్పుకు వెళ్ళకపోతే శిశువుకు, తల్లికి ప్రమాదం ఉన్నందున ఓ మంచి ఉద్దేశ్యంతోనే ఆస్పత్రిలో పుట్టిన శిశువులకే ఈ పథకం వర్తింపచేయాలని నిర్ణయించామన్నారు.

కేవలం చట్టాల వల్లనే సమాజంలో మార్పు రాదని, కుటుంబంలో కూడా మార్పు రావాలని ఆయన అన్నారు. "ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే మహిళలకు సమాజంలో, కుటుంబంలో గౌరవం ఉంటుందన్న ఉద్దేశ్యంతోనే, మహిళా ఆర్థిక స్వావలంబనకు

ప్రభుత్వ పథకాలకు ఆధునిక పరిజ్ఞానాన్ని జోడించి ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'మీసేవ' కార్యక్రమాన్ని ప్రారంభించింది. 'మీసేవ' పరిధిని విస్తరించడంలో భాగంగా ముఖ్యమంత్రి శ్రీ యన్. కిరణ్ కుమార్ రెడ్డి గనుల శాఖకు సంబంధించిన 7 సర్వీసులను 'మీసేవ' ద్వారా లాంఛనంగా జూలై 1న ప్రారంభించారు.

గనుల శాఖలో రికనాయి సెన్స్ (Reconnissance) పర్మిట్, ప్రాస్పెక్టింగ్ లైసెన్సు, మైనింగ్ లీజు, గ్రానైట్ క్వారీలీజు, మార్బుల్ క్వారీలీజు, ఇతర క్వారీల లీజు, మినరల్ డీలర్ లైసెన్సులకు ఇకపై 'మీసేవ'లో దరఖాస్తులు సమర్పించవలసి ఉంటుందని రాష్ట్ర గనులు మరియు భూగర్భ వనరుల శాఖా మంత్రి శ్రీమతి గల్లా అరుణ కుమారి తెలిపారు. ఈ సేవలను 'మీసేవ'లో చేర్చి లాంఛనంగా ప్రారంభించినందుకు ముఖ్యమంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



'మీసేవ' లో గనుల శాఖ

రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ప్రగతికి దోహదం చేసే తొమ్మిది విభాగాలలో భూగర్భ ఖనిజ విభాగం కూడా ఒకటిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

మన రాష్ట్రంలో మొత్తం 42 రకాల ఖనిజాలు లభ్యమవుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 2047 గనులు, 9687 క్వారీలు కౌలు అమలులో ఉన్నాయి.

ప్రస్తుత విధానంలో లీజు దరఖాస్తుదారుడు సంబంధిత సహాయ సంచాలకుల కార్యాలయంలో స్వయంగా, లేదా పోస్టు ద్వారా దరఖాస్తు సమర్పించవలసి వుంది. దీనివల్ల రవాణా ఖర్చులు, సమయం వృధా అవుతున్నాయి. ఒక వేళ దరఖాస్తు కార్యాలయానికి చేరని పక్షంలో లీజు దరఖాస్తు దారుడు ప్రాధాన్యతను కోల్పోతాడు. కార్యాలయానికి చేరిన దరఖాస్తులు ఏ దశలో వున్నదీ, ఏ అధికారి వద్ద ఉన్నదీ తెలిసే అవకాశం లేదు. దరఖాస్తుదారునికి సమాచారాన్ని పోస్టు ద్వారా పంపడం వల్ల సర్వేలకు, తనిఖీలకు హాజరు కాలేకపోయేవారు. అలాగే, మంజూరు ఉత్తర్వులు సకాలంలో అందకపోవడం వల్ల లీజు, కౌలు ఒప్పందాలు చేసుకోవడంలో అనవసర జాప్యం జరిగేది.

ఈ ఇబ్బందులన్నింటినీ తొలగించడానికి ఐ.టి. శాఖ సహకారంతో గనులశాఖ ఆన్‌లైన్‌లో 'మీసేవ' ద్వారా దరఖాస్తులు స్వీకరించే విధానాన్ని ప్రారంభిచడం జరిగిందని మంత్రి శ్రీమతి గల్లా అరుణ కుమారి తెలిపారు.

గడచిన నాలుగు సంవత్సరాలలో పాత పద్ధతిలో మొత్తం 30,897 దరఖాస్తులను స్వీకరించారు.

ఇప్పుడు 'మీ సేవ'లో దరఖాస్తులు సమర్పించడం ద్వారా దరఖాస్తుదారులకు డబ్బు, సమయం ఆదా కావడంతో పాటు, ప్రభుత్వ సేవలు సత్వరం అందుబాటులోకి వస్తాయి.

ఇప్పటికే రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, రవాణా, పౌర సరఫరాలు, విద్య, రిజిస్ట్రేషన్, పరిశ్రమలు, ఐ.టి. ఎన్నికలు వంటి 12 శాఖలకుసంబంధించిన 135 సేవలను 'మీ సేవ' ద్వారా అందిస్తున్నారు. ఇప్పుడు వీటికి తోడుగా గనుల శాఖ కూడా చేరింది.

లీజు, లేదా కౌలు దారులు 'మీసేవ'లో దరఖాస్తు సమర్పించిన వెంటనే దరఖాస్తు దారునికి రశీదు ఇవ్వడం జరుగుతుంది. అక్కడి నుంచే సంబంధిత అధికారులకు దరఖాస్తును పంపుతారు. దారఖాస్తుకు సంబంధించి వివిధ దశల సమాచారాన్ని దరఖాస్తుదారునికి సెల్‌ఫోన్ సందేశం ద్వారా పంపుతారు. దీనివల్ల అతను తగిన సమయంలో సర్వే, తనిఖీలకు హాజరు కాగలుగుతాడు.

–యం. మధుసూదన్


ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. దేశం మొత్తం మీద మహిళలకు 30 వేల కోట్ల రూపాయలు రుణాలుగా అందిస్తుండగా, ఒక్క మన రాష్ట్రంలోనే 16,500 కోట్ల రూపాయల రుణాలను అందిస్తున్నాం. మహిళలకు వడ్డీలేని రుణాలు అందించడం మరో విశేషం. గర్భిణీలకు పౌష్టికాహారం అందించేందుకు 'ఇందిరమ్మ అమృత హస్తం' పథకాన్ని ప్రవేశపెట్టాం. రాష్ట్రంలో పౌష్టికాహార లోపంతో ప్రతి వెయ్యిమంది పిల్లల్లో 49 మంది మరణిస్తున్నారు. తల్లి, పిల్లలకు మెరుగైన వైద్య సదుపాయం కల్పించేందుకు గత రెండేళ్ళుగా రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రులలో వెయ్యికి పైగా కొత్త పడకలు ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లో రూ. 480 కోట్లతో 6,500 పడకలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఆడపిల్లల జననం పట్ల ప్రజలలో ఉన్న అపోహలు, భయాందోళనలు పూర్తిగా తొలగించి వారు పుట్టిన దగ్గరినుంచి పెరిగి, యుక్త వయస్సు వచ్చే వరకూ వారికి బాసటగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే 'బంగారు తల్లి' పథకం అమలులోకి తెచ్చామన్నారు.

ఈ పథకం గత మే 1వ తేదీ నుంచి పుట్టిన ఆడపిల్లలకు అమలులోకి వస్తుందని, ఇప్పటికే (జూలై 2వరకు) ఈ పథకం క్రింద 20 వేల మంది ఆడపిల్లలు నమోదయ్యారని మంత్రి చెప్పారు. వీరిందరికీ ప్రోత్సాహకంగా రూ. 2,500 చొప్పున చెల్లిస్తున్నామని ఆమె చెప్పారు. 'బంగారు తల్లి' పథకం చరిత్రలో ఓ ధృవతారగా నిలిచిపోతుందన్నారు. దీని ద్వారా ఏడాదికి సుమారు 8 లక్షల మంది ఆడపిల్లలకు లబ్ధి చేకూరుతుందని, ఇకపై రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆడపిల్ల పుట్టిందని బాధపడే పరిస్థితి ఉండదని మంత్రి శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీమతి డి.కె. అరుణ, మంత్రులు, డాక్టర్ జె.గీతారెడ్డి, శ్రీమతి గల్లా అరుణకుమారి, శ్రీ దానం నాగేందర్, శ్రీ పార్థ సారథి, శ్రీ ముఖేష్‌గౌడ్, మహిళా కమీషన్ చైర్ పర్సన్ శ్రీమతి త్రిపురాన వెంకట రత్నం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె.మహంతి, తదితరులు పాల్గొన్నారు.

– కె.ఎస్. శాస్త్రి



మృతుల కుటుంబాలకు 'రూ.9 లక్షలు +...' సహాయం

సిటీలైట్ హోటల్ దుర్ఘటనపై సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి

సికిందరాబాద్‌లో సిటీలైట్ హోటల్ ఉన్న అతి పురాతన భవనం, జులై 8 వ తేదీ ఉదయం హఠాత్తుగా కుప్ప కూలింది.

ఈ దుర్ఘటనలో మొత్తం 18 మంది మృత్యువాత పడ్డారు. మృతుల్లో హోటల్ సిబ్బంది, హోటల్ యజమాని కుమారుడు, అల్లుడు, పలువురు కస్టమర్లు ఉన్నారు. మొత్తం 23 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో దాదాపు పదిమందికి ప్రాథమిక చికిత్స చేసి పంపగా... మిగిలిన వారు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

హోటల్ భవనం కూలి మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.9 లక్షలు చొప్పున సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొత్తంలో సిటీలైట్ హోటల్ యజమాని నుంచి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 7 లక్షల 50 వేలు ఇప్పించాలని అదే రోజు హుటాహుటిన సంఘటనా స్థలాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి కార్మిక శాఖను, ఇతర శాఖల అధికారులను ఆదేశించారు.

జి.హెచ్.ఎం.సి. తరఫున మరో లక్ష రూపాయలు చొప్పున ఇవ్వాలనీ, ఆపద్బంధు పథకాన్ని వర్తింపజేసి మృతుల కుటుంబాలకు యాభై వేల రూపాయల చొప్పున అందించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 25 వేలు అందజేయాలని సి.ఎం. సూచించారు.

దుర్ఘటన జరిగిన తీరును సి.ఎం. అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించాలనీ, బాధితుల కుటుంబ సభ్యులు ఏ ఆస్పత్రిలో చికిత్స చేయించాలో సూచిస్తే, అక్కడే చేర్పించి వైద్య సేవలు అందించాలనీ సి.ఎం. సూచించారు. ఇక్కడ నుంచి ముఖ్యమంత్రి నగరంలోని గాంధీ ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

ఎమర్జెన్సీ వార్డులో 15 నిమిషాలు క్షతగాత్రులను పరిశీలించి, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగా సి.ఎం. తో పాటు మంత్రులు శ్రీమతి జె. గీతారెడ్డి, శ్రీ దానం నాగేందర్‌లు కూడా సంఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు.



సిటీలైట్ హోటలున్న భవన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశించగా... స్థానిక మహంకాళి పోలీసు స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

పాత భవనాలపై సి.ఎం. సమీక్ష


సిటీ లైట్ హోటల్ దుర్ఘటన జరిగిన నేపథ్యంలో జంటనగరాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలపై రాష్ట్ర సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరిపారు. ఇందులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ఇలాంటి దుస్సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. ఒక సమగ్ర భవన కట్టడాల స్థిరీకరణ విధానాన్ని రూపొందించాలి. భవన నిర్మాణాల ను నియంత్రించేందుకు నిపుణుల, స్ట్రక్చరల్ ఇంజనీర్ల సలహాలు తీసుకోవాలి" అని అధికారుల ను ఆదేశించారు.

"ఈ దుర్ఘటనలో జి.హెచ్.ఎం.సి. వైఫల్యం ఉందా? అన్న కోణంలో దర్యాప్తు చేయాలి. బాధ్యులెవరైనా ఉంటే చర్యలు తీసుకోవాలి. శాశ్వత అంగవైకల్యం సంప్రాప్తించిన వారికి పరిహారం చెల్లించడంలో ఉదారంగా వ్యవహరించాలి. గాయపడ్డ వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. బాధిత కుటుంబాలకు ఇబ్బందులు రాకుండా చూడాలి" అని కూడా ఆయన అధికారులకు సూచించారు.

జి.హెచ్.ఎం.సి. కమిషనర్ శ్రీ కృష్ణబాబు మాట్లాడుతూ, ఇటీవల జె.ఎన్.టి.యు. జరిపిన సర్వే ప్రకారం 307 పాత భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని తేలిందని సి.ఎం.కి వివరించారు.

ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మహంతి, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ఎస్.కె. జోషి, జి.హెచ్.ఎం.సి. కమిషనర్ శ్రీ ఎం.టి. కృష్ణబాబు, నగర పోలీస్ కమిషనర్ శ్రీ అనురాగ్ శర్మ ఇతర అధికారులు పాల్గొన్నారు.

– రాజఫణి. వి



త్వరలో గంటకి 35 వేల ఉత్తరాల సార్టింగ్

"ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి తగినట్లుగా మనమూ మారాల్సి ఉంది. ఆ ఫలితాలు నిరుపేదలకు అందుబాటులోకి వచ్చినపుడే సాఫల్యత కలుగుతుంది" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు.



రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని పెద్ద గోల్కొండ గ్రామం వద్ద తపాలాశాఖ దాదాపు రూ. 70 కోట్లతో ఏర్పాటు చేయనున్న 'ఆటోమేటెడ్ మెయిల్ ప్రాసెసింగ్ సెంటర్'కై కేంద్ర ఐ.టి. సహాయ మంత్రి శ్రీమతి కిల్లి కృపారాణితో కలిసి ముఖ్యమంత్రి జూన్ 26న భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ప్రస్తావించిన అంశాలు శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి మాటల్లో.."తపాలా రంగంలో సేవలను త్వరత్వరగా అందించేందుకు ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. దీని వల్ల గంటకు 35 వేల ఉత్తరాలను ప్రాంతాల వారీగా వేరు చేయడం తేలిగ్గా జరుగుతుంది. ఇలాంటి కేంద్రం మనరాష్ట్రంలో ఇప్పటికే ఏర్పాటు చేసి ఉంటే ఆధార్ కార్డుల బట్వాడా వేగంగా జరిగి ఉండేది" అని అన్నారు.

"చదువు ఒక్కటే ఎవరికైనా భవిష్యత్తుకు దారి చూపి దారిద్ర్యాన్ని పారద్రోలుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే విద్యారంగంలో మౌలిక వసతుల కల్పనకు రూ. 5 వేల కోట్లు ఖర్చు చేయనున్నాం. ప్రతీ ఒక్క నిరుపేదకూ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా పారదర్శకంగా అమలు చేస్తున్నాం. ఈ ప్రాసెసింగ్ సెంటర్‌లో స్థానికులకే ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్‌లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడంలో కేంద్రమంత్రి శ్రీమతి కిల్లి కృపారాణి కృషి ప్రశంసనీయం" అని సి.ఎం. అభినందించారు.

కేంద్రమంత్రి శ్రీమతి కృపారాణి మాట్లాడుతూ... "159 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రగల భారత తపాలా సంస్థ ప్రపంచంలోనే పెద్ద సంస్థ. ఈ సంస్థకు పూర్వ వైభవం తెచ్చేందుకే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం" అని వివరించారు.

మంత్రి శ్రీ ప్రసాద్ కుమార్, ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీ బి.వి. సుధాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సదస్సులో పాల్గొన్నారు. ☆

ఊళ్లకు వెళదాం... ఊపిరి పోద్దాం... ఛలో! ఛలో!!

భారతావని ఉజ్జ్వలంగా ప్రకాశించాలంటే ముందుగా పల్లెల్లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగాలి. అన్ని సౌకర్యాలతో మన పల్లెలు దేదీప్యమానంగా వెలగాలంటే ప్రతి ఒక్కరూ అవిశ్రాంతంగా కృషి చేయాలి.

అప్పుడే 'దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలు' అన్న నినాదానికి సార్థకత ఏర్పడుతుంది. ఈ కీలకాంశాన్ని గ్రహించిన మన రాష్ట్ర ప్రభుత్వం 'పల్లె నిద్ర' అనే కార్యక్రమాన్ని రూపొందించి, అమలు చేయ సంకల్పించింది. దీనిలో భాగంగా తొలుత కలెక్టర్లను ప్రధాన పాత్రధారులుగా చేస్తూ అన్ని రంగాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పల్లెల్లోకి తీసుకెళ్లాల్సిన కీలక బాధ్యతలు అప్పగించింది. 'పల్లె నిద్ర' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది మన రాష్ట్ర ప్రభుత్వం.

ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకూ దిశానిర్దేశం చేస్తూ ఇటీవల మార్గదర్శకాలు కూడా జారీచేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె. మహంతి రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో జూలై 4న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, చేసిన సూచనల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- ☆ అన్ని జిల్లాల కలెక్టర్లూ ఇక నుంచి ప్రతీవారంలో రెండు రోజులు తమ జిల్లా పరిధిలోని గ్రామాల్లో 'పల్లె నిద్ర' చేయాలి.
- ☆ క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రగతి గురించి ఎప్పటికప్పుడు సమీక్ష చేయాలి. ఏయే ప్రభుత్వ పథకాలు ఎలా అమలు జరుగుతున్నాయి. వాటిలో లోపాలను సరిదిద్ది మెరుగుపరచేందుకు తగిన చర్యలు తీసుకోవాలి.
- ☆ 'పల్లె నిద్ర'కు వెళ్లినప్పుడు తమ అధ్యయనంలో తేలిన విషయాలపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలి.
- ☆ వీలైనంత వరకు మంగళ, గురువారాల్లోనే 'పల్లెనిద్ర' కార్యక్రమం పెట్టుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.
- ☆ పల్లెల్లో కరెంట్ సమస్యను కూడా ప్రధానంగా గుర్తించి, వాస్తవ స్థితిగతులను గ్రామీణులకు వివరించాలి.
- ☆ కరెంట్ వినియోగంలో పొదుపు పాటించేలా గ్రామీణులకు అవగాహన కల్పించాలి.



ప్రధాన కార్యదర్శి
శ్రీ పి.కె. మహంతి

అలాగే రాష్ట్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై కలెక్టర్లు, కార్యదర్శులు ప్రతీనెలా నివేదికలు రూపొందించి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించాలని శ్రీ పి.కె. మహంతి సూచించారు. ప్రభుత్వ శాఖలను విభజించి ప్రతీ రెండు నెలలకు ఒకసారి ప్రాధాన్యతా పరంగా సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.

ప్రతీ నెలా రెండవ శుక్రవారం, మూడవ శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక సి.ఎస్.లతో, కార్యదర్శులతో ప్రతీ నెలా సమీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు కూడా శ్రీ మహంతి చెప్పారు.

– ఆర్వీ.వి

'కొండ' దిగితే పునరావాసం

ఖమ్మం జిల్లాలో 6 మండలాల్లోని 83 ఆవాసాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజన తెగలకు చెందిన కొండరెడ్డి కుటుంబాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది.

రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి 2012 ఆగస్టులో జరిపిన 'ఇందిరమ్మ బాట' పర్యటనలో భాగంగా కొండరెడ్డి గ్రామాలను సందర్శించారు. అక్కడి ఆదివాసీ గిరిజనులయిన కొండరెడ్ల పరిస్థితులను తెలుసుకున్నారు. సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

అందులో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీ సిద్ధార్ధ జైన్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి నేటికీ కొండలు కోనలలో నివసిస్తున్న కొండరెడ్ల కుటుంబాలకు పునరావాసం కల్పించటానికి వారి అభిరుచులు, జీవనశైలికి అనుగుణంగా కొంత విశాలంగా ఇండ్లను నిర్మించేందుకు డిజైన్ రూపొందించాలని అధికారులకు సూచించారు.

ముఖ్యమంత్రి హామీ మేరకు కొండలపై నున్న కొండరెడ్ల పునరావాసానికి, గోదావరి తీరంలోనూ ఇతర అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న కొండరెడ్లకు నూరుశాతం కుటుంబాలకు ఇళ్ళ మంజూరీకై ప్రభుత్వానికి కలెక్టర్ ప్రతిపాదన చేశారు. 350 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు గదులు, వరండాతో ఆస్ బెస్టాస్ (రేకు) పైకప్పుతో కూనవరం మండలం పైడి గూడెంలో మోడల్ హౌస్‌ను నిర్మించారు. ఆ ఇంటిని కొండరెడ్లకు చూపించారు.

జిల్లాల నుంచి...

మోడల్ హౌస్ పట్ల వారు సంతృప్తి చెందారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతంలో ఉన్న జిల్లాలోని కొండరెడ్లకు నిర్మించే ప్రతి ఇంటికి రూ. 1.05 లక్షలను పూర్తి రాయితీగా ఇచ్చేందుకై ప్రభుత్వం నిర్ణయించింది.

అశ్వారావు పేట మండలంలో 138, చింతూరులో 126, దమ్మపేటలో 11, కూనవరంలో 107 వి.ఆర్.పురంలో 553, వేలేరుపాడులో 373, మొత్తం 1308 ఇండ్లను కొండరెడ్డి కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో భాగంగా కూనవరం మండలం పైడిగూడెంలో 107 ఇండ్ల మోడల్ కాలనీని నిర్మిస్తున్నారు.

గతంలో కొండలపై నివసిస్తున్న కొండరెడ్లను క్రిందకు దింపి పునరావాసం కల్పించేందుకు చల్లకవ్వం, తదితర ప్రాంతాలలో నిర్మించిన పక్కా ఇండ్లు కొన్ని నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరాయి. ఇరుకుగా ఉన్న ఇండ్లలో ఉండేందుకు ఆసక్తి చూపని కొండరెడ్లు తిరిగి కొండలపైకి వెళ్లడంతో పూర్తి స్థాయిలో పునరావాసం కలగలేదు. ఈ పరిస్థితులను గమనించిన అధికారులు కొండలపై నుండి కిందకు దిగి కొంతకాలం పాటు ఉండేవారికే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సంకల్పించారు. మొదటగా పైడిగూడెం వద్ద నివసిస్తున్న 25 కుటుంబాలకు ఇండ్లు నిర్మించే పనులు ప్రారంభించారు.

కళింగమిద్ది, నల్లమామిడిగొంది కొండ ఆవాసాలలో నివసిస్తున్న చెదల రామిరెడ్డి, చెదల కమ్మిరెడ్డి, కోండ్ల రామిరెడ్డి, సమ్మిరెడ్డి తదితర 25 కుటుంబాలు గత నాలుగు సంవత్సరాల నుండి పైడిగూడెంలో ఉంటున్నాయి. ఉపాధిపనులు, వ్యవసాయ కూలీపనులు చేస్తూ జీవిస్తున్నారు. పైడిగూడెంలో నిర్మిస్తున్న కాలనీకి రోడ్లు, విద్యుత్, మంచినీటి వసతులను కల్పించనున్నారు.

పైడిగూడెం బ్లాకులో నివసిస్తున్న 25 కుటుంబాలకు విద్యుత్ వసతికై సోలార్ ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. నీటి వసతికై ప్రభుత్వం రూ.15 లక్షలతో ఓ.హెచ్.యస్.ఆర్. ను నిర్మిస్తున్నది. దశల వారీగా చుట్టు ప్రక్కల నున్న కొండల పై నివసిస్తున్న మరో 82 కుటుంబాలకు పునరావాసం కలించేందుకు ఈ మోడల్ కాలనీలోనే ఇండ్లు నిర్మించనున్నారు.

అయితే క్రిందకు దిగిన కుటుంబాలకు దశల వారీగా ఇండ్లు నిర్మిస్తారు. పునరావాసానికై ప్రతి కుటుంబానికి పైడిగూడెంలో రెండెకరాల భూమిని కొనుగోలు చేసి ఇవ్వనున్నారు. దీనికి ముందస్తుగా వ్యవసాయం పట్ల అవగాహన కల్పించేందుకు ఐటిడిఏకు చెందిన 109 ఎకరాల పైడిగూడెం బ్లాకులో ఒక 40 ఎకరాలను సేద్యానికి వినియోగిస్తున్నారు. 6 మండలాల్లోని 152 కుటుంబాలకు రూ.82.08 లక్షలతో భూమి కొనుగోలు చేసి ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

కొండరెడ్ల సమగ్రాభివృద్ధికి చేపట్టిన చర్యలలో భాగంగా మొత్తం 2,446 కుటుంబాలను జనశ్రీ బీమాయోజన పథకంలో చేర్చడం జరిగింది. ఆహార భద్రతకై గ్రెయిన్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసిపనులు లేని కాలంలో మూడు నెలల పాటు ఒక్కొక్క కుటుంబానికి రూ.6 వేల విలువైన బియ్యం, ఇతర నిత్యావసర



వస్తువులను అప్పుగా ఇస్తున్నారు. దీనికి రూ.9.24 కోట్లను కొండరెడ్లకు చెందిన స్వయం సహాయక సంఘాలకు రివాల్వింగ్ ఫండ్‌గా అందుబాటులో ఉంచారు.

70 అంగన్ వాడీ కేంద్రాలలో 1278 మంది పిల్లలు, 117 మంది గర్భిణీలు, 97 మంది బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. ఇందిరమ్మ అమృతహస్తం ద్వారా తల్లీబిడ్డలకు ఆరోగ్య కార్డులు నిర్వహిస్తున్నారు.

6 నుండి 14 సంవత్సరాల వయస్సున్న 1589 మంది పిల్లలలో 991 మంది పాఠశాలల్లో నమోదయ్యారు. మిగిలిన 598 మంది బడి ఈడు పిల్లల ను పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యా సంబరాలలో లక్ష్యంగా తీసుకున్నారు. చిన్న పిల్లలకు విద్యపట్ల అవగాహన కల్గించేందుకు కొండలపై 14 చోట్ల బాల బడులను ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ క్రింద 2380 మంది పనిచేస్తున్నారు.

కొండరెడ్ల సంప్రదాయాలకనుగుణంగా రెండు పి.హెచ్.సి.లలో ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. కొండరెడ్ల పునరావాసం, విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన, ఉపాధి శిక్షణకు రూ.61.39 కోట్లతో ముఖ్యమంత్రి ప్యాకేజి కింద్ర పనులను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ శ్రీ సిద్ధార్ధ జైన్ వివరించారు.

బహుముఖ కార్యక్రమాలతో ఇప్పుడు కొండరెడ్ల జీవితాల్లో వెలుగు కిరణాలు ప్రసరిస్తున్నాయి.

– *వై. వెంకటేశ్వర్లు, ఖమ్మం*

దీపావళి హాస్య కథల పోటీ

రచయితలు, పాఠకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'హాస్య కథల పోటీ' మళ్ళీ మీ ముందుకు వచ్చింది.

కథా రచయితలు చూపుతున్న ఉత్సాహం, పాఠకుల నుంచి లభిస్తున్న స్పందన అపూర్వంగా ఉండటంతో 2013 దీపావళికి కూడా 'హాస్య కథల పోటీ' నిర్వహించాలని నిర్ణయించాం.

మనసుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందించి, గుర్తు చేసుకున్నప్పుడల్లా మళ్ళీ మళ్ళీ నవ్వించి గిలిగింతలు పెట్టే హాస్య కథలకు **'ఆంధ్రప్రదేశ్'** పత్రిక ఆహ్వానం పలుకుతోంది. ఇక ఆలస్యం ఎందుకు? 'కథ'న రంగంలోకి దిగండి ! గడువులోగా మాకు మీ కథలు అందేలా పంపండి ! ఉత్తమ రచనలకు బహుమతులు అందుకోండి.

ఈ పోటీలలో పాల్గొనదలచిన కథారచయిత(త్రు)లు తమ కథలను **2013 ఆగష్టు 31 లోగా** మాకు అందే విధంగా దిగువ పేర్కొన్న చిరునామాకు పంపించాలి.

బహుమతుల వివరాలు

ఉత్తమ హాస్య కథ	రూ. 15, 000
ద్వితీయ ఉత్తమ హాస్య కథ	రూ. 12, 000
తృతీయ ఉత్తమ హాస్య కథ	రూ. 8, 000

సాధారణ ప్రచురణకు ఎంపికైన హాస్య కథకు రూ. 1000 పారితోషికం ఉంటుంది.

పోటీకి కథలు పంపే రచయిత(త్రు)లు ఈ క్రింది సూచనలను గమనించాలి:

- కథ వ్రాత ప్రతిమీద కథ పేరు మాత్రమే ఉండాలి. రచయిత పేరు కథకి జతపరిచే హామీ పత్రంలో వుంటే చాలు.
- కథ నిడివి చేతి రాతలో A4 సైజు కాగితాల్లో 4 పేజీలు మించకూడదు. సైజుకు మించిన కథలను పరిశీలించటంసాధ్యపడదు.
- పేజీకి ఒక పక్క మాత్రమే, దస్తూరీ అర్థమయ్యే విధంగా రాయాలి.
- సామాజిక అంశాలతో పాటు అన్ని అంశాలపై కథలు పంపవచ్చు. అశ్లీలత, అసభ్యత, కులమత విద్వేషాలను రెచ్చగొట్టే ధోరణులు, రాజకీయాలు, వ్యక్తిగత దూషణ, వెకిలితనం లేకుండా హాస్యప్రధానమైన కథలు పంపాలి.
- పోటీకి పంపే హాస్య కథలు తెలుగు సంస్కృతికి దగ్గరగా ఉండాలి. అరువు తెచ్చుకున్న కథాంశాలూ, విదేశీ సంస్కృతీ కథలో ప్రతిఫలించకూడదు. అనుకరణ పాత్రలతో కూడిన కథాంశాలకు దూరంగా ఉండాలి.
- ఒక రచయిత ఒక కథను మాత్రమే పోటీకి పంపాలి.
- ఎంపిక కాని కథలపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండవు. ఎంపికకాని పక్షంలో తమ కథను త్రిప్పి పంపాలని కోరుకునేవారు అందుకు అవసరమైన స్టాంపులు అంటించిన కవర్లను కూడా తప్పక జతచేయాలి.
- రచయితలు తమ చిరునామాను పిన్‌కోడ్‌తో సహా వివరంగా రాయాలి. ఫోన్ నెంబర్లు కూడా రాస్తే మంచిది.
- న్యాయనిర్ణేతల కమిటీ మాత్రమే బహుమతి పొందే కథలను నిర్ణయిస్తుంది.
- ఎంపికైన కథలు **'ఆంధ్రప్రదేశ్'** పత్రికలో ప్రచురితమవుతాయి.
- కథల ఫలితాలను www.ipr.ap.nic.in వెబ్‌సైట్‌లో, నవంబర్ 2013 సంచికలో కూడా చూడవచ్చు.

చిరునామా:
చీఫ్ ఎడిటర్, ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక
(దీపావళి హాస్యకథల పోటీకి)
సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్
మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500 028

'ఇన్నర్' వ్యూ

-శరత్ చంద్ర

'బాక్సాఫీస్' దగ్గర బోల్తాపడ్డా 'జబరదస్తీ' సినిమాను ప్రమోట్ చేసి కొన్ని అప్పలనుండైనా గట్టెక్కాలనుకున్నాడు కూర్మారావు.

ఛానల్ 'జీరో' క్రియేటివ్ హెడ్ సాయిరాంని కలిశాడు.

"గురువు గారూ ఎలాగైనా గట్టున పడేయండి - మీ ఛానల్ ద్వారా..." బ్రతిమాలుకొన్నాడు.

"సాధ్యం కాదు సర్. అసలే టీ.ఆర్.పి. రేటు లేక మేం చస్తున్నాం. మిమ్మల్ని ప్రమోట్ చేస్తే మా ఛానల్‌ని ప్రేక్షకులు కన్నెత్తి కూడా చూడరు. మా ఛానల్ కనబడగానే రిమోట్ నొక్కేస్తారు. వల్ల కాదండీ" అన్నాడతను.

అరగంట సేపు కాళ్ళావేళ్ళ పడి ఆఖరికి బరువైన కవరు అందిన తర్వాత -

"సరే కానివ్వండి" అన్నాడు.

యాంకర్ సుప్రజను పిలిచి "మన మిత్రుడు కూర్మారావు తీసిన 'జబరదస్తీ' సి.డి. పంపిస్తాడు ఒక సారి చూడమ్మా. చూసి సినిమా హైలెట్స్‌పైన ఇంటర్వ్యూ ఇవ్వండి" చెప్పాడు.

ప్రక్క నిమిషం సుప్రజ వాష్ బేసిన్ దగ్గర కెళ్ళి వాంతి చేసుకుంది.

"ఏంటమ్మా ! రాత్రి ఏదైనా ఔట్ డేటెడ్ ఫుడ్ తిన్నావా? లేక ఎవరైనా గోకారా?" అడిగాడు.

వామ్‌టింగ్ సెన్సేషన్ ఆపుకోవడానికి శతవిధాల ప్రయత్నం చేస్తూ, "అదేం లేదు సర్... దయచేసి నన్ను వదిలేయండి సర్" అంది.

సాయిరాంకి అర్ధం కాలేదు ఒక నిమిషం.

మళ్ళీ తనే అంది –

"నిన్న రాత్రి మా బావ వూరి నుండి వచ్చాడని, అతడి బలవంతంపైన సెకెండ్ షో సినిమాకి వెళ్ళాను సర్. తెల్లవారే వరకూ ఒకటే వాంతులు. మా బావ పరిస్థితి మరింత అధ్వాన్నం. అతడికి విరేచనాలు కూడా పట్టుకొన్నాయి. ఇప్పుడు మళ్ళీ మీరా సినిమా గుర్తు చేయడంతో నాలో వామిటింగ్ సెన్సేషన్ మొదలైంది. ఇక సినిమా క్లిప్పింగ్‌లు చూపిస్తూ 'ఇంటర్వ్యూ' చేయాలంటే మన స్టూడియో పాడైపోతుందేమో సర్" అంది ఆందోళనగా...

"నీ పరిస్థితిలాగే స్టుడియో పరిస్థితి అవుతుందేమో నమ్మా... సినిమా చూడని వాళ్ళని ఎవర్నైనా చూసి ఇంటర్వ్యూ చేయిస్తాలే " చెప్పాడు సాయిరాం.

అనుకున్నట్టుగానే 'జబరదస్తీ' సినిమా చూడని ఆ మాటకొస్తే సినిమాల ముఖం... ఐ మీన్ సినిమా 'పోస్టర్ల'ను కూడా చూడని యాంకర్ మేరీని ఇంటర్వ్యూలో కూర్చో పెట్టాడు సాయిరాం.

సాయంత్రం నాలుగ్గంటలకు ఇంటర్వ్యూ మొదలైంది.

వీలైనంత ఎక్కువగా మేకప్ దట్టించుకొని కూర్మారావు స్టుడియోలో కూర్చున్నాడు.

అంతకు ముందు మేరీ "సార్... నన్ను 'నడిపించు నా నావా' కార్యక్రమానికి కదా ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు ఈ సినిమాల గోల ఏంటి సర్? నేనసలు సినిమాలే చూడను కాదా" అంది.

"ఫర్వాలేదమ్మా... ఏవో నాలుగు క్లిప్పింగ్‌లు వేస్తుంటాం... మధ్య మధ్యలో పాటలు వున్నాయని... డైలాగులు భావున్నాయని చెబుతూ వుండండి. ఎలాగూ 'లైవ్'లో లైన్లు అందేది మనం ఏర్పాటు చేసుకొన్న వాళ్ళకే కదా" అన్నాడు సాయిరాం.


మేరి అయోమయంగా చూసి –

"నేను 'ప్రభువు' భక్తురాలును సర్. 'బైబిల్‌ని బట్టి 'బాస్' ఆజ్ఞల్ని శిరసావహించాలి" అని ఇంటర్వ్యూ చేయడానికి అంగీకరించింది.

మొదట నమస్కారం పెట్టి... "చెప్పండి రావు గారూ, ఇంత గొప్ప 'కళాఖండాన్ని' ఎలా తీయగలిగారు?" అడిగింది.

కూర్మారావు ఒక నిమిషం బరువుగా శ్వాస పీల్చి–

"ఫ్యాక్షనిస్టుల్లో కూడా 'కళాకారులు' ఎలా దాగి వుంటారో అన్నది కాన్సెప్ట్ అమ్మా. మన చరాచర సోదరులు ఈ కథ కాన్సెప్ట్ చెప్పింతర్వాత ఒక నిమిషం నా మనసు స్తంభించిపోయింది. రాళ్ళల్లో రత్నాలు పండుతాయన్న సినిమాలు చాలా వచ్చాయి. కానీ రాళ్ళలో 'కళలు' దాగి వుంటాయి అన్నది ఈ సినిమాలైను. అది విన్న తర్వాత ఇక ఆగలేక పోయాను".



'దీపావళి హాస్యకథల పోటీ-2012' లో సాధారణ బహుమతి పొందిన కథ

"ఓకే నండీ. మీ సినిమా నుండి ఒక క్లిప్పింగ్" చెప్పింది మేరీ.

సినిమా క్లిప్పింగ్ మొదలైంది.

ఆపరేటర్ కళ్ళు మూసుకొని క్లిప్పింగ్ వేశాడు.

మేరీకి చూడక తప్పలేదు.

ఆమెకి ఒక నిమిషం మెదడు మొద్దు బారి పోయింది.

కళ్ళు తిరిగినట్టు అనిపించింది.

కూర్మారావు ఆమె పరిస్థితిని గమనించి ముఖంపైన నీళ్ళు చిలకరించి. ''నా సినిమా క్లిప్పింగ్‌లో లీనమైపోయినట్టున్నారు...'' అన్నాడు నవ్వుతూ.

మేరి అయోమయంగా చూసి –

"ఏమిటోనండి. ఏదోలా వుంది...'' అంది.

"ఓకే... తర్వాత ప్రశ్న అడగండి" కూర్మారావే గుర్తు చేశాడు.

"అవునండి. పాటలకి గొప్ప సాహిత్యాన్ని జోడించారు... ఇదెలా సాధ్యమైందండీ?" అడిగింది స్క్రిప్ట్‌ను చూసుకుంటూ.

కూర్మారావు ఉప్పొంగుతూ –

"మీకొక విషయం చెప్పాలి మేడం. ఆత్రేయగారి గురించి ఒక కథ ప్రచారంలో వుంది. రాసి ప్రేక్షకుల ను... రాయకుండా నిర్మాతలను ఏడిపిస్తారని. నా పరిస్థితి మాత్రం ఆత్రేయగారి నిర్మాతలాంటిదే మేడం. ఈ సినిమాలకు గీతాలు వ్రాసిన 'రాంబంట్లు' గారు మూడు పాటలు రాసేందుకు మూడు నెలలు తిప్పుకొన్నారు. ఉదయాన్నే వెళ్ళి 'గుడ్ మార్నింగ్' చెప్పేవాడ్ని. మధ్యాహ్నం 'గుడ్ ఆఫ్టర్‌నూన్', రాత్రి..."

"గుడ్ నైట్..." అందించింది మేరీ.

"ఎగ్జాట్లీ మేడం. బాగా క్యాచ్ చేశారు. అలా మూడు నెలలు తిరిగిన తర్వాత ఆయన మనసు కరిగి ముచ్చటగా మూడు పాటలు ఇచ్చారు. వంద మందిని చంపిన మన ఫ్యాక్షనిస్ట్ హీరో స్వేద బిందువులు పాడుకొనే పాట ఇది. థియేటర్లో ప్రేక్షకుల కళ్ళలో నీళ్ళు కారాయి."

'కారక ఏం చేస్తాయిరా బాబూ... నీ సినిమా చూస్తే ప్రేక్షకులకు మిగిలేది అదే కదా...' షూట్ చేస్తున్న కెమెరామెన్ ఏకాంబరం గొణిగాడు.

"మన కెమెరామెన్ ఏదో అడుగుతున్నాడమ్మా... అడగండి బాబూ" అన్నాడు.

"సారీ సర్... స్టుడియోలో వాళ్ళని లైవ్‌లోకి తీసుకోం" అంటుండగానే ప్రక్క గదిలో నుండి ఫోన్ మ్రోగింది.

"ఈ ఫోన్ తీసే ముందు ఈ సినిమాలోని పాట మన 'జీరో' ప్రేక్షకుల కోసం..." చెప్పింది మేరీ.

పాట వింటూ వుంటే మేరీ పరిస్థితి చాలా ఘోరంగా వుంది.

మట్టి బంధం

మట్టి మిద్దెల్లో నిద్రించినప్పుడు
మట్టి గిన్నెలో వండుకున్నప్పుడు
మట్టి కుండల్లో నీళ్ళు తాగినప్పుడు
మనుషులెంత మిసమిసలాడేవారో....

మట్టి ప్రమిదలు వెలిగించినప్పుడు
మట్టి వాసన తొలకరిలో పీల్చినప్పుడు
మట్టిలో విత్తనాలు చేత్తో నాటినప్పుడు
మట్టిలో వానపాముల్లా
మనుషులెంత పెనవేసుకొని ఉండేవారో....

మట్టి వంటినిండా పులుముకున్నప్పుడు
మట్టి విగ్రహాలు పూజించుకున్నప్పుడు
మట్టి పొయ్యి అలుక్కున్నప్పుడు
మట్టిలో మాణిక్యాల్లా
మనుషులెంత స్వచ్ఛంగా మెరిసేవారో....

మట్టి అంటని నేటి వారు
మరబొమ్మలై మందు గుండులై
మానవతను కాలదన్నుతున్నారు
మంచి మాటా మరచారు
మమకారం విడిచారు
మనసున మమత నిండుకున్నదే....

మట్టి నుండి నేతిని తీసి
కర్షుడు ఏమి సాధించాడో
మట్టిని తిని కృష్ణుడు
ఏమి ప్రదర్శించాడో
ఈనాటి వారు ఎరుకలేని వారయ్యారే....
మట్టితోనే మనుగడన్న నిజం మరచి
మరీ ఇంత మట్టిబుర్రలయ్యారే . . .

ఎంత కాదనుకున్నా
మట్టితనాన్ని
ఎంత వదిలించుకుందామనుకున్నా
తిరిగి మమేకమవ్వాల్సింది
ఈ మట్టి రేణువుల్లోనే..... అందుకే
మనందరిదీ గట్టి అనుబంధం....
మంచి మట్టి బంధం.

– షేక్ బషీరున్నీసాబేగం

కడుపులో పేగులు కాలిపోతున్న ఫీలింగ్.

మెదడులో నరాలు చిట్లిపోతున్న అనుభూతి.

గుండె కవాటాలు పని చేస్తున్నాయో లేదో నన్న సందేహం – వెరసి మేరీ ఆక్రందనల మధ్య... పాట పూర్తయ్యింది...

గుండెల్లో కాస్త నెప్పనిపించింది మేరీకి.

అప్రయత్నంగా తన చేయిని గుండెల దగ్గర పెట్టుకొంది.

"ఎస్... ఈ ఫీలింగ్... ఈ ఫీలింగే మేడం... థియేటర్‌లో ప్రేక్షకులకంతా. వాళ్ళ మధ్య చేరి చూశాను. వాళ్ళ రెస్పాన్స్ వండర్‌ఫుల్...'' చెప్పుకుపోతున్నాడు కూర్మారావు.

మేరీకి ఊపిరాడనట్లు అన్పించింది.

ఒక నిమిషం వాచీ చూసుకుంది.

"ప్రోగ్రాం అయిపోయింతర్వాత... మళ్ళీ ఒక సారి వెళ్ళి చూడాలనుకుంటున్నారు కదూ. నాకు తెలుసు మేడం. క్లిప్పింగ్ చూస్తుంటేనే మీ కనుపాపలు పెద్దవవుతున్నాయి " చెప్పాడు కూర్మారావు.

మళ్ళీ ఫోన్ మ్రోగింది.

"చెప్పండి, నిర్మాత కూర్మారావు గారు వున్నారు... మాట్లాడండి..." అంది.

టెలిఫోన్‌లో "రావుగారండీ... నమస్కారమండీ బాబూ... మీ సినిమా సూపరండీ బాబూ... ఇప్పటికి ఐదుసార్లు చూశానండీ... మళ్ళీ వెళదామంటే టిక్కెట్లు దొరకడం లేదు..." అతడు చెబుతున్నాడు.

మేరీ భృకిటి ముడిపడింది. ఆ గొంతు ఎక్కడో విన్నట్లు అనిపించింది.

ఇది స్టూడియో ఫ్లోర్ అసిస్టెంట్ వీర్రాజు గొంతులా వుందే అనుకుంటుండగానే...

"అదమ్మా రెస్పాన్సు..." అన్నాడు కూర్మారావు.

"మీరు ఎక్కడ నుండి మాట్లాడుతున్నారండి?" అడిగింది మేరీ.

"స్త... తూ...తూర్పు గోదావరి జిల్లా చిట్టి వలస నుండి అండి..." చెప్పాడతను..

మరో కాల్ వచ్చింది..

"చెప్పండి" అంది మేరీ.

''నేను నిర్మాత కూర్మారావు గారితో మాట్లాడాలండీ...'' అంది స్వరం.


"చెప్పండి. మీ పేరు..." అడిగింది మేరీ.

"సు... సులోచన మేడమ్..." అంది.

ఈ గొంతు కూడా ఎక్కడో విన్నట్టు అన్పించింది.

"చెప్పండి.. ఈ సినిమాలో ఏం నచ్చింది మీకు" అడిగింది మేరీ.

"ఫైట్స్ మేడమ్... రాయలసీమ బ్యాక్‌గ్రౌండ్‌లో చుక్క నెత్తురు చిందకుండా అద్భుతంగా తీసారండి... ఇటువంటి మంచి చిత్రాలు కూర్మారావు గారి నుంచి



చాలా రావాలి" అంటోంది లేడీ కాలర్.

"తప్పకుండానమ్మా..." అని మేరీ వైపు తిరిగి –

"చూశారు గదమ్మా... మహిళా ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుందో... ఫైట్సను స్టంట్ మాస్టర్ వుహాలేంది అద్భుతంగా తీసారు. నెత్తుటి బొట్టు పడకుండా చేశారు. సరిక్రొత్త కాన్సెప్ట్..." చెప్పాడు.

"ఇప్పుడు మీ చిత్రంలోని ఒక మంచి 'ఫైట్' సీన్ మన ప్రేక్షకుల కోసం..." అంది మేరి.

ఫైట్‌సీన్ మొదలైంది...

కాస్త బక్క పలచగా రజనీకాంత్ అల్లుడు ధనుష్ లాంటి హీరో కొడుతూంటే, రామిరెడ్డి లాంటి విలన్లు క్రింద పడిపోతున్నారు. విచిత్రమేమంటే ఎవరికీ చుక్క నెత్తురు రావడం లేదు.

ఎముకలు విరుగుతున్నాయ్. కొందరికి బైటకు వస్తున్నాయ్...

మేరీకి కడుపులో దేవినట్లైంది..

మెదడంతా వికారంగా మారిపోయింది.

''రేయ్... నెత్తుటి బొట్టు రాలకుండా... నిన్ను పరలోకానికి పంపిస్తానోరేయ్...'' హీరో అంటున్నాడు.

"రేయ్... నాదీ రాయలసీమ పౌరుషమేరా. నీతో తన్నులు తిని ఎముకలు విరిపించుకోవడం కాదురా. నా ఎముకలు నేనే విరుచుకుంటా..." అని వేళ్ళను చటుక్కున విరుచుకొన్నాడు.

పిచ్చి... పిచ్చిగా తీసిన ఆ ఫైట్‌సీన్‌తో మేరీకి వికారం పెరిగి భళ్ళున స్టుడియోలో వాంతులు చేసుకొనే పరిస్థితి వచ్చింది.

ఇదంతా గమనించిన కెమేరామెన్ ముందుకు వచ్చి...

"ఇప్పుడు కాసేపు బ్రేక్..." అన్నాడు...

మేరి కూర్మారావుని గుర్రున చూసి –

"ఇది సినిమానా... యాక్ థూ..." అని గ్రీన్ రూంలోకి వెళ్ళింది.

కూర్మారావు ప్రోగ్రాం వాయిదా పడడం ఇష్టంలేక... తనకు తానే యాంకరింగ్ చేసుకోవడానికి సిద్ధమయ్యాడు...

"మన యాంకర్ మేరీ గారు. క్లిప్పింగ్స్ చేసిన టెంప్టేషన్‌లో సినిమా చూసేందుకు వెళ్ళారు... ఇప్పుడు ఒక కాలర్‌తో మాట్లాడదాం..." అని ఫోన్ ఎత్తుకొన్నాడు.

అది అప్పటి వరకు ఇంటర్వ్యూ చేసిన మేరి గొంతు...

"ఒరేయ్ సన్యాసీ... ఇప్పటి వరకూ నీకు వచ్చిన కాల్స్ మా స్టుడియో నుండి వచ్చినవే... మా ఫ్లోర్ ఇన్‌చార్జ్ వీర్రాజు... మా యాంకర్ సుబ్బలక్ష్మి తదితరులు చేసినవే... ఎబ్రాసి వెధవ ఇటువంటి సినిమా తీసినందుకు నువ్వు కుళ్ళి చావాలిరా... నువ్వు పురుగులు పట్టి చావాలి..." అరుస్తోంది మేరి.

''కట్... కట్... కట్...'' తనకు తానే చెప్పుకొన్నాడు కూర్మారావు.

ఇంటర్వ్యూ ఆగిపోయింది.

*****

ఛానల్‌హెడ్ వీరశంకరం చాంబర్‌కి వెళ్ళాడు...తనని పరిచయం చేసుకొని "అదేంటండీ... మీ యాంకర్ ఇలా లైవ్‌లోకి వచ్చి ప్రోగ్రాం అంతా రసా... భాసా చేసింది..." అన్నాడు కాస్త కోపంగా.

"అవునా...?" అన్నాడు నొసలు ముడి వేస్తూ వీరశంకరం.

''ఇప్పటి వరకు నా ప్రోగ్రాం చూడలేదా మీరు...'' అడిగారు.

''చూడలేదండీ... మన ప్రోగ్రాం మనం చూసేదేముందండీ '' అన్నాడు నవ్వుతూ.

అప్పుడే అతడికి ఒక ఫ్యాక్స్ వచ్చింది.

సిటీ కమీషనర్ పికే ఖాన్ నుండి –

''చెత్త చిత్రానికి సంబంధించిన క్లిప్పింగ్స్ వేసి... ప్రజల్ని కల్లోలపరచినందుకు... మిమ్మల్ని ఎందుకు ప్రాసిక్యూట్ చేయకూడదన్నది...'' ఆ ఫ్యాక్స్ సారాంశం.

వీరశంకరం ముఖంలో రంగులు మారాయి.

ఫ్యాక్స్ చూపించాడు.

''ఇటువంటి బెదిరింపులు మిమ్మల్ని ఏం చేస్తాయిలెండి సర్... అవసరమైతే చెప్పండి మా బావమరిది ఫ్రెండ్ ఎక్స్ ఎమ్మెల్యే వున్నాడు.. ఖాన్ సంగతిని చూసుకుంటాడు...'' చెప్పాడు కూర్మారావు.

"మా తంటాలు మేం పడతాం... తమరు వెళ్ళి రండి సర్..." చెప్పాడు వీరశంకరం.

ప్రక్క రోజు కూర్మారావుకి మానవ హక్కుల కమీషన్ నుండి ఒక లేఖ వచ్చింది.

''చెత్త చిత్రాలు తీసి ప్రజల జీవితాల్ని కల్లోల పరిచినందుకు మీపై ఎందుకు చర్య తీసుకోకూడదన్నది'' కమీషన్ లేఖ సారాంశం.

తల పట్టుకొన్నాడు కూర్మారావు.

ఒక వైపు సినిమా ఫ్లాప్‌తో తీవ్రంగా నష్టపోవడం కాక ఇటువంటి తాఖీదులు అందడంతో అతడు కిందా... మీద అయిపోయాడు... పక్క రోజు మరో లేఖ అందించి... అది లేఖ కాదు... కోర్టు నోటీస్... యాంకర్ మేరి భర్త సాల్మన్ రాజు పంపింది.

కూర్మారావు చెత్త చిత్రం 'జబరదస్తీ' క్లిప్పింగ్స్ చూసి... మతి చెడిన భార్య మేరీకి నష్టపరిహారం చెల్లించాలన్నది నోటీసు సారాంశం.

పిచ్చిగా నవ్వుకున్నాడు కూర్మారావు.

సినిమా దెబ్బతో అసలే తను నష్టపోయివుంటే... మరొకరికి నష్టపరిహారం చెల్లించడమా ?

నవ్వుకున్నాడు.

ఆ నవ్వు...కంటిన్యూషన్‌గా మారి...

ప్రక్క రోజు ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయానికి చేరుకున్నాడు.

ప్రక్క బెడ్ మీద మేరి వుంది.

అదిరిపడ్డాడు.

పిచ్చి... పిచ్చి చూపులు చూస్తున్న మేరి ప్రక్కన ఆమె భర్త సాల్మన్ రాజు చేరి శుశ్రూష చేస్తున్నాడు.

తన పక్క బెడ్ మీద వుంది నిర్మాత కూర్మారావ్ అని తెలిసి సాల్మన్ పళ్ళు పట... పట కొరికాడు.

ఆ పక్క రోజు కూర్మారావు ఆర్థోపెడిక్ హాస్పటల్‌లో చేరాల్సి వచ్చింది.

కోర్టులు తనకు న్యాయం చేయలేవన్న ధృవీకరణకు వచ్చి సాల్మాన్ 'చేతివాటం' చూపాడు...


కూర్మారావు తన సొంత జిల్లా తూర్పు గోదావరిలోని 'బొబ్బరి లంక'కి లగేజీతో చేరి పోయాడు...

☆

కాలంతో కలిసి

-డా॥సి.నారాయణరెడ్డి

కాలం ఎప్పటికప్పుడే
నన్ను పరీక్షిస్తుంటుంది.
నా కంటే వేగంగా నడిచినట్టే నడిచి
మధ్యలో అదృశ్యమైపోతుంది.
ఎక్కడున్నావు కాలమా అని
ఎలుగెత్తి పిలిస్తే
ఇదిగో నీ నీడలో వున్నానని
కిలకిలా నవ్వుతుంది.



కాలం వేసే యెత్తులను తట్టుకునేదెలా అని
దాన్ని నా చేత్తో పట్టుకున్నాను.
కాసేపు కాలమూ నేను
కలిసి నడిచాం.
అంతలోనే కాలం కాళ్లల్లో
మెరుపులు చొరబడ్డాయేమో
అది ఎగరడం ప్రారంభించింది.
దాన్ని గట్టిగా నొక్కిపట్టి
అదుపులో పెట్టాను.
అది కూలబడిపోయింది
ఇది కాలం వేసిన మరో ఎత్తులే అని
గమనించి
దాన్ని ఈడ్చుకుంటూ పోయాను.
ఒక దశలో ఎంత ఈడ్చినా
అది కదలకుండా పడివుంది.
ఇది కాలం వేసిన మరో ఎత్తుగడ అని
విసుగు పుట్టి దాన్ని విసిరికొట్టి
నా దారి నేను చూసుకున్నాను.
కొన్ని క్షణాల్లోనే కాలం
గబగబా పరుగెత్తుకొని వచ్చి
నన్ను గభాలున కవుగిలించుకుని
నీతో పాటు నేనుంటాను
నిన్ను విడిచి నేనుండలేను అని
ఆర్ద్రకంఠంతో పలికింది.
కాలం అంతరంగాన్ని అవగతం చేసుకున్న
నేను
దాని చేతిలో నా చేయి కలిపి
వెల్లి విరిసే ఉల్లాసంతో సాగిపోయాను. ☆

'శునకం' వుంటేనే స్వర్గానికొస్తాను

అతి తరచుగా చాలామంది ఈ మీమాంసకి గురవుతుంటారు. సమాజం మొత్తం ధర్మంగా నడిస్తే బాగుణ్ణనిపిస్తూంటుంది. మళ్ళా తమ దగ్గరకొచ్చేసరికి - ప్రలోభాలు ఎదురైనప్పుడు - "ఆ ఎవడు చూడొచ్చాడులే" అనిపిస్తుంది.

ధర్మాన్ని ఆచరించాలా, వద్దా? దీనివల్ల లాభం వుందా? ధర్మాన్ని పాటించడం వల్ల నాకేమొస్తుంది? సుఖపడటానికి అడ్డొస్తే ధర్మాన్ని పక్కకి తోసైనా సుఖపడాలి గదా !

కష్టాలొచ్చినప్పుడు డబ్బు, అధికారం, జనబలం ఆదుకుంటాయి. అంతేకాని, ఈ ధర్మాలేమైనా ఆరుస్తాయా? తీరుస్తాయా ?

- ఇది భౌతికవాదుల సిద్ధాంతం. ధార్మిక వాదుల్ని నిలదీసే వారి వాదం. కానీ దీనికి దీటైన సమాధానాలు శాస్త్రాలే కాదు. నిత్య జీవిత వ్యవహారమే చెబుతుంది.

మన సమస్యలు - మహా పరిష్కారాలు



సామవేదం షణ్ముఖ శర్మ

రామాయణంలో ఆంజనేయుడు లంకాదహనం చేసేటప్పుడు అన్ని గృహాలూ దగ్ధమైనా విభీషణ గృహం తగలబడదు. హనుమంతుడు అతడి ఇంటికి నిప్పు పెట్టలేదు – అని అన్నంత మాత్రాన సరిపోదు. చుట్టూ మండించే అగ్ని వల్ల అన్ని ఇళ్లల్లో ఒక్క ఇల్లైన విభీషణుని ఇంటికీ అంటుకోగలదు. కానీ అక్కడ అగ్నిదేవుడు కూడా అతని గృహాన్ని తాకలేదు. ఇదీ గమనించవలసిన విషయం. ధర్మం ఏదో రకంగా వచ్చి ఆదుకుంటుంది.

ఒకప్పుడు చేసిన ధర్మాన్ని చేసినవాడు మరచి పోవచ్చు. కానీ ధర్మం జడమైనది కాదు. అది భగవత్స్వరూపం.

'రామో విగ్రహవాన్ ధర్మః
'ధర్మస్య ప్రభురచ్యుతః'


అని ఋషుల వాక్కు. అందుకే ఆ ధర్మం తనను ఆచరించిన వాడిని రక్షిస్తుంది.

వనే రణే శత్రుజలాగ్ని మధ్యే
మహార్ణవే పర్వత మస్తకేవా!
సుప్తంప్రసుప్తం విషమస్థితం వా
రక్షంతి పుణ్యాని పురాకృతాని॥

– అని ఋషి వచనం.

అడవిలో, యుద్ధంలో, శత్రు మధ్యలో, నీటిలో, నిప్పులో, సముద్రంలో, కొండ కొనపై... ఎక్కడ ఉన్నా, నిద్రిస్తున్నా, ప్రమాద స్థితిలో ఉన్నా- పురాకృత (మునుపు చేసిన) మంచి పనులు తప్పక కాపాడతాయి.

ఏనాడో చేసిన మంచి పని – తగిన సమయానికి తోడై కాపాడుతుంది.



జనాల వల్ల, ధనాల వల్ల, అధికారాల వల్ల దొరకని రక్షణ ధర్మం ఇస్తుంది. అందుకే ధర్మ సంపదను భద్రపరచుకున్నవాడు ధన్యుడు. నీరు దొరకని చోట పెట్టెనిండా డబ్బులిచ్చినా నీటి చుక్కని పుట్టించలేం.

పాప్రబ్ధవశాత్తు కష్టాలపాలైనా, ధర్మ ప్రభావం వల్ల వాటిని తట్టు కోగలం. క్రమంగా వాటి నుండి తప్పుకోగలం. నిండు సభలో, తన వారు కూడా అసహాయులై రక్షణకు రాలేక తలవంచుకు కూర్చున్నప్పుడు-ద్రౌపదీ దేవి ధర్మం ఆమెను కాపాడింది. చుట్టూ అగ్ని మధ్యలో విభీషణ గృహం చెక్కు చెదరకుండా కాపాడబడింది.

ముల్లోకాల రాజ్యం, భద్రమైన కోట, ఎంతోకాలపు తపశ్శక్తి వల్ల దొరికిన వరాలు, లెక్కకందని రాక్షసబలం, అనేక లోకాలనూ, రాజ్యాలనూ కొల్లగొట్టి తెచ్చిన సంపద, అస్త్రశస్త్రాలు.. ఇలా ఎన్నో రక్షక శక్తులున్నాయని భావించిన రావణుని అధర్మం వల్ల అవేవి కాపాడలేకపోయాయి. కాపాడేందుకు ధర్మమతనికి లేకుండా పోయింది. పదవీ, అధికారం అంతులేని అక్రమార్జన అండనుండే ప్రజా బలం... ఏవీ కూడా అధర్మపరుని ఆదుకోలేవు.

మొసలి పట్టుకి చిక్కిన గజేంద్రునికి గతంలోని మంచి పనుల మహిమయే, నారాయణుని స్మరింపజేశాయి. ఆ పరమాత్ముని కృప లభించేలా చేశాయి.

మనవెంట జీవనంలోనూ, మరణం తర్వాత కూడా అంటి పెట్టుకొని వచ్చేది ధర్మమే. మహాప్రస్థానానికి వెళ్లిన ఆ ధర్మరాజు చలించకుండా ధర్మాన్ని పట్టుకున్నాడు గనుకనే ఆతడొక్కడే లక్ష్య సిద్ధిని పొందాడు. అతడి ధర్మం శునక రూపంలో అతడితోనే వస్తుంది.

చివరకు– శునకం (ధర్మం) ఉంటేనే స్వర్గంలో సుఖప్రవేశం చేస్తానన్నాడు. ఆ శునకం తనదైన ధర్మ/సిద్ధ దేవతా రూపాన్ని ప్రకటించి మెచ్చుకుంది.

సరిగ్గా అంచనాలు వేయలేని సమయంలో అద్భుత పరిష్కారాన్ని చూపిస్తూ ధర్మమే స్ఫురణలో భాసిస్తుంది.

ధర్మబద్ధుడైన హనుమంతునకు ధర్మం చేతనే ధర్మ దేవత సరియైన ఆలోచనలను స్ఫురింపజేసి, కార్యసిద్ధి కలిగించింది. సీతాదేవి ధర్మం తోడుతోనే అసురుల నడుమ కూడా అభయంతో ఉండగలిగింది.

మహాత్ములు బ్రతుకు ఒడిదుడుకుల నుండి ధర్మ బలంతోనే విజయాన్ని సాధించగలుగుతున్నారు. కాని కాలంలో (కలసి రాని కాలంలో) నిబ్బరంగా మనగలుగుతున్నారు. ★

పల్లెజనంలో వెల్లివిరిసిన ఉత్సాహం

పంచాయతీరాజ్ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పల్లె ప్రాంతాలలో ఉత్సాహం వెల్లివిరిసింది.

మూడు దశలలో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగియడమే కాకుండా 80 శాతానికి పైగా ఓటింగ్ నమోదు కావడం మన ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని మరోసారి చాటి చెప్పింది.

జూలై 23, 27, 31 తేదీలలో మూడు విడతలుగా పార్టీ రహితంగా పంచాయతీ ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర ఎన్నికల కమీషనర్ శ్రీ రమాకాంత్ రెడ్డి, కార్యదర్శి శ్రీ నవీన్ మిట్టల్ నేతృత్వంలో ఎన్నికల నిర్వహణ సజావుగా, సాఫీగా జరిగింది.

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జూలై 3వ తేదీన నోటిఫికేషన్ జారీ కాగా 9వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 13వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, 14వ తేదీన నామినేషన్లు పరిశీలించి 17వ తేదీన అభ్యర్థుల తుది జాబితా ప్రకటించారు.



మొదటి విడతలో 6863 పంచాయతీలు, 69,450 వార్డులు; రెండవ విడతలో 7738 పంచాయతీలు, 78,160 వార్డులు; మూడవ విడతలో 6890 పంచాయతీలు, 69,968 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు.

మొదటి విడత ఎన్నికలు జరిగిన డివిజన్ల వివరాలు

(బ్రాకెట్లలో పంచాయతీల సంఖ్య)

ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ డివిజన్ (137, ఉట్నూరు (115), అనంతపురం జిల్లా పెనుకొండ (353), చిత్తూరు జిల్లా తిరుపతి (393), తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం (120), రాజమండ్రి (204), గుంటూరు జిల్లా తెనాలి (348), కరీంనగర్ జిల్లా పెద్దపల్లి (171), మంథని (122).

ఖమ్మం జిల్లా భద్రాచలం (117), కృష్ణా జిల్లా నూజివీడు (279), కర్నూలు జిల్లా (299), మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల్ (195), నారాయణపేట్ (328), మెదక్ జిల్లా సిద్ధిపేట (304), నల్లగొండ జిల్లా భువనగిరి (337), నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ (292), ప్రకాశం జిల్లా ఒంగోలు (349), నెల్లూరు జిల్లా కావలి (167), ఆత్మకూరు (193), శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళం (349), విశాఖ జిల్లా పాడేరు (244), విజయనగరం జిల్లా పార్వతీపురం (409), వరంగల్ జిల్లా ములుగు (236), పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు (341), వైఎస్సార్ కడప జిల్లా (252).

రెండవ విడతకి ఎంపికైన పంచాయతీలు

ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ (187), మంచిర్యాల (187), అనంతపురం జిల్లా ధర్మవరం (262), చిత్తూరు జిల్లా చిత్తూరు (464), తూర్పుగోదావరి జిల్లా కాకినాడ (163), పెద్దాపురం (203), గుంటూరు జిల్లా గుంటూరు (307), కరీంనగర్ జిల్లా జగిత్యాల (304), సిరిసిల్ల (211), ఖమ్మం జిల్లా ఖమ్మం (377), కృష్ణా జిల్లా విజయవాడ (238), కర్నూలు జిల్లా నంద్యాల (287), మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ (414), మెదక్ జిల్లా మెదక్ (406).

నల్గొండ జిల్లా నల్గొండ (203), సూర్యాపేట (253), నిజామాబాద్ జిల్లా బోధన్ (235), ప్రకాశం జిల్లా కందుకూరు (475), రంగారెడ్డి జిల్లా చేవేళ్ళ (227), నెల్లూరు జిల్లా నెల్లూరు (234), శ్రీకాకుళం జిల్లా పాలకొండ (378) విశాఖ జిల్లా విశాఖ (116), నర్సీపట్నం (238), విజయనగరం జిల్లా (512), వరంగల్ జిల్లా మహబూబాబాద్ (187), నర్సంపేట (119), పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు

ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

(191), జంగారెడ్డి గూడెం (102), వైఎస్సార్ జిల్లా రాజం పేట (258).

మూడవ విడతకి ఎంపికైన పంచాయతీలు

ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ (240), అనంతపురం జిల్లా, అనంతపురం (388), చిత్తూరు జిల్లా మదనపల్లి (499), తూర్పుగోదావరి జిల్లా అమలాపురం (272), గుంటూరు జిల్లా నర్సారావు పేట (355), కరీంనగర్ జిల్లా కరీంనగర్ (399), ఖమ్మం జిల్లా కొత్త గూడెం (147), పాల్వంచ (117).

కృష్ణా జిల్లా మచిలీపట్నం (233), గుడివాడ (219), కర్నూలు జిల్లా ఆదోని (297), మహబూబ్‌నగర్ జిల్లా నాగర్ కర్నూలు (225), వనపర్తి (162), నల్గొండ జిల్లా మిర్యాలగూడ (225), దేవరకొండ (151), మెదక్ జిల్లా సంగారెడ్డి (367) నిజామాబాద్ జిల్లా కామారెడ్డి (191), ప్రకాశం జిల్లా మార్కాపురం (199), రంగారెడ్డి జిల్లా వికారాబాద్ (236), నెల్లూరు జిల్లా గూడూరు (210), నాయుడుపేట (127), శ్రీకాకుళం జిల్లా టెక్కలి (364), విశాఖ జిల్లా అనకాపల్లి (322), వరంగల్ జిల్లా జనగాము (200), పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం (250), వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు (275).

– చెన్నూరి గణేశ్

వానల్లు కురవాలి వానదేవుడా

ప్రకృతిలోని వస్తుజాలం అనంతం. మానవుడు ప్రకృతి చుట్టూ తిరిగి జీవించవల్సిందే. ప్రకృతి లేనిదే మానవుడు లేడు. మానవుడు లేకున్నా ప్రకృతి వుంటుంది. ప్రకృతి మన తల్లి, మన తండ్రి, మన బంధువు, మన ఆత్మీయుడు. ఋతువులు, కాలాల ద్వారా మానవుడికి ఆనందాన్నిచ్చి అవసరాల్ని తీర్చేది ప్రకృతి. ఆదిమానవుడి నుండి అందరూ ప్రకృతిని ఉపాసించినవారే! అటువంటి ప్రకృతిలో ఇది వానకాలం.

ఈ వర్షాకాలం ఎంతగొప్పదో మన కవులు 'తెగ' వర్ణించేశారు. ఎవరి ఊహ వారిది! ఎవరి చూపు వారిది! ప్రకృతిలో ఎంత వైవిధ్యం వుందో ఆ ప్రకృతిని వర్ణించటంలోనూ అంత వైవిధ్యం వుంది.



వసంతఋతువు తర్వాత కవులకి ప్రియమైనది వర్షఋతువు. వసంతం చైతన్యానికి, ఆనందానికీ హేతువైతే వర్షాకాలం వాటితోపాటు జీవనాధారం కూడా. నన్నయ నుంచి ఆధునిక కవి దాకా ఎంతోమంది వానకాలాన్ని పరవశిస్తూ వర్ణించారు. వానరాగానే అడవులలోగల జంతువులు, పక్షులు ఆనందంతో మృదుల ధ్వని గీతాలు పాడతాయట! ఆకాశంలో ఇంద్రధనస్సు వివిధ రంగులలో వుంటే – భూమి నేను మాత్రం తక్కువ తిన్నానా – అనే విధంగా పచ్చిక, చిగురాకులు, పుట్టగొడుగులు, ఆరుద్ర పురుగులు మొదలైన రంగు రంగులతో పోటీపడిందట!

ఇదీ నన్నయ ఊహా వైభవం!

'చలిగాడ్పుల ముసరుల మెయి
వలిగొని ధాత్రీపురంధ్రి వలిబచ్చని కం
బలి గవిచి కొన్న విధమున
బొలుపుగ జీపురువు గవిసె భూతలమెల్లన్'

(నన్నెచోడుడు రాసిన కుమారసంభవం కావ్యం)

అంటే వానకాలంలో భూమి అంతా పచ్చగా వుంటుంది. చలిగాలులు వీస్తాయి. భూదేవి చలిగాలులను తట్టుకోవడానికి పచ్చటి కంబలి కప్పుకొన్నట్లుందిట! వానరాగానే నెమళ్ళు మహానందంగా నాట్యమాడతాయి.

దీనిని

'ధిమి ధిమి యనుచు మద్దెల మ్రోయుబాట
లమర నటీమణులాడు చందమున
ఘుమఘుమ యనుచు మేఘుడు గర్జిల్ల
నమల కే కాస్ఫూర్తి నాడె నెమళ్ళు'

అంటూ తొలి రామాయణ కవి గోన బుద్ధారెడ్డి వర్ణిస్తాడు. 'కేక' అంటే నెమలి కూత అనే అర్థం వుంది. 'కేకి' అంటే నెమలి. కాబట్టి పాటపాడుతూ, మేఘ గర్జనలు మద్దెలగా నెమళ్ళు ఆడుతున్నాయంటాడు కవి!

ఎఱ్ఱన హరివంశంలో జడివానను పద్యాలలోనే కాదు–వచనంలో సుదీర్ఘంగా వర్ణించి ఆశ్చర్యపరిచాడు. అయ్యల రాజు రామభద్ర కవి అయితే శృంగార భావంతో వర్ణించాడు.

'పదియె వడగండ్లు నింద్రగోపములు కూర్మి
ఘనవిభుడు క్రొమ్మెఱుంగు జవ్వనిచెనంగ
బన్న సరమున నదలి పై పైని రాలు
విమల ముక్తాఫలాబ్జ రాగములనంగ'

మేఘమనే పురుషుడు మెఱుపు అనే స్త్రీతో రతికేళి కోసం పెనగులాడుతున్నాడు. అప్పుడామె మెడలోని దండలో గల ముత్యాలు రాలినట్లుగా వడగండ్లు పడ్డాయట!

రాయప్రోలు, దేవులపల్లి, విశ్వనాథ వంటి ఆధునిక కవులు కూడా వర్ష ఋతువును విశేషంగా దృశ్యీకరించారు.

దువ్వూరి రామిరెడ్డి వాన కాలంలో భూమి 'యౌవనవతి' అయిందంటారు. వేదుల సత్యనారాయణ శాస్త్రి 'కుండపోతగా వర్షం కురవటం వల్ల ఆకాశపు నీలి మేలిముసుగు తొలిగి పోయిందని' భావించారు. బాల గంగాధర తిలక్ మరీ వినూత్నంగా 'సన్నని వాన చినుకులు పడుతూవుంటే భూమికి కట్టే దోమతెరలాగా' ఉందంటారు. కుందుర్తి ఏకంగా 'నగరంలో వాన' అనే కావ్యమే రాశారు.!

కొసమెరుపు : వానకాలంలో మనిషి ఎంత సుఖపడతాడో, వానకాలం సమాజానికి ఎంత అవసరమో, వానకాలం ఎంత సుందర మనోహరభరితమో మన కవులు తనివి తీరా వర్ణించారు. మన కళ్ళకి కట్టించారు. వాన దేవుడుగా, వరుణుడుగా, వానమ్మగా కొలిచే మహత్తర తత్త్వం మనది.

'వానల్లు కురవాలి వానదేవుడా
వరిచేలు పండాలి వానదేవుడా..'

అంటూ ప్రార్థిస్తూ, పాడుకుంటూ, ఆడుకుంటూ మురిసి పోయే సంప్రదాయం మనది.

కాని ఇవాళ మనం–

'రెయిన్ రెయిన్ గో ఎవే
కం ఎగైన్ ఏనదర్‌డే...'

అంటూ వాన రావద్దనే 'రైమ్'ను చిన్నపిల్లల్లోకి ఎక్కిస్తున్నాం. వానలో 'వానా వానా వల్లప్పా' అని ఆడుకోవటం ఎంత ఆనందమో చెప్పటం లేదు.

'రావొద్దు వానా' అనిపిస్తున్నాం. ఆంగ్ల దేశపు వాతావరణంలో రాయబడిన పాటను మన దేశానికి సరిపడని పాటను పాడించటం ఎంత వరకు సబబు? సమంజసం?

సాహితీ విన్యాసాలు- 11

– డా.ద్వా.నా. శాస్త్రి

పౌర సంబంధాలతో ఎదిగిన అలుపెరగని 'సింహం'

ఆయన సమాచార, పౌర సంబంధాల శాఖలో వివిధ హోదాలలో 28 ఏళ్ళు తనదంటూ ఒక ముద్రవేసేలా పనిచేశాడు. డైరక్టర్‌గా పదవీ విరమణ చేసి 22 సంవత్సరాలు గడిచాయి.

కాని . . .

ఇప్పటికీ 'పౌరసంబంధాల' స్ఫూర్తిని వెలుగెత్తిలా ప్రసరింపజేయడంలో అలుపెరగని ఉత్తేజంతో, సెలవులేని ఉత్సాహంతో పనిచేస్తున్నాడు. ఇవ్వాళ దేశంలోనే 'పౌర సంబంధాలు' మీద ఆయన ఒక నిఘంటువుగా - తెలుగువారు గర్వించేస్థాయికి - ఎదిగాడు. ఆయన సి.వి. నరసింహారెడ్డి !



సరిగ్గా 80 ఏళ్ళ కిందట నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో పేదకుటుంబంలో జన్మించారు చామల వెంకట నరసింహా రెడ్డి. ఎంతో కష్టపడి ప్రాథమిక విద్యను అభ్యసించిన ఆయన రావి నారాయణరెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ విమోచన పోరాటంవైపు అడుగులు వేశాడు.

1950 నాటికి ఏడో తరగతి పూర్తి చేశాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేక తండ్రి పెద్ద చదువులు చెప్పించనన్నాడు. మామ మారం సత్యనారాయణ రెడ్డి ఈ బాలునిలో చదువుపట్ల ఉన్న ఆర్తికి ముగ్ధుడై చేయూతనందించారు. నరసింహారెడ్డి ఆ రకంగా అక్క శశిరేఖాదేవితో కలిసి బావ నలమాద రాఘవ రెడ్డి ఇంట్లో ఉంటూ చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. బి.ఎ. చదువుతున్నప్పుడు ట్యూషన్లు చెప్పడం వంటి పలు ఆర్థిక కష్టాలకు ఓర్చి, విద్యాభ్యాసం ముగించిన నరసింహారెడ్డి తొలుత బ్లాక్ స్థాయి సహకార సంఘ కార్యాలయంలో భువనగిరిలో కొంతకాలం ఉద్యోగం చేశారు.

తర్వాత 1957లో జిల్లా పౌర సంబంధాల శాఖాధికారిగా ప్రవేశించారు. నాటి నుండి సమాచార ప్రజా సంబంధాల రంగంలో అంచెలంచెలుగా సమున్నత శిఖరాలను అధిరోహించారు.

ప్రజా సంబంధాల వృత్తి నిపుణునిగా ఎంతో ఆదర్శవంతమైన విజయాలను సాధించారు. ఆర్టీసీలో ముఖ్య ప్రజా సంబంధాల అధికారిగా చేసిన ప్రయోగాలు ఆ రంగంలోని వారికి అనుసరణీయంగా నిలిచాయి. అనుదినం హైదరాబాద్‌లో కుక్కకాటుకు బలైపోయే వారి సంఖ్య అపరిమితంగా ఉండేది. కుక్కలకు వాక్సీన్ వేయించడం ద్వారా ఈ ఘటనల సంఖ్యను అపరిమితంగా తగ్గించగలిగిన నరసింహారెడ్డి ప్రజా సంబంధాల నైపుణ్యం ప్రశంసలందుకుంది.

లండన్ నుంచి వెలువడిన ఐపిఆర్ఎ రివ్యూ ఆయన కృషిని ఎంతగానో ప్రశంసించింది. ఆ సమీక్షలో ఆయన గురించి రాసిన అంశాలను చదివి, తర్వాతికాలంలో ఆస్ట్రేలియాలోని కాన్‌బెరా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆయనను విజిటింగ్ స్కాలర్‌గా ఆహ్వానించి ప్రజా సంబంధాల గురించి ఉపన్యాసాలిప్పించింది.

నరసింహారెడ్డి జీవితమంతా నీతి, నిజాయితీ, ఎదుటివారికి చేతనైన సహాయమందించే ఉత్తమ ఆదర్శాలను ఆచరించి చూపారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావు, భవనం వెంకట్రాం, ఎన్.టి. రామారావుల హయాంలో ముఖ్యమంత్రి ముఖ్య పౌరసంబంధాల అధికారిగా సేవలందించి పార్టీలకు అతీతంగా మెప్పుపొందారు. సమాచార శాఖలో అత్యున్నత పదవిలో ఉన్నప్పుడు 69 మంది డివిజనల్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ల నియామకం పారదర్శకంగా, ప్రతిభావంతులనే ఎంపిక చేసేలా నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. అన్ని జిల్లాల్లో 'ప్రగతిపథం' అనే వాహనాల ద్వారా సమాచార శాఖ సిబ్బంది పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రచారం చేసేలా, అదే విధంగా ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ప్రజల స్పందనను సేకరించి ఎప్పటికప్పుడు పంపేలా శ్రద్ధ తీసుకున్నారు. సమాచార శాఖలోని వివిధ స్థాయిలకు చెందిన సిబ్బందికి, అధికారులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టారు.

సాంస్కృతిక శాఖ సంచాలకునిగా 1992లో పదవీ విరమణ చేసే నాటికి 35 సంవత్సరాల ప్రభుత్వ అధికార బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నారు.

పదవీ విరమణ తర్వాత ప్రజా సంబంధాల వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు వివిధ విశ్వవిద్యాలయాల్లో కోర్సులు ప్రారంభించేలా పాటుపడ్డారు. ఫలితంగా అనేక చోట్ల కోర్సులు రావడమే కాకుండా యుజిసి నేషనల్ ప్రొఫెసర్‌గా గుర్తింపు లభించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆ వయసులోనూ పి.హెచ్.డి (పరిశోధన) చేసి డాక్టరేట్ తీసుకున్నారు.

భారతీయ విద్యాభవన్, తెలుగు విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తదితర విశ్వవిద్యాలయాల్లో ప్రజాసంబంధాల అధ్యాపకులుగా సేవలందించారు. ఆస్ట్రేలియా, యు.కె, అమెరికా, చైనా వంటి అనేక దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పర్యటించారు. అనేక ఇతర ప్రతిష్టాత్మక సంస్థల్లో వివిధ అంశాలపై ప్రత్యేక ప్రసంగాలు చేశారు.

1997 అక్టోబర్ నుంచి నేటి వరకూ 'పబ్లిక్ రిలేషన్స్ వాయిస్' అనే పత్రికను స్వీయ సంపాదకత్వంలో నిర్వహిస్తున్నారు. ప్రజా సంబంధాలకు సంబంధించి దేశంలో ఏకైక పత్రిక ఇది. మరొకవైపు పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) ని గత 60 సంవత్సరాలుగా పటిష్టంగా నిర్వహించడం వెనుక ముఖ్యంగా చెప్పుకోదగిన వారిలో డా.సి.వి. నరసింహారెడ్డి ఒకరు. ఆయన ప్రజా సంబంధాల విద్యను, విస్తరింపజేసేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఆయన జన్మదినం ఆగస్టు 6న జాతీయ ప్రజా సంబంధాల విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. ఆయన చొరవ వల్లనే ఏప్రిల్ 21ని జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవంగా పాటిస్తున్నారు. ప్రజాసంబంధాల విజ్ఞానాన్ని అందరికీ పంచిపెట్టేందుకు 22 ప్రామాణిక గ్రంథాలను వెలువరించారు.



ప్రజా సంబంధాల రంగంలో అధికారిగా, బహు గ్రంథ రచయితగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా, వక్తగా తాను సంపాదించిన ధనాన్నంతటినీ తిరిగి సామాజిక సేవకు ధారపోస్తున్న ఆదర్శ మూర్తి నరసింహారెడ్డి. డాక్టర్ సి.వి.ఎన్. ఫౌండేషన్‌ను నెలకొల్పి పేద విద్యార్థుల చదువుకయ్యే ఖర్చులు భరిస్తున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు, పతకాలను అందజేస్తున్నారు.

శర్బనాపురం అనే గ్రామంలో 20 లక్షల రూపాయలు ఖర్చుచేసి ఒక విజ్ఞాన మందిరాన్ని నిర్మించారు. వివిధ శాస్త్రాలకు సంబంధించిన గ్రంథాలను పొందుపరచారు. సామాన్య ప్రజల్లో ప్రభుత్వ పథకాలు, చట్టాల గురించి చైతన్యం పెంపొందించేందుకు అనేక గ్రంథాలు వెలువరించడంతో పాటు సదస్సులు నిర్వహించారు.

8 పదుల వయసులోనూ అలుపెరగని రీతిలో తన సేవల్ని కొనసాగిస్తున్న నిత్య కృషీవలుడు డాక్టర్ సి.వి.నరసింహారెడ్డి.

- డా॥ జె. చెన్నయ్య

ఆగస్టు 6, 2013న డా. సి.వి. నరసింహారెడ్డి అశీతి ఉత్సవం (80 వ జన్మదినం) హైదరాబాద్‌లో జరుగుతున్న సందర్భంగా....

చేనేతకు సి.ఎం వరం

"వివిధ కారణాల వల్ల చేనేత కార్మికులు పడుతున్న శ్రమకు ఫలితం లభించడం లేదు. వడ్డీ లేకుండా రైతులకు రుణాలు ఇస్తున్నట్లుగా చేనేత కార్మికులకూ లక్షరూపాయల వరకూ 'వడ్డీ లేని రుణాలు' ఇవ్వనున్నాం. ఈ పథకం వల్ల రాష్ట్రంలోని లక్షమంది చేనేత కార్మికులు లబ్ధిపొందుతారు. మన చేనేత కార్మికుల జీవన స్థితిగతుల్లో మార్పులు తెచ్చేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాయశక్తులా కృషి చేస్తున్నాయి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.



నేతన్నలకూ వడ్డీ లేని రుణాలు

జౌళి పరిశ్రమలో చేనేత కార్మికుల సమస్యల పై జూన్ 28 వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రస్తావించిన విషయాలు ముఖ్యమంత్రి మాటల్లో.... "ఇందిరమ్మ బాట సందర్భంగా నేను శ్రీకాకుళం, ఉభయ గోదావరి వంటి జిల్లాల్లో పర్యటించినపుడు చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకున్నాను. వారి సమస్యలపై సమీక్ష సమావేశాలు నిర్వహించాను. ఆప్కో వస్త్రాలను ప్రభుత్వ శాఖలన్నీ కొనాలని ఉత్తర్వులు జారీ చేశాం. ఆప్కో వస్త్రాల ఉత్పత్తి కూడా మన్నికగా ఇతర వస్త్రాలకు దీటుగా ఉండాలి" అని వివరించారు.


"వ్యవసాయ కూలీలకు అమలు చేస్తున్నట్లుగా గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నేత కార్మికులకు కూడా వర్తింపజేసే అంశం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. చేనేత కార్మికులకు వ్యక్తిగతంగా ప్రయోజనం చేకూర్చే పథకాలను అమలు చేయాలి. కేంద్రం అమలు చేస్తున్న ఆర్.ఆర్.ఆర్. పథకం కింద ఏమంత ప్రయోజనం చేకూరలేదు. మరో ఆరునెలలు పాటు గడువు పెంచి, నిబంధలను సులభతరం చేస్తే ఎక్కువ మందికి ప్రయోజనం కలుగుతుంది" అని సి.ఎం. కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

"ఆర్.ఆర్.ఆర్. పథకంలో రుణ మాఫీ పరిమితిని రూ. యాభైవేల నుంచి రూ.2 లక్షలకు పెంచాలి. సుమారు రూ. 30 నుంచి రూ.40 కోట్లు ఖర్చుయ్యే పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేయాలి. 60 వేల పవర్‌లూమ్స్‌ను దశలవారీగా ఆధునికీకరించేందుకు ఆర్థిక సహకారం అందించాలి. అలాగే హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పోర్ట్స్ కౌన్సిల్ శాఖను, కాటన్ రీసర్చి ల్యాబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలి. అనంతపురం జిల్లా ధర్మవరం ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ సిల్క్‌పార్కులో ఇచ్చే రుణాలను రుణ మాఫీ పథకం కింద చేర్చాలి" సి.ఎం. కేంద్రమంత్రికి సూచించారు.

కేంద్రమంత్రి శ్రీ కావూరి సాంబశివరావు. మాట్లాడుతూ "ఆత్మ విశ్వాసంతో శ్రమించే నేత కార్మికుల సమస్యలు నాకు తెలుసు, వారి కోసం దీర్ఘ, స్వల్ప, మధ్య కాలిక, శాశ్వత అభివృద్ధి పథకాలు రూపొందించి క్యాబినెట్ సబ్ కమిటీ ముందు పెడతా" అని హామీ ఇచ్చారు.

కేంద్ర జౌళి శాఖ సహాయమంత్రి శ్రీమతి పనబాక లక్ష్మి మాట్లాడుతూ "వర్షాకాలంలో పిట్‌లూమ్స్ మునిగిపోయి, నేత కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. వాటిని ఆధునీకరించుకోవాలనుకుంటే తగిన సహాయం అందజేస్తాం" అని చెప్పారు.

ఈ సదస్సులో రాష్ట్ర చేనేత పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ జి.ప్రసాద్ కుమార్, ఎం.పి. శ్రీ రాపోలు ఆనందభాస్కర్, ఆప్కో ఛైర్మన్ శ్రీ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రసంగించారు.



అహో మొక్కజొన్న...



2012 ఖరీఫ్, రబీల్లో దేశంలోని కొన్ని ప్రాంతాల్లో కరవు, వర్షాభావ పరిస్థితులు నెల కొన్నప్పటికీ, రికార్డు స్థాయిలో 254.23 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల దిగుబడి జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి, రైతులకు అందిస్తోన్న ప్రోత్సాహకం... ఒక వంతు ఐతే, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, పంటల యాజమాన్యంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరగడం ఆహార ధాన్యాల దిగుబడి పెరగడానికి ప్రధాన కారణాలుగా చెప్పకోవచ్చు. దేశ ఆర్థికాభివృద్ధిలో వ్యవసాయం కీలక రంగంగా మారింది.

185 లక్షల టన్నులతో ఆహారం 'భద్రం..'

స్థూల జాతీయ ఉత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా సాలీనా 4 శాతం పైనే నమోదవుతోంది. దేశంలో 60 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం బాగుంటేనే రైతు సుభిక్షంగా ఉంటాడు. దేశం సుభిక్షంగా ఉంటుంది.

2004 నుంచి మన రాష్ట్రంలో రైతులకు ఎన్నడూ లేనంతగా ప్రోత్సాహం లభిస్తోంది. ఉచిత విద్యుత్తు నుంచి వడ్డీ లేని పంట రుణాలు వంటి అనేకానేక ప్రోత్సాహకాలను రైతులకు అందించడంలో మన రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. అనేక రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శవంతంగా మారింది.

2012-13లో ఆహార ధాన్యాల ఉత్పత్తి

పంట	పంటల సాగు విస్తీర్ణం (లక్షల హెక్టార్లు)		ఉత్పత్తి (లక్షల టన్నులు)	
	సాగుకావల్సింది	సాగైనది	జరగాల్సినది	జరిగినది
వరి	41.32	36.28	131.43	114.22
గోధుమ	0.10	0.08	0.11	0.07
జొన్న	3.05	2.87	4.29	5.18
సజ్జలు	0.57	0.67	0.73	1.12
మొక్కజొన్న	8.07	9.72	37.31	48.13
రాగి	0.47	0.41	0.53	0.45
తృణధాన్యాలు	0.30	0.38	0.20	0.36
కంది	4.98	4.81	2.24	2.50
మినుము	4.55	4.44	2.72	3.75
పెసర	3.47	2.78	1.43	1.88
ఉలవలు	0.44	0.31	0.22	0.18
సెనగ	6.06	6.81	7.71	7.59
బొబ్బర్లు	0.00	0.23	0.00	0.20
ఇతరం	0.00	0.10	0.00	0.12
మొత్తం	73.66	69.89	189.08	185.75

2004 నుంచి వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం చేపడుతోన్న పలు వినూత్న కార్యక్రమాలు, పథకాలను జాతీయ స్థాయిలో అనేక పార్టీలు తమ ఎజెండాల్లోనూ చేర్చుకొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తోన్న తోడ్పాటు వల్ల కరవు కాటకాల్లోనూ మన రైతన్నలు రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాలను పండిస్తున్నారు.

2012లో నీలం తుపాను, కరువు ప్రభావం అన్నదాతలను కోలుకోలేని దెబ్బ తీసినప్పటికీ, రాష్ట్రంలో 185 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగిందని అర్థ గణాంక శాఖ తుది అంచనాలు రూపొందించింది. 2012-13లో 73.66 లక్షల హెక్టార్లలో మాత్రమే పంటల సాగు జరిగింది. సాధారణ సాగు విస్తీర్ణం కన్నా దాదాపుగా 3.77 లక్షల హెక్టార్లు తగ్గింది. 2011-12లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 184.01 లక్షల టన్నులు కాగా, 2012-13లో 185.75లక్షల టన్నులకు ఉత్పత్తి పెరిగింది. సంవత్సరపు సరాసరి ఉత్పత్తి కన్నా 3.33 లక్షల టన్నులు మాత్రమే తగ్గింది. ఇందులో వరి ఉత్పత్తి గత ఏడాదితో పోలిస్తే సుమారు 14.69 లక్షల టన్నులు తగ్గినట్లు అంచనావేసింది.

వరి సాధారణ విస్తీర్ణం 41.32 లక్షల హెక్టార్లు కాగా 2012-13 ఖరీఫ్, రబీలలో కలిపి 36.28 లక్షల హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పడ్డాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులలోకి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడం వల్ల సుమారు 5.04 లక్షల హెక్టార్లలో వరి పంట వేయలేదు.

ఫలితంగా వరి దిగుబడి తగ్గిందని అర్థ గణాంక శాఖ అంచానా వేసింది. అయితే మొక్కజొన్న ఉత్పత్తి మాత్రం 11.57 లక్షల టన్నులు పెరిగింది. మొక్కజొన్న సాధారణ ఉత్పత్తి 37.31 లక్షల టన్నులు ఉండగా, 48.13 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించారు. అలాగే జొన్న, రాగి పంటల ఉత్పత్తులు కూడా పెరిగాయి.

వరి, పప్పుధాన్యాల మద్దతు ధరల పెంపు

వరి, పలు పప్పుధాన్యాలు, నూనెగింజల మద్దతు ధరలను కేంద్ర ప్రభుత్వం జూన్ 27వ తేదీన పెంచింది. ఢిల్లీలోని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘం (సి.సి.ఇ.ఎ) సమావేశమై తీసుకున్న నిర్ణయం ప్రకారం... సాధారణ వరి రకం కనీస మద్దతు ధర (ఎం.ఎస్.పి)ను ప్రస్తుతమున్న క్వింటాలు రూ.1250 నుంచి రూ. 1310కి పెంచింది. అలాగే 'ఎ' గ్రేడ్ వరి మద్దతు ధరను రూ. 65 పెంచి, రూ. 1345గా నిర్ణయించింది.

పత్తికి క్వింటాల్‌కు రూ. వంద చొప్పున కనీస మద్దతు ధర పెంచారు. మీడియం రకం పత్తి క్వింటాలు రూ. 3,700, పెద్ద పత్తి రూ. 4 వేలకు పెంచారు. ప్రస్తుతం సోయాబీన్ క్వింటాలు రూ.2,200 ఉన్న ఎం.ఎస్.పిని రూ. 300 పెంచి రూ. 2,500 చేయడం జరిగింది. పసుపు సోయాబీన్ క్వింటాల్‌కు రూ. 2,560 ఎం.ఎస్.పి. చెల్లిస్తారు.

కందిపప్పు ఎం.ఎస్.పి.ని క్వింటాల్‌కు రూ. 450, పెసలు మద్దతు ధరను క్వింటాల్‌కు రూ. 100 చొప్పున, నువ్వులను రూ. 300 చొప్పున పెంచింది. కాగా మినుములు, పొద్దుతిరుగుడు మద్దతు ధరలను మాత్రం పెంచలేదు. 2013-14 సంవత్సరం నుంచి పైన పేర్కొన్న విధంగా ధాన్యం, నూనెగింజల మద్దతు ధరలు అమలులో ఉంటాయని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ శరద్‌పవార్ వివరించారు.




కేంద్రానికి సి.ఎం. కృతజ్ఞతలు

వరి, పప్పు ధాన్యాలు, నూనెగింజల కనీస మద్దతు ధరలను పెంచడం పట్ల రాష్ట్ర, ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి యు.పి.ఎ. ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీకి, ప్రధాని శ్రీ మన్మోహన్‌సింగ్‌కు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శ్రీ శరద్‌పవార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పప్పుధాన్యాల దిగుబడి కూడా 2011-12 సంవత్సరంతో పోలిస్తే... సుమారు నాలుగు లక్షల టన్నులు పెరిగింది. పప్పు ధాన్యాల సాధారణ దిగుబడి 14.48 లక్షల టన్నులు కాగా, 2012-13లో 16.22 లక్షల టన్నులు ఉత్పత్తి జరిగింది.

ఈ సంవత్సరం ఖరీఫ్, రబీలలో సుమారు 81.12 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు. తద్వారా 225 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి సాధించగలమని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.



2012-13 సంవత్సరపు ఆహార ధాన్యాల ఉత్పత్తి వివరాలు ఇక్కడ పట్టికలో ఇవ్వబడినవి. ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆహారధాన్యాల ఉత్పత్తి పెంపునకు ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

విత్తనాలు, ఎరువులకు కొరత లేదు

మొక్కజొన్న, చెరుకు, వేరుశనగ, పత్తి పంటలకు సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ వర్తింపజేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కన్నా లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ తాజా పరిస్థితిపై ఆయన జూలై 10న వ్యవసాయ శాఖ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోని రైతులు జాతీయ పంటల బీమా ప్రీమియం చెల్లించే గడువును జూలై 15 నుంచి నెలాఖరుకు పెంచాలని, వ్యవసాయ పంటల బీమా కార్పోరేషన్‌ను కోరాలని అధికారులకు సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చేవిధంగా ప్రస్తుతం గ్రూపులకు ఇచ్చే నిబంధనలలో తగిన మార్పులు చేయాలని తెలిపారు.

ఖరీఫ్ 2013 ఆశాజనకంగా ఉందని వ్యవసాయ మంత్రి అన్నారు. ఖరీఫ్‌లో జూలై 10 వరకు 26.79 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగు కావల్సి ఉండగా ఇప్పటికీ.. 29.57 లక్షల హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయని తెలిపారు.

విశాఖపట్నం, అనంతపురం, చిత్తూరు జిల్లాలు మినహా రాష్ట్రమంతటా సాధారణ వర్షపాతం నమోదైందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో విత్తనాలకు గానీ, ఎరువులకు గానీ ఎక్కడా కొరత లేదని అన్నారు.

వచ్చే నెల, నెలన్నర పాటు రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని ఎరువుల సరఫరా జరిగేట్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కృష్ణానది ఎగువ ప్రాంతాలలో మంచి వర్షాలు కురుస్తున్నందు వల్ల రానున్న రోజులలో శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలలోకి ఆశించిన స్థాయిల్లో వరద నీరు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా డెల్టాలోనూ వరి నాట్లు పూర్తి స్థాయిలో జరుగుతాయనిఆశిస్తున్నామన్నారు. మొత్తం మీద ఈ ఖరీఫ్‌లో పంటల సాగు ఆశాజనకంగా ఉందన్నారు.

ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, కమీషనర్ మధుసూధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

- వన్నెంజు సుధాకర్

పొదుపు చర్యలకు శ్రీకారం

సంక్షేమ కార్యక్రమాలను భారీ ఎత్తున అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వాటికి అవసరమైన మేర నిధులు ఖర్చు చేసేందుకు పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖలలో అనవసర ఖర్చులు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ఆర్థిక శాఖ జులై 1 వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది.

పొదుపు చర్యలకు మార్గదర్శకాలు ఇవి....

- అత్యవసరమైతే తప్పితే కొత్తగా ఎటువంటి నియామకాలు జరపరాదు. పదోన్నతులకు సంబంధించిన ఎటువంటి కొత్త ప్రతిపాదనలు చేయరాదు.
- ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బంది (అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్) విషయంలో కచ్చితమైన మార్గదర్శకాలు పాటించాలి. ఇప్పటికే పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బంది పనితీరుపై సమీక్ష జరపడంతో పాటు, వారి సంఖ్యను వీలైనంత మేర తగ్గించేలా చర్యలు చేపట్టాలి. తాత్కాలిక ప్రాతిపదికపై కొత్తగా ఎటువంటి నియామకాలు చేయరాదు.
- రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న శాఖలకు సంబంధించి ఎటువంటి రాయితీలు ఇవ్వకూడదు. అలాగే వాటి ఆదాయాన్ని తగ్గించే ఎటువంటి ప్రతిపాదనలు చేయకూడదు.
- ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడే ప్రతిపాదనలు ప్రధానంగా వైద్య ఖర్చుల లాంటివి చేయరాదు. వీటికి సంబంధించి ఎటువంటి వెసులుబాటు ప్రతిపాదనలకు అంగీకరించేది లేదు.
- రెవెన్యూ పద్దుల కింద ఏ శాఖ కూడా అదనపు బడ్జెట్ కోసం ప్రతిపాదనలు చేయరాదు. చేసినా వాటిని ఆర్థిక శాఖ అంగీకరించదు.
- ఇప్పటికే అమలులో ఉన్న ఉత్తర్వులకు కొనసాగింపుగా కొత్తగా వాహనాలు కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వరు. ఈ మేరకు ఏ ప్రభుత్వ శాఖైనా ప్రతిపాదనలు పంపితే వాటిని తిరస్కరిస్తారు.
- ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలలో అద్దె ప్రాతిపదికన వినియోగిస్తున్న వాహనాల వినియోగాన్ని బాగా తగ్గించాలి. కొత్తగా అద్దె వాహనాలకు అనుమతించరు.
- తమ తమ శాఖల పరిధిలో అనవసర ఖర్చు తగ్గించడానికి ఆయా శాఖల అధిపతులు అన్ని చర్యలు తీసుకోవాలి. సమావేశాలు, సదస్సుల పేరిట దుబారా చేయడానికి వీలు లేదు. ఫైవ్‌స్టార్ హోటళ్ళలో ప్రభుత్వ ఖర్చుతో సమావేశాలు జరపడం నిషిద్ధం.
- మంత్రులతో సహా కొంత మంది ఉన్నతాధికారులకు మాత్రమే విమానయానం చేసేందుకు మినహాయింపు ఉంటుంది. అలాగే వీరంతా కేవలం సాధారణ తరగతిలోనే ప్రయాణం చేయాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ ఖర్చుతో విదేశీ ప్రయాణాలు అనుమతించరు.
- ఆయా శాఖల అధికారులు తమ పరిధికి లోబడి చేసిన పర్యటనలకు మాత్రమే ప్రయాణ భత్యం చెల్లిస్తారు.
- తమ పరిధికి మించి అధికారులు చేసే వ్యయాన్ని తీవ్రంగా పరిగణించడంతో పాటు అటువంటి వ్యయానికి ఎటువంటి చెల్లింపులు చేయరు.
- ప్రభుత్వ శాఖల్లో ఎటువంటి అదనపు కొనుగోళ్ళను అనుమతించరు. కొనుగోళ్ళకు సంబంధించి పొదుపు చర్యలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడే అవకాశమున్నందు వల్ల బదిలీల పై నిషేధం అమలులో ఉంటుంది. ఒక వేళ అనుమతించినా ఉద్యోగులకు ఎటువంటి అదనపు భత్యాలు చెల్లించరు.

అన్ని ప్రభుత్వ శాఖలలో పాటు అనుబంధ సంస్థలు, పంచాయతీరాజ్ సంస్థలు, పురపాలక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ సంస్థలకు కూడా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి.

– చెన్నూరి గణేశ్

తెలుగు హొయలు

చక్కనమ్మ తెలుగు
చందమామ నెలవు
చల్లబువ్వ తెలుగు
చందనాల కొలువు

ముగ్గురయ్యల ముందు
బుద్ధిగా కూర్చుంది
ముద్దు పల్కుల తోను
భారతము నేర్చింది.

పోతన్న పొలములో
పొత్తములు పట్టింది
హలము వెంబడి సాగి
హరిలీల పాడింది.

అన్ని భాషల యందు
అగ్రపీఠము తనదంది
ఆంధ్రభోజుని మెప్పు
ఒప్పుగా పొందింది.

శ్రీనాథు కవితల్లో
పైట సవరించింది
పద్యసీమల పట్ట
మహిషిగా వెలిగింది.

విశ్వనాథుని కావ్య
కన్నెగా కులికింది
కృష్ణశాస్త్రి భావ
కవనాన మునిగింది.

త్యాగయ్య రాగాల
రాముణ్ణి పొగిడింది
శ్యామయ్య కీర్తనల
కీర్తిగా నిలిచింది.

జానపదుల భాష
జడలోన తురిమింది
ప్రగతి దారుల వెంట
పయనమై కదిలింది.

గురజాడ బాటగా
అడుగులను వేసింది
రెండు సిరుల వాని
సరి జోడి కట్టింది.

పద్యమూ, వచనమూ,
గానమూ తనవంది
ఆద్యంతములు లేని
కీర్తులకు ఎగిసింది.

– గోరుగంతుల రాజశేఖర్

రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలపై సమీక్ష

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, ఐ.టి. అధికారులతో ఆయా శాఖల అనుసంధానంపై రాష్ట్ర సచివాలయంలో జూన్ 30వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అనుసంధానం కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రికార్డయిన రిజిస్ట్రేషన్ల ప్రకారం భూ రికార్డుల్లో ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తే అక్రమాలకు తావుండదు. భూ యాజమానులకు సమస్యలు తొలగిపోతాయి" అని అన్నారు.

వెంటనే అధికారులు స్పందించి రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖల అనుసంధానికి సంబంధించి ఎన్.ఐ.సి. తయారు చేసిన సాఫ్ట్‌వేర్‌ను ముఖ్యమంత్రికి చూపారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను చిత్తూరు, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వారు సి.ఎం.కి చెప్పారు.

రెవెన్యూమంత్రి శ్రీ రఘువీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి, శ్రీమహంతి భూ పరిపాలనా శాఖ ప్రధాన కమీషన్ శ్రీ ఐ.వై.ఆర్. కృష్ణారావు, రెవెన్యూ శాఖ కార్యదర్శులు, ఐ.టి. శాఖ కార్యదర్శి ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.



సి.ఎం సమీక్షలు

ఎర్రచందనం స్మగ్లర్లపై కేసులు పెట్టాలి

అటవీ సంపదను, ముఖ్యంగా ఎర్రచందనాన్ని అక్రమ రవాణా చేసే స్మగ్లర్లపై పి.డి.యాక్టు కింద కేసులు పెట్టాలని ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి అటవీశాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో జూన్ 29వ తేదీన జరిగిన వైల్డ్ లైఫ్ స్టేట్ బోర్డు ఏడవ సమావేశానికి సి.ఎం. అధ్యక్షత వహిస్తూ అడవులు తరిగిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలనీ, దీనివల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినదనీ అన్నారు.

వెంటనే అధికారులు స్పందించి మాట్లాడుతూ చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల్లో విలువైన ఎర్రచందనాన్ని అక్రమ రవాణా కాకుండా ఉండేందుకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు సి.ఎం.కి వివరించారు.

ఈ సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి శ్రీ ఎం. శామ్యూల్, చీఫ్ కన్జర్వేటర్ శ్రీ బి. ఎస్.ఎస్.రెడ్డి, సి.ఎం. కార్యదర్శి శ్రీ కె. ఎస్. జవహర్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు 15న పులిచింతల ప్రాజెక్టును ప్రారంభించాలి

ప్రాధాన్యతగా గుర్తించి పూర్తి చేయాల్సిన నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణ దశలపై రాష్ట్ర సచివాలయంలో జూలై 9న ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పలువురు మంత్రులు, అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష జరిపి, కీలకమైన ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పులిచింతల ప్రాజెక్టుకు ఆగస్టు 15వ తేదీన ప్రారంభోత్సవం చేసేందుకు ఎలాగైనా ఆ తేదీలోగా పనులు పూర్తి చేయాలి. మళ్లీ మళ్లీ వాయిదా వేయకుండా సిద్ధం చేయాలి. దీనితో పాటు శ్రీ గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాన్ని కూడా అదేనెలలో ప్రారంభించేందుకు సమాయత్తమవ్వాలి" అని అధికారులను ఆదేశించారు.

"ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలి. నత్తనడకన నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాజెక్టును గుర్తించి, వాటి సమస్యలు తీర్చాలి" అని సి.ఎం. అన్నారు.

మంత్రులు శ్రీయుతులు సుందర్శన్ రెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి, పార్థసారధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహంతి, నీటి పారుదల శాఖ అధికారులు శ్రీ అజయేంద్రపాల్, శ్రీ ఆదిత్యనాథ్ దాస్, శ్రీ అరవింద రెడ్డి ఇతర ఇంజనీర్లు ఈ సుదీర్ఘ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

కేంద్రానికి 'నిమ్జ్' నివేదిక పంపాలి :సి.ఎం

"చిత్తూరు, మెదక్ జిల్లాల్లో ఏర్పాటు కానున్న జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండళ్ళ (నిమ్జ్) కోసం ఆమోదించిన ప్రతిపాదనలను, పూర్తిస్థాయి నివేదికను (డి.పి.ఆర్)ను వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపాలి. చిత్తూరు జిల్లాలో జపాన్‌కు చెందిన సుమిటోమో కార్పొరేషన్, మెదక్ జిల్లాలో మహీంద్రా లైఫ్‌సైన్సెస్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఈ రెండు నిమ్జ్‌లనూ సత్వరం అభివృద్ధి చేయాల్సి ఉంది" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారికిరణ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు.

భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీమతి జె.గీతారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ మహంతి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ ప్రదీప్ చంద్ర తదితరులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

ఉద్యోగుల పెన్షన్ చెల్లింపులపై సమీక్ష

"పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అదే రోజు చెక్కు రూపంలో పెన్షన్ చెల్లించేట్లు ఉత్తర్వులు జారీ చేయాలి. దీనికి సంబంధించిన నియమని నిబంధనలూ మార్గదర్శకాలనూ రూపొందించాలి. ప్రభుత్వోద్యోగులందరికీ ఈ విధానం అమలులోకి తేవాలి. అలాగే పెన్షన్ చెల్లింపుల గురించి పదవీ విరమణ చేసిన ఉద్యోగికి అదే రోజు ఉత్తర్వులు జారీ అయ్యేట్లు చూడాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు.

రాష్ట్ర సచివాలయంలో జూలై నాలుగవ తేదీన ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలో సి.ఎం.పై విధంగా వివరించారు.

ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె. మహంతి, కార్యదర్శి శ్రీ జవహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీల్లో ముమ్మరంగా అభివృద్ధి పనులు

మున్సిపాల్టీల్లో అభివృద్ధి పనులు, ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి జూలై 4వ తేదీన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "ముఖ్యంగా మున్సిపాల్టీల్లో అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా జరగాలి. పట్టణ ప్రాంతాల్లో కనీస వసతులు మెరుగు పరచేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలి. రోడ్లు, త్రాగునీరు, కరెంట్ సౌకర్యాలపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపాలి. పురపాలక సంస్థలకు ఎన్నికలు నిర్విఘ్నంగా పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేయాలి" అని అధికారులకు సూచించారు.

మంత్రి శ్రీ ఎం. మహీధర్ రెడ్డి, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ అదర్ సిన్హా, కమీషనర్ డాక్టర్ బి. జనార్దన్ రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ భాస్కర్, తదితర అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

విద్యుత్కేంద్రాలను వేగంగా పూర్తి చేయాలి

"రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్తు ప్రాజెక్టుల పనులను త్వరగా పూర్తి చేసి, విద్యుదుత్పత్తి పెంచాలి. వినియోగదారులకు కరెంట్ కోతలు లేకుండా చూడాలి. కరెంట్ సరఫరాపై రోజూ ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా అధికారులు సమీక్షించాలి. విద్యుత్తు డిమాండు, సరఫరాల్లో ఉన్న వ్యత్యాసాన్ని లెక్కించి వివరాలనూ, పరిస్థితినీ నాకు సంక్షిప్త సందేశాల ద్వారా తెలపాలి. సౌర విద్యుత్తు

ప్యానెళ్ల స్థాపనకు ఆసక్తితో ఉన్న వారికి ప్రభుత్వ రంగ సంస్థలకున్న నిబంధనల ప్రకారం అనుమతి ఇవ్వాలి" అని ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డి ఇంధన శాఖ అధికారులను ఆదేశించారు.

విద్యుత్తు సరఫరాపై రాష్ట్ర సచివాలయంలో జూన్ 8న జరిగిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె. మహంతి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ఎం.సాహు, తదితర అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రి ఉపాధి కల్పన' త్వరలో ప్రారంభం

రాష్ట్రంలో ఆరు లక్షల మంది ఎస్.సి., ఎస్.టి., బి.సి. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రతిపాదించిన 'ముఖ్యమంత్రి ఉపాధి కల్పనా' కార్యక్రమంపై జూలై 10 న సచివాలయంలో ముఖ్యమంత్రి శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి సమీక్షించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "లబ్ధిదారుల ఎంపికకు ఉమ్మడి నిబంధనలు రూపొందించి, పారదర్శకంగా అమలు చేయాలి. అన్ని శాఖల సమన్వయంతో లబ్ధిదారుల ఎంపిక జరగాలి. స్వయం ఉపాధి పథకాన్ని ఎంపిక చేసుకునే లబ్ధిదారులకు మార్గదర్శకం చేయడానికి నిపుణుల దాన్ని ఏర్పాటు చేయాలి. యువతకు శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి పథకాన్ని గుర్తించేందుకు రాజీవ్ యువ కిరణాల విభాగం సహకారాన్ని తీసుకోవాలి" అని సూచించారు.

జౌళి, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ జి. ప్రసాద్ కుమార్, రాజీవ్ యువకిరణాలు ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ కె.సి.రెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు శ్రీ వి. భాస్కర్, శ్రీ ప్రేమ్‌చంద్రారెడ్డి, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి శ్రీ సవ్యసాచి ఘోష్, కె.వి.ఐ.బి, సిఇఓ శ్రీ కె.వి.రమణ ఇతర అధికారులు పాల్గొన్నారు

కాగా రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం పనితీరుపై ముఖ్యమంత్రి అదే రోజు సమీక్షించారు.

బస్‌స్టేషన్లు మరిన్ని ఏర్పాటు చేయాలి

"రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) వారు తమ పరిధిలోని బస్సు డిపోలు, స్టేషన్లు వంటి వాణిజ్య సముదాయాల ద్వారా ఆదాయ సముపార్జన చేయాలి. బస్సులను వేళలకు తగినట్లుగా నడుపుతూ లాభాలు వచ్చే రూట్లు, నష్టాలు వచ్చే రూట్ల మధ్య హేతుబద్ధత పాటించాలి. వీటన్నిటి కోసం నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర సచివాలయంలో జులై 10 న 'బస్సుల రాకపోకల వేళలు, బస్టేషన్ల ప్రారంభం, డిపోల నిర్వహణ' వంటి అంశాలపై మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం జరిపారు.

రవాణా శాఖ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ, ఆర్థిక మంత్రి శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి, ప్రభుత్వ విప్ శ్రీ అనిల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మహంతి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు, ఆర్టీసీ ఎం.డి. ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అందరూ అప్రమత్తంగా ఉండాలి

"రాష్ట్ర వ్యాప్తంగా ఋతుపవనాల ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలి. వాగులు, వంకలు పొంగి వచ్చిన వరదల వల్ల మృతి చెందిన ఆరుగురి కుటుంబ సభ్యులకు నిబంధనల ప్రకారం నష్ట పరిహారం అందజేయాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

భారీ వర్షాల వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలపై జులై 11వ తేదీ నుంచి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో రకారకాలుగా నిర్వహించిన సమీక్ష సమావేశాలల్లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "లోతట్టు ప్రాంతాలలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి, ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా చూడాలి. పశువులను కూడా సురక్షిత ప్రాంతాలైన స్కూలు భవనాలు, గ్రామ పంచాయతీ ఆఫీసులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హైస్కూళ్లు, రైస్ మిల్లులు, సినిమా థియేటర్ల వద్దకు తరలించి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. నిత్యావసర సరుకులు, తాగునీరు. వీధి దీపాలు, వైద్యాధికారులు, ఔషధాలు అందుబాటులో ఉంచాలి" అని కలెక్టర్లకు సూచించారు.

ఇక అధికారులు మాట్లాడుతూ, ఇంతవరకు వర్షాలకు 25 పక్క ఇళ్లు దెబ్బ తిన్నాయనీ, ఎనిమిది మంది గల్లంతయ్యారనీ సి.ఎం.కి వివరించారు. వర్షపాతం వివరాలను కూడా ప్రాంతాలవారీగా సి.ఎం.కి విపులీకరించారు.

రెండు నెలల్లో 8 కోట్ల మొక్కలు నాటాలి

"ఇందిరమ్మ పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ఎనిమిది వేల మొక్కలు నాటాలి. అటవీ శాఖ సహకారంతో వచ్చే రెండు నెలల్లో అన్ని జిల్లాల్లో శీఘ్రంగా మొక్కలు నాటించాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్‌లోని సి.ఎం. క్యాంపు కార్యాలయంలో జులై 14 న జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. చివరగా హైదరాబాద్ మెట్రోరైలు మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టు, రైల్వేలింక్స్, ఔటర్ రింగు రోడ్లు, 34 రేడియల్ రోడ్లు నిర్మాణ పనుల కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు.

ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.కె. మహంతి, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ సీట్ల కౌన్సిలింగ్ పై సమీక్ష

ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశాలు, కోర్టుల వ్యవహారంపై హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో జులై 17న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ఎం. మాట్లాడుతూ "హై కోర్టు తీర్పు వెలువడ్డాకే ఇంజనీరింగ్ కన్వీనర్ కోటా కౌన్సిలింగ్ నిర్వహించాలి" అని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్ష సమీక్ష సమావేశంలో సి.ఎం.తో పాటు డిప్యూటీ పి.ఎం. శ్రీదామోదర రాజనరిసింహ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

1900 వైద్యుల పోస్టులు సత్వరం భర్తీ చేయాలి

"రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో గుర్తించిన 1900 డాక్టర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. వచ్చే మూడేళ్లలో 12 వేల నర్సుల పోస్టులతో పాటు 9 వేల పారామెడికల్ సిబ్బందిని నియమించాలి. అలాగే ఆగస్టు నుంచి ప్రభుత్వోద్యోగులకు ఆరోగ్య కార్డులు జారీ చేసే ఏర్పాట్లు ప్రారంభించాలి" అని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు.

హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య శాఖలో పెండింగులో ఉన్న అంశాలపై జులై 22న జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

దానితో అధికారులు స్పందించి మాట్లాడుతూ, రాష్ట్రంలో 108 సేవలు అందించే వాహనాలు 743 ఉండగా వాటిలో 583 వాహనాలు తిరుగుతున్నాయనీ, వాటిని సమర్థంగా నడిపేందుకు పొరుగు రాష్ట్రాలకు చెందిన వారిని కూడా నియమిస్తున్నామని సి.ఎం. చెప్పారు. దానితో సి.ఎం. జోక్యం చేసుకుని 180 సేవలకై వెహికిల్ ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



ఖరీఫ్ కళ కళ...

నాలుగు సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో ఖరీఫ్ కళకళలాడుతోంది. అన్నదాతకు మరింత మంచిరోజులు వచ్చాయి. రాష్ట్రమంతా సస్యశ్యామలం. రైతన్నలో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. చాలా కాలం తర్వాత పుష్కలంగా వర్షాలు కురుస్తుండటంతో కర్షకులు పొలం పనులలో నిమగ్నమై ఉన్నారు.

ముందస్తు అంచనాలను మించి సాగు విస్తీర్ణం పెరుగుతున్నప్పటికీ రైతన్నకు ఏ ఇబ్బందీ రాకుండా వ్యవసాయ శాఖ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర ఉత్పాదకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకొంటోంది. దేశంలో ఆహార భద్రతా చట్టం అమల్లోకి వస్తున్న తరుణంలో ఇది శుభపరిణామం. రికార్డు స్థాయిలో రైతన్నలు పంటలు విత్తుకుంటున్నారు.

జూన్ 1 నుంచి జూలై 24 వరకూ రాష్ట్రంలో 256.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావల్సి ఉండగా, 333.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. విశాఖపట్నం, అనంతపురం జిల్లాల్లో మినహా రాష్ట్రమంతటా సుమారు 30 శాతం అధిక వర్షపాతం నమోదైంది.

జూలై 24 నాటికి 41.72 లక్షల హెక్టార్లలో పంటలు సాగు కావల్సి ఉండగా... 45.01 లక్షల హెక్టర్లలో వివిధ పంటలు వేసుకొన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 55 శాతం పంటల సాగు జరిగింది. ఖరీఫ్ ప్రారంభమైన నెలన్నరలోనే తెలంగాణాలో 78 శాతం పంటల సాగు పూర్తి అయింది. కోస్తాంధ్రలో 27 శాతం, రాయలసీమలో 45 శాతం సాగు జరిగింది. నిజామాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 103 శాతం మేర పంటలు సాగు చేశారు.

అదిలాబాద్ 91 శాతం, మెదక్ 83 శాతం, మహబూబ్ నగర్ 88 శాతం, రంగారెడ్డి 72 శాతం, వరంగల్ 70 శాతం, కరీంనగర్ 73 శాతం, చిత్తూరు 71 శాతం మేర వివిధ పంటలు వేశారు. కృష్ణ, గోదావరి నదుల పరివాహక ప్రాంతాలలో కురుస్తోన్న వర్షాలకు రాష్ట్రంలోని ప్రధాన జలాశయాలకు జల కళ వస్తోంది.

కర్నాటకలోని అలమట్టి, నారాయణపూర్, తుంగభద్ర జలాశయాలు పూర్తిగా నిండటంతో వరదనీరును దిగువనున్న జూరాల, శ్రీశైలం జలాశయాలకు వదులుతున్నారు. ఈ నెల 24 నాటికి జూరాలలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1045 అడుగులకు గానూ 1042 అడుగులకు చేరుకొంది.

అలాగే శ్రీశైలం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 885 అడుగులకు గానూ 828 అడుగులకు చేరుకొంది. ఈ రెండు ప్రాజెక్టులలోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గోదావరి పరీవాహక ప్రాంతంలోనూ మంచి వర్షాలు కురుస్తుండటంతో కడెం రిజర్వాయర్, లోయర్ మానేరు డ్యాం, నిజాం సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు జలకళను సంతరించుకొంటున్నాయి.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1091 అడుగులకు గానూ ఈ నెల 24 నాటికి 1085.2 అడుగులకు చేరుకొంది.

ప్రధాన జలాశయాలలోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో ఆయకట్టు రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి. ఇప్పటికే కృష్ణ, గోదావరి డెల్టాలలో వరి నాట్లు మొదలయ్యాయి. రానున్న రోజులలో ప్రాజెక్టుల కింద కూడా వరి నాట్లు ముమ్మరంగా జరిగే అవకాశం కనపడుతోంది. ఈ సీజన్ ప్రారంభం నుంచి అత్యల్ప వర్షపాతం నమోదవుతోన్న విశాఖపట్నం, అనంతపురం జిల్లాలోనూ గడిచిన వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పుంజుకొనే అవకాశం ఉంది. అనంతపురం జిల్లాలోనూ... వేరుశనగ పంట సాగు ఇప్పుడిపుడే ఊపందుకొంటోంది.

ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉండటంతో ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కన్నా లక్ష్మీనారాయణ, అన్నదాతలకు ఏ లోటు రాకుండా చూడాలని వ్యవసాయ యంత్రాంగాన్ని, బ్యాంకర్లను ఎప్పటిప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా పర్యటించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు.


జూలై 24 నాటికి 2013 ఖరీఫ్‌లో వివిధ ప్రాంతాల వారీగా పంటలసాగు విస్తీర్ణం పరిశీలిస్తే... కోసాంధ్ర సాధారణ సాగు విస్తీర్ణం 2406791 హెక్టార్లు కాగా, 646213 హెక్టార్లు (27 శాతం)లో పంటలు సాగు చేశారు.


రాయలసీమలో 1815541 హెక్టార్లకు గాను 808686 హెక్టార్లు (45 శాతం), తెలంగాణలో 3889801 హెక్టార్లకుగాను 3046499 (78 శాతం) సాగు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 8112133 హెక్టార్లు గాను 4501398 హెక్టార్లు (55 శాతం) సాగయింది.


- వనౌజు సుధాకర్



ఆ మాధురి.. రాఖీ కడ్తుందోనన్న కోపంతో
"రాఖీ.. నా చేతికి కాదు! నా గొంతుకు కట్టు" అని ఎమోషనల్ డైలాగ్ ఎందుకు కొట్టావురా...!
హిక్కు...
NOTES



రాఖీలు అడ్డం పెట్టుకొని భలే కాపీ కొడుతున్నాడు


అయ్యో.. ఎంత పని చేసావ్ మధూ.. నేన్నీకు కట్టింది రాఖీ కాదు... ఫ్రెండ్షిప్ బ్యాండు!
అపాయం
వడ్డేపల్లి వెంకటేష్

రాఖీ . . . రాఖీ


మా ఆయనింతే మోహన్...! ఇంటికెవరైనా మగవాళ్ళొస్తే.. ఇలా రాఖీ కట్టించి గాని మాట్లాడనివ్వడు!


అమ్మా!! ఇవ్వాళ రాఖీ పౌర్ణమి కదా!! నే స్కూలు కెళ్ళను.... నా గర్ల్ ఫ్రెండ్ నాకు రాఖీ కట్టేస్తుందేమోనని భయంగా వుంది!!
-Ravindra


నీ బర్త్‌డే రోజే రాఖీ పండగ వచ్చింది కదా.. అందుకే మన కాలేజి అమ్మాయిల్ని...... పార్టీకి పిలవద్దురా... అన్నా..!
LOVE
NOTES


వచ్చే వారం నువ్వు పుట్టింటికి కెళ్తుంటే మాత్రం..... ఇలా పనిమనిషి చేత నాకు రాఖీ కట్టించటం ఏం బాలేదే తాయారూ!!
-Ravindra

నిరుద్యోగులకు శుభవార్త!

గరిష్ఠ వయోపరిమితి పెంపు

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ప్రభుత్వోద్యోగ నియామకాల్లో ప్రస్తుతం ఉన్న గరిష్ఠ వయోపరిమితిని మరో రెండేళ్లు పెంచింది. ఇంతవరకూ ఉన్న 34 ఏళ్ల వయోపరిమితిని ఇక నుంచి 36 ఏళ్ల వయోపరిమితిగా మార్చింది. ఈ మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ (జి.ఎ.డి) నుంచి జూన్ 29వ తేదీన ఉత్తర్వులు (జీ.వో.ఎం.ఎస్. నం. 518) జారీ చేస్తూ అంధ్రప్రదేశ్ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్-1996లోని 12వ నిబంధన కింద ఉన్న కేటగిరీల ఉద్యోగాలకు ఈ కొత్త వయోపరిమితి సడలింపు వర్తిస్తుందని స్పష్టం చేసింది.

అంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ (ఎ.పి.పి. ఎస్.సి), ఇతర రిక్రూటింగ్ ఏజెన్సీల ద్వారా నేరుగా చేపట్టే నియామకాలకు గరిష్ఠ వయోపరిమితి వర్తిస్తుందని జీవోలో పేర్కొంది. అంతేకాక ఈ సంవత్సరం డిసెంబర్ 31వ తేదీవరకు వివిధ కేటగిరీల్లో పోస్టుల భర్తీకి వెలువడే నోటిఫికేషన్లకు మాత్రమే వర్తిస్తుందని జీవోలో వివరించింది. అయితే పోలీసు, ఎక్సయిజ్, అగ్నిమాపక, జైళ్లు, అటవీశాఖలలో భర్తీకి ఈ వయోపరిమితి పెంపు ఉండదు. నిరుద్యోగులు, పలు నిరుద్యోగ సంఘాలు, ప్రముఖులు, పలువురు మంత్రులు చేసిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి వయోపరిమితి పెంచాలని నిర్ణయించినట్లు జీవోలో పేర్కొంది.

GOVERNMENT OF ANDHRA PRADESH

GENERAL ADMINISTRATION (SERVICE-A) DEPARTMENT

G.O.Ms.No. 518 **Dated: 29th June 2013**

ORDER:

Government has been according top priority for filling vacancies in Government Departments by direct recruitment to provide employment opportunities to the educated youth in the State. In order to expedite follow-up action, clearance is also being given to the Andhra Pradesh Public Service Commission and also other Recruiting Agencies. Accordingly, the Recruiting Agencies are notifying the vacancies from time to time.

2. At this stage, a number of representations have been received from unemployed youth, certain associations and also from various dignitaries for considering relaxation of upper age limit for direct recruitment to enable more unemployed youth to become eligible to compete in the recruitment process.

3. Government having examined the same, decided to relax the upper

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

ఎస్సీ, ఎస్టీ, రైతులకు

ఉచితంగా సోలార్ పంపుసెట్లు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా వ్యవసాయ సోలార్ పంపు సెట్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను రాష్ట్ర ఇంధన శాఖ నుంచి జూన్ 19వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం. 26) విడుదల చేస్తూ సోలార్ పంపుసెట్ల కొనుగోళ్లపై ఇకనుంచి నూరుశాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, రైతులకు ఇస్తున్న సబ్సిడీకి అదనంగా 'ఇందిర జలప్రభ' పథకం కింద 70 శాతం సబ్సిడీని, ఇతర రైతులకు ఇరవై శాతం అదనపు సబ్సిడీ మాత్రం ఇవ్వనున్నట్లు జీవోలో వివరించింది. సబ్సిడీ నిధుల ను నెడ్‌క్యాప్ విడుదల చేస్తుందనీ, నోడల్ ఏజెన్సీ వారు రూపొందించిన లబ్ధిదారుల జాబితాను గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సిఫారసులతో నెడ్ క్యాప్‌కు పంపాలని జీవోలో పేర్కొంది.

అంతేకాక ఎవరైనా గృహ వినియోదారులు 20 ఎల్.పి.డి. సామర్థ్యంగల సోలార్ వాటర్ హీటింగ్ సిస్టమ్ కొనాలంటే దీనిపై ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 30 శాతం సబ్సిడీకి అదనంగా 20 శాతం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని జీవోలో తెలిపింది.

GOVERNMENT OF ANDHRA PRADESH

ENERGY (RES-A1) DEPARTMENT

G.O.Ms. No.26 **Dated:.19th June 2013**

ORDER:

State Government have announced various policies for encouraging use of solar power in the State. In order to implement these initiatives, Government have decided to provide additional incentives for Solar Water Heating Systems and Solar Agricultural Pumpsets in addition to subsidy provided by the Government of India to popularize these solar products among people.

2. Government after careful consideration accordingly order the following in this regard:

(1) The focus area of Solar Pumpsets programme would be areas where grid connectivity does not exist as well as Indira Jala Prabha Blocks wherein it would be implemented on cluster basis for SC & ST beneficiaries only. In respect of the SC&ST beneficiaries of these two categories of areas, the State Government would provide 70% of the Solar Pumpsets as subsidy in addition to central Government subsidy.

(2) For other areas & beneficiaries 20% additional subsidy from the State Government side would be provided for installing Solar Pumpsets

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

రూ.41.50 కోట్లతో ఐ.టి.ఐ. కి శాశ్వత భవనాలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టి.ఐ)లకు శాశ్వత భవన సముదాయాల నిర్మాణానికి రూ. 41 కోట్ల 50 లక్షలు మంజూరు చేసేందుకు పాలనా పరమైన అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించింది.

ఈ మేరకు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనాశాఖ ద్వారా జులై 18న ఉత్తర్వులు (జీ.వో. ఆర్. టి. నం.649) జారీ చేస్తూ ఉపాధి శిక్షణా శాఖ కమిషనర్ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి నిధులు కేటాయించాలని నిర్ణయించినట్లు స్పష్టం చేసింది.

కడప జిల్లా ఎర్రగుంట్ల, అనంతపురం జిల్లా తాడిపత్రి, గుంతకల్లు హిందూపూర్, నెలూరు జిల్లా పొదలకూరు, చిత్తూరు జిల్లా వేదూరు కప్పం, విజయపురి, శాంతిపురం, వరంజిల్లా మహబూబాబాద్, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లా

GOVERNMENT OF ANDHRA PRADESH

LABOUR EMPLOYMENT TRAINING AND FACTORIES (EMP) DEPARTMENT

G.O.Rt.No. 649 **Dated: 18th July 2013**

ORDER:

In the circumstances reported by the Commissioner of Employment & Training, Andhra Pradesh, Hyderabad vide letters 1st read above, Government after careful examination of the matter here by accord work-wise Administrative Sanction for an amount of Rs.4150 Lakhs for "Construction of permanent buildings" for the following (17) newly sanctioned Government ITIs in the State:-

(Rupees in Lakhs)

Sl. No.	Name of the Govt. ITI	Amount
1	Govt. ITI, Yerraguntla, Kadapa District	195.00
2.	Govt. ITI, Tadipatri, Anantapur District	149.00
3.	Govt. ITI, Hindupur, Anantapur District	84.00
4.	Govt. ITI, Podalakur, Nellore District	265.00
5.	Govt. ITI, Santhipuram, Chittoor District	170.00

రామగుండం, పశ్చి గోదావరి జిల్లాలో చింతలపూడి, మెదక్ జిల్లా సిద్ధి పేట, ఖమ్మం జిల్లా మణుగూరు, నల్గొండ జిల్లా ఆలేరు, ఖమ్మం జిల్లా వాజీడు, శ్రీకాకుళం జిల్లా రాజాంలలో ఐ.టి.ఐ. లకు శాశ్వత భవనాల నిర్మాణానికి ఆ నిధులు వెచ్చించాలని జీవోలో పేర్కొంది. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జీవోలో కమిషనర్‌ను దేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

జూనియర్ కాలేజీలుగా 7 గురుకులాల అప్‌గ్రేడేషన్

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో నడుస్తున్న ఏడు గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో వెలువరించింది. ఇందుకు సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా జూన్ 25 వ తేదీన ఉత్తర్వు (జీ.వో. ఎం.ఎస్. నం. 52) లు విడుదల చేసింది. ఈ పాఠశాలల అప్‌గ్రేడేషన్‌కు కావాల్సిన రూ. 2 కోట్ల 70 లక్షలను మంజూరు చేస్తున్నట్లు జీవో లో తెలిపింది.

చిత్తూరు, ఖమ్మం, దేవరకొండ, జంగారెడ్డి గూడెం, డోన్, ఇస్నాపూర్ (బాలికలు), అల్లవరం (బాలురు) గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా మార్చినట్లు జీవోలో పేర్కొంది.

GOVERNMENT OF ANDHRA PRADESH

SOCIAL WELFARE (RS.2) DEPARTMENT

G.O.Ms.No.52 **Dated: 25th June 2013**

ORDER:

In the reference read above the Secretary, APSWREI Society, Hyderabad has furnished proposals for up-gradation of (7) APSWR Schools to intermediate level from the academic year 2013-14.

2) Government after careful examination of the proposal and with a view to augment the facilities for quality education and increased opportunities for schedule castes in Intermediate education, hereby accord permission to the A.P. Social Welfare Residential Educational Institutions Society to Up-grade the following 7 (seven) Social Welfare Residential schools from the academic year 2013-14.

S.No.	Name of the School	District	B/G	Group / Course Proposed
1	Chittoor	Chittoor	Girls	Science Group
2	Khammam	Khammam	Girls	Science Group
3	Devarakonda	Nalgonda	Girls	Science Group
4	Jangareddy Gudem	West Godavari	Girls	Arts group

వీటిలో జంగారెడ్డి గూడెం కళాశాలలో ఆర్ట్స్, మిగిలిన వాటిల్లో సైన్స్ గ్రూపులో 2013-14 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభిస్తారని జీవోలో వివరించింది. ఈ జూనియర్ కళాశాలలో త్వరలో బోధన, బోధనేతర సిబ్బందిని నియమించనున్నట్లు జీవోలో సూచించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

GOVERNMENT OF ANDHRA PRADESH

HIGHER EDUCATION (TE.I) DEPARTMENT

G.O.Ms.No. 50 **Dated: 26th June 2013**

ORDER:

In the reference 1st read above, the Commissioner of Technical Education, A.P., Hyderabad has furnished the proposal for sanctioning of (4) new Government Polytechnic Colleges for the benefit of Scheduled Tribes in Utnoor of Adilabad District, Medaram of Warangal District, Rampachodavaram of East Godavari District and Gummalaxmipuram of Vizianagaram District to start with two Diploma courses namely DME and DEEE with an intake of (60) in each course from the academic year 2013-14, which have market demand with an estimated cost of Rs.654.00 Lakhs.

2. In the reference 2nd read above, the Commissioner of Technical Education, A.P., Hyderabad has furnished another proposal for sanction of (1) new Government Polytechnic College at Seetampeta of Srikakulam District to start with two Diploma Courses namely Diploma in Mechanical Engineering and Diploma in Civil Engineering with an intake of (60) in each course which have market demand with an estimated cost of Rs.589.11 Lakhs.

3. In addition to the above, Government is of the view that it would be appropriate to start Government Polytechnic Colleges at (1) Chintapalli of Visakhapatnam District with the courses DCE, DEEE & DCME and (2) K.R.Puram, West Godavari District with the Courses of DCE, DEEE with an intake of (60) in each course for the benefit of Scheduled Tribe students, as all

కొత్తగా 7 రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లు

రాష్ట్రంలో 2013-14 విద్యా సంవత్సరం నుంచి ఏడు రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లను ప్రారంభించేందుకు పాలనా పరమైన అనుమతులు మంజూరు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ ద్వారా జూన్ 26 వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం. 50) జారీ చేస్తూ ఒక్కో పాలిటెక్నిక్ ఏర్పాటుకు రూ. 6 కోట్ల 54 లక్షలు అంచనా వ్యయమవుతుందని స్పష్టం చేసింది.

వీటిలో అయిదు రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లలో డి.ఎం.ఇ., డి.ఇ.ఇ.ఇ., అనే రెండు కోర్సులనే నిర్వహిస్తారనీ, విశాఖ జిల్లా చింతపల్లిలో ఏర్పాటు చేసే కాలేజీలో డి.సి.ఇ., డి.ఇ.ఇ.ఇ., డి.సి.ఎం.ఇ. కోర్సులుంటాయనీ జీవోలో పేర్కొంది. ఇక తూర్పు గోదావరి జిల్లా కె.ఆర్. పురం రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లో డి.సి.ఇ., డి.ఇ.ఇ.ఇ., కోర్సులుంటాయని జీ.వో.లో తెలిపింది. ఈ కాలేజీలన్నిటిలో ఒక్కో కోర్సులో 60 సీట్లు చొప్పున విద్యార్థులకు అడ్మిషన్లు ఉంటాయని జీవోలో వివరించింది. ఎ.పి. సాంకేతిక విద్యా కమిషనర్ తగిన చర్యలు తీసుకోవాలని జోవోలో ఆదేశించింది.

☆

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి)

GOVERNMENT OF ANDHRA PRADESH

DEPARTMENT FOR WOMEN, CHILDREN, DISABLED & SENIOR CITIZENS (ESTT-A2)

G.O.Ms.No.14 **Dated:.27th June 2013**

ORDER:

In the circumstances reported by the Commissioner, Women Development and Child Welfare, A.P., Hyderabad, in his letters 2nd, 5th, 6th and 8th read above, Government after careful examination of the matter hereby issue the following amendments to the guidelines issued in G.O.Ms.No.14, WD, CW [Estt.] Dept., dated 10-05-2000, as subsequently amended from time to time: -

AMENDEMENTS

In the guidelines issued in G.O.Ms.No.14, WD,CW & DW [Estt.] Dept., dt.10-05-2000, in para – 2 under the table in Sl.No.I of Category – I Class – A, Extension Officer Grade – I [Supervisor] against qualifications under item [i] after the words " Must posses a Bachelor's Degree in Home Science / B.S.W., the following shall be added:-

01. Degree in Sociology;
02. B.Sc. [Hons.] – Food Science & Nutrition;

ఇకపై స్త్రీలకే అంగన్ వాడీ సూపర్‌వైజర్ పోస్టులు

రాష్ట్రంలో సమగ్రబాలల అభివృద్ధి పథకం (ఐ.సి.డి.ఎస్.) కింద అమలవుతున్న ప్రాజెక్టుల్లో పనిచేసే గ్రేడ్-1, గ్రేడ్-2 సూపర్ వైజర్ల నియామకాలలో ఉన్న మార్గదర్శకాలలో సవరణలు చేసి రాష్ట్ర ప్రభుత్వం నూతనగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు రాష్ట్ర మహిళా, శిశు, వికలాంగ, సంక్షేమ శాఖ ద్వారా జూన్ 27న ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం 14) వెలువరిస్తూ అంగన్‌వాడీ సూపర్ వైజర్లుగా మహిళలే అర్హులని స్పష్టం చేసింది.

సవరించిన మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతం కాంట్రాక్టు సూపర్ వైజర్లుగా పని చేస్తున్న వారికి రెగ్యులర్ సూపర్ వైజర్లుగా నియమించే అవకాశాలు ఉన్నట్లు జీవోలో సూచించింది. ఇదేకాక గతంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్లుగా నియమితుల వ్వాలంటే హోమ్‌సైన్స్ / సోషల్‌వర్క్‌లలో డిగ్రీ ఉన్న వారినే అర్హులుగా పరిగణించేవారు. ఇక నుంచి ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారికి సోషియాలజీ, బి.ఎస్సీ. (ఆనర్స్)లో ఫుడ్‌సైన్స్, బి.ఎస్సీలో న్యూట్రిషన్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, క్లినికల్ న్యూట్రిషన్, అప్లయిడ్ న్యూట్రిషన్, ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ వంటి సబ్జెక్టుల్లో డిగ్రీ అర్హత ఉండాలని జీవోలో వివరించింది.

మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్ పంపిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఈ మార్గదర్శకాలను సవరించిపట్టు జీవోలో పేర్కొంది..

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆



ముంతా మాయమ్మ నిన్ను మరువజాలనే . . .

'స్వాతంత్ర్యం నా జన్మహక్కు'

'అంతా ఒక్కటే, మనమంతా ఒక్కటే'

'మా దేశం, మా జాతి, మా పరిపాలన'

'భరతమాతకి స్వేచ్ఛావాయువులు కలిగించాలి'

.... ఇటువంటి అనేకాశయాలతో స్వాతంత్ర్యోద్యమం ఉప్పెనలా సాగింది. మహాత్మాగాంధీ పూరించిన స్వాతంత్ర్య సమర శంఖం అందర్నీ జాగృత పరచింది. స్వరాజ్య ఉద్యమానికి సమాయత్త పరచింది. ఆ ఉద్యమంలో మన తెలుగుకవులు -

'మేము సైతం
సమిధనొక్కటి ఆహుతిస్తాము'

అంటూ కలాలను ఝుళిపించారు. తెలుగువారిలో దేశభక్తిని రగుల్కొల్పారు. కవి బాధ్యతను గుర్తు చేశారు. తమ కవితల్ని ఆంగ్ల పరిపాలకులపై తూటాలుగా వదిలారు. గరిమెళ్ళ, చిలకమర్తి, రాయప్రోలు, దువ్వూరి, త్రిపుర నేని రామస్వామి వంటి ప్రసిద్ధులు సరే . . . వీరితోపాటు అంతగా ప్రాచుర్యం పొందని కవుల పాత్రను విస్మరించటం అన్యాయం! వీరి కవితలేజనంలోకి వెళ్ళి ఆనాడు ఉత్సాహ తరంగాలను సృష్టించాయి. నూతన ఉత్తేజాన్ని కలిగించాయి. ఈ స్వాతంత్ర్య దినోత్సవ సమయంలో ఆ మహనీయ కవుల్ని స్మరించుకుందాం.

'హిందువులారా, ఎన్నాళ్ళీగతి
మందమతుల్లరై మాటికి చెదెదరు
నందనులగు మీ రందరు స్రుక్కగ
యెందుకు, నా బ్రతుకితరుల కోసమ'

అంటూ ఉత్సాహం నింపే గీతాన్ని -

జాతీయోద్యమ కవిత్వంలో తొలిగేయంగా పేర్కొనబడే-

'మేలుకొనుమీ భరత పుత్రుడ
మేలు కొనుమీ సచ్చరిత్రుడ'

అంటూ ఉత్తేజపరిచే గీతాన్ని రాసిందెవరో తెలీదు. తమ పేరు కన్నా కవితలే ముఖ్యమనుకున్న వారికి నమస్కారాలు చెప్పవల్సిందే!

మంగిపూడి వేంకటశర్మ అచ్చమైన దేశభక్తుడు. వీరి స్థానం మహోన్నతమైనది. గాంధీ అడుగు జాడలలో నడిచారు.

'పరతంత్రతత సౌఖ్యహరము
పరతంత్రతత ప్రాణమాన భంగ కరంబున్
పరతంత్రతత బహుహేయము
నరకమువలె, భరతమాత న్యాయసమేత'

అంటూ బానిసత్వం ఎంతటి హీనమైనదో ప్రకటించారు ఈయన 1924లోనే.

'నిరుపమ కల్యాణగుణా... పురుషార్థ భరితచరితా' అంటూ గాంధి శతకం రాశారు. అంతేకాదు-

'నా మాతృ దేశమా! నా ప్రాణప్రదము
నా నాక లోకమా! నా తపః ఫలము...'

అంటూ 1911లోనే స్తుతిపూర్వకంగా 'భారతమాత' అనే ఖండిక రాశారు.

గుంటూరు వాసి దామరాజు పుండరీకాక్షుడు గారు గొప్ప దేశభక్త కవి. కవితలు, నాటకాలు వంటివి ఎన్నో రాశారు. చాలా రచనలు అలభ్యం. అయితే అప్పటికీ ఇప్పటికీ ఈయన పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే గేయం -

అరుదైన స్వాతంత్ర్యోద్యమ కవితలు

'శ్రీ గాంధీనామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం
కూడి భారతమాత గొలుతాం గొలుతాం
నేడే రాజ్యాన్ని తెస్తాం తెస్తాం'

ఈ గేయం అప్పుడు ఒక మంత్రంలా ప్రచారంలో వుంది. ఈయన స్వరాజ్యోదయం, గాంధీమహోదయం, పాంచాల పరాభవం వంటి నాటకాలు రాశారు.

కొండపల్లి జగన్నాథదాసు గారు ఎన్నో పాటలు రాశారు. మహాత్మాగాంధీని స్తుతిస్తూ వచ్చిన సాహిత్యంపై అంకయ్యగారు ఒక సిద్ధాంత గ్రంథమే రాశారు. ఈ జగన్నాథదాసు గారు స్త్రీల పాటలాగా రాసిన ఒక గేయ పంక్తులివి -

'గాంధీలాలీ! మోహన గాంధీలాలీ!
కరుణాసాంద్రా, మోహన దాసా లాలీ!'

శ్రీ సుబ్రహ్మణ్య భాగవతులు రాసిన గాంధీ దండకం ఇలా సాగుతుంది-

'లోకంబునన్ కార్యదీక్షారతిన్ పట్టుచే నీశ్వరుంగాక వేరెవ్వనిన్ లక్ష్యముంజేయబోనట్టి ధీరుండు, నీ ముద్దు పుత్రుండు గాంధీ మహాత్ముండు హిందూ ధరిత్రి స్థలిన్ జన్మముంగాంచి యత్యంతమున్ మాతృసేవా పరత్వంబునుంబూని సర్వస్వమున్ దేశ సేవార్థమై యర్పణంబొప్పగా జేసి...'

ములుకుట్ల పున్నయ్య శాస్త్రి, నల్లమిల్లి బసవరెడ్డి భాగవతార్ మొదలైనవారు గాంధీపై హరికథలు రాసి ఆయన నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం కలిగించారు.

విశాఖ ప్రాంతానికి వన్నె తెచ్చిన వారొక అజ్ఞాత కవి, దేశభక్తుడు మారేపల్లి రామచంద్ర శాస్త్రి గారు. (ఈయన శ్రీశ్రీకి పద్య గురువు) ఈయన రాసిన దేశభక్తి కవిత్వం అముద్రితంగా, అలభ్యంగా వుండిపోయింది. తన జీవితాన్ని స్వాతంత్ర్యం కోసం, తెలుగు భాష కోసం అంకితం చేశారాయన. దాదాభాయి నౌరోజి మరణించినప్పుడు 'వగపు పద్యాలు' (ఎలిజీ) రాశారు. ఈయన ఇలా పిలుపునిచ్చారు-

'ఖద్దరైన కట్టుడీ - కదమవేవీ చేయకున్న
మొద్దులంచు మోటులంచు - ముల్ల కుంద ముక్కకుంద
బరువటన్న దాస్యము బరువుకాదే చెప్పుడీ'

అంటూ స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన పాత్ర వహించిన ఖద్దరు ఉద్యమంపై రాశారు.

యనమండ్ర కృష్ణారావు అనే కవి వినూత్నంగా జైలుపై గేయం రాశారు. దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్ళటం గొప్పయోగం, కర్తవ్యం అంటూ ఆయన ఇలా అంటారు-

'జన్మ మదేలా?
జైలుకు పోని జన్మ మదేలా?
ధర్మము తోడను - జన్మభూమికి మన
నిర్మలత్యాగము - నొసగని వాని
జన్మ మదేలా?'

1920 ఏప్రిల్ 13న పంజాబ్‌లో రౌలట్ చట్టాన్ని ప్రతిఘటిస్తూ జలియన్‌వాలాబాగ్‌లో పెద్ద సభ జరిగింది. క్రిక్కిరిసిన జనంతో మహోద్వేగంగా సాగింది. ఆ సభను విచ్ఛిన్నం చేయడానికి అప్పటి బ్రిటీష్ సేనాని జనరల్ దయ్యర్ పాశవికంగా ప్రవర్తించాడు. కాల్పులు జరిపి మారణహోమం సాగించాడు. మరి మన తెలుగు కవి స్పందించకుండా ఎలా వుంటాడు? ఆ కవి పేరు కొండపల్లి జగన్నాథదాసు. భరతమాత చెప్తున్నట్లుగా కొత్త పద్ధతిలో ఇలా రాశారు -

'హిందూ మాతానురా దయ్యరు!
వినర లోకమాతానురా!
హీనుడ! వినుర! దేశమాతానురా!
నా దబ్బుతిని నీవు - నా బిడ్డలను జంప
చేతులెట్లాడెర, నీతి లేనివాడ!'

గురజాడ రాఘవశర్మ గారు మరొక స్వాతంత్ర్య సమర యోధుడైన కవి. తను కవిత్వం రాస్తూ స్వాతంత్ర్య ఉద్యమంలో రాసిన వారి కవితలన్నీ సేకరించి అద్భుతమైన సంకలన గ్రంథం తీసుకువచ్చారు. స్వాతంత్ర్యోద్యమంలో మన జెండా ఎగర వెయ్యటం పెద్ద సాహసం. ఆంగ్లేయుడి జెండా తప్ప మరొకటి కనిపించగూడదు. ఆ సమయంలో రాఘవశర్మ గారు -

'జండా యెత్తర - జాతికి ముక్తిర
నిండగు శక్తిర - నిల్పర కీర్తిర
ప్రాణమొండె - యభిమానమొండె మన
ప్రాణములైనన్ బలియొసంగి జండాయెత్తర' అంటూ చైతన్యపరిచారు.

'అభినవ పోతన' వానమామలై వరదాచార్యులు పండితులు. సంప్రదాయ నిబద్ధులు. స్వాతంత్ర్యం కోసం కలంపట్టిన కవి. జాతీయ పతాక ఆవశ్యకతనీ, ప్రాశస్త్యాన్నీ వెల్లడిస్తూ కవిత్వం రాశారు. 'క్విట్ ఇండియా' ఉద్యమంలో ఈయన-

'పరదేశీయులు తొలగండి
ఈ భరతదేశం మా దేశం
వినండి వినండి విశ్వ ప్రజలు'
అంటూ సమరశంఖం పూరించారు.

సాంబశివ రావు బాబ్జీ-

'వీరభారత యువకుల్లారా!
విజయోత్సాహిత మూర్తుల్లారా!
విన్నారా, మన వీరుల చరితం'

అంటూ గతవైభవాన్ని గుర్తు చేస్తారు.

బసవరాజు అప్పారావు అనగానే 'కొల్లాయిగట్టి తేనేమి - మా గాంధీ కోమటై పుట్టితే నేమి' అన్నదే అందరకూ గుర్తుకువస్తుంది.

కానీ ఆయనే చాలామందికి తెలియని ఈ గేయం రాశారు -

'అన్ని మతాలకు- అన్ని తెగలకు
ఆశ్రయ మీ జండా ఒకటేనోయ్
ప్రాణము పోతే పోనీ - జండా
మానము మాత్రము మంటగలవక
పతాకోత్సవము సేయండీ!'

1930 ప్రాంతంలో జాలా రంగస్వామి అంట రానితనంపై 'అంటరాని వారెవరు?' అనే సుదీర్ఘ గేయం రాశారు. మహాత్మగాంధీ జాతిసమైక్యతలో భాగంగా అస్పృశ్యతా నివారణ ఉద్యమం చేపట్టారు. ఆ ప్రభావంతో జాలా రంగస్వామి ఆవేశం, ఆవేదన ఇది -

'ఏడు కోట్ల దండొక్క భాగమై ఎడగలుండి పోతే
బల మెక్కడిదీ, హిందూ జాతికి పౌరుషమెక్కడిదీ?
హిందూ దేశములోపల జనులు ఏకము కాకుంటే
సంపాదింపగ జన్మహక్కు మరి శక్యముకాదండీ'

1930లోనే నీలం వెంకయ్య అనే కవి విశిష్టంగా 'మద్యపాన నిషేధ కీర్తనలు' రాశారు. గాంధీ ప్రారంభించిన మద్యపాన నిషేధానికి ప్రభావితుడై రాసినవి ఇవి. అయితే ఇవి నేడు దొరకక పోవటం మన దురదృష్టం.

1935లో. ..

'ముంతా మాయమ్మ నిన్ను మరువజాలనే
కల్లుముంతా మాయమ్మ'

అంటూ నక్కా చిన వెంకయ్య త్రాగుడు వ్యసనం పై రాయడం విశేషం.

గరికపాటి మల్లావధాని విదేశీ వస్తుబహిష్కరణ ఉద్యమానికి అనుగుణంగా-

'వద్దురా - మన కొద్దురా!
పరదేశ వస్త్రము వద్దురా!
చేతివృత్తి పనుల నెల్లను చితుకగొట్టెను సోదరా'! అంటూ ప్రబోధించారు.

చెన్నాప్రగడ భానుమూర్తి పరాయి పాలకుల వల్ల దేశం ఎంతటి దుస్థితిలో ఉందో ఇలా వివరించారు -

'మాసె కలా ప్రవీణత సమస్తము నష్టము నొందె శిల్పము
ల్వాసె నశేష భూరమణ వాంఛిత భారత వర్ష సంపదల్
దాగె నవగ్రహంబు ధనలక్ష్మి దొరంగి దరిద్రులై ప్రజల్
గాసిలి చిక్కిరెంతయున్ క్షామని పీడితులై యజస్రమున్'

చివరగా 'శారద లేఖలు' ద్వారా స్త్రీ చైతన్యాన్ని రగిలించిన విదుషి, రచయిత్రి అయిన కనుపర్తి వరలక్ష్మమ్మ గారు రచించిన 'భరతమాత వందనం' లోని పద్యాన్ని పరిశీలించండి -

'సకల నారీలోక సంస్తూయ మానయౌ
శ్రీ సరోజిని గన్న శిష్ట చరిత
వివిధ ఖండాలలో విఖ్యాతి గాంచిన
విజయలక్ష్మిని గన్న వీరచరిత
అజదు వీరుల గూడి యాలంబు సేసిన
లక్ష్మి యోధను గన్న లలితచరిత
స్త్రీజనోద్ధరణకై సేవావ్రతా సక్త
మా పార్వతిని గన్న మహిత చరిత
హంస మెహతా, సుచేతయ, నమృతకౌరు,
కమల యరుణాది వనితల గన్న తల్లి
కరుణ గల తల్లి మా పాలి కల్పవల్లి
అమ్మ భారతీ, వందనమమ్మ నీకు'

ఇక్కడ చోటుచేసుకోని ఇతర అజ్ఞాత కలం యోధుల్ని కూడా స్మరించుకుంటూ . . .

- డా. ద్వా.నా. శాస్త్రి, 9849293376

టోఫెల్, జీమాట్ కోర్సులు చదవాలనుకునే ఎస్సీ విద్యార్థులకు చేయూత

విదేశీ విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించాలనుకునే వారికి ఉద్దేశించిన 'టోఫెల్', ఐ.ఇ.ఎల్.టి.ఎస్.', 'జి.ఆర్.ఇ./జి.మాట్' తదితర అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా ఎస్సీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా జూన్ 29 న ఉత్తర్వులు (జీవో.ఎం.ఎస్.నం. 55) జారీ చేస్తూ సొంత ఖర్చుతో అర్హత సాధించిన ఎస్సీ విద్యార్థులకు మాత్రమే ముందుగా ఎంపిక చేసిన సంస్థల్లో అయా అర్హత పరీక్షల కోసం శిక్షణ ఇస్తారని వివరించింది.

విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించాలంటే ఇక్కడ అభ్యర్థులకు అత్యున్నత మార్కుల శాతం అత్యవసరం. ఆంగ్లంలోనూ ప్రావీణ్యముండాలి, అయితే మారుమూల పల్లెల్లో నిరుపేద కుటుంబాల్లోని ఎస్సీ విద్యార్థులు అయా అంశాల్లో బాగా వెనుకబడి ఉంటున్నారు. ఇలాంటి వారు

GOVERNMENT OF ANDHRA PRADESH

SOCIAL WELFARE (EDN.1) DEPARTMENT

G.O.Ms.No. 55 **Dated: 29th June 2013**

ORDER:

The Government of Andhra Pradesh have taken a policy decision to provide financial assistance to SC students desirous of pursuing higher studies in Foreign Countries, separate orders have been issued for this purpose. To seek admission in reputed foreign universities, students have to obtain good scores in tests of English proficiency such as TOEFL & IELTS and in General Aptitude Tests such as GRE / GMAT or equivalent qualifying examinations for pursuing admissions into various Post Graduate Courses in reputed foreign universities.

2. Most of the SC students, due to their extreme backwardness, poor knowledge of English and other disabilities are often unable to perform up to the mark in the above said qualifying exams. Therefore, with a view to equip the students with requisite skills by providing them the benefit of coaching for the above exams, the Social Welfare Department has proposed to facilitate coaching in TOEFL / IELTS / GRE / GMAT etc., in the existing &

కూడా టోఫెల్ / జీమాట్ వంటి కోర్సులు చదివేందుకు నిధులు మంజూరు చేసేలా ఎస్సీ ఉపప్రణాళిక క్రింద చేర్చినట్లు జీవోలో వివరించింది.

ఈ కోర్సుల్లో ప్రవేశించాలనుకొనే ఎస్సీ గ్రాడ్యుయేట్ విద్యార్థులు లేదా డిగ్రీ ఫైనలియర్ చదివేవారి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2 లక్షలకు మించి ఉండరాదని జీవోలో సూచించింది. అభ్యర్థులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ మార్కులే ప్రామాణికంగా తీసుకుంటారనీ, ప్రతి ఏటా జూన్, అక్టోబర్ నెలల్లో విద్యార్థుల ఎంపికకు నోటిఫికేషన్ వస్తుందనీ జీవోలో తెలిపింది.

ప్రతీ ఏటా మే 31వ తేదీలోగా అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి తుది జాబితాను ప్రకటించే రాష్ట్ర స్థాయి కమిటీకి ఛైర్మన్‌గా సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ వ్యవహరిస్తారు. ఎ.పి. గురుకుల విద్యా సంస్థల సొసైటీ సెక్రటరీ, ఎ.పి.ఎస్సీ. సహకార ఆర్థిక మండలి మేనేజింగ్ డైరెక్టర్, ఎ.పి. ఉన్నత విద్యా మండలి తరపున ప్రతినిధి ఒకరు సభ్యులుగా ఉంటారు. సాంఘిక సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు కన్వీనర్‌గా ఉంటారని జీవోలో పేర్కొంది.

అంతేకాక ఎస్సీ విద్యార్థులు టోఫెల్ / జిమాట్ కోర్సులు చదివేందుకు కోర్సులను బట్టీ చెల్లించిన కోచింగ్ ఫీజులను కూడా జీవోలో పట్టిక రూపంలో పొందుపరచింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

రేషన్ షాపు డీలర్‌షిప్పును వారసులకివ్వొచ్చు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చౌకధరల షాపుల డీలర్ల నియామకాలలోని కొన్ని నిబంధనలను సవరించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ నుంచి జూన్ 17వ తేదీన ఉత్తర్వులు (జీవో ఎం.ఎస్. నం. 16) జారీ చేస్తూ ఎ.పి. స్టేట్ ప్రజా పంపిణీ విధానం-2008 అనుసరించి కొత్తగా జోడించిన మార్గదర్శకాలు ఇలా వివరించింది.

ఎక్కడైనా చౌక ధరల షాపునకు అధీకృత డీలర్ లేకపోతే అలాంటి సందర్భాల్లో వారి కుటుంబసభ్యులలో భర్త లేదా భార్య లేదా వారి సంతానంలోని కుమారుడు లేదా అవివాహిత అయిన కుమార్తె ఆ డీలర్‌షిప్పు పొందేందుకు అర్హులని జీవోలో సూచించింది. పౌరసరఫరాల

GOVERNMENT OF ANDHRA PRADESH

CONSUMER AFFAIRS, FOOD & CIVIL SUPPLIES (CS-1) DEPARTMENT

G.O.Ms.No.16 **Dated: 17th June 2013**

ORDER:

In the Government Order 1st read above, revised guidelines have been issued for selection and appointment of Fair Price Shop Dealers under the Andhra Pradesh State Public Distribution System (Control) Order, 2008 and para-12 (xiii) of the annexure to G.O.Ms.No.4, Consumer Affairs, Food & Civil Supplies (CS-1) Dept, dated 19-02-2011, is as follows:-

> "The applicant shall personally run the F.P.Shop and not run benami or through an agent. However, women F.P.Shop dealers may take the assistance of their family member (s) whose name or names are to be included in the dealer's supply card. If a women dealer gets married and in the event of her leaving the village she must relinquish the F.P. Shop dealership".

శాఖ కమిషర్ చేసిన విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని కొత్త మార్గదర్శకాలను రూపొందించినట్లు జీవోలో పేర్కొంది. వెంటనే తగిన చర్యలు గైకొనాలని జీవోలో కమిషనర్‌ను ఆదేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

ఆశ్రమ స్కూళ్లుగా మారిన 50 హాస్టళ్లు

రాష్ట్రంలోని షెడ్యూల్డు తెగలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధించాలన్న ధ్యేయంతో యాభై వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చేందుకు పాలనాపరమైన అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ద్వారా జులై ఒకటో తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం. 56) జారీ చేస్తూ ఎస్టీ సబ్‌ప్లాన్ 2013-14 ప్రకారం ఈ నూతన నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది.

గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ పంపిన ప్రతిపాదనలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత 2013-14 విద్యా సంవత్సరం నుంచి ఈ స్కూళ్లు ప్రారంభమవుతాయని జీవోలో తెలిపింది. ఇప్పుడున్న హాస్టళ్ల ప్రాంగణాల్లోనే ఈ ఆశ్రమ పాఠశాలలు ప్రారంభమవుతాయనీ, వీటిలో నలుగురు ఎస్.జి.టీచర్లు, మరో అనుభవజ్ఞుడైన టీచర్ స్కూలు హెడ్ మాస్టర్‌గా ఉంటారని జీవోలో వివరించింది.

GOVERNMENT OF ANDHRA PRADESH

TRIBAL WELFARE (EDN.1.1) DEPARTMENT

G.O.Ms.No. 56 **Dated: 1st July 2013**

ORDER:

The Tribal Welfare Department, in tune with Tribal Empowerment Policy, 2010-2015 and also in compliance to the 9-Point Program for Tribal Development announced by Hon'ble Chief Minister and as part of the Sunnamvarigudem Declaration articulated by Hon'ble Chief Minister on 08.8.2012, has proposed to take measures for providing quality education for ST students in the State.

2. In Tribal Welfare Department there were (442) Hostels functioning and the boarders staying in the Hostels going for Schools run by other managements such as Zilla Parishad, School Education and other managements. Whereas Tribal Welfare Department has also been running Ashram Schools where boarding and instruction take place under the same roof. The performance of boarders of Hostels has been relatively poor compared to that of Ashram Schools due to the following reasons:

శ్రీకాకుళం జిల్లాలో 3 ఆశ్రమ పాఠశాలలు, విజయనగరం జిల్లాలో 5, విశాఖపట్నంలో 4, తూర్పు గోదావరి జిల్లాలో 5, పశ్చిమ గోదావరి జిల్లాలో 5, ఖమ్మం జిల్లాలో 13, వరంగల్ జిల్లాలో 12, ఆదిలాబాద్ జిల్లాలో 3 ఆశ్రమ పాఠశాలలు నిర్వహించనున్నట్లు జీవోలో పట్టిక రూపంలో పేర్కొంది. ప్రాథమిక విద్యా బోధనకు ప్రాధాన్యత ఇచ్చే ఈ పాఠశాలల్లో మూడు నుంచి అయిదు తరగతుల వరకు క్లాసుకు నలభై మంది చొప్పున విద్యార్థులను చేర్చుకుంటారని జీవోలో వివరించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ ఆశ్రమ పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలుగా మార్చి ఏడవ తరగతి వరకు విద్యా బోధన చేయనున్నట్లు జీవోలో తెలిపింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

పెన్షన్ల పథకాలకు భారీగా నిధులు

గ్రామీణాభివృద్ధికి గ్రీన్ ఛానల్ కార్యక్రమం కింద వివిధ సంక్షేమ పథకాల అమలుకు రూ. 247.50 కోట్లు విడుదల చేసేలా పాలనాపరమైన అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు జూలై 16న రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం. 332, 334, 338) వెలువరించింది.

తొలి జీవో (332) ప్రకారం వృద్ధులు, వితంతువులకు 'ఇందిరమ్మ పెన్షన్ల' పంపిణీకి రూ. 956.50 కోట్లు విడుదల చేసేందుకు, వికలాంగుల కోసం రూ. 393.50 కోట్లు ఇచ్చేలా అనుమతి మంజూరు చేసింది.

రెండవ జీవో (334) ప్రకారం డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చేందుకు

GOVERNMENT OF ANDHRA PRADESH

PANCHYAT RAJ & RURAL DEVELOPMENT (RD-IV) DEPARTMENT

G.O.Ms.No.332,334,338 **Dated:. 16th July 2013**

ORDER:

A provision of Rs.127500.00 lakhs has been made in BE 2013-2014 for implementation of INDIRAMMA Pensions to Old Age Persons & Widows, out of which an amount of Rs.31875.00 lakhs has already been released vide the GO first read above, leaving a balance of Rs.95625.00 lakhs during the current financial year i.e, 2013-2014.

2. In the GO second read above, the Finance (W.A.I) Department have issued consolidated BRO for an amount of Rs.246000.00 lakhs under Plan from the BE Provision 2013-14 to the Commissioner, Rural Development, Hyderabad towards second, third and fourth installments under 'GREEN CHANNEL" for implementation of various welfare schemes of Rural Development, out of which an amount of Rs.95625.00 lakhs (Rupees Nine hundred and fifty six crores and twenty five lakhs only) has been earmarked for implementation of INDIRAMMA Pensions to Old Age Persons & Widows, during the current financial year, i.e., 2013-2014.

3. Government, after careful examination, hereby accord administrative Sanction for

రూ. 487.50 కోట్లు, మూడవ జీవో (338) ప్రకారం వైయ్యస్సార్ అభయ హస్తం కింద పెన్షన్లు పంపిణీకి రూ. 487.50 కోట్లు ఇచ్చేలా పాలనా పరమైన అనుమతి ఇచ్చినట్లు స్పష్టం చేసింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

వృత్తి విద్యా కాలేజీల్లో కొత్త కోర్సులు

GOVERNMENT OF ANDHRA PRADESH

HIGHER EDUCATION (EC/A2) DEPARTMENT

G.O.Ms.No. 505 **Dated: 8th July 2013**

ORDER:

The All India Council for Technical Education (AICTE) has introduced the new Dual degree/ Integrated programmes from the academic year 2013-14 and the All India Council for Technical Education (AICTE) has accorded approvals for starting the following new programmes in the existing Professional Institutions in the State:-

1) 5- year Duel Degree course in Management.

2) 5 ½ year Integrated programme in Management leading to award of Master of Management (Engineering – MTM, Pharmacy- MTM, Pharmacy – MPM) and 6 ½ year Master of Management programme in Architecture (MARM).

3) Separate Division for conducting 2- year MCA course.

4) 5 year Dual Degree course in MCA

రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ నుంచి జులై 8వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఆర్.టి. నం. 505) జారీ చేస్తూ ప్రారంభించబోయే కొత్త కోర్సులకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎ.ఐ.సి.టి.ఇ.) ఆమోదించినట్లు పేర్కొంది.

మేనేజ్‌మెంట్ కోర్సులో అయిదేళ్ల, ఇంజనీరింగ్ ఎం.టి.ఎం. ఫార్మసీ–ఎం.టి.ఎం., ఎం.పి.ఎం. కోర్సుల్లో అయిదున్నర ఏళ్ల, ఆర్కిటెక్చర్ (ఎం.ఎ.ఆర్.ఎం.)లో పి.జి. కోర్సును ఆరున్నరేళ్ల కాల పరిమితితో నిర్వహించనున్నట్లు జీ.వో.లో వివరించింది. అలాగే ఎం.సి.ఎ. రెండేళ్ల ప్రత్యేక కోర్సు, అయిదేళ్ల కోర్సులతో పాటు బి.సి.ఎ., బి.ఎస్సీ. కోర్సులు చదివిన వారు ఎం.సి.ఎ. ద్వితీయ సంవత్సరం కోర్సులో నేరుగా చేరేందుకు 20 శాతం సూపర్ న్యూమరీ సీట్లు కేటాయించినట్టు జీవోలో పేర్కొంది.

అంతేకాక, డిప్లొమా, బి.ఎస్సీ కోర్సులు చదివిన వారి కోసం మూడేళ్ల ఇంజనీరింగ్, టెక్నాలజీ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు జీవోలో తెలిపింది. 2014-15 విద్యా సంవత్సరానికి అయా కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాలను రూపొందించాలని జీవోలో ఎ.పి. ఉన్నత విద్యా మండలి సెక్రటరీని ఆదేశించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

అన్ -ఎయిడెడ్ వృత్తి విద్యా సంస్థల ఫీజుల వివరాలివి...

GOVERNMENT OF ANDHRA PRADESH

HIGHER EDUCATION (EC/A2) DEPARTMENT

G.O.Ms.No. 57 **Dated: 6th July 2013**

ORDER:

The Member Secretary, Admission and Fee Regulatory Committee (AFRC) has informed that as per the opinions expressed by the majority members of the Admission & Fee Regulatory Committee for matters relating to Fixation of Fee Structures for Private Un-aided Professional institutions in the state of Andhra Pradesh, the Admission and Fee Regulatory Committee (AFRC) has fixed the Fee Structures for **Under-graduate Engineering**

ప్రైవేట్ అన్ -ఎయిడెడ్ వృత్తి విద్యా సంస్థలు 2013 నుంచి 2015-16 విద్యా సంవత్సరాలకు సంబంధించి వసూలు చేయాల్సిన అడ్మిషన్ ఫీజుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించింది. ఇందుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ద్వారా జూలై 6 వ తేదీన ఉత్తర్వులు (జీ.వో. ఎం.ఎస్. నం. 57) జారీ చేస్తూ అడ్మిషన్ ఫీరెగ్యులేటరీ కమిటీ (ఎ.ఎఫ్. ఆర్.సి.) సూచనల ప్రకారం ప్రవేశ రుసుం, ఇతర సేవలకు గాను ఖర్చులను విద్యార్థులు చెల్లించాలని స్పష్టం చేసింది.

తమ అడ్మిషన్ ఫీజుల వివరాలను ఎ.ఎఫ్. ఆర్.సి.కి సమర్పించని వృత్తి విద్యా సంస్థలకు ఏటా రూ. 30 వేలు అడ్ హాక్ ఫీజుగా నిర్ణయించినట్లు జీవోలో పేర్కొంది. వచ్చే సెప్టెంబర్ 30 వ తేదీలోగా వివరాలు సమర్పించని సంస్థలకు అదనపు ప్రాసెసింగ్ ఫీజు నిమిత్తం రూ.10 వేలు చెల్లించాలనీ, ఈ అదనపు ఫీజును బి.ఇ. / బి.టెక్ కోర్సుల దరఖాస్తుల పరిశీలన కోసం వసూలు చేయాలని జీవోలో సూచించింది.

ఎ.ఎఫ్.ఆర్.సి. కోరిన వివరాలు సమర్పించిన ఇంజనీరింగు కళాశాలలకు ఏటా రూ.35 వేల ఫీజును, ఎన్.ఆర్.ఐ. కోటా కింద ప్రతీ విద్యార్థి నుంచి ఏటా రూ.5 వేల వరకు అమెరికన్ డాలర్ల రూపంలో ఫీజు వసూలు చేయాలని జీవోలో పేర్కొంది. ట్యూషన్ ఫీజుకు అదనంగా ప్రతీ విద్యార్థి నుంచి అక్రిడిటేషన్ పొందిన కోర్సులకు గాను రూ.3 వేలు వసూలు చేయాలని జీవోలో తెలిపింది. అదీకాక అడ్మిషన్ల సమయంలో ప్రతీ విద్యార్థి నుంచి రూ.రెండు వేలు, ప్రత్యేక సేవల పేరుతో ఏటా రూ.వెయ్యి వసూలు చేయాలని జీవోలో వివరించింది.

(సమగ్ర పాఠానికై **http://goir.ap.gov.in** లో చూడండి) ☆

మన మాజీ ప్రధాని దివంగత శ్రీమతి ఇందిరాగాంధీ 1975 లో ఇదేరోజు దేశ వ్యాప్తంగా ప్రారంభించిన 'ఇరవై సూత్రాల అమలు కార్యక్రమం' ఆవిర్భావ దినోత్సవం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జులై ఒకటో తేదీన వైభవంగా జరిగింది.

ఈ సందర్భంగా 'మీ-సేవ'లో కొత్తగా 17 సేవలనూ, వాటిపై రూపొందించిన గోడ పత్రికలనూ ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.



20 సూత్రాల అమలుతో మన రాష్ట్రానికి మరింత వన్నె: సి.ఎం.

'మీ-సేవ' ఆరంభమయిన నాటి నుంచి ఇంత వరకూ వచ్చిన దరఖాస్తుల సంఖ్య 2 కోట్లు దాటింది. ఈ దృష్ట్యా అద్భుత ప్రతిభ కనబరచిన పలు జిల్లాల కలెక్టర్లు, సి.పి.వో.లు, ఎం.పి.డి.వో.లు, తదితరులకు సి.ఎం. అవార్డులు అందజేశారు. వీరిలో కొందరిని సి.ఎం. నగదు పురస్కారాలతో సత్కరించారు.

ఆ ఇరవై సూత్రాల వివరాలు

ముప్పయ్ ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రజా శ్రేయస్సు కోసం రూపొందించి అమలు చేసిన 'ఇరవై సూత్రాల కార్యక్రమం'లోని విశేషాంశాలేమిటో మరోసారి క్షుణ్ణంగా జ్ఞాపకం చేసుకోవాల్సి ఉంది.


1. పేదరిక నిర్మూలన, 2. ప్రజలకు అధికారం, 3. రైతులకు చేయూత, 4. కార్మిక సంక్షేమం, 5. ఆహార భద్రత, 6. అందరికీ ఇళ్లు, 7. పరిశుభ్రమైన తాగునీరు, 8. అందరికీ ఆరోగ్యం, 9. అందరికీ విద్య, 10. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, బి.సి.ల మైనార్టీల సంక్షేమం, 11. మహిళా సంక్షేమం. 12. శిశు సంక్షేమం. 13. యువజనాభివృద్ధి, 14. మురికివాడల అభివృద్ధి, 15. పర్యావరణ పరిరక్షణ, 16. సామాజిక భద్రత, 17. గ్రామీణ రహదారులు, 18. గ్రామీణ విద్యుదీకరణ, 19. వెనుబడిన ప్రాంతాల అభివృద్ధి, 20. ఇ.టి. ఆధారిత ఇ-పాలన వంటివి... ఇరవై సూత్రాలుగా అమలై ప్రజాదరణకు నోచుకున్నాయి.

ఈ సందర్భంగా జరిగిన సభలో సి.ఎం. శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ఇరవై సూత్రాల అమలులో కూడా మన ఆంధ్రప్రదేశ్ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. మరో వైపు 'మీ-సేవ' కు వినూత్న కార్యక్రమాల రూపకల్పనలో మన రాష్ట్రానికి ప్రథమ స్థానం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఈ విజయాలలో అధికారుల భాగస్వామ్యం ఎంతో ఉంది. ముఖ్యంగా 20 సూత్రాల కార్యక్రమం అమలులో మన రాష్ట్రం గత మూడేళ్లుగా ప్రథమ స్థానం దక్కించుకోవడం హర్షణీయం" అన్నారు.

"అన్ని ప్రాంతాల్లోనూ పర్యటించి డాక్టర్ తులసిరెడ్డి ఇరవై సూత్రాల అమలు కార్యక్రమాన్ని బాగా పర్యవేక్షిస్తున్నారు. ఇరవై సూత్రాల కార్యక్రమం అమలు కమిటీకి ఛైర్మన్‌గా ఆయన చేస్తున్న సేవలు అమోఘం. కేవలం పది సర్వీసులతో ప్రారంభమైన మీ-సేవలో ఇప్పుడు 150 సర్వీసులు పొందుపరచాం. పథకాల అమలు తర్వాత లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు కృషి చేస్తాం... క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తాం. మీ-సేవలో ప్రజలకు సరైన సేవలు సకాలంలో అందకుంటే బాధ్యులైన అధికారులు ఆ వినియోగదారునికి జరిమానా చెల్లించేలా 'సిటిజన్ ఛార్టర్' తెస్తున్నాం. దీని వల్ల అధికారుల్లో జవాబు దారీతనం పెరుగుతుంది" అని ముఖ్యమంత్రి వివరించారు.

డాక్టర్ తులసిరెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి శ్రీ దిగ్విజయ్ సింగ్, మంత్రులు శ్రీ బొత్స సత్యనారాయణ, శ్రీ రఘువీరా రెడ్డి, శ్రీ పొన్నాల లక్ష్మయ్య, డాక్టర్ గీతారెడ్డి, శ్రీ పార్థసారథి, శ్రీ దానం నాగేందర్, శ్రీమతి డి.కె. అరుణ, శ్రీ కన్నా లక్ష్మీనారాయణ, శ్రీ పితాని సత్యనారాయణ, శ్రీ ముఖేష్ గౌడ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ మహంతి తదితరులు పాల్గొన్నారు.

- రాజఫణి వి.





ఇదో సరికొత్త ప్రయోగం!

బాల మానసిక వికలాంగులకు ప్రభుత్వ ఆశ్రయం

పుట్టుకతోనే మానసికంగా అంతగా ఎదగని అనాథ బాలబాలికలను చేరదీసి వారిని అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు మన రాష్ట్రంలోనే ప్రప్రథమంగా ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఓ ఆశ్రమం రూపుదాల్చింది.

'సువిధ ఆశ్రమం' పేరుతో హైదరాబాద్ సమీపంలోని గాజుల రామారంలో ఏర్పాటు చేసిన ఈ ఆశ్రమాన్ని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖా మంత్రి శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి జూన్ 26న ప్రారంభించారు.

కస్తూర్బా జాతీయ స్మారక సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ ఆశ్రమం నిర్వహణను పర్యవేక్షించేందుకు ఓ కమిటీ ఉంటుంది. ఈ కమిటీలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, కస్తూర్బా స్మారక సంస్థ అధికారి ఒకరు సభ్యులుగా ఉంటారు.

గ్రామీణ స్థాయిలో మహిళలు, పిల్లల విద్య, వైద్యం, సామాజిక వికాసం కోసం కృషి చేస్తున్న కస్తూర్బా గాంధి జాతీయ స్మారక ట్రస్టు 1945 లో మహాత్మాగాంధీ చేతుల మీదుగా ప్రారంభించబడింది. ఈ సంస్థ ఆనాటి నుంచి నేటి వరకూ తన లక్ష్య సాధనలో నిర్విరామంగా కృషి చేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ ట్రస్టుకు 22 శాఖలు ఉన్నాయి. ప్రధాన కార్యాలయం ఇండోర్‌లో ఉంది. మన రాష్ట్రంలో రాజమండ్రిలోను, హైదరాబాద్‌లోను రెండు శాఖలు ఉన్నాయి. హైదరాబాద్‌లోని హైదర్షాకోట్ శాఖలో బాలబాలికల కోసం 'బాల వాడి' నిర్వహిస్తున్నారు.

ఈ సంస్థకు గల అనుభవాన్ని, కృషిని దృష్టిలో ఉంచుకొని మానసికంగా ఎదగని, అనాథలైన బాల బాలికలను చేరదీసి, వారికి ఆపన్న హస్తం అందించడంతో పాటు, అన్ని విధాల వారిని తీర్చిదిద్ది, జనజీవన స్రవంతిలో కలిసి మెలసి తిరిగేలా చేయాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఈ 'సువిధ' ఆశ్రమ నిర్వహణ బాధ్యతని కస్తూర్బా గాంధీ స్మారక సంస్థకి అప్పగించింది. ప్రత్యేక అవసరాలుగల బాల బాలికల కోసం ప్రప్రథమంగా ప్రభుత్వం, ప్రయివేటు సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఆశ్రమం ఏర్పాటు చేయడం జరిగిందనీ, ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆశ్రమ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి శ్రీమతి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఈ ఆశ్రమ నిర్వహణకు అవసరమైన పూర్తి సహాయం, సహకారాలు అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు.


ఈ కార్యక్రమంలో విశేష అతిథిగా పాల్గొన్న మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీమతి నీలం సహాని మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల బాల బాలికల కోసం ఓ ఆశ్రమం ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించి, ప్రభుత్వంతో కలసి ఆశ్రమం నిర్వహణకు ముందుకు వచ్చిన కస్తూర్బా సంస్థను అభినందించారు. ప్రత్యేక అవసరాల గల పిల్లల కోసం వసతి గృహాల అవసరం ఎంతో ఉన్నదని, ఒక స్వచ్ఛంద సంస్థతో కలిసి, రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ నిర్వహణ చేపట్టడం ఒక వినూత్న ప్రయోగమన్నారు.

ఈ ఆశ్రమంలో ముందుగా అనాథలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని బాలల సంక్షేమం-సంస్కరణల సర్వీసులు- వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు శ్రీ కిస్మత్ కుమార్ చెప్పారు. ఇక్కడ చేరిన పిల్లలకు 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ ఆశ్రయం ఇస్తారని, ఆ తరువాత బాలికలను కస్తూర్బా స్మారక సంస్థ నిర్వహిస్తున్న 'స్వధాన్ హోమ్'కు తరలిస్తారని, బాలురను వికలాంగ సంక్షేమ శాఖ ద్వారా నిధులు అందుతున్న హోమ్‌లకు తరలిస్తారని శ్రీ కిస్మత్ కుమార్ చెప్పారు.

ఈ 'సువిధ ఆశ్రమాన్ని' ఆరు ఎకరాల విస్తీర్ణంలో బాల బాలికలకు వేర్వేరుగా వసతి కల్పించేలా ఏర్పాటు చేశారు. ఇక్కడ 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు మాత్రమే ఆశ్రమం కల్పిస్తారు. ఆయా జిల్లాలలో గల శిశు సంక్షేమ కమిటీలు తమ ప్రాంతంలోని మానసిక వికలాంగులైన అనాథ బాల బాలికలను గుర్తించి ఈ ఆశ్రమానికి తరలిస్తారు.

ఆశ్రమంలో చేరిన బాల బాలికలను ప్రేమాభిమానాలతో, సహనంతో వారిని అన్ని విధాల తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు.

మన రాష్ట్రంలో తొలిసారిగా చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిద్దాం.



నడుస్తున్న చరిత్ర



అవార్డులు - రివార్డులు

* మానవహక్కుల పరిరక్షణలో చేస్తున్న కృషికి గాను ప్రధానిమన్మోహన్‌సింగ్ కుమార్తె అమృత్‌సింగ్‌కు ఇండియా అబ్రాడ్ పబ్లిషర్స్ స్పెషల్ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ 2012 పురస్కారాన్ని ప్రధానం చేశారు.

నియామకాలు

- కేంద్రప్రభుత్వ రంగ పరిశోధన సంస్థ సెంటర్ ఫర్ ఎకనమిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)కు నూతన ఛైర్మన్‌గా ప్రొఫెసర్ ఆర్. రాధాకృష్ణ నియమితులయ్యారు.
- దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తమిళనాడుకు చెందిన జస్టిస్ పి.సదాశివం నియమితులయ్యారు.
- కేంద్ర హోంశాఖ నూతన కార్యదర్శిగా జమ్మూకాశ్మీర్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్ గోస్వామి జూన్ 30న బాధ్యతలు స్వీకరించారు.
- భారత విదేశాంగ కార్యదర్శిగా సుజాతాసింగ్ నియమితులయ్యారు. 1976 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సుజాతాసింగ్ ప్రస్తుతం జర్మనీలో భారత రాయబారిగా పనిచేస్తున్నారు.
- సాఫ్ట్‌వేర్, సేవల కంపెనీల జాతీయ మండలి (నాస్కామ్) అధ్యక్షుడిగా టెలికం మాజీ కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్ జూలై 5న నియమితులయ్యారు.
- భారత సైన్యంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తిగత కార్యదర్శి పొందిన తొలిమహిళగా లెఫ్టినెంట్ జనరల్ లాల్జీ రికార్డు సృష్టించారు.

రాష్ట్రీయం

- రాష్ట్రప్రభుత్వం 'బంగారుతల్లి' పథకాన్ని జూలై 2న ప్రారంభించింది. ఆడపిల్లల చదువును ప్రోత్సహించడమే ఈ పథక ముఖ్యోద్దేశం. ఈ పథకం కింద ఆడపిల్ల పుట్టినప్పటినుంచి డిగ్రీవరకు ప్రభుత్వం ఏటా కొంత మొత్తాన్ని అందిస్తుంది. రాష్ట్రంలోని తెల్లకార్డు దారులందరికీ ఈ పథకం వర్తిస్తుంది. పుట్టినప్పటినుంచి డిగ్రీవరకూ చెల్లించే మొత్తం 2,16,000 రూపాయలుగా ఉంటుంది.
- గ్రూపు-2లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులను గ్రూపు-1లో విలీనం చేస్తూ గ్రూపు-1బి గా మార్పు చేయడానికి సంబంధించిన ఉత్తర్వుల అమలును ప్రభుత్వం వాయిదా వేసింది. 2014 నుంచి ఈ పునర్విభజన ఉత్తర్వులను అమలు చేస్తామని పేర్కొంది.
- హైదరాబాద్ - తిరుపతి మధ్య సెప్టెంబర్‌లో డబుల్ డక్కర్‌రైలును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.
- కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా ప్రొఫెసర్ బి. శ్యామసుందర్‌ను ప్రభుత్వం నియమించింది.
- అయిదోతరగతి నుంచే ఉపకారవేతనాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జాతీయం

- కాశ్మీర్‌లోయ - జమ్మూ ప్రాంతాన్ని కలిపే 18 కిలోమీటర్ల పొడవైన బనిహాల్ - కాజీగుండ్ రైలు మార్గాన్ని ప్రధాని మన్మోహన్‌సింగ్, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ జూన్ 26న ప్రారంభించారు.
- నొప్పి నివారిణి 'అనాల్జిన్', మధుమేహ నివారక, ఔషధం 'పియో గ్లిటాజోన్', యాంటీ డిప్రెసంట్ 'డియాంగ్జిట్ ఔషధాలపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది.
- భారత్ చేపట్టిన సోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పీఎస్ఎల్వీ-సీ 22) ప్రయోగం విజయవంతమైంది. జూలై నెల ఒకటిన శ్రీహరికోట షార్ కేంద్రం నుంచి తప్రయోగించిన పీఎస్ఎల్వీ -సీ 22 దేశ తొలి పూర్తిస్థాయి నావిగేషన్ ఉపగ్రహం ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం -1ఎను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది.
- సాధారణ వరిరకం కనీస మద్దతు ధరను క్వింటాలకు 60 రూపాయలు చొప్పున కేంద్రం పెంచింది.
- అంగారకుడిపై జీవాన్వేషణ, అక్కడి వాతావరణ పరిస్థితుల పరిశీలన లక్ష్యంగా వచ్చే అక్టోబర్ - నవంబర్‌లలో మార్స్ ఆర్బిటల్ మిషన్ ప్రయోగాన్ని నిర్వహిస్తున్నట్లు ఇస్రో ప్రకటించింది.
- సైబర్ దాడుల నుంచి ప్రభుత్వ, ప్రయివేటు మౌలిక సదుపాయాలను రక్షించేందుకుగాను కేంద్రప్రభుత్వం నేషనల్ సైబర్ సెక్యూరిటీ విధానాన్ని జూలై 2న ప్రకటించింది.
- జాతీయ ఆహారభద్రత ఆర్డినెన్స్‌కు భారత రాష్ట్రపతి ఆమోద ముద్రవేశారు. ఈ ఆర్డినెన్స్ వల్ల 67 శాతం జనాభాకు ప్రతినెలా సబ్సిడీపై ఆహారధాన్యాలు పొందే హక్కు లభిస్తుంది.
- జైలు, పోలీసు కస్టడీలో ఉన్న వ్యక్తులు పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలకు పోటీ చేయరాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఏ చట్టం కిందనైనా ముందస్తు నిర్బంధంలో ఉన్నవారికి మాత్రం ఈ అనర్హత వర్తించదని పేర్కొంది.
- మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థలను రద్దు చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ సంస్థలు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ చేపట్టే పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తున్నాయి. కొత్తపేరు పెట్టనున్న డిఆర్‌డిఏలు ఇకపై జిల్లా పరిషత్‌ల ఆధ్వర్యంలో విధాలు నిర్వర్తించనున్నాయి.

అగస్టు నెలలో ముఖ్యమైన రోజులు

5	స్నేహితుల దినోత్సవం
6	హిరోషిమా సంఘటనా దినం ప్రపంచ శాంతి దినోత్సవం
9	క్విట్ఇండియా దినోత్సవం
15	భారత స్వాతంత్ర్య దినోత్సవం స్వామి అరవిందుని జయంతి
19	ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం రాజీవ్‌గాంధీ జయంతి
23	టంగుటూరి ప్రకాశం జయంతి
26	మదర్‌థెరిసా జయంతి
29	జాతీయ క్రీడల దినోత్సవం

అంతర్జాతీయం

- ఆస్ట్రేలియా 28వ ప్రధానిగా కెవిన్‌రుడ్ జూన్ 27న బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రధాని పదవి చేపట్టడం ఇది రెండోసారి.
- దివంగత పోప్‌లు జాన్‌పాల్ -2, జాన్ -23లకు సెయింట్ హోదా ఇవ్వాలని పోప్‌ఫ్రాన్సిస్ జూలై 5న నిర్ణయించింది.
- మౌస్ సృష్టికర్త డగ్లస్ ఎంగెల్ బార్ట్(88) జూలై 2న అనారోగ్యంతో కాలిఫోర్నియాలో కన్నుమూశారు.

ఉగ్గుపాల భాష మనది

ఉగ్గుపాల భాష మన తెలుగు
సిగ్గు పడక మాటలాడదాం !
పలకమీద వ్రాసినది
పలుకుదాం హాయిగా
అమ్మ తీయనైన మాటకదా
నాన్న కమ్మనైన పాటకదా !
మనకి భాష నేర్పిన అమ్మ
మన భవితవ్యానికి పట్టు కొమ్మ

అమ్మని తలుద్దాం
భాషని కొలుద్దాం !
గోదావరి, కృష్ణ, పెన్న, కావేరి, నదులు
పరవశించి పాడాయి తెలుగు పాటని
ఉప్పొంగి కూచిపూడి నాట్యాలు చేశాయి
మహాకవుల అవధానాలూ
కూచిపూడి, భరత నాట్యాలూ

ఛందోబద్ధ పద్య నాటక రాగాలూ
మన తెలుగు తల్లి సంపద.
అది తెలుగు తల్లి మనకిచ్చిన పద సంపద
ఉగ్గుపాల భాష మన తెలుగు
సిగ్గు పడక మాటలాడదాం !
ఆ పద సంపద పెంచుదాం !
అందరికీ అది పంచుదాం !

– సూరంపూడి విశ్వం

- రష్యా రాకెట్ 'ప్రోటాన్ – ఎం' గాలిలో కూలిపోయింది. దీనిని జూలై 2న కజికిస్థాన్‌లోని బైక్ నూరా అంతరిక్ష కేంద్రం నుంచి ప్రయోగించారు. ఇది మూడు గ్లోనాస్ నావిగేషన్ ఉపగ్రహాలను మోసుకెళ్తుంది.
- ఈజిప్టు దేశ తాత్కాలిక అధ్యక్షుడిగా ఆదేశ రాజ్యాంగ న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి ఎడ్లీ మహ్మద్ మన్సూర్ బాధ్యతలు స్వీకరించారు.
- వివాదస్పద అబార్షన్ బిల్లుకు సంబంధించి రోమన్ క్యాథలిక్ దేశం ఐర్లాండ్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో గర్భస్రావానికి అనుమతిచ్చే చట్టానికి ఐర్లాండ్ దిగువ సభ ఆమోదం తెలిపింది.

వార్తలు – విశేషాలు

- బ్రిటన్‌కు చెందిన ఆడమ్ కిర్బీ అనే రెండేళ్ళ చిన్నారి మేధావుల క్లబ్ 'మెన్సా'లో సభ్యత్వం పొందిన అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డు సాధించాడు. ఈ చిన్నారి ఐక్యూ పరీక్షల్లో 141 స్కోరు సాధించి రికార్డు పుటల్లోకి ఎక్కాడు.
- ప్రపంచంలో అతి పెద్ద గాలిమర (విండ్‌ఫాం) ను బ్రిటన్ ఆగ్నేయతీరంలో జూలై 4న బ్రిటన్ ప్రధాని డేవిడ్ కెమెరూన్ ప్రారంభించారు. 630 మెగావాట్ల సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ఉత్పత్తి చేసే విద్యుత్ ద్వారా ఐదు లక్షల గృహ అవసరాలకు తీర్చవచ్చు.
- విలన్‌గా తనదైన ముద్రవేసిన ప్రసిద్ధ బాలీవుడ్ నటుడు ప్రాణ్ జూలై 12న ముంబాయిలో కన్నుమూశారు. 2012 సంవత్సరానికి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్న ఆయన ప్రాణ్ అసలు పేరు 'ప్రాణ్‌కేవల్ సికంద్'. 1940లో హీరోగా పంజాబీ చిత్రం ద్వారా తెరంగేట్రం చేసిన ఆయన అనంతరం 400 చిత్రాలకు పైగా పనిచేశారు.
- మజ్లిస్ బచావ్ తహరీక్ (ఎంబీటి) పార్టీ అధ్యక్షుడు, హైకోర్టు సీనియర్ న్యాయవాది ఆదం మాలిక్ జూలై 12న కన్నుమూశారు.
- ప్రముఖ బుర్రకథ కళాకారుడు నిట్టల లక్ష్మణరావు కన్నుమూశారు.
- పద్మభూషణ్, సంగీతనిధి, మహామహోపాధ్యాయ డాక్టర్ నూకల చిన్న సత్యనారాయణ కన్నుమూశారు.
- జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా జేఎంఎంనేత హేమంత్ సోరెన్ జూలై 13న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు.

క్రీడలు

- ఇరాన్ జరుగుతున్న ఆసియాయూత్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో మన రాష్ట్రానికి చెందిన బొడ్డు ప్రత్యూష స్వర్ణపతకాన్ని సాధించింది. అండర్ – 18 బాలికల విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది.
- ఆర్మేనియాలో ముగిసిన (జూన్ 28న) 'ఫిడే' మహిళల గ్రాండ్ ప్రి టోర్నమెంట్‌లో మనరాష్ట్రానికి చెందిన్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి మరో గ్రాండ్ ప్రిటైటిల్ సాధించింది. మొత్తం 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణులు పాల్గొన్న ఈమెగా ఈవెంట్‌లో హంపి అజేయంగా నిలవడం విశేషం.
- ప్రతిష్టాత్మక కాన్ఫెడరేషన్స్ ఫుట్‌బాల్ కప్‌ను బ్రెజిల్ గెలుచుకుంది. స్పెయిన్‌తో జూన్ 30న జరిగిన ఫైనల్‌లో బ్రెజిల్ విజేతగా నిలిచింది.
- షికలాండ్‌లో ఒరిమటిలాలో జరిగిన జూనియర్ అంతర్జాతీయ షాట్‌గన్ ఈవెంట్‌లో మానవదిత్య రాథోడ్ వ్యక్తిగత ఈవెంట్లో రజత పతకం సాధించాడు. అలాగే సునీల్ శరణ్, అభయ్‌రాథోడ్‌లతో కలిసి టీమ్ ఈ వెంట్లో పసిడి పతకం సాధించాడు. అలాగే డబుల్ ట్రాప్ వ్యక్తిగత విభాగంలో ప్రియాన్ను పాండే స్వర్ణపతకం సాధించగా, టీమ్ విభాగంలో సంజయ్‌రాథోడ్ అహవర్ రిజ్వీ, ప్రియాన్నులతో కూడిన బృందం రజత పతకం సాధించింది.
- నాలుగో ఆసియా ఇండోర్ క్రీడల కబడ్డీ, పోటీలలో మనదేశానికి చెందిన పురుషుల, మహిళల జట్లు స్వర్ణపతకాలు సాధించాయి. దక్షిణకొరియాలోని ఇంచియాన్‌లో ఈ పోటీలు జరిగాయి.
- వింబుల్డన్ మహిళల సింగల్స్ టైటిల్‌ను ఫ్రాన్స్‌కు చెందిన మరియన్ బర్తోలి కైవశం చేసుకుంది. జూలై 6న జరిగిన ఫైనల్లో ఆమె జర్మనీకి చెందిన సబైన్ లిసికిపై గెలుపొంది, తన కెరీర్‌లో తొలిగ్రాండ్ స్లామ్‌టైటిల్ సాధించింది. అలాగే మహిళల డబుల్స్ టైటిల్‌ను సువుయ్ (తైవాన్) పెంగ్ (చైనా) జంట కైవసం చేసుకుంది. ఇదిలావుంటే పురుషుల సింగిల్స్ టైటిల్స్‌ను బ్రిటన్‌కు చెందిన ఆండ్రీముర్రే గెలుచుకోగా, డబుల్స్ టైటిల్‌ను బాబ్ బ్రయాన్ – మైక్ బ్రయాన్ (అమెరికా) జోడీ చేజిక్కించుకుంది.
- జర్మనీ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ విజేతగా నిలిచాడు. జూలై 7న ఈ పోటీలు జరిగాయి.
- పుణెలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి చైనా మొదటి స్థానంలో నిలిచింది. రెండు స్వర్ణాలు, ఐదు రజతాలు, పదికాంస్య పతకాలు సాధించి భారత్ ఆరోస్థానంలో నిలిచింది.
- అండర్ –19 ముక్కోణపు క్రికెట్ టోర్నీ విజేతగా భారత్‌జట్టు నిలిచింది.
- వెస్టిండీస్‌లో ముక్కోణపు క్రికెట్ టోర్నీ విజేతగా భారత క్రికెట్ జట్టు నిలిచింది. టైటిల్ సాధించింది.

– దాసరి దుర్గాప్రసాద్



తూర్పు తీరంలో చరిత్ర సృష్టించనున్న విశాఖపోర్టు

తూర్పు తీరంలో ఎనిమిది దశాబ్దాల చరిత్ర కలిగిన విశాఖపట్నం ఓడరేవు ఇప్పుడు ఆధునీకరణ, యాంత్రీకరణ వంటి భారీ పరిమాణాలతో కొత్త చరిత్ర సృష్టించేందుకు ఉరుకులు, పరుగుల మీద ముందుకు సాగుతోంది.

ఇప్పటి అంచనాల ప్రకారం - 2020 నాటికి తూర్పు తీరంలో ఎగుమతి దిగుమతుల నిర్వహణలో అత్యధిక పెరుగుదల వేగాన్ని విశాఖపోర్టు సాధించనుంది. ఇందుకు అనుగుణంగా పోర్టు కార్యకలాపాలను రూపుదిద్దడంలో గత అయిదేళ్ళలో ఛైర్మన్‌గా వ్యవహరించిన శ్రీ అజయ్ కల్లం, ఆయన బృందం చేసిన కృషి సత్ఫలితాలు ఇవ్వనున్నది.

భారీయెత్తున విశాఖపోర్టులో బెర్త్‌లను ఆధునీకరించడం, హార్బర్ కాల్వలను వెడల్పు చేయడం, స్టాక్ యార్డ్‌లనుమెరుగు పర్చడం వంటి దీర్ఘకాలిక చర్యలను ఈ అయిదేళ్ళ కాలంలో పోర్టు చేపట్టింది. ఫలితంగా తూర్పు తీరాన ఉన్న విశాఖపోర్టు కార్గో కార్యకలాపాల్లో, ఎగుమతుల వ్యాపారంలో కొత్త రికార్డులను సృష్టించబోతోంది.

భారత ప్రభుత్వం రూపొందించిన 'తూర్పు వైపు చూపు' విధానం వల్ల సింగపూర్, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మలేషియా, తైవాన్, మయన్మార్, చైనా వంటి దేశాల నుంచి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు ముమ్మరంకానున్నాయి.

విశాఖ పోర్టు విస్తరణకి అవకాశాలు అపారంగా వున్నాయి. రైల్వేలైన్లు, హైవే కనెక్టివిటీ, సహజమైన ఓడరేవు, బల్క్ కార్గోను నిర్వహించడంలో ఉన్న అపారమైన అనుభవం పోర్టు విస్తరణకు, అభివృద్ధికి కారకాలుగా ఉన్నాయి.




విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ప్రస్తుత సామర్థ్యం ఏడాదికి 68 మిలియన్ టన్నులు. 2020 నాటికి పోర్టు నిర్వహణ సామర్థ్యం 160 మిలియన్ టన్నులకు చేరే విధంగా 13 వేల కోట్ల రూపాయలు వ్యయం కాగల పోర్టు ఆధునికీకరణ విస్తరణకు శ్రీ అజయ్ కల్లం ప్రణాళికలను రూపొందించారు.

కేంద్ర నౌకాయాన శాఖ రూపొందించిన 'మెరైటైం- 2010' అజెండా ప్రకారం పోర్టు నిర్వాహక సామర్థ్యం 2014-15 నాటికి 119 మిలియన్ టన్నులకు, 2017 నాటికి 130 మిలియన్ టన్నులకు 2020 నాటికి 150-160 మిలియన్ టన్నులకు చేరుకోవలసివుంది.

పశ్చిమతీరంలో ఉన్న పోర్టులతో పోల్చితే తూర్పు తీరంలో ఉన్న ప్రధాన రేవుల పురోగతి చాలా మందకొడిగా వుంది. దేశంలో ఉన్న 12 ప్రధాన రేవులలో తూర్పుతీరంలో ఆరు, పశ్చిమతీరంలో ఆరు ఉన్నాయి. దేశం మొత్తం మీద సరుకుల ఎగుమతి దిగుమతుల నిర్వహణలో పశ్చిమ తీరంలోని రేవుల గుండా 55 శాతం సాగుతోంది.

దేశంలోని ప్రధానమైన ఓడరేవులలో 2012-13 సంవత్సరంలో మొత్తం కార్గో నిర్వహణ 545.68 మిలియన్ టన్నులు కాగా, విశాఖపోర్టు నిర్వహించిన కార్గో 58.96 మిలియన్ టన్నులు. అంటే మొత్తం కార్గో నిర్వహణలో 10 శాతం మాత్రమే విశాఖ పోర్టు నిర్వహించగలిగింది.



వందేమాతరం !

నేను పుట్టడానికి మునుపే
నువ్వు స్వతంత్రవి !
అగ్ని పరీక్షలెదుర్కొన్న సీతవి !
కన్నబిడ్డల్ని కోల్పోయిన ద్రౌపదివి !
జలియన్ వాలాబాగ్‌లు
చంపోలన్ నీలి ఉద్యమాలు
దండి సత్యాగ్రహాలు
చూసిన ముగ్గుబుట్టవి !
నీ గుండెనిండా గాయాల తోటలు
రక్త నదులై ప్రవహించిన రోజులు
ఎన్నెన్ని దాటుకొని వచ్చావో యిప్పటికి
ఎన్ని భాషల నదులతో
ఏర్పడిన సముద్రానివో నువ్వు
ఎన్ని ఆర్యహంత పదాల నుండి
ద్రవిడోద్యానాల వరకు ప్రవహించిన
కాల సహగామివో నువ్వు
అరున్నర దశాబ్దాల నుండి
ఆరుగాలం ఆరోహణావరోహణాల్ని
శాంతి సహనాలతో తిలకిస్తున్నావు
ఖండాలుగా విడిపోతున్న జనాలు
విడిపోయినా పాదరస రేణువుల్లా
తిరిగి ఒకటై పోవటం
పూల జాతులు ఎన్ని ఉన్నా
తోట మాత్రం ఒకటే కావటం
చీలిన వేర్వేరు దారుల్లో నడుస్తూ
ఒకే గమ్యానికి చేరుకోవటం
ఉత్థాన పతనాల మధ్య
నింగి ఎత్తుకు లేచిన నీ శిరస్సు
సూర్య తేజస్సుతో సమానమైన
నీ ముఖ వర్చస్సు
ఆసేతు హిమాచల పర్యంతం
ఒకే ఒక నాదనినాదం
వందేమాతరం – మా తుఝె సలాం !

– గుర్రాల రమణయ్య

చిన్న తరహా పోర్టులన్నింటిలోనూ కలిపి 370 మిలియన్ టన్నుల కార్గోను నిర్వహిస్తే, పశ్చిమ తీరంలోని పోర్టులు 2012-13లో 70 శాతం కార్గోను నిర్వహించాయి.

దేశ, విదేశాల్లోని వాణిజ్య, వర్తక రంగంలోని సంస్థలు విశాఖ పోర్టు ప్రణాళికా, పెట్టుబడుల విభాగం వైపు దృష్టిసారించాయి.

గత అయిదేళ్ళలో విశాఖపట్నం పోర్టు-విస్తరణ, ఆధునికీకరణ (యాంత్రీకరణ), వాణిజ్య ప్రోత్సాహం – అన్న త్రిముఖ వ్యూహాన్ని అవలంబించింది. పోర్టులో ఉన్న పది బెర్తుల ఆధునికీకరణ, యాంత్రీకరణ చేపట్టి నిర్వహణా సామర్థ్యాన్ని పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇన్నర్ హార్బర్, ఔటర్ హార్బర్లలో పనులను ప్రయివేట్, ప్రభుత్వ భాగస్వామ్యంలో రూ. 2,230 కోట్లతో చేపట్టింది. ఇప్పుడు ఇన్నర్ హార్బర్‌లో 18 బెర్తులు, ఔటర్ హార్బర్‌లో ఆరు బెర్తులు ఉన్నాయి. 'మెరైటైం' అజెండా ప్రకారం మరో నాలుగు కొత్త బెర్తులను పోర్టు నిర్మించనున్నది.

దీనితో పాటు భీమునిపట్నం సమీపంలో మాలకుద్దు వద్ద విశాఖ పోర్టు శాటిలైట్ పోర్టును నిర్మిస్తోంది. దీని నిర్మాణానికి రూ. 2 వేల కోట్లు వ్యయం అవుతుంది. ఈ శాటిలైట్ పోర్టు నిర్వహణ సామర్థ్యం 20 మిలియన్ టన్నులు. విశాఖ పోర్టులో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, కొత్త శాటిలైట్ పోర్టు అదనపు కార్గోను నిర్వహించడానికి ఉపయోగపడుతుంది. శాటిలైట్ పోర్టులో 4-5 బెర్తులు ఉంటాయి.

కొత్తగా మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ప్రస్తుతం ఉన్న సౌకర్యాలను ఆధునికీకరించడానికి విశాఖపోర్టు వెయ్యి కోట్ల రూపాయలు వ్యయం చేస్తోంది.

ఇన్నర్ హార్బర్‌లోకి పెద్ద పెద్ద నౌకలు సులభంగా ప్రవేశించడానికి వీలుగా ప్రవేశ మార్గాలను వెడల్పు చేసింది. ఇందుకు అనుగుణంగా కొత్త రోడ్లను, రైలు మార్గాలను కల్పించే పనులు చేపట్టింది. కార్గో దిగుమతులను నిల్వ చేయడం కోసం వర్షాల నుంచి రక్షణ పొందే స్టాక్ యార్డ్‌లను అదనంగా అభివృద్ధి చేస్తోంది.

ఈ ప్రాజెక్టు పనులన్నీ పూర్తయితే భారీ నౌకలను నిర్వహించేందుకు విశాఖ పోర్టుకు అవకాశం కలుగుతుంది. వర్తకులకు రవాణాచార్జీలు, ఇతర వ్యయాలు గణనీయంగా తగ్గిపోతాయి. నౌకలకు చెల్లించే అద్దెలు కూడా భారీగా తగ్గుతాయి.

బొగ్గును నిర్వహించేందుకు ఆధునిక యంత్రాలను ఇటీవల పోర్టు ఏర్పాటు చేసింది. గతంలో ఏటా 4 మిలియన్ టన్నుల బొగ్గును నిర్వహించే సామర్థ్యం నుంచి ఒక్కో కార్గో బెర్త్ ఇకపై 10.18 మిలియన్ టన్నుల బొగ్గును నిర్వహించే సామర్థ్యానికి చేరుకుంటుంది.

ఓర్ హ్యాండ్లింగ్ కాంప్లెక్స్, ఇతర కార్యకలాపాలను ఆధునికంగా యాంత్రీకరించే పనులను విశాఖ పోర్టు ట్రస్టు ఇటీవల చేపట్టింది. ఈ పనులు పూర్తి అయితే ఇనుప ఖనిజం నిర్వహణా సామర్థ్యం 12 మిలియన్ టన్నుల నుంచి ఏటా 23 మిలియన్ టన్నులకు చేరుతుంది. రసాయన ఎరువులు నిర్వహించే ఈక్యూ -7 బెర్త్ వార్షిక సామర్థ్యం 4-5 మిలియన్ టన్నులకు చేరుతుంది. అదే సమయంలో పోర్టు ఆధునికీకరణ, యాంత్రీకరణ వల్ల విశాఖపట్నం పోర్టు పరిధిలో వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.

పోర్టు ఛైర్మన్‌గా శ్రీ అజయ్ కల్లం ఈ ప్రాజెక్టులన్నింటికీ సకాలంలో ఆమోదాలు తెచ్చుకోవడంతో పాటు, జాతీయ, అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు వున్న కంపెనీలకు పనులను అప్పగించి, వాటి పూర్తికి నిర్ణీత గడువులను నిర్దేశించారు.

ఫలితంగా – 1980 దశకం చివర్లో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో వెలిగిన విశాఖ పోర్టు మరోసారి ఆ ఖ్యాతిని సాధించేందుకు పరుగులు తీస్తోంది.

– వి.డి.ఎస్. రామరాజు

జిల్లాల నుంచి...

వాన దేముడి లెక్కే....

మహావృక్షమయినా, చిన్న మొక్కయినా వానదేవుడికి తేడా ఉండదు. ప్రజాసంక్షేమాన్ని కాంక్షించే ఏ ప్రభుత్వమైనా అంతే. అధిక సంఖ్యాకులయినా, అల్పసంఖ్యాకులయినా (మైనారిటీలు) వివక్ష ఏమీ ఉండదు. ప్రభుత్వ సాయం అందరికీ, అదికూడా పంక్తి చివరన కూర్చున్న వాడికి కూడా సంపూర్ణంగా అందితీరుతుంది.

ఈ వ్యాఖ్యానం ఎవరిదనుకున్నారు! సంక్షేమ ఫలాలను తనివితీరా అనుభవిస్తున్న చిత్తూరుజిల్లా మదనపల్లి డివిజన్ లబ్దిదారులది.

ఈ డివిజన్‌లోని బి.కొత్తకోట మండలానికి చెందిన నవయువకుడు షేక్ నిజామ్. దూరవిద్యలో డిగ్రీ చేస్తున్నాడు. ఫొటోగ్రఫీలో అనుభవమున్నా, స్టూడియో నడపాలన్న అభిలాష ఉన్నా, తగిన పెట్టుబడిలేక సతమతమయ్యేవాడు. మైనార్టీ



ఫైనాన్స్ ద్వారా రుణాలు మంజూరు చేస్తారనే విషయం తెలుసుకొని వెళ్ళి వారిని కలిశాడు. బ్యాంకు ద్వారా వాళ్ళు లక్ష రూపాయలు రుణం మంజూరు చేయించి దానిలో రూ.25 వేలు సబ్సిడీగా ఇచ్చారు. ఇప్పుడు స్టూడియోతోపాటూ, వీడియో మిక్సింగ్‌ను కూడా ప్రారంభించాడు. నెలకు అప్పువాయిదాలతో సహా అన్ని ఖర్చులుపోను ఇప్పుడు నికరంగా రూ.7 వేల దాకా వెనకేసుకుంటున్నాడు.

ఇదే మండలానికి చెందిన ఎస్.బావాజాన్ అనే మరో యువకుడు ఐటిఐలో ఫిట్టర్ చేసినా నిరుద్యోగిగానే మిగిలాడు. అతనుకూడా మైనారిటీ ఫైనాన్స్ ప్రోత్సాహంతో రూ.50 వేలతో టూవీలర్ మెకానిక్ షాప్ పెట్టుకున్నాడు. దీనిలోకూడా కార్పొరేషన్ రూ.25 వేలు సబ్సిడీ ఇచ్చింది. తల్లిదండ్రులు కూడా మరికొంత సాయం అందించారు. ఇప్పుడు బావాజాన్ తన షాపును చూసి తనే మురిసిపోతున్నాడు. రోజుకు ఐదారొందలు కళ్ళ చూస్తున్నాడు. కిస్తీలతో సహా అన్నీపోను నెలకు రూ.5 వేలు మిగులుతున్నదనీ, మా కుటుంబం అంతా



సంతోషంగా ఉందని ఒకింత గర్వంగా చెబుతున్నాడు.

మరో యువకుడు షేక్‌నయాజ్. ఇంటర్ పూర్తయింది. ఖాళీగానే ఉండేవాడు. తండ్రి ఒకప్పుడు డోర్ కర్టన్ల వ్యాపారం చేసినందువల్ల దాని లోతుపాతులు నయాజ్‌కు కూడా బాగా తెలుసు. కానీ పరిస్థితులు అనుకూలించక సగంలో ఆగిన



వ్యాపారాన్ని కొనసాగిద్దామంటే ఏ దిక్కూ కానరాలేదు. చివరకు స్నేహితులద్వారా తెలుసుకొని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారిని కలిసి అర్జీ పెట్టుకున్నాడు. వారు రూ.50 వేలు మంజూరు చేస్తూ అందులో రూ.25 వేలు సబ్సిడీకూడా ఇచ్చారు. ఇప్పుడు ఖర్చులన్నీ మినహాయించుకుంటే రోజుకు రూ.200లకు పైగానే మిగులుతున్నదనీ, ఇంటాబయటా అందరూ కార్పొరేషన్‌ను మెచ్చుకుంటున్నారని చెప్పాడు.

"ప్రభుత్వం అంటే ఎక్కడో ఉంటుందనుకుంటాం సార్. ఇలా ఒక ఫ్రెండ్‌లాగా భుజంమీద చెయ్యేసి నడిపిస్తుందనుకోలేదం"టూ నయాజ్ పొంగిపోతున్నాడు.

– బి.పద్మజ, మదనపల్లి

జన జాగృతి

వందే మాతర గీతం
ఆలపించ కదలి రావ !
దేశ ప్రజల సౌభాగ్యం
కాంక్షించి కలసి రావ !

చెడును తలచు దుష్టులకు
కను విప్పును చేయ రావ !
చేయి చేయి కలిపి నీవు
నీ శక్తిని చూప రావ !

ఉప్పెన వలె ఉరికి నీవు
మీసం మెలి వేయ రావ !

జగము మెచ్చు రీతి నీవు
మత మూఢుల నెదుర్కోవ !

నీతి పరుల కండగాను
నిలబడుటకు ముందురావ !
నీతి లేని వారి చీడ
లేకుండగ చేయ రావ !

గర్వంగా జాతి జెండా
విను వీధిన ఎగుర నివ్వు !
జనగణమన పాడి నీవు
జన జాగృతి చేయరమ్ము !

– బెలగాం భీమేశ్వర రావు

కొత్త భవనం ప్రారంభం

హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లో రూ. 11 కోట్లకు పైగా ఖర్చుతో నిర్మించిన సి.ఐ.డి. నూతన భవనాన్ని ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి జూలై ఒకటో తేదీన లాంఛనంగా ప్రారంభించారు. ట్రాఫిక్ పోలీసులకు కేటాయించిన నూతన ద్విచక్ర వాహనాలకు, ఇతర వాహనాలకు, ముఖ్యమంత్రి జెండా ఊపి స్వాగతం పలికారు. క్రైమ్ ఆఫ్ ఎ.పి. 2012 సి.ఐ.డి జర్నల్, సి.ఐ.డి. విభాగానికి చెందిన లోగోను సి.ఎం. ఆవిష్కరించారు.

పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ నిర్మించిన ఈ భవనంలో సి.ఐ.డి. పరిపాలనా విభాగం, క్రైమ్ విభాగం, ఆర్థిక నేరాల విభాగం, మానవ హక్కుల పరిరక్షణ (పి.సి.ఆర్)తో పాటు కోస్తా ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ జోన్‌లు ఉంటాయి.

ఈ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి శ్రీ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ... "మన రాష్ట్రంలో జోన్ల వారీగా ఉన్న సి.ఐ.డి. కార్యాలయాలు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం." అని అన్నారు.

రాష్ట్ర డి.జి.పి. శ్రీ దినేష్‌రెడ్డి మాట్లాడుతూ, "కానిస్టేబుల్ స్థాయి నుంచి డిజిపి వరకు ఒకరోజు వేతనాన్ని ఉత్తరాఖండ్ వరద బాధితుల సహాయార్థం సి.ఎం.రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తున్నాం. హోంగార్డుల వేతనాల పెంపుపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటాం" అని వివరించారు.

ముఖ్య ఘట్టాలు

చివరగా వేదికపై ఉత్తరాఖండ్ వరదబాధితుల కోసం వసూలైన విరాళాల మొత్తం రూ. 4 కోట్లను చెక్కు రూపంలో ముఖ్యమంత్రికి డి.జి.పి. అందజేశారు.

రాష్ట్రమంత్రులు శ్రీమతి గీతారెడ్డి, శ్రీ ముఖేష్‌గౌడ్,ఎం.పి. శ్రీ వి. హెచ్. హనుమంతరావు, కమీషనర్లు శ్రీ అనురాగ్ శర్మ, శ్రీ సి.వి. ఆనంద్, ఎ.సి.బి. చీఫ్ శ్రీ ప్రసాదరావు ఆర్టీసీ. ఎం.డి. శ్రీ ఎ.కె. ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అమర వీరుల పిల్లలకు కొత్త నిబంధనలు

పోలీసుల అమరవీరుల పిల్లలకు ఎం.బి.బి.ఎస్., డెంటల్ వృత్తి విద్యా కోర్సుల్లో 0.25 శాతం రిజర్వేషన్లు పొందేందుకు కాంపిటెంట్ అథారిటీ ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుతో జతచేయాలన్న కొత్త నిబంధన విధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జులై 19న తాజాగా ఉత్తర్వులు (జీవో.ఎం.ఎస్.నం.108) జారీ చేస్తూ ఎం.పి. అన్-ఎయిడెడ్ నాన్-మైనార్టీ ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రూల్ - 2007 ప్రకారం సవరణ చేసినట్లు పేర్కొంది.

రాష్ట్రంలోని అన్-ఎయిడెడ్ నాన్ మైనార్టీ కాలేజీల్లోని మెడికల్, డెంటల్ కోర్సుల్లో ప్రవేశాలు కోరువారు 'కాంపిటెంట్ అథారిటీ' ధ్రువీకరణ పత్రాన్ని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఎస్.ఐ.బి.) / డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (సి.ఐ.సెల్) నుంచి పొందాలని జీవోలో వివరించింది. పోలీసు అమరవీరుల పిల్లల (పి.ఎం.సి) కేటగిరీలో అభ్యర్థులు ఈ ధ్రువీకరణ పత్రాన్ని జత చేస్తేనే వారి దరఖాస్తుల పరిశీలించడం జరుగుతుందని జీవోలో స్పష్టం చేసింది.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కొత్త కోర్సులు

రాష్ట్రంలోని కొన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రస్తుత (2013-14) విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఇందుకు ఉన్నత విద్యా శాఖ ద్వారా జులై 19వ తేదీన ఉత్తర్వులు (జీ.వో.ఆర్.టి. నం. 548) విడుదల చేస్తూ వీటిలో మూడు రకాల కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు వివరించింది.

ప్రధానంగా బి.ఎ., బి.కాం, బి.ఎస్సీ ఫ్యాకల్టీల్లో కొత్త సెక్షన్లలో సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాతిపదికన రీస్ట్రక్చర్డ్ కోర్సులు నిర్వహించనున్నట్లు జీ.వో.లో తెలిపింది.

అలాగే సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాతిపదికన పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులను ప్రవేశపెట్టడం జరిగింది. ఎం.ఎ., ఎం.కాం., ఎం.ఎస్సీ కోర్సులుంటాయి. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, విజయవాడ, రాపూర్, పుత్తూర్, చిత్తూరు జిల్లా పీలేరు, శ్రీకాళహస్తి, రాజంపేట, ప్రొద్దుటూరు, అనంతపూర్‌లో రెండు కాలేజీలు, పత్తికొండ, వరంగల్, మహబూబ్‌నగర్, నర్సన్నపేట, జగిత్యాల, ఖమ్మం, సంగారెడ్డి పెద్ద పల్లిల్లోని మొత్తం ఇరవై ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పి.జి. కోర్సులు నిర్వహించనున్నట్లు జీ.వోలో వివరించింది.

అంతేకాక, డిగ్రీ స్థాయిలో కన్వెన్షనల్ కోర్సులను కృష్ణా జిల్లా ముప్వలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, మైలవరం, తూర్పుగోదావరి జిల్లా మండపేట, రాపూర్, ఉదయగిరి, చీరాల, అనంతపురం, మెదక్ జిల్లా సంగారెడ్డి, జోగిపేట, మహబూబ్‌నగర్, దేవరకొండ హైదరాబాద్‌లోని నాంపల్లి, ప్రభుత్వ డిగ్రీకాలేజీల్లో ప్రవేశ పెడుతున్నట్లు జీ.వోలో తెలిపింది.

ఎన్.ఎస్.ఎస్ సలహా సంఘం ఏర్పాటు

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని జాతీయ సేవా పథకానికి (ఎన్.ఎస్.ఎస్) సంబంధించిన రాష్ట్ర స్థాయి సలహా సంఘాన్ని పునర్ నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ద్వారా జులై 19వ తేదీన ఉత్తర్వులు (జి.వో.ఆర్.టి. నం. 550) వెలువరిస్తూ రెండేళ్లపాటు ఈ కమిటీ పని చేస్తుందని తెలిపింది.

ఈ సంఘానికి ఛైర్మన్‌గా ఉన్నత విద్యా శాఖ మంత్రి వైస్ ఛైర్మన్‌గా అదే శాఖ ముఖ్య కార్యదర్శి వ్యవహరిస్తారని జీవోలో పేర్కొంది. అంతేకాక ఈ సంఘంలో అన్ని యూని వర్సిటీల వైస్ ఛాన్సలర్లు, ఆర్&బి, వైద్య, ఆరోగ్య, ఆర్థిక, ప్రణాళిక శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులు, ఎ.పి. ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వాధికారులు సభ్యులుగా ఉంటారని జీ.వోలో వివరించింది. ☆



కమ్మరి సూరన్న కొలిమిలో తయారైన కత్తి మంగలి నూకరాజు చేతిలో మెత్తగా మారి చినకాపు పాపారావు గెడ్డం గీస్తున్న సమయంలో పాపారావు మేనల్లుడు సుందర్ చేతిలోకి రేజర్‌తో సహా సెవెన్ ఓ క్లాక్ బ్లేడు వచ్చేసింది...

మెత్తగా కాళ్ళను వత్తుతున్న చెప్పుల అనుభవంతో వెంకడి పనితనాన్ని స్టాఫ్ అంతటికీ తరచూ రికమెండు చేస్తూండే హెడ్మాస్టర్ దక్షిణామూర్తి కాళ్ళు ఓ రోజు నిగనిగలాడుతున్న నల్లబూటుల్లోకి దూరి పోయాయి.

ఐదు తరాల హీరో 'హేవలాక్ వంతెన'!

టక్-అప్‌లు, మెటల్ బొత్తాలు, సిల్కు చొక్కాలు, ట్వీడ్ పాంటులు... ఇలా మనుషుల వేషభాషలు... ఆలోచనలు... దృక్పథాలు.. రూపాంతరం చెందడంలో 'హేవలాక్' వంతెన పాత్ర, 5 తరాల పాటు గాఢంగా వుంది.

సోషల్ ఇంజనీరింగ్‌ను ఈ వారధి మౌలికంగా మార్చేసింది. జాతీయభావాన్నీ 'అభ్యుదయాన్ని' సంస్కరణనూ మనుషుల మధ్య బదిలీ చేసింది కూడా ఈ వంతెనే!

అదే పనిగా రుద్ధి కొండలనే కరగించి ఇసుకగా మార్చడానికి నదికి వేల సంవత్సరాలు పడితే, ఆంగ్లేయుల హిందూదేశపు ముఖ్యపట్టణం కలకత్తా, తూర్పుకోస్తాలో చెన్నపట్టణం మధ్య ప్రత్యక్షంగా- ఉత్తరాది, దక్షిణాదుల మధ్య పరోక్షంగా అనేక మార్పులను బట్వాడా చేయడానికి 'హేవలాక్ వంతెన'కు ఐదు తరాలు పట్టింది.

గోదావరి మీద కొవ్వూరు-రాజమండ్రిల మధ్య జవసత్వాలుడిగిన మొదటి వంతెనను ఒక స్మారకంగా కాపాడాలని ప్రజా ఉద్యమం గళం విప్పిన నేపథ్యంలో చారిత్రక వాస్తవాలను విశ్లేషిస్తే ఈ వంతెన రవాణా ఉపకరణంగా కంటే ప్రజల జీవితాల్లో పెనుమార్పుల వారధిగానే చివరివరకూ ఉపయోగపడిందని స్పష్టమౌతోంది.

1897లో వంతెన నిర్మాణం మొదలై కేవలం మూడేళ్ళలోనే ఇరవయ్యో శతాబ్దం మొదట్లో - అంటే 1900 సంవత్సరంలో వంతెనపై రైళ్ళ రాకపోకలు ప్రారంభమయ్యాయి.

న్యూస్ ఛానళ్ళూ మొబైల్ ఫోన్లూ లేని ఆ రోజుల్లో ఈ వంతెన ద్వారానే పారిశ్రామిక విప్లవా నంతర యూరప్ పరిణామాలూ, భారతదేశం లో స్వాతంత్ర్యోద్యమ భావాలు, సాంఘిక సంస్కరణలు బట్వాడా అయ్యాయి.

19వ శతాబ్దంలో (1800-1900 సంవత్సరాల మధ్య) బ్రిటీషర్లు మనదేశం నుంచి చవకగా వస్తువులను కొని యూరప్‌లో లాభసాటిగా అమ్ముకునే వ్యాపారం చేసేవారు. అందుకు పరిమితమైన వసతులు ఏర్పాటు చేసుకోవడం మినహా ఆ కాలంలో పెద్దగా మనదేశంలో మౌలికవసతులు ఏర్పాటు కాలేదు.

ఇంగ్లాండ్‌లో పారిశ్రామిక విప్లవం ఫలితంగా వస్తూత్పత్తి విపరీతంగా పెరిగిపోవడంతో వాటిని అమ్ముకోడానికి భారతదేశం పెద్ద మార్కెట్‌గా కనబడింది. దేశవ్యాప్తంగా పెద్ద నదులపై వంతెనలు కట్టాలని 1896లో బ్రిటీష్ ప్రభుత్వం నిర్ణయించి పనులు మొదలుపెట్టింది. 1900 సంవత్సరంలో దేశమంతటా ఒకేసారి 31 భారీ వంతెనలు ప్రారంభం కాగా, అందులో హేవలాక్ వంతెన ఒకటి. ఈ వారధులన్నీ కలసి అప్పటివరకూ ఎగుమతుల దేశంగావున్న భారతదేశాన్ని దిగుమతుల దేశంగా మార్చేశాయి.

మా తాత పెద్దాడ పేర్రాజు గారు (1873-1948) హయాంలో సిల్కు చొక్కా ట్వీడ్ ఫాంటు క్లాతింగ్‌కి బొంబాయి వెళ్ళవలసి వచ్చేదని చెప్పేవారని, అవే గుడ్డలు 1930ల్లో నిడదవోలు, భీమవరం, తాడేపల్లిగూడెం లాంటి పట్టణాల్లో దొరికేవనీ, రెండు అణాలకు సిల్కు చొక్కా, మూడున్నర అణాలకు ట్వీడ్ ఫాంటు కొనుక్కున్న అనుభవాన్ని మా నాన్న పెద్దాడ రామచంద్రరావు గారు (1911-1997) చెప్పారు.

ఈ విధంగా రవాణా వ్యవస్థ మెరగయ్యాకే రాజమహేంద్రవరం నల్లమందు హోల్‌సేల్ వ్యాపార కేంద్రమయ్యింది. ఏకంగా 'నల్లమందు సందు' అనే పేరు వచ్చిందంటే (వ్యాపారం లేకపోయినా ఇప్పటికీ నల్లమందు సందు వుంది) ఎంత వ్యాపారం జరిగేదో అర్థం చేసుకోవచ్చు. ఇదే సందులో ఇప్పటికి 'ఓకే స్టోర్స్' పేరుతో ఒక షాపింగ్ కాంప్లెక్సు వుంది. ఈ షాపుల్లో ఫ్యాన్సీ, ఎలక్ట్రానిక్, ఇంపోర్టెడ్ ఐటమ్స్ అమ్ముతారు.

లండన్‌లోని 'ఓకే స్టోర్స్' కంపెనీ పేరుతో రాజమండ్రి నల్లమందు సందులో ఒక షాపుపెట్టి దిగుమతి అయిన వస్తువులు అమ్మేవారని, సంపన్నులే ఆ వస్తువులు కొనగలిగేవారని వయోవృద్ధులు తమ చిన్న నాటి జ్ఞాపకాలను వివరిస్తారు.

వంతెనల వల్ల రైళ్ళు హోల్‌సేల్ వ్యాపార కేంద్రాలనీ, ఆ కేంద్రాల నుంచి కాల్వల వల్ల గూడు పడవలు రిటైల్ వ్యాపారాన్నీ పెంచాయి. ఈ విధంగా 20వ శతాబ్దం కన్స్యూమరిజం వ్యాప్తితోనే మొదలైంది. విద్యావ్యాప్తి కూడా జరిగింది. ఇది మన సోషల్ ఇంజనీరింగ్‌ను మార్చేసింది.

హౌరా నుంచి మద్రాసుకి వస్తువులతో పాటే కొత్త ఆలోచనలూ రవాణా అయ్యాయి. రైలు ప్రయాణాలంత వేగంగా రాజకీయాలు ఊపందుకున్నాయి. జాతీయోద్యమంలో ఊరూ వాడా సభలు, సమావేశాలు పెరగడానికి ఈ వంతెన ప్రముఖ సదుపాయమయ్యింది. కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం వంటి నాయకుల సంస్కరణ భావాలు, జాతీయ లక్ష్యాలు తూర్పు కోస్తా అంతటా ప్రభావం చూపించాయంటే గోదావరి దాటి ఎక్కడికైనా వేగంగా వెళ్ళిపోవడానికి వీపు పరచిన హేవలాక్ వంతెనే ముఖ్య కారణం!

అప్పటి మద్రాసు గవర్నర్ సర్ ఆర్థర్ ఎలిబంక్ హేవలాక్ పేరుని వంతెనకు పెట్టారు. చీఫ్

మేఘుమా! ఓ మేఘుమా

- హరిరమణ

నింగి వ్యాపించిన 'శ్వేతవర్ణపు' మబ్బులు
ఆకసాన దోబూచులాడుతూ,
సంద్రాన్ని మోసుకుని 'పయోధరాలై'
నింగి వ్యాపించి కరిమబ్బులై
తెలి, కరిమబ్బుల మోహాతిశయాలలో
జీవం 'ఊపిరి' పోయబడినదై,
'ఉరుములు -మెరుపులు' తోబుట్టువులై
నింగి నేలల అంతరాలు ఏకమై,
జాలువారిన 'అమృత ధారలై'
గ్రీష్మ తాపం నిండిన నేలమ్మ హృదయంపై
అమృత జల్లుల నిచ్చిన ఓ! మేఘుమా!
చిటపట చిటపట రాలిన
ఒక్కో చినుకు కలిసి ఏకమై,
గిరులపై ఝరీ ప్రవాహాలై
కొండా కోనలు స్పృశిస్తూ,
విహరించే గిరికా వసురాజులై,
ప్రేయసీ ప్రియులై 'వాగులై, వంకలై' -

జలకళలు సంతరించుకొన్న నేలతల్లి
జలకళల దర్పణాలలో తమ అందాల
మెరుగులు దిద్దుకుంటున్న తరుపు తరుణులు
ప్రకృతికాంత ఆరుద్రపుటద్దకాల
పచ్చకోక సింగారించినదై
వాల్జడలో విరిసిన మొగలిపూల సుగంధాలు
ఎటుచూసినా... గలగలల రాగాలు

కర్షకుల నిరాశ -నిస్పృహల
హృదయాలపై సాంత్వన జల్లువై
ముదమారగ హలం పట్టిన రైతన్నలు
నీ రాకతో! పచ్చని పైరుల కళకళలు
కలుపు తీసేవేళ శ్రమజీవుల రాగాలు,
ఆకలి దప్పులు దీర్చి
జీవమిచ్చే ఓ! మేఘుమా!
మాకోసమై కరిగిపోయి నీ తొలి
కాన్పువానమ్మను మాకు ధారపోసిన
ఓ మేఘుమా! మేఘుమా
నీకేమిచ్చి రుణం తీర్చుకోను,
మరుజన్మలో పిల్ల తెమ్మెరనై
నీలోకలిసిపో వరాన్ని నాకొసగుమా! ఓ మేఘుమా!

☆



ఇంజనీర్ ఫ్రెడ్రిక్ థామస్ గ్రాన్ విల్లే వాల్టన్ ఈ రైల్వే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మూడేళ్ళు పట్టిన ఈ నిర్మాణం అంచనా వ్యయం 50 లక్షల రూపాయలు కాగా (మద్రాసీ) కాంట్రాక్టర్ 47 లక్షలకే పనిపూర్తి చేశారట! నీటి ప్రవాహవేగాన్ని లెక్కగట్టి వందేళ్ళు వుంటుందన్న అంచనాలతో అద్భుతమైన ఇంజనీరింగ్ ఫీట్‌గా రాయి, సున్నాలతో స్టీలు గర్డర్లతో కట్టిన హేవలాక్ వంతెనపై రాకపోకలను సరిగ్గా వందేళ్ళకు 1997లో నిలుపుదల చేశారు.

రైల్వే శాఖ ఈ వంతెనలో ఇనుమును వేలం వేయాలని ప్రతిపాదించింది. గర్డర్లు తొలగించాక రాతిస్థంభాలు కాలక్రమంలో నదిలోకి ఒరిగి పోతాయి.

హేవలాక్ వంతెనను పరిరక్షించాలని, టూరిస్టు కేంద్రంగా వృద్ధి చేయాలనీ, జాతీయ స్మారకంగా వుంచాలనీ రాజకీయాలకతీతంగా ఉద్యమ నిర్మాణానికి ప్రజలను కూడగట్టే ప్రయత్నాలు రాజమండ్రిలో మొదలయ్యాయి. ఈ స్ఫూర్తికి అనుగుణంగానే కేంద్ర పర్యాటక శాఖా మంత్రి శ్రీ చిరంజీవి ఇటీవల ఒక ప్రకటన కూడా చేశారు.

హేవలాక్ వంతెన సంస్కృతినీ దృక్పథాలనీ దేశమంతటికీ రవాణా చేసిన వారధి అవ్వడం వల్లే వంతెన కూల్చివేత ఆలోచనే ఒక ఉద్వేగమౌతోంది.

ఏ కథైనా ఆసక్తికరమే. సమాజం చరిత్ర కంటే ఆసక్తిదాయకమైన కథ వుండదు. శరవేగంగా మార్పులను అందుకుని అందుకు అనుగుణంగా తనను తాను మలచుకున్న తూర్పుకోస్తా ప్రయాణానికి గోదావరి అడ్డుపడినప్పుడు మౌనంగా వీపున మోసిన 'హేవలాక్ వంతెనే' ఐదు తరాల కథకు అసలైన హీరో!

ఈ జ్ఞాపకాల ఉద్వేగాన్ని భౌతికరూపంతో ఒక స్మృతి చిహ్నంగా మార్చుకోవడం చిన్న విషయం కాదు. అది విజయవంతమైతే చరిత్రను పదిలపరచుకునే దారికి కూడా హేవలాక్ వంతెన మళ్ళీ వారధే అవుతుంది.

- పెద్దాడ నవీన్

96180 22444



– తెలిదేవర భానుమూర్తి

ఇంటే ఆమె పాటలే ఇనాలె

దినం పూట మా వాడకట్టుకు వచ్చెతందుకు అందరు బయపడుతున్నరు. పండ్లు అమ్మెటోల్లు వొస్తలేరు. కూరలబండి లొస్తలెవ్వు. బిల్లు ఇచ్చెతందుకు కరెంటోల్లు వొస్తలేరు. కారట్లు ఇచ్చెతందుకు పోస్టు మ్యానొస్తలేడు. ఆటోలు గిట్లొచ్చి గట్ల బోతున్నయి. బిచ్చపోల్లు వొస్తలేరు. ఆకర్కి కాకులు గూడ మొగులు మీదికెల్లి మొగులు మీదనే బోతున్నయి. గని తప్పి జారి కిందికొస్తలెవ్వు. మా వాడ కట్టుల జరూర్ పని బడ్తెనే తల్పులు దెరుస్తున్నరు. ఉత్తప్పడు తల్పులు బిర్రుగ బెట్టుకోని ఇండ్లల్లనే గూసుంటున్నరు. కొత్తోలు గినొసై బుగులు బడి ఒక్కొటే ఉర్కుడు. ఇంతకు ముందు గా పని మీద గీ పని మీద సుట్టాలొచ్చెటోల్లు. గని గిప్పుడు రమ్మన్నా వొస్తలేరు. ఒగాల్ల వొచ్చినా ఉండుమన్నా ఉంటలేరు.

ఇంతకు మీ వాడకట్టు కేమైంది. మీ వాడకట్టుల దెయ్యమున్నదా ? బూతమున్నదా ? బాంబు గోల లున్నాయా ? మందు పాతర్లున్నయా ? ఏ మున్నయి? అందరు ఒక్కతీర్గ ఎందుకు బయపడున్నరు. అని ఎర్కలేనోల్లు అడుగుతుంటరు. మా వాడకట్టుల దెయ్యం లేదు. బూతం లేదు. బాంబు గోలలు గూడ లెవ్వు. గని ముత్తులక్ష్మి ఉన్నది. గామె మల్లె పువ్వు లెక్కుంటది. గామె నవ్వును జూసి చిల్కలు గూడ సిగ్గుబడుతుంటయి. గామె బజార్లకెల్లి బోతుంటె అందరు గామెనే జూస్తుంటరు.

ముత్తులక్ష్మి– రామన్ పెండ్లాం. గాల్లకు ఆ నడ్మనే పెండ్లి అయ్యింది. రామన్‌కు మా వాడకట్టుల సొంతిల్లున్నది. రామనోల్లు నిజాం జమానల కెల్లి మా వాడకట్టులనే ఉంటున్నరట. ముత్తులక్ష్మి సక్కదనం చూసే రామన్ గామెను పెండ్లి జేస్కున్నడు. సూస్తె గామెనె సూడాలె. తింటె వొంకాయ కూరనే దినాల అని కొందరంటున్నరు.

బంగారి బొమ్మసుంటి గామెను జూసి అందరెందుకు బయపడుతున్నరు. గామెను జూసి ఎవ్వరు బయపడ్తలేరు. గామె పాట ఇనే అందరు బయపడుతున్నరు.

ముత్తులక్ష్మి పాట గిన పాడితే పిండి గిర్ని సప్పుడు లెక్కుంటది. సైలెన్సర్ లేని మోటరు సైకిల్ మోత లెక్కుంటది. బోరు ఏస్తుంటె వొచ్చేటి సప్పుడు లెక్కుంటది. మొగడు గిట్ల దప్తర్‌కు బోంగనే గట్ల ముత్తులక్ష్మి పాటలు షురువు జేస్తది. గామె 'సామ జ వర గమనా' అని పాటందుకోంగనే మా వాడకట్టు ఆడోల్లు 'సచ్చింది గొర్రె' అన్కుంట తల్పులు బెట్టుకుంటరు. కిట్కిలు గూడ బంద్ జేసి చెవులల్ల దూది బెట్టుకుంటరు. గామె పాడుడు బంద్ జేసినంక తల్పులు దీస్తరు. మొగడున్నప్పుడు గామె పాడదు. రాత్రిపూట గూడ బాడదు.


పెండ్లి సూపులప్పుడు –

"మీ బిడ్డకు పాటలొస్తయా ?" అని రామన్ అమ్మ అడిగింది.

''వొస్తయి'' అన్కుంట ముత్తు లక్ష్మి పాడబోతె గామె నాయిన పాడ నీయలేదు.

మీదికెల్లి – ''మా బిడ్డకు సరింగ పాడరాదు" అని జెప్పిండు.

వొకాల్ల గప్పుడు ముత్తు లక్ష్మి పాడుంటె రామన్ గామెను పెండ్లి జేస్కునేటోడు గాదు. పెండ్లయినంక గూడ గాయిన ముంగల పాడేటి మోక గామెకు దొర్కలేదు. గామెకు చిన్నప్పటి సంది పాడాలనేటి షోకుండేంది. సంగీతం నేర్పియ్యమని గాల్ల నాయినను గామె ఒక్కతీర్గ అడిగింది. గని గాయిన గామెకు సంగీతం నేర్పియ్యలేదు. గాడ ఇని గీడ ఇని ఎట్లబడ్తె గట్ల గామె పాడ బట్టింది. మంది పానం దినబట్టింది.



ముత్తులక్ష్మి పాటలు బాడుకుంట పానం దింటుంటె వాడకట్టోల్లు ఊకుంటరా ? ఆర్గీజ్ ఊకోరు. కొంతమంది ఆడోల్లు గామె తాన్కి బోయింద్రు. గాల్లనుజూసి నవ్వుకుంట ముత్తులక్ష్మి –

"రాంద్రి, కూసోంద్రి" అని అన్నది.

''మేము కూసునే తందుకు రాలేదు" అని ఒగామె అన్నది.

"ఏందొదినే గట్లంటున్నవు ?" అని ముత్తులక్ష్మి అడిగింది.

"నువ్వు పాటలు బాడుకుంట మా పానం దింటుంటె ఎట్లనుమంటవు" అని గామె అన్నది.

"మా ఇంట్ల నేను గున్ గునాయిస్తే మీకేం బాద" అని ముత్తులక్ష్మి అడిగింది.

"నీకు గున్ గునాయించి నట్లున్నదేమొ గని మా దమాక్ కరాబైతున్నది" అని ఇంకొకామె అన్నది.

"మీ తాన్కి ఎవ్వరన్న వొచ్చి దమ్ము దీస్కోవొద్దు అంటె మీరు దమ్ము దీస్కోకుంట ఊకుంటరా ?. పాటలు నాకు దమ్మసువంటియి. నేను పాడకుంట ఊకునే సవాలే లేదు" అని ముత్తులక్ష్మి అన్నది.

"ఆకరి సారి అడ్గుతున్నం. పాటలు బంద్ జేస్తవా? లేదా" అని ఆడోల్లు అడిగింద్రు.

"చెయ్య" అని ముత్తులక్ష్మి అన్నది.

"గీమె తెగిడ్సింది. తెగిడ్సినోడికి తెడ్డే లింగం" అన్కుంట ఆడోల్లు బోయింద్రు.

వాడకట్టు ఆడోల్లు ఊకోలేదు. రాత్రి పూట ఎవ్వరి మొగనితోని ఆల్లు ముత్తులక్ష్మి పాటల గురించి జెప్పింద్రు. ఇక దాంతోని అందరి దిక్కుకెల్లి ఒక ముస్లాయిన రామన్‌ను గల్సిండు.

వానతల్లికి వందనం



గ్రీష్మతాపవు సుడిగాలి ఫీంకరించి
పుడమి బీటలు వారంగ పుక్కిలించె
పేదబ్రతుకుల హృది రాగ ప్రేగుల కట
నీటి చుక్కల కోసమై నీల్గుచుండె!

తరువులన్నియు వానకై తపముజేసి
కృంగి కృశియించి చూచెను నింగికేసి
కనికరము లేదు కాబోలు కాలమహిమ
రాలలేదొక్క చినుకైన జాలువార!

విరుల సొగసులు మొగ్గలో విహ్వలింప
కాంత కన్నులు కన్నీటి కడవలయ్యె!
వరుణ దేవుడు కాడయ్యె కరుణమూర్తి
జగతి ప్రకృతి యేరీతి ప్రగతి గొనును!!

కర్షకుని యింట జాబిల్లికాంతులీన
కార్మికుని కంట అనురాగ పేర్మివిరియ
నీలి మేఘాల మాలవై జాలిచూపి
ఆదుకొనుమమ్మ కారుణ్య ఆత్మవగుచు!

ఉల్లమున శాంతి రేకలు పల్లవించి
సకల సృష్టికి సౌందర్య సమతలద్ది
మానవాళికి మాధుర్య మమతనిచ్చి
ప్రణయ రాగాల రాణివై పలుకరించు
వానతల్లికి స్వాగత వందనంబు!!

- సి.కామేశ్వర రావు

"ఏం కాకా బాగున్నవా ?" అని రామన్ అడిగిండు.

"బాగున్న, గని నీ పెండ్లాం పాటలతోని వాడకట్టు ఆడోల్లందరికి తల్కాయ నొప్పి లేస్తున్నదట. జెర గామెకు పాటలు బంద్ జెయ్యమని జెప్పు" అని గాయిన అన్నడు.

"తప్పకుంట జెప్త కాకా" అని రామన్ అన్నడు.

గాయిన జెప్పె దాంక ముత్తులక్ష్మి గంత గనం గలీజ్గ బాడ్తదన్న సంగతి రామన్‌కు ఎర్కలేదు. ఆడోల్లు మంగలారతులు బాడ్తుంటరు. పెండ్లిలల్ల బాడ్తుంటరు. గని బువ్వదిన్న తీర్గ దినాం ఎవ్వరు బాడరు. రామన్‌కు పెండ్లాం మీద బగ్గ కోపమొచ్చింది. జల్ది జల్ది ఇంటికి బోయిండు.

"ముత్తులక్ష్మి !" అని కేక బెట్టిండు.

గని గామె నవ్వు మొకం సూసె తల్కె సల్లబడ్డడు.

"ఏంది లాసిగ బిల్సినవు ?" అని గామె అడిగింది.

"దినాం పాటలు పాడుకుంట వాడకట్టోల్లకు చైను బట్టకుంట జేస్తున్నవట" అని రామన్ అడిగిండు.

"నేను ఆకిట్ల గూసోని బాడుతున్ననా ? వాడకట్టుల దిరుక్కుంట బాడుతున్ననా ? మనింట్ల గూసోని బాడుతున్న. మనింట్ల గూసోని బాడుతుంటె వాడకట్టోల్ల కేం బాద" అని ముత్తులక్ష్మి అడిగింది.

"గదంత నాకెర్కలేదు. రేపటి సంది నువ్వు పాటలు బాడ్తివా అంటే మంచి గుండదు" అని రామన్ అన్నడు.

"మంచిది పాడ తియ్యి" అని ముత్తులక్ష్మి అన్నది.

మొగని కిచ్చిన మాట మీద కొన్ని దినాలు పాటలు బంద్ జేద్దామని గామె అనుకున్నది. అనుకునుడే గాకుంట నిజంగనే పాడకుంట ఊకున్నది. గామె పాటలు బంద్ జేయ్యంగనే వాడకట్టు ఆడోల్లందరు పండ్గ జేస్కున్నరు.

ముత్తులక్ష్మికి తల్లిగారింటికి బోయే పని బడ్డది. రామన్‌ను యెంబడి రమ్మని గామె అడిగింది. దప్తర్ల పని మస్తుగుండె బట్కె గామె ఒక్కతే తల్లిగారింటికి బోదామనుకున్నది. బస్సు డిపోకు బోయింది. బస్సెక్కింది. బస్సు పట్నం దాటింది. పంట చేన్లు దాటింది. అన్ని దాటి అడ్విల కెల్లి బోబట్టింది. సల్లగ గాలి గొట్ట బట్టింది. సరింగ గప్పుడే ముత్తులక్ష్మికి పాడాలని పిచ్చింది.

రెండు మూడు దినాల సంది గామె పాడకుంట ఊకున్నదామె. బల్మీకి బంద్ జేసిన పాటలన్ని నోట్లెకు రాబట్టినయి. ఆమె పాటందుకున్నది. బస్సుల ఉన్నోల్లందరి చెవులు అదిరినయి. పాటలు బంద్‌జేస్తవా లేదా అని కొందరు గామెను బెదిరించ్చింండ్రు. ఎవ్వరు బెదిరిచ్చినా గామె పాటలు బంద్ జెయ్యలే... . గామె పాటలకు చిన్న పోరగాల్లు గజ్జున వొన్క బట్టింండ్రు. ఏడ్వబట్టింండ్రు. ఎవ్వరు ఏడ్సినా, ఎవ్వరు మొత్తుకున్నా ముత్తులక్ష్మి పాటలు బంద్ జెయ్యలేదు.

మీది కెల్లి ఎవ్వరు ఇంతకు ముందు ఇనని రాగాలల్ల పాటలు పాడబట్టింది. బస్సులున్నోల్లందరు చెవులు మూస్కున్నరు. కొందరు బిర్రుగ దస్తీలు గట్టుకున్నరు. ఒగాయిన దేవర్ తాన్ని బోయిండు.

"బస్సు రుకాయించు. పాటలు పాడెటామెను బస్సుల కెల్లి దించు" అని గాయిన అన్నడు.

"ఆడామెను అడ్విల దించుతె యాడికి బోతది. ఏదన్న ఊరొచ్చినంక బస్సు రుకాయించి గామెను దించుదాం" అని దేవర్ అన్నడు.

"ఊరొచ్చినంక అమీన్ కచేరి కాడ బస్సు రుకాయించి, పాటలతోని మమ్ములను ఒక్కతీర్గ సతాయిస్తున్న గామెను పోలీసులకు పట్టిస్తం" అని గాయిన అన్నడు.

"నువ్వొక్కనివి అనంగానే అయిపాయెనా ?" అని దేవర్ అన్నడు.

"బస్సులున్న అందరి దిక్కుకెల్లి నేను మాట్లాడుతున్న" అని గాయిన అన్నడు.

ఊరొచ్చినంక అమీన్ కచేరి ముంగట దేవర్ బస్సు రుకాయించిండు. ముత్తులక్ష్మిని బస్సుల కెల్లి దించింండ్రు. పోలీసులకు వొప్పజెప్పింండ్రు. అమీన్ కచేరీల ఉన్నా గామె ఊకోలేదు. ఒక్క తీర్గ పాటలు బాడ్తనే ఉన్నది. గామె పాటలకు పోలీసోల్ల దమాక్లు గూడ కరాబైనయి. చెవుల పని జెయ్యకుంట బోయినయి. గాల్లు నెత్తి గొట్టుకున్నరు. కొందరైతె వామ్మో ! అన్కుంట కిందబడి దొర్లింండ్రు.

"అమ్మా ! నీకొక దండం. నీ పాటల కొక దండం. పౌరన్ ఈడికెల్లి బో అమ్మా" అని అమీన్ సాబ్ అన్నడు.

పోలీసోల్లు ముత్తులక్ష్మిని అమీన్ కచేరీల కెల్లి అవుతలకు తీస్కబోయి ఇడ్సిపెట్టింండ్రు. గీ తీర్గ గామె మషూరైంది. ఇగ దాంతోని మొండి బాకిలు వసూలు జేసెంతందుకు ఒక బేంకు గామెకు కొల్వు ఇచ్చింది. ☆



నేస్తమా! ఇక సెలవు !!

నమస్కారమండీ!

బాగున్నారా?

ఏంటి... అలా చూస్తున్నారు? వీడెవడురా మనని పలకరిస్తున్నాడని ఆశ్చర్యపోతున్నారా?

నేనండీ! నన్ను గుర్తు పట్టలేదా?

అవున్లేండి... ఇప్పుడు మీకు నేనెందుకు గుర్తుంటాను.

అయినా, మీకిప్పుడు నా అవసరం లేదుగా! అందుకేనేమో... 'ఏరు దాటిందాకా ఓడమల్లయ్య, ఏరు దాటిం తర్వాత బోడి మల్లయ్య' అనే సామెత వచ్చింది!


ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. నేనెవరో మీకే తెలుస్తుంది...

పాతికేళ్ళ క్రితం దూరంగా నగరంలో ఉన్న మీ అబ్బాయి జాడ తెలియక, ఎప్పడొస్తాడా అని మీరు ఎదురు చూస్తూ బాధపడుతుంటే, మీ బాధ చూడలేక ఫలానా రోజున వచ్చేస్తున్నాడని హైదరాబాద్‌లో ఉన్న మీకు తీపికబురు అందించిందెవరూ?

నేనే కదండీ!

మీరు మరచిపోయినా నాకింకా గుర్తుంది.

ఆ రోజు ఇంటి ముంగిట మెట్ల దగ్గర నాకోసం ఎదురుచూస్తూ మీరు నిల్చోలేదూ... నేను రావటం కొంచెం ఆలస్యమయ్యేసరికి కంగారుపడుతూ, ఎదురుచూస్తూ, ఇంట్లోకి, వీధిలోకి ఎన్నిసార్లు పచార్లు చేశారో మర్చిపోయారా?



అవున్లేండి... మీకు నేనెందుకు గుర్తుంటాను !

మీ పెద్దమ్మాయికి పెళ్ళిచూపులై, పెళ్ళివారు ఏ సమాచారం చెప్పకుండా వెళ్ళిపోతే, పెళ్ళివారి 'అభిప్రాయం' ఏమిటో నేనొచ్చి చెపుతానని మీరు వీధి గుమ్మంలో కళ్ళు కాయలుకాచేలా ఎదురుచూసిన రోజులు మీరు మరచిపోయినా నాకు బాగానే గుర్తుంది.

నేనేకదండీ... పెళ్ళికొడుక్కి మీ అమ్మాయి భేషుగ్గా నచ్చిందన్న వార్త మీ చెవిన వేసింది. నేనామాట చెప్పగానే మీరు ఎంత ఆనందపడ్డారో, మీ ముఖం చంద్రబింబంలా ఎలా వెలిగిపోయిందో నేనెలా మరవగలను. నేను ఈ శుభవార్త మీ చెవిన వేయగానే "ఏమేవ్... మన అమ్మాయి మగ పెళ్ళి వారికి నచ్చిందట. రేపే మిగతా విషయాలు మాట్లాడుకోవడానికి వస్తారట" అంటూ మీరు మీ ఆవిడకి కేకలేసి చెప్పడం, ఓ 'శుభకార్యం' చేశానన్న తృప్తితో నేను వెనుదిరగటం... ఇదంతా గడచి ఓ పాతిక ముప్పై ఏళ్ళయింది.

ఏమండోయ్... ఇప్పుడే మరో విషయం కూడా గుర్తొచ్చింది.

మీ రెండో అబ్బాయికి బ్యాంకులో ఉద్యోగానికి ఇంటర్వ్యూ వస్తే ఆ సమాచారం కూడా మీకు చెప్పింది నేనేగా.

అప్పుడు మీరు ఓ మాట కూడా అన్నారు. గుర్తుందా?

"ఒరే అబ్బాయి.. నీవు కనుక ఈ సమాచారం ఇవ్వడం రెండు రోజులు ఆలస్యమైతే, మా అబ్బాయికి ఇంటర్వ్యూ సమయం దాటిపోయేది, ఉద్యోగం కాస్తా రాకుండా పోయేది" అని, అప్పుడు నాకు చాక్లెట్ కూడా ఇచ్చి నా నోరు తీపి చేశారు. ఈ విషయం మీరు మరచిపోయినా చాక్లెట్ తిన్న నేను మాత్రం మరచిపోలేదు.

అందాకా ఎందుకూ... మీ రెండో కోడలు విశాఖపట్నంలో బంగారం లాంటి మగబిడ్డను కంటే, అందరికన్నా ముందుగా ఆ విషయం మీకు ఇంటికి వచ్చి మరీ చెప్పింది నేను కాదుటండీ!

అప్పుడు తాతగారైన ఆనందంలో నన్ను మరచిపోయుంటారు.

అయ్యో రామ! వృద్ధాప్యంతో నా రూపురేఖలు మారిపోవడం వల్ల, అంతకంటే ముఖ్యంగా ఇప్పుడు నా అవసరం మీకు ఏ మాత్రం లేకపోవడం వల్ల మీరు నన్ను గుర్తించినట్టు లేరు.

అయినా... ఏం చేస్తాం! నా రోజులు బాగాలేవు. ఇంతకాలం మీకు సేవచేసిన నేను నా ఉనికి గురించి మీకు గుర్తుచేసుకోవలసి రావడం నా దురదృష్టం. అందులోనూ ఇప్పుడు అసలు నా ఉనికినే కోల్పోతున్నవాణ్ణి...

అసలు విషయం చెప్తా... వినండి!

ఇప్పుడు నా వయస్సు ఎంతనుకోంటున్నారు. 160 ఏళ్ళు పైనే. నమ్మడం లేదా? అవున్లేండి. మీకంటే ముందరపుట్టిన వాణ్ణి, నా వయస్సు మీకెలా తెలుస్తుంది.

అటు బ్రిటీషు వారి కాలం నుంచి ఇప్పటిదాకా శుభవార్తలు, అశుభవార్తలు ఏన్నో మీకు చేరవేసి, అలసిసొలసి పోయాను. నేను యవ్వనంలో ఉన్నప్పుడు మీరంతా నా వెంట పడ్డవారే. నా కోసం క్యూలు కట్టినవారే!

1850లో భారతదేశంలో నేను పుట్టాను. పుట్టీ పుట్టగానే, పసిగుడ్డుగా ఉండగానే అన్ని నగరాలూ తిరుగుతూ సమాచార వారధిగా నిలిచాను.

2013 జూలై 15 అర్ధరాత్రి నుంచి 'టెలిగ్రాం' సేవలను పూర్తిగా రద్దు చేసిన సందర్భంగా . . .

కింకర్తవ్యం

- కాటేపల్లి లక్ష్మీనరసింహ మూర్తి

కిం కర్తవ్యం ?
పాంచ భౌతిక ప్రకృతి శోభతో
శతాబ్దాలుగా ఓంకార శ్రవణం
ఆదిదేవ ఆశ్రయ యోగం
తురీయాశ్రమంలోని ముముక్షువుల
దివ్య పథదర్శనంతో
అలౌకికానుభూతిలో ఉన్న కేదారాన్ని,
నేడు...
ఆధ్యాత్మిక యానంలో అకస్మాత్ప్రళయంతో-జలస్ఫోటకంలో
అరిచే, అర్థించే, ఆదుకునే, అదుపు జేసే
క్షణాల సమయం కూడా లేకుండా
కైలాసం చేరి కొందరు...
గాలి, నీరు, ఆహారం కరవై,
ఆప్తులు చూస్తుండగానే దూరమై
శ్వాస, తృష్ణ, క్షుత్తులు ప్రాణాలను
పీల్చేస్తుంటే...
వైరాగ్యం, నైరాశ్యం, ఆశక్తతలతో
ఆక్రోశిస్తున్న అమాయక జీవులెందరో...
జాతి, కుల, మత, ప్రాంత, భాషాభేదాలను వదలి
జీవన వేదన అనుభవిస్తున్న... ఎందరినో
చూసి, హృదయం చలించి దేహంలో బందీయై
'వారినాదుకోలేని ఆశక్తత ఏమిటి ?'
అన్న నా ప్రశ్నకు 'నాధుడు'
"ఎక్కడెక్కడో ఎన్నో విధాలుగా బాములు పడి,
పరమపదించే వారందరు ఒక్క చోటనే
జరగటం... అనివార్యం.
నిర్మాణాలు, నిర్వహణలు, నిర్ణయాలు, నిశ్చయాలు
నిస్వార్థంగా ఉంటే మానవకోటికి క్షేమకరం-
నీ నిర్మాణమే అందుకు సాక్ష్యం-
నిన్ను చేరేవారిని ప్రశాంత చిత్తులను చేస్తూ
హైందవ జ్యోతిని అఖండంగా వెలిగిస్తూనే
ఉండటమే నీ కర్తవ్యం"...
అన్న సందేశం
సర్వదా శిరోధార్యం -



హైదరాబాద్, కోల్‌కత్తా, ముంబై, ఢిల్లీ, మద్రాసు, ఇలా చెప్పుకుంటూ పోతే నేను తిరగని నగరం లేదు. నేను కొంచెం పెద్దయ్యాక జిల్లా కేంద్రాలు, చిన్న చిన్న గ్రామాలను కూడా చేరుకోగలిగాను.

ఎక్కడ ఎవరికి ఏ అవసరం వచ్చినా, ఎక్కడి నుంచి ఎక్కడికైనా, ఎవరి నుంచి ఎవరికైనా, మంచి, చెడు అన్న తేడా లేకుండా మీరిచ్చిన సమాచారాన్ని మీరిచ్చినట్టుగా అవతలవారికి అందిస్తూ మీ అందరి మన్ననలూ పొందాను.

నేను చెప్పుకుంటే 'గొప్పలు' చెప్పుకున్నట్టు ఉంటుంది. కానీ, దేశంలో ఎన్ని పత్రికలకు నేను 'రిపోర్టర్'గా పనిచేశానో తెలుసా. అప్పట్లో నేనేమైనా 'సమాచారం' అందిస్తే చాలు, ఆయా పత్రికల్లో ప్రముఖంగా ప్రచురించే వాళ్ళు.

చెప్పకూడదు గానీ... పత్రికలేంటి.. నాకు ఎన్నో సినిమాల్లో నటించిన అనుభవం కూడా ఉంది.

చెప్పానుగా... ఇప్పుడంటే వృద్ధాప్యం మీదపడి వేషాలు రావడం లేదుగానీ, పాత సినిమాలు ఓ సారి తిరగెయ్యండి. నేను ఎన్ని సినిమాల్లో నటించిందీ మీకే తెలుస్తుంది. తండ్రి, కొడుకుల మధ్య, ప్రేమికుల మధ్య, భార్యాభర్తల మధ్య ఇలా.. నేను ఎన్ని రాయబారాలు నడిపానో ఆ సినిమాలు చూసిన వాళ్ళకి గుర్తుండే ఉంటుంది.

అయితే ఒక్క విషయం, నిర్మాతలు నాకు ఎన్ని సినిమాల్లో వేషాలు ఇచ్చినా అన్నీ గెస్ట్ (అతిథి) పాత్రలే. అయినా ఎందుకు ఒప్పుకున్నానో తెలుసా. నా ప్రవేశంతో ఆ సినిమా కథే పెద్ద మలుపు తిరిగేది. అందుకే, 'పాత్ర' చిన్నదైనా 'ప్రభావం' గొప్పగా ఉంటుందని ఆ సినిమాలన్నీ అంగీకరించా.

అయినా... ఇప్పుడు నన్ను సినిమాల్లో నటించడానికి పిలిచేవాళ్ళు లేరు, నాకు ఓపికా లేదు. అదంతా గతం!

చివరిగా ఒకమాట...

నేను మీకు ఎన్ని శుభవార్తలు అందించి మిమ్మల్ని ఆనందపరచినా, అప్పుడప్పుడు మీకు 'దుర్వార్తలు' కూడా అందించి మీ మనసు కష్టపెట్టాను. అది మనసులో పెట్టుకొని నన్ను తిట్టుకోకండి. మీరు ఆనందించినప్పుడు నేను ఎంత సంతోషిద్దానో, మీకు బాధ కల్గించినప్పుడు కూడా అంతగా విచారించా. కానీ, ఏం చేస్తాం చెప్పండి. నా విధులు నేను నిర్వర్తించాలిగా మరి!

గత వైభవాన్ని మనసునిండా నింపుకొని, గుండెబరువుతో మీ అందరి దగ్గరా సెలవు తీసుకొని వెళ్తున్నా...

మీకు ఇంతకాలం సేవలందించిన నేను కోరుకొనేది ఒక్కటే... నన్ను మాత్రం మరచి పోకండి. నా ఉనికి ఉన్నా లేకున్నా నా గురించి మీ ముందు తరాల వారికి కూడా కొంచెం చెప్పండి.

ఇక వస్తా! నాకు టైమైంది మరి!

మీకు ఎప్పటికీ గుర్తుండిపోవాలని కోరుకుంటూ...

నేస్తమా? ఇక సెలవా మరి!!

మీ మాజీ సేవకుడు

టెలిగ్రాం

- కె.ఎస్. శాస్త్రి

తెలుగు పలుకుబడులు-13

తరచుగా కనబడే అపభ్రంశాలు

❀ ***భిన్నాభిన్నమైంది :*** ముక్కలు చెక్కలు అయింది, చెల్లా చెదురైంది అనే అర్థంలో వాడుతుంటారు. తత్సమ పదాలను తెలుగులో వాడుతున్నపుడు యిష్టం వచ్చినట్టు మార్చకూడదు. ఛిన్న భిన్నం అని మాత్రమే వాడాలి. కాని తెలుగులో వున్న చెల్లా చెదురు, తునాతునకలు, పటాపంచలు లాంటి మాటల్లో మొదటి మాట మీది దీర్ఘాన్ని ఛిన్నా భిన్నంలో కూడా వాడేస్తున్నాం. ఇది అలవాటులో పొరబాటు.

❀ ***అంతర్జాతీయ సదస్సు :*** అనేక దేశాల ప్రతినిధులతో జరిగే సభ అని అర్థం. అంతరాష్ట్ర క్రీడలు, అంతర్ కళాశాల పోటీలు లాంటి ప్రయోగాలను చూస్తుంటాము. కళాశాల విద్యార్థుల మధ్య, రాష్ట్రాల నడుమ అనే అర్థంలో అంతర్ శబ్దాన్ని వాడుతున్నారు. ఇది ఇంటర్ నేషనల్, ఇంటర్‌స్టేట్ పదాల తెలుగింపు. ఇక్కడ ఇంటర్ అంటే నడుమ అనే భావం స్ఫురిస్తోందా అని ఆలోచించాలి. ఇంటర్ నెట్‌ని అంతర్జాలంగా వ్యవహరిస్తున్నారు. ఈ పదాలు యిప్పటికే ప్రజల నాల్కల మీద పీఠం వేశాయి. కనుక నిఘంటువులలో వాటిని పెట్టుకోవాలి.

❀ ***ఫలానా చర్య అమానుషం:*** అంటే మనిషి చేయతగిన పనికాదు అనే అర్థంలో వాడతారు. ఇది సరైన ప్రయోగమే. ఇక్కడ ఒక ఉదాహరణ చెప్పాలి. చాలా రోజుల క్రితం ఒక తమిళ మిత్రుడు నన్ను కలవడానికి జూబ్లీహిల్స్ నివాసానికి వచ్చారు. అప్పటికి జన సంచారం అక్కడ చాలా తక్కువగా వుండేది. ఆ మిత్రుడు వస్తూనే ''మీ ఏరియా రొంబ అమానుషంగా వుంది సామీ'' అని నిట్టూర్చాడు.



ఎవరూ మనుషులు కనిపించలేదని ఆ మిత్రుని వుద్దేశం. పదం తప్పొప్పుల మాట అటుంచితే, మిత్రుడు స్వయంగా కట్టినందుకు అభినందించాల్సిందే.

❀ ***సిరి సంపదలు :*** ఇది బాగా వాడుకలో వున్న జంట మాట. ఈ పేరుతో సినిమా, నవలలు, కథలు కూడా వచ్చాయి. సిరి అన్నా సంపదన్నా ఒకటే అర్థం. ఇది యిలా పుట్టి తెలుగునాట పాతుకుపోయింది. గడ వాసం, పేపర్ కాగితం, ఇంకు సిరా లాంటి మాటలు జానపదుల నోటివెంట వినవస్తూ వుంటాయి. ఒక జానపద పాటలో 'దారిమార్గములో' అనే పదాన్ని చూడచ్చు.

❀ ***ప్రధాని సముఖంలో చర్చలు :*** సమక్షంలో, ఎదురుగా అనే అర్థంలో వాడుతుంటారు. నిజానికి సముఖంకి వ్యుత్పత్తిని బట్టి చూస్తే ముఖం కలది, నోరు కలది అనే భావం వస్తుంది. "సముఖాస రాయబార మెందుకులే..." అనే గీతం బహుళ ప్రాచుర్యం పొందింది. ఈ మాటలో సమ్, ముఖ అనే రెండు పదాలున్నాయి. సమ్ముఖ, సమ్ముఖం అవుతుంది. గాని సముఖం కాదు. సమ్ముఖీ అనే ప్రయోగం కాళిదాసు శాకుంతలంలో రఘువంశంలో దర్శనమిస్తుంది. సమ్ముఖం సముఖమై తెలుగు కావ్యాల్లో చోటు చేసుకుంది. సముఖమునకు తోడ్కొని రమ్మని రాజు ఆజ్ఞాపించెను –వగైరా. ☆

"రాష్ట్రం జలకళ నింపుకుంది. నిన్నటిదాకా సాధుగోదారి నేడు ప్రళయ గోదారిగా ప్రవహిస్తోంది. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. జలాశయాలు నిండుకుండలై నిబ్బరంగా వున్నాయి. వాగులు, వంకలు రంకెలు వేస్తూ వురకలు పెడుతున్నాయి. చెరువులు తమ అడ్డుకట్టలను కవ్విస్తున్నాయి. ఎక్కడ చూసినా నీరు. నేలని నీళ్లని రంగరిస్తే పచ్చదనం!" - ప్రస్తుతం వాతావరణాన్ని యిలా కవితా మయంగా చూస్తున్నాం. చదువుతున్నాం. ఎక్కడైనా సాధ్యం. కాని ప్రకృతి వర్ణనలో ఆంగ్లపదాల ను యిరికించలేం. అలా వాడినా అవి అతకవు. ఇప్పుడు పత్రికలు చదువుతుంటే ఎన్నో చక్కని తెలుగు పలుకుబడులు వరదలా ప్రవహిస్తున్నాయి. మన తెలుగు భాష మన నదీ నదాలలో పదిలంగా వుందని ఆనందం కలుగుతుంది.

-సంపాదకులు

పొడుపు

తండ్రి గరగర, తల్లి పీచు పీచు
ముత్యాల్లాంటి బిడ్డలు



విడుపు


ఇంఠ ఠఠఠ

తెలుగు పలుకుబడులు-13

సామెతలు శాశ్వతం !

నిజంగానే సామెతలు కాలానికి నిలుస్తాయి. అలనాడు పుట్టిన నానుడిలోని కొన్ని వస్తువులు, ప్రదేశాలు నేడు కనుమరుగైనా సామెతలు మాత్రం సజీవంగానే వున్నాయి. కొన్నింటిని చూద్దాం.

- **ఇంటి గుట్టు లంకకు చేటు**– ఇది రామాయణ గాథలో ముడివడి వచ్చింది. యుగాల నాటి గాథ అయినా నేటికే వాడుకలో వుంది. రామాయణం వున్నంత వరకూ వుంటుంది.



- **దమ్మిడీ ముండకి ఏగాణీ క్షవరం**– ఏగాణీలు, దమ్మిడీలు పోయి చాలా కాలం అయింది. కాని తరచు యథాతథంగా వినిపిస్తూనే వుంటుంది. ''రూపాయి దానికి డాలర్ క్షవరం'' అని నవీకరించాడొకాయన.
- **చల్లకొచ్చి ముంత దాచనేల**– చల్ల తెలియదు, ముంత లేదు. అయినా సామెత వుంది.
- **ఎసరు–అత్తెసరు** – ఎసళ్లు వేయడం లేదు, వేళ్ల కొలతతో అత్తెసరూ లేదు. బొటాబొటీగా వస్తే అత్తెసరు మార్కులు అంటారు. కుక్కర్ వంటలు వచ్చాక ఎసళ్లు లేవు. ఎసరు పెట్టాడంటే వేరే అర్థం వస్తుంది. గుంట తవ్వాడని.
- **రాజుని చూసిన కంటితో మొగుణ్ణి చూసినట్టు**– అనేది నాటి నానుడి. ఇప్పటికీ వాడుకలో వుంది. రాజులు రాజ్యాలు పోయాయి. కాబట్టి 'హీరోని చూసిన' అని నవీకరిస్తే యీ తరానికి చక్కగా ఎక్కుతుంది. ☆

ఈడూ-జోడూ

భార్యా భర్తలు చూడచక్కగా వుంటే ఈడూ జోడూ బావుంది. చిలాకా గోరింకల్లా వున్నారంటారు. ఈడు అంటే వయసు, జోడు అంటే జత అని అర్థం. జోడు అనే మాటని చాల చోట్ల వాడతాం. కళ్లజోడు, కాళ్లజోడు, జోడు గుర్రాలు – యిలా అనేకం. బండిచక్రాలను జోడు అంటారు. జోడు గుళ్ల పిస్తోలు ఒకనాటి మాట. కొన్ని తినుబండారాలను లెక్కించేటప్పుడు ఇన్ని జోళ్లు అంటారు. ఉదాహరణకి అరిసెలు పాతిక జోళ్లు అంటారు. అంటే యాభై అని అర్థం.

జత కూడా దీనికి దగ్గరగా వుండే మాట. ఎడ్లజత, కోడెల జత అంటారు. జత ధోవతులు, పంచల జత అని ఎక్కువగా వినిపిస్తుంది. జంట కూడా యీ కోవలోదే. జంటకవులు, జంట స్వరాలు, జంట నగరాలు, జంట రూళ్లు (చూచి రాతకు జంట గీతల పుస్తకాలు ఉండేవి) మొదలైనవి. ఇంకా అనేక జంట, జత, జోడీ ప్రయోగాలను మీరు గుర్తుచేసుకోండి. ☆



మూర - నెరవు

చీరెలు, ధోవతుల ప్రసక్తి వచ్చినప్పుడు యీ మాటలు వినిపిస్తాయి. మూర అంటే పొడుగు అనీ, నెరవు అంటే వెడల్పు అనీ అనుకోవచ్చు. వస్త్రాల కొలతలలో చిన్నపన్నా, పెద్ద పన్నా అని వుంటాయి. పన్నాని బట్టి ఎంత వస్త్రం పడుతుందో అంచనా వేస్తారు. పన్నా అంటే వెడల్పు.



వేదాధ్యయనంలో కూడా పన్నా వినిపిస్తుంది. ఒక కొలత. ఎన్ని పన్నాలు చదివాడు ? పన్నాలు పల్లించాడు–అని వాడుక. దీన్నే పనసలు అని కూడా అంటారు. ''ఒక పనస ముక్కున పెట్టుకు వచ్చాడు'' అని విమర్శ. వేదాన్ని స్వర సహితంగా గురువు వద్ద భట్టీయం వేస్తారు. నాలుగు ముక్కలే చెప్పగల వారిని అలా విమర్శిస్తారు. వేదం చాలా తరాల పాటు అపౌరుషేయం. అంటే లిఖిత సంప్రదాయం కాదు. ఆశు సంప్రదాయం. గురువు నుంచి శిష్యునికి, శిష్యున్నించి ప్రశిష్యునికి సంక్రమిస్తుంది గాని చదవడానికి గ్రంథస్తం కాలేదు. అయినా కొన్ని వేల సంవత్సరాలు స్వరసహితంగా అవి నిలిచాయి. అందుకే వేదం, వేదాక్షరం అంటే మారనిది, తిరుగు లేనిది అనే భావం వచ్చింది. ఆయన మాట అతనికి వేదం అని సామెత.

– శ్రీ

మనవి

ప్రస్తుతం కనిపించడం, వినిపించడం కరువైన అనేక మాటలను యీ శీర్షికలో తలుచుకుంటున్నాం. ఇది స్వాతంత్ర్యదినోత్సవ శుభవేళ. మనందరికీ సంతోష సమయం. చాలా మందికి బాల్యం గుర్తుకు వస్తుంది. ఎందుకంటే చిన్న తరగతులలో అయ్యవారు డిక్టేషన్ లో తప్పక రాయమనే మాట ''స్వాతంత్ర్యము''. ఆ జ్ఞాపకాల వరుసలో విఘ్నేశ్వరుడు, విష్వక్సేనుడు ముఖ్యమైనవి. ఈ శుభతరుణంలో అందరికీ శుభకామనలు.

ఎడిటర్, ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక, సమాచార భవన్, ఏ.సి. గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500 028

చార్‌ధామ్ 'విషాదం'



'పరమేశా గంగ విడుము

పార్వతి చాలున్.....'

అని భగీరధుడు ప్రార్థిస్తే, పరమ శివుడు అనుగ్రహించి గంగావతరణం చేశాడన్నది పురాణ గాథ.

కానీ, నేడు పరమశివుని అనుగ్రహం కోసం వెళ్ళిన భక్తులపై 'గంగ' ఆగ్రహించింది!

కారుమేఘాలు కక్షగట్టాయి.....

ఒక్కసారిగా గర్జించాయి.

తమలోని నీటినంతటినీ ఒక్కసారిగా గుమ్మరించాయి.....

జల ప్రళయమే సృష్టించాయి.

ఫలితం...

నదులు ఉప్పొంగాయి. వరదలు ముంచెత్తాయి. మంచుకొండలు విరిగి పడ్డాయి. బండరాళ్ళు క్రిందికి దొర్లుతూ వచ్చాయి. బురదనీరు వెల్లువలా ప్రవహించింది. రోడ్లు, వంతెనలు, ఆవాసాలు కొట్టుకు పోయాయి. కొండచరియలు విరిగిపడి దారులన్నీ మూసుకుపోయాయి.

ఊహించని ఈ వరదల ధాటికి జనం కొట్టుకుపోయారు. చెట్టుకొకరుగా, పుట్టకొకరుగా చెల్లా చెదురయ్యారు.

ఓ పక్క భారీ వర్షం. మరో వంక ఊహించని వరదలు. సమాచార వ్యవస్థ కుప్పకూలడంతో ఎవరు ఏమయ్యారో, ఎక్కడున్నారో తెలియని, తెలుసుకోలేని దుస్థితి. ఆర్తనాదాలు వినిపించినా, కనిపించని జనం. ఆపన్న హస్తం అందించినా అందుకోలేని దుస్థితి. ఏ మార్గం లేని నడి 'సముద్రం'లో చిక్కుకొని బిక్కుబిక్కుమంటున్న వేలాది మంది బాధితులు ఓ ప్రక్క.. వారిని ఎలాగైనా చేరుకొని, ప్రాణాలతో రక్షించి ఒడ్డుకు చేర్చాలన్న లక్ష్యంతో పోరాడిన ప్రభుత్వ యంత్రాంగం, సైనిక దళాలు మరో వంక.

వీరి ప్రయత్నాలకు గండికొడుతూ, విఘాతం కల్గిస్తూ ఆగకుండా కుండపోతగా కురుస్తున్న వర్షం....

ఈ ప్రకృతి విలయాన్ని ఎదుర్కొని వేలాది మంది యాత్రికులను సురక్షితంగా రక్షించుకోగలిగాం. అయినా, వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోవలసి వచ్చింది. మరికొంతమంది జాడ ఇప్పటికీ తెలియరాలేదు. ఇందులో మన తెలుగువారు కూడా ఉండటం తీవ్ర ఆందోళన కల్గించింది. యాత్రికులతో పాటు స్థానికంగా ఆయా ప్రాంతాలలో ఉండే ప్రజలు, వ్యాపారులు కూడా ఈ వరదలకు దెబ్బతిన్నారు. మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. చార్‌ధామ్‌లో జరిగింది ఇదే!

చార్‌ధామ్!

ఇప్పుడు ఏ నోట విన్నా, ఏ పత్రిక చూసినా, ఏ టి.వి. వీక్షించినా వినిపించే, కనిపించే పేరు 'చార్‌ధామ్'!!

ఉత్తరాఖండ్ ఓ చిన్న రాష్ట్రం. జనాభా సుమారు ఓ కోటి ఉంటుంది. ఈ రాష్ట్ర పరిధిలో, హిమాలయాలలో ఉండే యమునోత్రి, గంగోత్రి, కేధార్‌నాథ్, బదరీనాథ్ అనే నాలుగు పుణ్యక్షేత్రాలను కలిపి 'చార్‌ధామ్' అని అంటారు.

ఈ 'చార్‌ధామ్' యాత్ర ఎంతో పవిత్రమైనదిగా భావించి, ఏటా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది యాత్రికులు ఈ 'యాత్ర' చేస్తుంటారు. యాత్రికుల రద్దీ దృష్ట్యా ఆయా ప్రాంతాలలో వసతి గృహాలు, సత్రాలు, వ్యాపార కేంద్రాలు కూడా పెద్ద సంఖ్యలోనే వెలిశాయి.

ఈ యాత్రలో చిన్నచిన్న అపశ్రుతులు సర్వసాధారణమే అయినా, ఈ ఏడాది 'ప్రళయగంగ' సృష్టించిన విలయంలో జనం విలవిలలాడాల్సి వచ్చింది.

అసలే మంచుకొండలు. ఆపై భారీ వర్షం, ఆకస్మిక వరదలు. దీంతో భక్తులు భీతిల్లిపోయారు. బయటపడే మార్గం లేక వేలాది మంది జనం రోజుల తరబడి యాతన అనుభవించాల్సి వచ్చింది.

ప్రమాదభరితం ఈ 'యాత్ర'

సాధారణంగానే 'చార్‌ధామ్' యాత్ర ఎంతో ప్రమాదంతో, ప్రయాసతో కూడుకున్నది. ఓ విధంగా చెప్పాలంటే ఇది 'సాహసయాత్ర' అనక తప్పదు. అయినా, భక్తి విశ్వాసాలతో ఏటా పెద్ద సంఖ్యలో 'చార్‌ధామ్' యాత్రకు ప్రజలు తరలి రావడం కొత్తేమీ కాదు. అలాగే, చిన్నచిన్న దుస్సంఘటనలు జరగడం కూడా సర్వసాధారణం.

పోటెత్తే నదులు, కొండ మార్గాలు, మంచు పర్వతాలు, అననుకూల వాతావరణం మధ్య ఈ యాత్ర సాగుతుంది. అందుకే ఇది ఓ సాహస యాత్ర! కొండలపై ఇరుకైన ఘాట్ రోడ్లు, సముద్ర మట్టానికి 11,600 అడుగుల ఎత్తులో ప్రాణవాయువు కూడా సరిగా లభించని ప్రదేశాలగుండా ప్రయాణం. కొంత దూరం కాలినడకన, నడవలేని వారు గుర్రాల మీద, వృద్ధులు, మహిళలను మోసుకొని వెళ్ళడానికి ఏర్పాటు చేసే 'డోలీలు' మీద ప్రయాణం చేయవలసి ఉంటుంది.

'చార్‌ధామ్' యాత్రికులు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అనుక్షణం ఎంతో అప్రమత్తంగా వ్యవహరించవలసి వస్తుంది.

గుడి తెరుచుకోగానే..

ఏడాదిలో కొద్దిరోజులు మాత్రమే తెరచి ఉంచే కేదార్‌నాథ్ ఆలయం ఈ ఏడాది 'అక్షయ తృతీయ' పర్వదినాన తలుపులు తెరుచుకుంది. ఈ ఆలయాన్ని దర్శించుకొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తజన సందోహం భారీ ఎత్తున తరలి వచ్చింది. మన రాష్ట్రం నుంచి కూడా వందలాది మంది భక్తులు తరలి వెళ్ళారు.

అయితే, జూన్ 15 నుంచే వాతావరణంలో మార్పుచోటుచేసుకుంది. కానీ, ఎవ్వరూ ఊహించని విధంగా, గతంలో ఎన్నడూ లేని విధంగా జూన్ 16,17 తేదీలలో ఈ ప్రాంతంలో 'కుంభవృష్టి' కురిసింది. ఈ వర్షానికి తోడు నదుల్లోని నీరు కూడా తోడు కావడంతో 'గంగమ్మ తల్లి' జడలు విప్పి 'ప్రళయగంగ' గా మారింది.

కుండపోతగా కురిసిన వర్షానికి గంగ, మందాకిని, అలకనంద, తదితర నదులు మహోగ్రరూపం దాల్చాయి. ఎటు చూసినా నీరే! విరిగిపడిన

జై జవాన్ !

"సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏ.ఎఫ్.ఎస్.ఐ.ఏ.) పై సైన్యంతో నేను విభేదించవచ్చుగాక... అయితే సైన్యం, వైమానిక దళం, ఐ.టి.బీ.పీ. దళాలు ఉత్తరాఖండ్‌లో ప్రస్తుతం చేపడుతున్న అద్భుతమైన సహాయక చర్యలకు మాత్రం జోహార్లు అర్పిస్తున్నాను..."

ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న బాధితులను రక్షించేందుకు భారత సైనికులు చేస్తున్న సేవలను, కృషిని చూసి జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలివి.

ఉత్తరాఖండ్ విపత్తులో బాధితులను ఆదుకోవడంలో, వేలాది మంది యాత్రికులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో మన జవానులు చేసిన కృషి అనన్య సామాన్యం. అత్యంత ప్రతికూల వాతావరణంలో సయితం ప్రాణాలను ఫణంగా పెట్టి మన జవానులు ప్రజలను రక్షించిన తీరుకు జాతి యావత్తు కీర్తిస్తోంది.

చెట్టు, పుట్టలు, వాగు, వంకలు గాలించి వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించిన వారి సేవలకు, సాహసోపేత చర్యలకు బాధితులేగాక, జాతి మొత్తం సెల్యూట్ చేస్తోంది. ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రవాహాల మీదుగా తాళ్ళ సహాయంతో వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, నడువలేని స్థితిలో వున్న వృద్ధులను, మహిళలను, పిల్లలను తమ భుజాలపై మోసుకొని రావడం వారి ఉత్తమ సేవలకు నిదర్శనం.

జూన్ 25 న ప్రతికూల వాతావరణ పరిస్థితులకు కూడా లెక్క చేయకుండా



బాధితుల ప్రాణ రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్న భారత వాయుసేనకు చెందిన ఓ హెలికాప్టర్ కుప్పకూలి పోవడంతో సుమారు 20 మంది జవానులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మన రాష్ట్రానికి చెందిన 'వీరజవాన్' వినాయకన్ కూడా ఉండటం మరింత విషాదాన్ని నింపింది.

ఇంత జరిగినా ఏ మాత్రం వెనుకంజ వేయని జవానులు 'చివరి బాధితుని కూడా కాపాడే వరకూ వెనుదిరిగేది లేదు' అంటూ ముందుకు సాగిన తీరు వారి త్యాగనిరతికి, దేశభక్తికి నిదర్శనం. పలువురు సైనిక సిబ్బంది తమకు మంజూరైన సెలవులను కూడా రద్దు చేసుకొని సహాయ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

దేశ సైనిక చరిత్రలోనే ఇంత భారీ ఎత్తున 'రక్షణ చర్యలు' చేపట్టడం ఓ మైలురాయిలా నిలిచిపోతుంది. ☆

కొండచరియలతో దారులన్నీ మూసుకుపోయాయి. ఎక్కడి వాహనాలు అక్కడే నిలచిపోయాయి.

రుద్రప్రయాగ్, చమోరి, ఉత్తరకాశి జిల్లాలు బాగా దెబ్బతిన్నాయి. వందలాది వసతి గృహాలు, పలు అంతస్తుల భారీ భవనాలు, మఠాలు, ధర్మసత్రాలు నీటి ప్రవాహానికి జనం కళ్లముందే నేలమట్టమయ్యాయి. రవాణా వ్యవస్థతో పాటు, సమాచార వ్యవస్థ కూడా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

యుద్ధప్రాతిపదికపై రక్షణ చర్యలు

'చార్‌ధామ్' యాత్రికులు జల ప్రళయంలో చిక్కుకున్నారని జూన్ 16 రాత్రికే సమాచారం అందడంతో కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు తక్షణం అప్రమత్తమయ్యాయి. బాధితులను ఆదుకొనేందుకు అధికార యంత్రాంగంతో పాటు త్రివిధ దళాలని (ఆర్మీ, వాయుసేన, నేవీ) రంగంలోకి దింపాయి. జాతీయ విపత్తు నివారణ సంస్థ సహాయక బృందాలు కూడా రంగంలోకి దిగి రక్షణ, పునరావాస చర్యలకు నడుం బిగించాయి.

మన రాష్ట్ర ప్రభుత్వంతో సహా దాదాపు అన్ని రాష్ట్రాలు హెల్ప్ లైన్లు ఏర్పాటుచేసి, వరదల్లో చిక్కుకున్న యాత్రికులను రక్షించేందుకు ప్రత్యేక హెలికాప్టర్లు ఏర్పాటు చేశాయి. కానీ, ఏ మాత్రం తెరపి ఇవ్వకుండా భారీ వర్షాలు కురుస్తుండటంతో సహాయక చర్యలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. అననుకూల వాతావరణ పరిస్థితులలో కూడా మన జవానులు హెలికాప్టర్లలో గాలింపు చర్యలు చేపట్టి వేలాది మంది బాధితులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు.

వాతావరణం అనుకూలించక రక్షణ చర్యలలో జాప్యం జరుగుతూ ఉండటంతో వరదల్లో చిక్కుకున్న బాధితుల కోసం ప్రభుత్వం హెలికాప్టర్లలో టన్నుల కొద్దీ ఆహార పదార్థాలు, మంచినీరు, మందులు సరఫరా చేశాయి. ఈ ముప్పునుండి బయట పడినవారిని ప్రత్యేక విమానాలు, ప్రత్యేక రైళ్ళలో వారి వారి గమ్యస్థానాలకు చేర్చారు.

ఎంతో ఉత్సాహంతో, భక్తి శ్రద్ధలతో 'చార్‌ధామ్' యాత్రకు వెళ్ళిన భక్తులు ప్రకృతి వైపరీత్యంతో అష్టకష్టాలు పడవలసి వచ్చింది. ఈ యాత్ర వారి వారి కుటుంబాలలో ఓ 'పీడకల'గా, విషాద యాత్రగా మిగిలిపోయింది.

అయితే..... జలవిలయానికి ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రం కేదార్‌నాథ్ లో భారీ భవనాలు, మఠాలు, ఇతర కట్టడాలు, కొట్టుకు పోయి, పట్టణమంతా శిథిలమైనా, ఎనిమిది శతాబ్దాల క్రితం నిర్మించినట్లు తెలుస్తున్న అక్కడి పరమశివుని ఆలయం మాత్రం చెక్కుచెదరకుండా ఉండటం నిజంగా ఆశ్చర్యకరం!

రాష్ట్రవాసులు 13 మంది మృతి, 81 మంది గల్లంతు

మన రాష్ట్రం నుంచి చార్‌ధామ్ యాత్రకు వెళ్ళిన యాత్రికుల్లో 81 మంది గల్లంతైనట్టు, మరో 13 మంది మరణించినట్టు జూలై 4న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మన రాష్ట్రం నుంచి చార్‌ధామ్ యాత్రకి మొత్తం 2,751 మంది తరలి వెళ్ళారు. వీరిలో 2,657 మంది సురక్షితంగా తిరిగి వచ్చారు. 13 మంది మరణించినట్టుగా గుర్తించారు. మరో 81 మంది యాత్రికుల ఆచూకీ తెలియరాలేదు. అలాగే, చార్‌ధామ్ యాత్రలో ప్రాణాలు కోల్పోయిన రాష్ట్ర యాత్రికుల కుటుంబాలు ఒకింటికి 5 లక్షల రూపాయల వంతున పరిహారం అందించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం, ఇతర సంస్థలు అందించే పరిహారానికి ఇది అదనం.

ఉత్తరాఖండ్ సహాయక చర్యల సందర్భంగా జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన, మన రాష్ట్రానికి చెందిన జవాన్ వినాయకన్ కుటుంబానికి కూడా ముఖ్యమంత్రి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు, అతని కుటుంబానికి ఇంటి స్థలం కూడా మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

రూ.50 కోట్ల ఆర్థిక సహాయం

ఉత్తరాఖండ్‌లో సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం ముఖ్యమంత్రి శ్రీ యన్. కిరణ్ కుమార్ రెడ్డి జూన్ 29న ఎంతో ఉదారంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వం తరపున 50 కోట్ల రూపాయల విరాళాన్ని ప్రకటించారు.

– కె.ఎస్. శాస్త్రి

బాధితులకు ప్రభుత్వ చేయూత



ఉత్తరాఖండ్ ఉపద్రవం గురించి తెలిసిన వెంటనే, అక్కడ వరదల్లో చిక్కుకున్న తెలుగు వారిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రానికి చెందిన యాత్రికులందరినీ సురక్షిత ప్రాంతాలకు చేర్చి, వారికి అవసరమైన ఆహారం, నీరు మందులు అందించేందుకు సకల చర్యలు తీసుకోవలసిందిగా ప్రధాన కార్యదర్శి శ్రీ పి.కె.మహంతిని ముఖ్యమంత్రి శ్రీ యన్. కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శ్రీ మహంతి ఉత్తరాఖండ్‌లోని ఉన్నతాధికారులతో నిరంతరం సంప్రదిస్తూ, అక్కడ వరదల్లో చిక్కుకున్నవారి స్థితిగతులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కేంద్రమంత్రి శ్రీ బలరాం నాయక్, రాష్ట్ర మంత్రులు శ్రీ డి. శ్రీధర్ బాబు, శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా వెళ్ళి సహాయ కార్యక్రమాలు, బాధితులను స్వస్థలాలకు చేర్చేందుకు అవసరమైన రవాణా, తదితర సౌకర్యాలను పర్యవేక్షించారు. ఎయిర్‌ఫోర్స్ అధికారులతో సమన్వయ పరచుకొని బాధితులను స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.

తరలివెళ్ళిన అధికారులు

రాష్ట్రం నుంచి సీనియర్ అధికారులు – విపత్తుల నిర్వహణ శాఖ కమీషనర్ డాక్టర్ టి. రాధ, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ ఆదిత్యనాథ్ దాస్, కాలుష్య నివారణ బోర్డు మెంబర్ కార్యదర్శి శ్రీ సంజయ్ కుమార్, వరంగల్ మునిసిపల్ కమిషనర్ శ్రీ వివేక్ యాదవ్, హైదరాబాద్ డి.సి.పి. శ్రీ తరుణ్ జోషిలను ప్రభుత్వం ఉత్తరాఖండ్‌కి పంపింది. వీరితో పాటు మరో 30 మంది అధికారులు, రాష్ట్రం నుంచి తరలి వెళ్ళిన వైద్య బృందాలు బాధితుల రక్షణకు చర్యలు తీసుకున్నారు.

ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి స్వయంగా ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ బహుగుణతోను, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ కార్యదర్శిలతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ మన రాష్ట్ర వాసులకు సహాయం, పునరావాసం అందేలా కృషి చేశారు. ఉత్తరాఖండ్ అధికారులతో సమన్వయం కోసం ఢిల్లీలోని ఏ.పి. భవన్ నుంచి కూడా అధికారుల బృందాన్ని డెహ్రాడూన్ పంపారు. వరదల్లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ యాత్రికులకోసం ఢిల్లీలోని ఏ.పి. భవన్‌లో హైదరాబాద్‌లోని సచివాలయంలో 24 గంటలూ పనిచేసే హెల్ప్ లైన్లు ఏర్పాటు చేశారు. తెలుగు వారి కోసం ప్రత్యేక పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయించారు.



ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి, క్యాంప్ కార్యాలయంలో పలుదఫాలు అనునిత్యం సమీక్ష సమావేశాలు నిర్వహించి, వరదల్లో చిక్కుకున్న మన రాష్ట్ర యాత్రికుల స్థితిగతులు, వారికి అందుతున్న పునరావాస, రవాణా సౌకర్యాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

బాధితుల్ని 2 విమానాల్లో తరలింపు

ముఖ్యమంత్రి శ్రీ కిరణ్ కుమార్ రెడ్డి స్వయంగా ఢిల్లీలోని ఏ.పి. భవన్‌లో పునరావాసం పొందిన యాత్రికులను పరామర్శించారు. వారిని ఉచితంగా వారివారి స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేశారు.

బదరీనాథ్, తదితర ప్రాంతాలలో చిక్కుకున్న తెలుగు వారిని డెహ్రాడూన్, ఢిల్లీలకి తీసుకొని వచ్చి, అక్కడి నుంచి ప్రత్యేకంగా, ఉచితంగా ఏర్పాటు చేసిన విమానాలు, రైళ్ళలో వారివారి స్వస్థలాలకు తరలించారు. జూన్ 26, 28 తేదీలలో మొత్తం రెండుసార్లు ప్రత్యేక విమానంలో డెహ్రాడూన్ నుంచి మన రాష్ట్రానికి యాత్రకుల్ని చేర్చారు.

అసలు మన రాష్ట్రం నుంచి చార్‌ధామ్ యాత్రకు ఎంతమంది వెళ్ళింది, ఏ జిల్లా నుంచి ఎంతెంత మంది వెళ్ళింది, వారిలో ఎందరు తిరిగి వచ్చారు. మరెందరు, వరద ప్రాంతాలలో చిక్కుకున్నారన్న విషయాలను రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు, యాత్రికులు అందజేసిన సమాచారం ఆధారంగా బాధితుల గాలింపు, సహాయక చర్యలను ముమ్మరం చేసింది.

ప్రభుత్వం తీసుకున్న చర్యలు, కేంద్ర ప్రభుత్వం, సైనిక జవానులు అందించిన సహాయ సహకారాలతో మన రాష్ట్ర యాత్రికులలో అత్యధికులు సురక్షితంగా స్వస్థలాలకు చేరుకున్నారు.

ప్రత్యేక విమానాలు, రైళ్ళలో స్వస్థలాలకు తిరిగి వచ్చిన బాధితులు పునర్జన్మ ఎత్తామన్న ఆనందంతో తమ వారిని చూసి ఉద్వేగానికి గురైనారు.

తల్లిపాలే మిన్న

పిల్లల్లో హైపర్ యాక్టివిటీ డిజార్డర్ గురించి మనకు తెలిసిందే. ఇటీవల కాలంలో వీళ్ల సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ విషయంమీద కూలంకషంగా పరిశీలించిన నిపుణులు తల్లిపాలు తాగే పిల్లల్లో ఇలాంటి లక్షణాలు తక్కువగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. టెల్అవీవ్‌కి చెందిన పరిశోధకులు కౌమార దశలో ఉన్నవాళ్లనీ పిల్లల ప్రవర్తనారీతుల్ని పరిశీలించినప్పుడు వీళ్లలో చిన్నప్పుడు తల్లిపాలు తాగిన పిల్లల్లో ఇలాంటి



సమస్యలు తక్కువగా ఉన్నాయని గుర్తించారు. అదే మూడు నెలలకే బాటిల్ పాలు తాగిన పిల్లల్లో తల్లిపాలు తాగిన పిల్లల్లో కన్నా ఈ రకమైన మానసిక సమస్యలు ఎక్కువని తేలింది. అంతేకాదు, దీనివల్ల తల్లికీ బిడ్డకీ మధ్య ఓ చక్కని అనుబంధం ఏర్పడుతుందనీ అందుకే ఇతరత్రా సమస్యలు వీళ్లలో తక్కువనీ చెబుతున్నారు. తల్లిపాల ఆవశ్యకత గురించి ఇటీవల మన ప్రభుత్వం కూడా గట్టి ప్రచారాన్నే చేపట్టింది. పనిలోపనిగా ఇది కూడా చేరిస్తే మరిన్ని ఫలితాలు ఉండవచ్చు.

అల్పాహారం చేయకపోతే...

బరువు తగ్గాలనో లేదా సమయం లేదనే చాలామంది ఉదయం పూట అల్పాహారం తినడం మానేస్తుంటారు. ఇది మానడం వల్ల ఆరోగ్యానికి మంచిది కాదని తెలిసినప్పటికీ నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కి చెందిన కొందరు నిపుణులు ఈ విషయమై కూలంకషంగా పరిశోధనలు చేశారు. ముఖ్యంగా ఉదయం ఏమీ తీసుకోకుండా అలాగే రాత్రిపూట కూడా లేటుగా తినే అలవాటున్న పురుషుల్లో ఎక్కువ మంది హృద్రోగాల బారినపడుతున్నారని తేలిందట.

అంతేకాదు, ఇలా అల్పాహారం తిననివాళ్లలో ఎక్కువ మంది శారీరకంగా అంత చురుగ్గా ఉండలేరట. పైగా ఆల్కహాల్‌కీ ధూమపానానికీ బానిసలుగా మారతారని తేలింది. అంతేకాదు, బ్రేక్‌ఫాస్ట్ చేయనివాళ్లకి బీపీ, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటివి కూడా ఎక్కువేనని తేలింది అందుకే మరి ఇడ్లీ, ఉప్మా, అట్టు, పెసరట్టు... ఇలా ఏదో ఒకటి తప్పకుండా తినడమే మంచిది. ఇవేమీ కాదంటే ఎంచక్కగా పండ్లూపాలతోబాటు, కాస్త అన్నం తింటే మరీ మంచిది.



ప్యాకింగ్‌తోనే సమస్య

తమ దేశంలోనే పౌరులను ధూమపానానికి దూరంగా ఉంచాలని ఏ ప్రభుత్వంఅయినా చిత్తశుద్ధితో అనుకుంటే వాటి ప్యాకింగుల మీద శ్రద్ధ తీసుకోవాల్సిందే. అదీ ఎందుకంటే ఇటీవల ఆస్ట్రేలియాలో సిగరెట్ ప్యాకింగులను డిజైన్లు లేకుండా సాదా రంగుల్లో తీసుకురావడం ప్రారంభించారట. దాంతో వాటి అమ్మకాలు దారుణంగా పడిపోయాయట. ముఖ్యంగా వాటిమీద ఆరోగ్యానికి సంబంధించిన హెచ్చరికలు స్పష్టంగా కనిపిస్తుండటంతో చాలా మంది వాటి జోలికి పోవడం మానేశారట. అంతేకాదు, అక్కడ ఇలాంటి ప్లెయిన్ ప్యాక్‌ల్లోనే వీటిని విక్రయించాలని చట్టం కూడా తీసుకువచ్చారట. దాంతో జనాలకి ఆరోగ్య హెచ్చరికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఫలితంగా ఎంత కాదనుకున్నా దృష్టి వాటిమీదకి పోతుండటంతో ధూమపాన ప్రియులే వాటిని దూరంగా నెట్టేస్తున్నారట. కొంతమందేమో ఇదేదో నాసిరకం సిగరెట్లుగా భావించి కొనడం



మానేస్తున్నారట. మొత్తమ్మీద కారణాలేమయినా సిగరెట్ల అమ్మకం దారుణంగా పడిపోయింది. సో... అన్ని దేశాల్లోనే ఇలాంటి చట్టాలే తీసుకువస్తే బాగుణ్ణు అనిపించడం లేదూ.

జీవం ఎక్కడ ఉందీ... ?

ఏ గ్రహం మీదైన జీవం ఉండాలి అంటే అది ఎలా ఉండాలి ? దీనికి నాసా శాస్త్రవేత్తలే సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఐదో తరగతి పిల్లవాడైనా సమాధానం చెప్పేస్తాడు. ఎందుకంటే జీవం ఉన్న ఏ గ్రహమైనా మన భూమిలానే ఉంటుంది. అంటే విశ్వంలోని ఏ గ్రహానికైనా మన భూమితో పోలికలు ఉన్నట్లయితే దానిమీద కచ్చితంగా జీవం ఉండి ఉండవచ్చు.... అన్న కోణంలోనే నాసా పరిశోధకులు తమ పరిశీలనలు సాగిస్తున్నారు. దీన్నిబట్టి మన సౌరకుటుంబంలోని సూర్య నక్షత్రం నుంచి మన భూమి ఎంత దూరంలో ఉందో, అలాగే ఇతర గ్రహరాశుల్లో కూడా నక్షత్రానికి అంతే దూరంలో ఉన్న గ్రహాలమీద ఓ కన్నేసి ఉంచుతోంది. నాసా కనిపెట్టిన కెప్లర్ మిషన్, కెప్లర్‌తో పాటు ఇతర టెలిస్కోపులు కూడా దూరంతో పాటు భూమి పరిమాణంలో ఉన్న గ్రహాలను శోధిస్తున్నాయి.

అందులో భాగంగా భూమి కన్నా పెద్దవీ లేదా చిన్నవాటినీ కూడా పరిశీలిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే జీవానికి మూలం నీళ్లు కాబట్టి నీటి ఛాయలున్న గ్రహాలకోనం అన్వేషణ ప్రారంభించారు. ఇందులో భాగంగానే కెప్లర్ 62



ఎఫ్ అనే ఓ సూపర్ భూ గ్రహాన్ని కనుగొంది. కెప్లర్ మిషన్ – ఈ గ్రహం తన కక్ష్యలో తిరగడానికి 267 రోజులు తీసుకుంటుందట. అయితే దీనిమీద ఉన్న రసాయనాల ద్వారా వాతావరణాన్నీ నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగా జేమ్స్ వెబ్ అనే స్పేస్ టెలిస్కోప్‌ను ఉపయోగిస్తున్నారు. దీన్ని ద్వారానయినా త్వరగా భూమిలాంటి గ్రహాలను గుర్తించగలరని ఆశిద్దాం.

మెదడుకి అనుకరణ

ఎంత మాస్టర్ కంప్యూటర్లయినా మనిషి మెదడుతో పోటీపడలేవు. అందుకే ఎలాగైనా కృత్రిమ మెదడు తయారుచేయాలన్నది నిపుణుల చిరకాల కోరిక. ఆ రోజు దగ్గర్లోనే ఉందనిపిస్తోంది. అంటే అచ్చం మనిషి మెదడులానే ఆలోచించే కంప్యూటర్లూ రోబోలూ రానున్నాయన్నమాట. పూర్తిగా మనిషి న్యూరాన్లను పోలిన బ్రెయిన్ సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసే రోజు ఇంకెంతో దూరంలో లేదు అనిపిస్తోంది. ఎందుకంటే యూనివర్సిటీ ఆఫ్ జ్యురిచ్‌కు చెందిన న్యూరో ఇన్ఫర్మేటిక్స్ విభాగానికి చెందిన నిపుణులు ఇటీవల ఓ చిప్‌ను కనుగొన్నారు.

ఇది అచ్చం మన మెదడులానే పనిచేస్తుందట. అంటే దాదాపు మన నాడీకణాలనే ఇది అనుకరిస్తుందన్నమాట. ఇంకా వివరంగా చెప్పాలంటే ఈ న్యూరోమార్ఫిక్ చిప్స్ మన మెదడుని పూర్తిగా అనుకరిస్తూ పనిచేస్తాయట. అంటే మెదడు నిర్మాణం, పనితీరుకి సమూనాలా ఈ ఎలక్ట్రానిక్ చిప్‌ను డిజైన్ చేశారట. ఇది ఎంత మేరకు విజయవంతమవుతుందో వేచి చూడాల్సిందే.

– హేమంత్

జూన్ 22 : హైదరాబాద్ హెచ్ఐసిసిలో విద్యాపక్షోత్సవాలను, ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలను లాంఛనంగా ప్రారంభించారు. సచివాలయంలో అనంతపురం జిల్లాలో ఐరన్ ఓర్ బెనిఫికేషన్, ఫెలిటైజేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు మూడు ప్రభుత్వ రంగ సంస్థల మధ్య జరిగిన ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయంలో ఉత్తరాఖండ్ వరదబాధితుల సహాయ చర్యలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జూన్ 23 : విశాఖపట్నంలో ఏ.యు. ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఒలింపిక్ డే రన్ - 2013ను ప్రారంభించారు. తూర్పు గోదావరి జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం విశాఖపట్నం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కాకినాడ చేరుకొని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కాకినాడ నుంచి ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకున్న తెలుగు యాత్రికులను పూర్తిస్థాయిలో రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఉత్తరాఖండ్‌లో పర్యటిస్తున్నా రాష్ట్ర మంత్రులతో సమీక్ష నిర్వహించారు. విద్యా పక్షోత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ నగరంలోని అనాథ బాలల వసతి గృహం 'ఆనంద నిలయం'లో విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. కాకినాడ నుంచి విశాఖపట్నం చేరుకొని గవర్నర్ బంగ్లాలో బసచేశారు.

జూన్ 24 : విశాఖపట్నం నగరంలోని కంచరపాలెంలో ప్రాంతీయ నిఘా విభాగ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కశింకోట మండలం తేగాడలో మోడల్ స్కూల్, అనకాపల్లిలో రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. ఉత్తరాఖండ్‌లో చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన యాత్రికుల కోసం చేపట్టిన ఏర్పాట్లపై క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. తక్షణ సహాయం కింద రూ. 5,000 తోపాటు ఉచిత రైలు టికెట్లు, వైద్య సదుపాయం, మందులు ఆహారం, వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు.

జూన్ 25 : ఢిల్లీ పర్యటన నిమిత్తం బయలుదేరి వెళ్లారు. ఏ.పీ భవన్‌లో చార్‌ధామ్ బాధితులతో మాట్లాడి వారి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో బాధితులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం అధికారులతో సహాయ కార్యక్రమాలపై సమీక్షించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి శ్రీ దిగ్విజయ్‌సింగ్, శ్రీ అహ్మద్ పటేల్, ఆర్థికమంత్రి శ్రీ చిదంబరంలతో వేరు వేరుగా సమావేశం అయ్యారు. రాత్రి ఏపీ భవన్‌లో బసచేశారు.

జూన్ 26 : ఏపీభవన్‌లో చార్‌ధామ్ వరద బాధితులకు చేపడుతున్న సహాయ చర్యలపై మంత్రులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఉత్తరాఖండ్ వరద బాధితులను పరామర్శించారు. కేంద్రమంత్రి శ్రీ ఎకే. ఆంటోనితో, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ శ్రీ దిగ్విజయ్ సింగ్‌తో వేరు వేరుగా భేటీ అయ్యారు. ఏపీ భవన్‌లో బస చేశారు.

జూన్ 27 : ఏపీ భవన్‌లో చార్‌ధామ్ వరద బాధితులకు చేపడుతున్న సహాయ చర్యలపై మంత్రులు, అధికారులతో సమీక్షించారు.



కేంద్రమంత్రి శ్రీ గులాంనబీ ఆజాద్‌తో భేటీ అయ్యారు. అనంతరం పలువురు అధిష్ఠానం పెద్దలతో సమావేశం అయ్యారు. రామగుండం ఎరువుల కర్మాగారాన్ని బిఐఎఫ్ఆర్ జాబితా నుండి తొలగించి ప్లాంట్ పునరుద్ధరించడానికి నూత్రప్రాయంగా అంగీకరించినందుకు ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, యుపిఎ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీలకూ కృతజ్ఞతలు తెలియజేశారు. మూడు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు.

జూన్ 28 : హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో 'జౌళి పరిశ్రమ - చేనేత కార్మికుల సమస్యలపై ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ పి.వి.ఘాట్‌లో మాజీ ప్రధాని కీ॥శే. పి.వి. నరసింహారావు 92వ జయంతి ఉత్సవాలలో పాల్గొని నివాళులు అర్పించారు. సచివాలయంలో మంత్రులు, పలువురు అధికారులు, తదితరులు కలుసుకున్నారు.

జూన్ 29 : సచివాలయంలో 'రాష్ట్ర వన్యప్రాణుల సంరక్షణ సమితి' పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్తరాఖండ్‌లో చిక్కుకున్న తెలుగు యాత్రికులకు సహాయ చర్యలపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ఉత్తరాఖండ్‌కు వరద సహాయక చర్యల కోసం రూ. 50 కోట్లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఉత్తరాఖండ్ వరద సహాయక చర్యల్లో, మరో దుస్సంఘటలో ప్రాణాలు కోల్పోయిన రాష్ట్ర జవాన్లు యాదయ్య, వినాయకన్ కుటుంబాలకు రూ. 5 లక్షలు, ఇంటిస్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వరదల్లో మృతిచెందిన ఇతరుల కుటుంబాలకు కూడా ఆర్థిక సహాయం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో తెలంగాణ ఉద్యోగులు, కార్మికులు, గెజిటెడ్ అధికారులు తమ ఒక రోజు వేతనాన్ని ఉత్తరాఖండ్ బాధితుల సహాయార్థం విరాళం రూపంలో అందజేశారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు కూడా ఒకరోజు వేతనాన్ని విరాళంగా అందజేశారు. సమాచార కమీషనర్ శ్రీ వర్రె వెంకటేశ్వర్లు రూ. లక్ష విరాళం సచివాలయంలో అందజేశారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు శ్రీ గంటా శ్రీనివాసరావు, శ్రీ విశ్వరూప్‌లు సమావేశం అయ్యారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ గ్రామం వద్ద తపాలా శాఖ రూ. 75 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఆటోమేటిక్ మెయిల్ ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం 10వ తరగతి ఫలితాల్లో గత ఏడాది ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు.

జూన్ 30 : క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ సభ్యులు, తదితరులు వేరు వేరుగా కలుసుకున్నారు. విపత్కర పరిస్థితుల్లో ఉన్న తమ రాష్ట్రానికి సహాయ సహకారాలు అందించినందుకు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి శ్రీ విజయ బహుగుణ ఫోన్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

జూలై 1 : గాంధీభవన్‌లో రాష్ట్ర ఇన్‌ఛార్జీ శ్రీ దిగ్విజయ్‌సింగ్‌తో సమావేశం అయ్యారు. అనంతరం కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన 20 సూత్రాల కార్యక్రమం 'ఆవిర్భావ దినోత్సవం'లో పాల్గొన్నారు. అనంతరం 'మీ సేవ' పథకం కార్యక్రమంలో పాల్గొని మరో 17 నూతన సేవలను 'మీ సేవ' పథకంలో భాగంగా ప్రారంభించారు. లక్డీకపూల్‌లోని సిఐడి నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం 156 ద్విచక్ర వాహనాలను, 10 సుమోలు, 2 టాటా ఏఎస్‌లు, ఒక డిసిఎం, ట్రాఫిక్ ఎడ్యుకేషన్ మొబైల్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. జంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రిసెప్షన్ కేంద్రాన్ని ప్రారంభించారు. గాంధీభవన్‌లో రాష్ట్ర ఇన్‌ఛార్జీ శ్రీ దిగ్విజయ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర

సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.

జూలై 2 : హైదరాబాద్ లలిత కళాతోరణంలో 'బంగారుతల్లి' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశం అయ్యారు. తెరాస నేత కేటీఆర్ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వ 'ఉద్యోగ జాతర'లో భాగంగా 24,078 పోస్టులు భర్తీకి ఆమోదం తెలిపారు.

జూలై 3 : సచివాలయంలో చిత్తూరు, మెదక్, ప్రకాశం జిల్లాల్లో జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలాలు ఏర్పాటుకు సంబంధించిన ప్రగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయంలో చిత్తూరు జిల్లా త్రాగునీటి సరఫరాపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ సభ్యులు, తదితరులు కలుసుకున్నారు.

జూలై 4 : జూబ్లీహాల్‌లో రంజాన్, బోనాల పర్వదినాల సందర్భంగా శాంతి భద్రతలపై, ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయంలో పురపాలక సంఘాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒడిశాలోని తాల్చేర్ బొగ్గుగనులలో బొగ్గు బ్లాకు గనులు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించినందుకు యుపిఎ, చైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ, ప్రధానమంత్రి శ్రీ మన్మోహన్ సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో పీసీసీ మాజీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ డి. శ్రీనివాస్‌తో సమావేశం అయ్యారు.

జూలై 5 : సచివాలయంలో ఆధార్‌కార్డు (యూఐడిఐఎ) చైర్మన్ శ్రీ నందన్ నీలేకనితో సమావేశం అయ్యారు. అనంతరం ఆధార్‌కార్డు నమోదు ప్రక్రియపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలు సమావేశం అయ్యారు. ఆరోగ్య కార్డులు జారీ చేయాలని వినతిపత్రం ఇచ్చారు. సచివాలయంలో ఇసుజు మోటార్స్ ఇండియా సంస్థ ప్రతినిధి బృందం కలుసుకుని చిత్తూరు జిల్లా శ్రీసిటీలో ట్రక్కు, కారు ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ తమ ఒక రోజు వేతనాన్ని ఉత్తరాఖండ్ రాష్ట్రానికి అందజేయాలని కోరుతూ విరాళంగా అందజేశారు.

జూలై 6 : క్యాంపు కార్యాలయంలో తమిళనాడు తెలుగు సమైక్య వేదిక ఆధ్వర్యంలో తెలుగు సంఘాల సభ్యులు సమావేశం అయ్యారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు, అధికారులు, తదితరులు సమావేశం అయ్యారు.

జూలై 7 : క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ సభ్యులు తదితరులు వేరు వేరుగా కలుసుకున్నారు.

జూలై 8 : సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి రోడ్డులో గల సిటీలైట్ హోటల్ భవనం కుప్పకూలిన ఘటనపై విచారణకు ఆదేశించారు. సిటీలైట్ హోటల్ భవనం కుప్పకూలిన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. కీ॥శే డా॥ వై.యస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా పంజగుట్ట క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శాసనసభ కమిటీ హాల్‌లో జరిగిన సీఎల్పీ కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించారు. సచివాలయంలో విద్యుత్తు సరఫరా, ఉత్పత్తిపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సచివాలయంలో సిటీలైట్ హోటల్ ఘటన నేపథ్యంలో నగరంలోని శిథిలావ్యవస్థలో వున్న భవనాలపై ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనిపై ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 7.5 లక్షలు, గాయపడిన వారికి ఉచిత వైద్య సౌకర్యాలు, పరిహారాన్ని ప్రకటించాలని అధికారులను ఆదేశించారు.

జూలై 9 : సచివాలయంలో మంత్రులు, అధికారులతో రాయలసీమ ఆంధ్రాప్రాంతానికి చెందిన భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్షించారు. 'జలయజ్ఞం' క్రింద చేపట్టిన అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సిటీలైట్ హోటల్ భవనం కుప్పకూలిన ఘటనపై కొనసాగుతున్న సహాయక పునరావాస చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకుని ఇంకా గుర్తించని వారి వివరాలను జిల్లాల వారీగా నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

జూలై 10 : సచివాలయంలో "జాతీయ ఆహార భద్రతా బిల్లు", 'రోడ్డు రవాణా సంస్థ' ముఖ్యమంత్రి ఉపాధికల్పనా కార్యక్రమాలపై మంత్రులు, అధికారులతో వేరు వేరుగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ సభ్యులు తదితరులు కలుసుకున్నారు.

జూలై 11 : క్యాంపు కార్యాలయంలో మంత్రులు, శాసనసభ సభ్యులు, అధికారులు, తదితరులు కలుసుకున్నారు. కోర్‌కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్ళారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ శ్రీ దిగ్విజయ్ సింగ్‌తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఢిల్లీలో ఏపీ భవన్ నుంచి ఫోన్ ద్వారా అధికారులతో సమీక్షించారు. అప్రమత్తంగా వుండాలని అధికారులను ఆదేశించారు. రాత్రి ఏపి భవన్‌లో బసచేశారు.

జూలై 12 : కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియాగాంధీతో సమావేశం అయ్యారు. తెలంగాణ అంశంపై చర్చించేందుకు సమావేశమైన కోర్‌కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఏపి భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు శ్రీ బొత్స సత్యనారాయణ సమావేశమయ్యారు. ఏపి భవన్‌లో బసచేశారు.

జూలై 13 : రాష్ట్రపతి శ్రీ ప్రణబ్‌ముఖర్జీతో మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ శ్రీ దిగ్విజయ్‌సింగ్‌తో సమావేశం అయ్యారు. అనంతరం ఇతర కాంగ్రెస్ పెద్దలతో వేరు వేరుగా సమావేశం అయ్యారు. ఆహారభద్రత చట్టంపై శ్రీమతి సోనియాగాంధీ నివాసంలో జరిగిన ముఖ్యమంత్రుల సదస్సులో పాల్గొన్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు.

జూలై 14 : ఇటీవల కురిసిన భారీ వర్షాలు సందర్భంగా చేపట్టిన సహాయక చర్యలపై క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్ మెట్రో రైలు మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్, రైల్వే లింక్స్ ఔటర్ రింగ్ రోడ్డు, 34 రేడియల్ రోడ్డు నిర్మాణం పనులను అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో వివిధ శాఖల ద్వారా 8 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. జిల్లాల కలెక్టర్లు, అటవీశాఖ, మున్సిపాలిటీలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని, రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి పరిధిలో చెరువుల పరిరక్షణ కార్యక్రమంపై క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ముందుగా ప్రతిపాదించిన 108 చెరువుల నుండి 200 చెరువులకు పెంచాలని అధికారులను ఆదేశించారు.

జూలై 15 : ఆస్ట్రేలియన్ రచయిత రచించిన 'మేన్ ఇన్ ద హ్యాట్' పుస్తకాన్ని సచివాలయంలో



ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని పాకిస్థాన్‌లో సామాజిక చైతన్యం, భాగస్వామ్య గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు ఆద్యుడైన షోయబ్ సుల్తాన్‌ఖాన్ జీవిత చరిత్ర ఆధారంగా రచించారు.

జూలై 16 : రాష్ట్ర విద్యార్థులకు జేఈఈ ప్రవేశాల్లో అన్యాయం జరగకుండా చూడాలని కేంద్రమంత్రి పళ్ళంరాజుకు లేఖరాశారు. గ్యాస్ కేటాయింపుల్లో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర

పెట్రోలియం, సహజవాయువు శాఖమంత్రి శ్రీ వీరప్ప మొయిలీని ఫోన్‌లో కోరారు. కాంట్రాక్ట్ లెక్చరర్లను తొలగించకుండానే కొత్త లెక్చరర్ల నియామకం చేపట్టాలని కోరుతూ పీడీఎఫ్ ఎమ్మెల్సీలు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం బెంగుళూరు వెళ్ళారు. రాత్రి అక్కడే బస చేశారు.

జూలై 17 : బెంగుళూరు నుంచి సాయంత్రం హైదరాబాద్ చేరుకున్నారు..

జూలై 18 : భారీ వర్షాలు, వరద పరిస్థితిపై క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల్లో తక్షణమే సహాయ పునరావాస చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులు మరియు భవనాలు శాఖపై సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్యాంపు కార్యాలయంలో అనుమతి పొందిన మంత్రులు అధికారులు తదితరులు కలుసుకున్నారు.

జూలై 19 : రాష్ట్రమంత్రివర్గ సమావేశంపై సచివాలయంలో అధికారులతో సంక్షిప్త సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి అధ్యక్షత వహించారు. రాష్ట్ర సమస్యలపై చర్చించారు. సచివాలయంలో మంత్రులు వేరు వేరుగా కలుసుకున్నారు.

జూలై 20 : భారీ వర్షాలు – విపత్తుల నివారణ చర్యలు, దెబ్బతిన్న ప్రాంతాల్లో అమలు జరుగుతున్న రక్షణ సహాయచర్యలు, ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం వున్నందున యంత్రాంగం సంసిద్ధత గురించి సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మాజీమంత్రి కోటగిరి విద్యాధరరావు మృతికి సంతాపం తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ అఖిలేష్ యాదవ్ కలుసుకున్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ



సందర్భంగా మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలు గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. మన రాష్ట్రంలో అమలు పరుస్తున్న వివిధ పథకాలను ఆయన ప్రశంసించారు.

జూలై 21 : క్యాంపు కార్యాలయంలో మంత్రులు శాసనసభ, శాసనమండలి సభ్యులు అధికారులు తదితరులు వేరువేరుగా సమావేశం అయ్యారు.

– ఎ. మధుసూదనరెడ్డి

నేనూ వత్తాను బిడ్డో సరకారు దవాఖానకి........

ప్రభుత్వం-నిద్ర నటిస్తున్న సింహంలాంటి దంటారు. అంటే అది పూర్తిగా స్పృహలోకి వచ్చి జూలు విదిలిస్తే దాని సహజ శక్తి ముందు ప్రైవేట్ ఆకర్షణలు ఎంత బలంగాఉన్నా బలాదూర్ అవుతాయి. ఇప్పుడు ఆ చైతన్యం రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ప్రూవ్ కావాలా....? అయితే రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లోని ప్రసవాల విభాగాలకెళ్ళి చూడండి. లేదా మా జగిచ్చాల (జగిత్యాల)కు రండి.......



గర్భవతులకు నొప్పులు ప్రారంభమైన క్షణం నుండీ పండంటి బిడ్డను కళ్ళారా చూసుకునేదాకా....అన్నీ అగ్ని పరీక్షలే. మరీ ముఖ్యంగా జిల్లాల్లో, మారుమూల ఊళ్ళల్లో. అడుగుతీసి అడుగేస్తే బిల్లుల మోత మోగించే ప్రైవేట్ ఆసుపత్రుల స్పెషల్ ట్రీట్‌మెంట్‌తో కళ్ళు బైర్లుకమ్మని వారుండరు.

ఇప్పుడు గర్భిణులకోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సర్కారు దవాఖానాలన్నీ కళకళలాడుతున్నాయి. మా జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అయితే మునుపెన్నడూ లేనన్ని ప్రసవాలు సుఖంగా, సవ్యంగా జరిగిపోతున్నాయి. 12 ఏప్రిల్, 2012 నుండి మే, 2013 వరకు 1997 కాన్పులు జరిగితే వాటిలో 459 సహజ కాన్పులే. ఆశ్చర్యపోకండి. ఇదెలా సాధ్యపడిందో చూడండి.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రసవమయితే జననీ సురక్ష పథకం కింద రు.1000లు, జననీ శిశు సంరక్షణ పథకం కింద గర్భిణీకి, ఆమె వెంట వచ్చిన వ్యక్తికి ఉచితంగా భోజనం, ఉచితంగా మందులు ఇస్తున్నారు. నొప్పుల సమాచారం అందిన వెంటనే గర్భిణీని ఆసుపత్రికి తీసుకురావడం, ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇంటివద్ద దిగబెట్టిరావడం అంతా ఉచితంగానే. ఇన్ని వసతులతోబాటూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మలాలన, మార్పు వంటి పలు పథకాలతో అనూహ్యమైన మార్పులు జరిగిపోతున్నాయి. పైగా నొప్పులు వచ్చే సమయంలో ఒక్క ఫోన్‌తో '108' అంబులెన్స్ వచ్చి ఆసుపత్రికి తరలిస్తోంది.

ప్రైవేట్‌లో వేలరూపాయలు కుమ్మరించలేని నిరుపేదలు దీనిని ఒక వరంగా భావిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సహజ ప్రసవాలను ప్రోత్సహించడమే గాకుండా మందులు, ఇతరత్రా సేవలన్నీ ఉచితంగా ఇవ్వడంతో ఇప్పుడు మా

జిల్లాల నుంచి...

ఊళ్ళ నుండీ, బస్తీలనుండీ అందరం ఇటే వస్తున్నామంటున్నారు.....ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన 8నెలల గర్భవతి గంధం భాగ్యలక్ష్మి, వెల్గటూర్ మండలం జగదేవ్ పేట్‌కు చెందిన సయ్యద్ ఫాతిమాలు.

ఇప్పుడు మీరూ ఒప్పుకుంటారుగా పాట రివర్స్ అయి..." నేనూ వత్తాను బిడ్డో సరకారు దవాఖానకి" అని పాడుకునే రోజులొచ్చాయని.

–అబ్దుల్ కలీమ్, జగిత్యాల

సినిమా(య)

చివరి రోజుల్లో...



ప్రతిభావారి 'బాలరాజు' (1948)కి విజయోత్సవాల మీద విజయోత్సవాలు జరుగుతున్నాయి. నాటి చిత్రాల్లో అమితమైన ఆదరణ పొందిన 'బాలరాజు' కొన్ని థియేటర్లలో సంవత్సరం పాటు నడిచింది. ఈ జానపద చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు నాయకుడైతే, మృదు మధురగాయని యస్. వరలక్ష్మి నాయిక. ఆర్ద్రత నిండిన ఆ పాత్రను వరలక్ష్మి నిర్వహించి స్త్రీ ప్రేక్షకుల చేత చీరెకొంగులతో కళ్లు తుడిపించింది.

అక్కినేని, కస్తూరి శివరావులతో పాటు వరలక్ష్మికి అభిమానులు హారతి పట్టారు. వరలక్ష్మి గాన సరస్వతి. గాత్రం అమృత ధారాపాతం. సెలయేరు గలగలలు, చల్లని పిల్లగాలి ఆమె కంఠంలో వినిపిస్తాయి. అందుకే ఆమెను 'ఏస్వర లక్ష్మి' (ముళ్లపూడి వెంకటరమణ) అన్నారు.

ఎప్పుడో 'ఇల్లాలు' (1940)లో పరికిణీ, గౌను వేసుకుని తోటలో పాడిన బసవరాజు అప్పారావు గారి గీతం 'కోయి లొకసారొచ్చి కూసిపోయింది'తో ఆమె సంగీతాభిమానుల్ని ఆకట్టుకుంది.

పిల్లలయినా పెద్దలయినా పాటలు, పద్యాలు పాడగలిగే వాళ్లనే నాటి రోజుల్లో చిత్రాలకు తీసుకునేవారు గనుక, పాడగల వరలక్ష్మి 'బాల యోగిని' (1937)లో బాలనటిగా ప్రవేశించి, నాయికపాత్రలు, వదిన పాత్రలు, అమ్మ పాత్రలూ, అత్త పాత్రలూ అన్నీ ధరించింది. అటు తమిళంలో కూడా ఆమె నటించి పేరు తెచ్చుకుంది. రెండో చిత్రమే తమిళ చిత్రం. 'సేవా సదన్', 'ప్రేమసాగర్' అనే హిందీ చిత్రం మూడోదయితే, అన్ని చిత్రాల్లోనూ బాలనటిగా ఆమె పాటలు పాడింది.

గదిలోనే 'బందీ' అయింది!

'మాయలోకం' (1945) 'పల్నాటి యుద్ధం' చిత్రాల్లో అక్కినేని, ఆమె జంట. వరలక్ష్మి శాస్త్రీయ సంగీతం బాగా అభ్యసించింది. రాజేశ్వరరావుతో గ్రామఫోన్ పాటలు పాడినప్పుడు హిందూస్థానీ నేర్చుకుంది. నాటకాల్లో నటించింది. ముఖ్యంగా 'సక్కుబాయి' నాటకం. వరలక్ష్మి నిర్మాతగా కూడా మారింది. సతీసావిత్రి, వీరభాస్కరుడు, బభ్రువాహన చిత్రాలు తీసిందామె.

సాత్విక పాత్రలు, గయ్యాళి అత్త పాత్రలూ ధరించిన వరలక్ష్మి చిత్రాల్లో మహామంత్రి తిమ్మరుసు, శ్రీకృష్ణార్జున యుద్ధం, ఆస్తులు-అంతస్తులు, జీవితం, విజయావారి హరిశ్చంద్ర, ఉమ్మడి కుటుంబం, శ్రీ వేంకటేశ్వర మహాత్యం-కొన్ని. ఆనాడు 'పల్నాటియుద్ధం'లో పాడిన 'ఈ కుహూరాత్రి' 'బాల రాజు'లో పాడిన 'ఎవరినే నేనెవరినే?' 'ఓ బాల రాజా' 'పతి రూపము నీయవయా,' 'మహామంత్రి తిమ్మరుసు'లో 'లీలాకృష్ణ', 'తిరుమల తిరుపతి వేంకటేశ్వరా' (సుశీలతో) 'వెంకటేశ్వర మహాత్యం'లో 'శ్రీదేవిని నీదు దేవేరిని', 'వరాల చేరమయా' వంటి పాటలు వరలక్ష్మి పాటకు ప్రమాణాలు. 1986లో వచ్చిన 'ముద్దుల కృష్ణయ్య' తర్వాత ఆమె చిత్రాల్లో నటించలేదు.

శారదా స్టూడియో అధినేత, నిర్మాత, పరిశ్రమలో ప్రముఖుడూ అయిన ఎ.ఎల్. శ్రీనివాసన్‌ను వరలక్ష్మి వివాహం చేసుకున్నారు. 50 సంవత్సరాల నటజీవితంలో వరలక్ష్మి తెలుగు, తమిళ చిత్రాలు ఎన్నో చేసింది. పేరు, పెన్నిధి సంపాదించుకుంది. కాని శ్రీనివాసన్ మరణించిన తర్వాత చివరి సంవత్సరాల్లో ఆమె బయటికి ఎక్కడికీ రాలేదు. రాలేకపోవడం కాదు. ఇంట్లో వున్న వాళ్లే రానివ్వలేదు.




ఒకసారి వి.ఎ.కె. రంగారావు, నేనూ ఆమెను చూద్దానికి ఇంటికి వెళ్ళితే మమ్మల్ని రానివ్వలేదు. ఆరోగ్యం సరిగా లేదని చెప్పారు. ఎవర్నీ కలవనిచ్చే వారు కాదు. అలా ఒక కళాకారిణి గదిలోనే బందీగా వుండిపోయింది-మూడు నాలుగేళ్ల పాటు!!

బయటివాళ్లు ఆమెను మతిభ్రమించిందనీ అందుకే రానివ్వరనీ ఏవేవో చెప్పుకునేవారు. ఆరోగ్యం బాగులేక ఆమె రావడం లేదని కొందరు చెప్పుకునేవారు. ఆమె మరణించినప్పుడు గాని, ఆమె పేరు బయటకి రాలేదు.

"సున్నిత మనస్కులైన కళాకారులు స్వేచ్ఛను కోరుకుంటారు. తమలో లీనమై వున్న కళను ప్రపంచానికి పంచాలనీ కోరుకుంటారు. బలవంతాన ఆ కోరికల్ని అణచివేస్తే వాళ్లు చిత్తభ్రమకి లోనుకారా?" అని పరిశ్రమ పరితపించింది.

– రావి కొండలరావు
98480 71175



కథ

ప్రేమంటే

- తటవర్తి రామచంద్రరావు

రవీంద్రని తన గదిలోకి ఆహ్వానించాడు రాధాకృష్ణ.

"మా కార్పొరేట్ బిల్డింగ్‌కి మీ పెయింటింగ్స్ మంచి అందాలు తెచ్చిపెట్టాయి. సుపర్బ్ వర్క్! మీరీడబ్బుతో ఏం చేస్తారు ?"

"మా చెల్లి పెళ్ళికి చేసిన అప్పులు ముందు తీర్చాలి. అమ్మకి వైద్యం చేయించాలి".

"ఊరికినే అడిగాను. మరేమనుకోకండి. సిటీ సెంటర్లో మీరో ఆర్ట్ స్టూడియో తెరిస్తే మంచిది... మీ సందేహం దానికి అద్దెకట్టాలనే కదా ! కృష్ణా సెంటర్లో మేమా మధ్య ఒక ఫ్లోర్‌ని అద్దెకి తీసుకున్నాం. దానిలో మా షోరూం ఉంది. పక్క పోర్షను ఖాళీ. దానికి పార్టిషను పెట్టించి ఆ జాగా మీకు ఫ్రీగా యిస్తాను. మా కంపెనీ ప్రోడక్ట్సు కోసం మా కేలండరుకి పెయింటిగ్స్ వేసిస్తే చాలు. మీకు రాయల్టీగా ఏడాదికి నాల్గు లక్షలు ఇప్పిస్తాను. ఓకే ?".

రవీంద్రకి నోటమాట రాలేదు. కళ్ళల్లోకి నీళ్ళు చింది వచ్చాయి.

నెల రోజులకి రవీంద్ర ఆర్ట్ స్టూడియో ఏర్పాటయింది.

పత్రికల్లో ప్రకటనలు వచ్చాయి. ప్రముఖుల కి ఆహ్వానాలు వెళ్ళాయి. ఓ పుర ప్రముఖుని చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. టీవీలో ప్రసారం జరిగింది. పత్రికల్లో మంచి రివ్యూలు వచ్చాయి. సందర్శకులు పెరిగారు. వారం పాటు జరిగిన ఆ ప్రదర్శనలో పది పెయింటింగ్స్ అమ్ముడయ్యాయి. నాలుగు కంపెనీల నుంచి కొత్త ఆర్డర్లు వచ్చాయి. ఖర్చులు పోను రవీంద్రకి ఎనిమిది లక్షలు మిగిలాయి. దీనికంతకీ రాధాకృష్ణ హస్తం అండగా ఉంది.

ఎనిమిదవ రోజు సాయింత్రం కాసేపు విశ్రాంతిగా కుర్చీలో వాలి కళ్ళు మూసుకున్నాడు రవీంద్ర... ఏడెనిమిదేళ్ళ పాటు ఇల్లు గడవటం కష్టమై సినిమా పోస్టర్లు వేసేవాడు. రాధాకృష్ణతో పరిచయమైన నాల్గునెలల్లో తన జీవితం ఎంతగా మారి పోయింది ! ఒక్కసారిగా గతమంతా సినిమా రీలులా బుర్రలో తిరిగింది.

గుమ్మంలో అలికిడైౖ కళ్ళు తెరిచాడు. మందహాసంతో రాధాకృష్ణ !

రవీంద్ర భుజంపై చేయివేసి ముందుకి నడిచాడు. ఒక్కొక్క చిత్రం దగ్గర ఆగి తదేకంగా చూశాడు. మధ్య మధ్య అతను విశ్లేషిస్తూంటే వింటూ పరవశించి పోయాడు రవీంద్ర. అతని ఆఫీసు గది పక్కన స్టాండుపై తెల్లని తెరని చూసి "ఇదేమిటి? కొత్తగా మొదలు పెట్టారా ?" అని అడిగాడు రాధాకృష్ణ.

"లేదండి, పాతదే ! వేసి చాలా కాలమైంది. ఒకసారి టచ్ చేద్దామని...."

"చూడచ్చా?"

ఎందుకో ఇబ్బందిగా నవ్వి తనే తెరనెత్తాడు



రవీంద్ర. దుష్యంతుడి మనస్సును ఆకర్షించిన శకుంతల !

"ఎంత సజీవంగా ఉంది !.... మనం ఆ వనంలో నిలబడి ఓ చెట్టు చాటు నుంచి చూస్తూన్న ఫీలింగ్. ఫెంటాస్టిక్ త్రీడయమెన్షనల్ ఎఫెక్ట్ !"

బిడియంగా నవ్వాడు రవీంద్ర.

"మీ చిత్రాల్లోని స్త్రీలంతా ఒకే పోలిక. అందులో శకుంతల మరీను. మీరు ప్రేమించిన స్త్రీ ముఖానికి ప్రతిబింబాలా ఇవి ?".

అతను ఇబ్బందిగా చూశాడు. . . "అదేం లేదండి".

"గుచ్చి గుచ్చి మీ స్వవిషయాలు అగడటం నాకు భావ్యం కాదు"

"అబ్బే, అదేం లేదండి. నాకున్నది అమ్మ, చెల్లి.... అంతే ?"

"ఈ చిత్రాన్ని ఆ వేళ ఎగ్జిబిషన్లో ఎందుకు పెట్టలేదు ?"

"బాగా పాతబడినట్టుంటేను" అని నసిగాడు.

"మంచిది. దీన్ని ఫినిషింగ్ చేసి నాకివ్వండి"

రవీంద్ర తెల్లబోయాడు "మీకా ? ఇంత పాత చిత్రమెందుకండి ! కొత్తది ఇంకొకటి వేసిస్తాను".


"అహ ! ఈ చిత్రానికీ, నా జీవితానికీ చాలా సంబంధం ముంది !"

అర్థంకానట్టు చూశాడు రవీంద్ర.

"చెప్తాను..." అంటూ తన కథని చెప్ప సాగాడు రాధాకృష్ణ.

అతని భార్య అద్భుత సౌందర్యవతి. అసమాన నృత్యకారిణి. ఒక సంగీత నృత్య నాటికలో శకుంతల రూపంలో చూసి ఆమెను ఇష్టపడ్డాడు. తనంతట తాను వాళ్ళన్నయ్యను అడిగి సంబంధం కలుపుకున్నాడు.

మొదటి రాత్రి తమకంగా ఆమెను దగ్గరకి తీసుకోబోయాడు. ఆమె వెనకడుగు వేసింది. "మీకో సంగతి చెప్పాలి" అంటూ. అప్పటికే అతను ఆమె చేయి పట్టుకుని పరి హాసంగా దగ్గరకి లాక్కోబోయాడు. ఆమె అతని చేతుల్ని విడిపించుకుని తన ముఖాన్ని



తన చేతులతో కప్పుకుని ఏడవ సాగింది. అతను కంగారు పడి ఏం జరిగిందని అనునయించాడు. తాను అతని ప్రేమకి తగనంది. తాను ఇదివరకే మరొకరికి మనసిచ్చానంది. ఈ సంగతి పెళ్ళికి ముందే చెప్పనందుకు తనను క్షమించమంది. తను మనసిచ్చినవాడు అర్థాంతరంగా తనని కాదని వెళ్ళిపోయాడంది. తను నిస్పృహలో మతి పోగొట్టుకున్నానంది. తన అన్నగారి మాట కాదన లేక ఈ పెళ్ళి చేసుకున్నానంది. కాని, తనపై అతను చూపిస్తున్న అనురాగం, ఆప్యాయత తన అపరాధ భావాన్ని పెంచుతున్నాయంది. లేని ప్రేమను నటిస్తూ అతన్ని వంచించలేక పోయానంది. నిజం చెప్పి, అతను ఏ శిక్ష విధించినా భరిస్తానంది.

వివాహ బంధానికి కావల్సింది ఒకరిపై ఇంకొకరికి నమ్మకం. తన మీద ఎంత విశ్వాసం లేకపోతే తనతో తొలిరాత్రి నాడు తన ప్రేమ కథని చెపుతుంది ఆమె ! ఆ నిష్కల్మష హృదయినిని ఎవరు ప్రేమించకుండా ఉండగలరు !

ఆమె కళ్ళల్లో నీళ్ళు చూడలేకపోయాను. ఆమె మనస్సులోని మధురానుభూతుల్ని తుడిచేసే హక్కు తనకు లేదు. ఎవరి ప్రేమ వారికి ఎక్కువ. కావాలన్నా ఆమె ప్రియుడ్ని తానిప్పుడు తెచ్చివ్వ గలనా?... చివర్లో ఈ ప్రశ్న వేశాడు రాధాకృష్ణ.

“మీది చాలా గొప్ప మనసు సర్ !” అన్నాడు రవీంద్ర.

“మా పెళ్ళయ్యాక ఆమెకు ఎన్నో అవకాశాలు వచ్చాయి. ఒక్క ప్రదర్శనకి కూడా ఆమె ఒప్పుకోలేదు. నా మూలంగా ఆమె నృత్య కళకి దూరం కావటం నేను భరించలేక పోతున్నాను. మళ్ళీ ఆమె స్టేజి ఎక్కాలి. దానికి ఈ చిత్రం స్ఫూర్తిని ఇస్తుందని నా ఆశ. మీరెంత ధర చెప్పినా సంతోషంగా ఇస్తాను...”

*****

రాధాకృష్ణ పెయింటింగ్‌ని తీసుకు వెళ్ళిన మర్నాడు సాయంత్రం గది బయట కూర్చుని తన స్టూడియోనంతా కలయచూశాడు రవీంద్ర. ఇన్నాళ్ళుగా శకుంతల చిత్రం అలంకరించిన స్టాండు బోసిగా ఉంది. గ్యాలరీ నిండా అనేక చిత్రాలున్నాయి. కాని, ఏమిటో స్టూడియో అంతటా శూన్యమనిపిస్తోంది. తన ప్రియమైన వస్తువుని పోగొట్టుకున్న బాధ గుండెల్లో సుడులు తిరిగింది.

సరిగ్గా అప్పుడే గుమ్మంలో “సార్ !” అన్న తెలిసిన గొంతు వినిపించింది. రాధాకృష్ణ డ్రైవరు.

“అయ్యగారు వచ్చారా ?” అన్నాడు ఉత్సాహంగా పైకి లేస్తూ.

“లేదండి. అమ్మగారు వచ్చారు” అంటూ పక్కకి

తప్పుకున్నాడు.

ఆమె లోపలకి వచ్చింది.

రవీంద్ర నిర్ఘాంత పోయాడు.

డ్రైవర్ని క్రింద ఉండమని చెప్పి అతనికి దగ్గరగా వచ్చిందామె.

"నేనిలా వస్తానని నువ్వెప్పుడూ ఊహించలేదు కదూ !"

అతను శిలా ప్రతిమలా నిలబడి పోయాడు.

"ఆయన చెప్పారు.... ఒక గొప్ప పెయింటర్‌వని. ఇప్పుడు నీ బిజినెస్ బావుందని. నీ చేత నా పెయింటింగ్ ఒకటి వేయించాలని ఆయన ఆరాట పడ్డారు. కాని, ఒకప్పుడు నన్ను నెల రోజులపాటు నీకు దగ్గరగా కూర్చో బెట్టుకుని వేసిన పెయింటింగ్ అదేనని ఆయనకేంతెలుసును ! దాన్ని ఆయన తెచ్చినప్పుడే అనుకున్నా ఇక్కడున్నది నువ్వేనని ! నన్ను వదిలేశావు. మంచిది. నీ అభివృద్ధికి అడ్డువచ్చే వాటిని వదలించుకోవటంలో తప్పులేదులే !..."

"ఇంకేం చెప్పకు" అంటూ తలపట్టుకుని కుర్చీలో కూలబడ్డాడతను.

"నా ప్రేమని ఎందుకు కాదన్నావని అడగను రవీ ! నీ జ్ఞాపకాలతో గుట్టుగా బ్రతుకుతున్న నా గుండెల్లో చిచ్చుపెట్టటానికా నువ్వా చిత్రాన్ని ఆయనకి ఇచ్చింది !"

''లేదు లలితా ! లేదు. నువ్వు ఆయన భార్యవని నిజంగా నాకు తెలియదు. నీలోని కళా కారిణికి మళ్ళీ ప్రాణం పోయాలని ఆయన ఆరాట పడితే సదుద్దేశంతోనే ఇచ్చాను. నువ్వు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం !"

"అది ఇంట్లో ఉండగా ఆయన కోరిక తీర్చలేను. వెనక్కి తీసుకుపో !"

"ఎలా ? ఒకరికి అభిమానంతో ఇచ్చింది తిరిగి వెనక్కి ఎలా తీసుకోగలం ?"

''ఆయన మంచితనం సంపాదించి చక్కని స్టూడియో పెట్టుకున్న సమర్థుడివి. నువ్వు లేక నేను బ్రతకలేనని నాతో చెప్పి మరో ఆడదాని మెళ్ళో మాంగల్యం కట్టగలిగిన ధీమంతుడివి".

రవీంద్ర వెర్రి నవ్వు నవ్వాడు.

"నిన్ను కోడలిగా చేసుకోవాలని కలలుకన్న అమ్మ నా చేత మరో పిల్ల మెళ్ళో మంగళసూత్రం ఎలా కట్ట నిస్తుందనుకున్నావు లలితా ?"

ఒక్కసారిగా కుర్చీలో కూలబడి పోయిందామె.

"అలాగని మీ అన్నయ్య చెప్పారా !"

ఆమె పిచ్చిదానిలా తల పంకించింది.

''స్కూటరు ఏక్సిడెంటయి నేను పదిహేను రోజులు హాస్పటల్లో స్పృహ తప్పి పడి వున్న విషయాన్ని ఆయన నీతో చెప్పలేదు. మా చెల్లాయి మీ వదినకి ఫోన్ చేసిందన్న విషయం నీకు తెలియనే తెలియదు. తర్వాత మీ అన్నయ్యే స్వయంగా మా యింటికి వచ్చి నీ పెళ్ళి శుభలేఖ ఇచ్చారు. అప్పుడు నేనేం చేయాలి ! నీ కాబోయే భర్తకి నిజం చెప్పి నాకు అన్యాయం చేయవద్దని అర్థించనా ? మీ అన్నయ్య గారు పెద్ద ఎత్తుగా చేస్తున్న నీ పెళ్ళి ప్రయత్నాలు చెడగొట్టనా ? అసలు నువ్వెలా మనసు మార్చుకుని ఈ పెళ్ళికి సిద్ధపడ్డావని నిన్ను నిలవెయ్యనా ! ఏం చేయను ? ఎవరినీ ఇబ్బంది పెట్టలేకనే నిశ్శబ్దంగా దూరంగా వెళ్ళిపోయాను''.

"అన్నయ్య ఎంత ఘోరం చేశాడు !'' అంది ఆమె కంపిత కంఠంతో.

"లేదు లలితా ! తన చెల్లెలి ఉజ్వల భవిష్యత్తు కోరే అందరి అన్నల్లాగానే ఆయన చేశారు. నువ్వు కూడా ఓ మంచి ఉద్యోగం చూసుకుని జీవితంలో స్థిరపడు... అని నాతో అన్నారే కాని ఆయన నన్నేమి కించపరచలేదు".

''కాని, నాకు మోసాలు తెలియవు. నేను ఆయనకి మొదటి రాత్రే నిజం చెప్పేశాను".

"అవును. ఆ సంగతి రాధాకృష్ణ నాకు చెప్పారు"

లలిత నిర్ఘాంతపోయింది. "ఓ గాడ్ ! ఇంకా ఏమని చెప్పారు ?"

తమ మధ్య జరిగిన సంభాషణని పూసగుచ్చి నట్టు చెప్పుకు వచ్చాడు.

''మళ్ళీ తన భార్య స్టేజి ఎక్కాలి. నృత్యం చేయాలి. దాని కోసమే ఆయన తపన అంతా !"

"ఇంతదాకా వచ్చాక ఇంక దాచేదేముంది ? ఆ ప్రేమికులం మనమేనని ఆయనకి నిజం చెప్పేద్దాం".

*****

గుమ్మంలో నిలబడి ఎదురు చూస్తున్న లలిత దగ్గరకి వచ్చాడు రాధాకృష్ణ.

''డ్రైవర్ని పంపావు కదా ! ఎందుకు అంత కంగారు ! కాసేపట్లో అతను వస్తాడు. వచ్చి కూర్చో !" అని చిరునవ్వు నవ్వాడు.

ఆమె సిగ్గు పడింది. ఇక అక్కడ నిలబడటం బాగుండదని వచ్చి కూర్చుంది. ఆమెకు నిమిషాలు గంటల్లా గడుస్తున్నాయి.

కాసేపటికి కారువచ్చి పోర్టికోలో ఆగింది.

"రవీంద్ర రాలేదేం ?" అని అడిగాడు రాధాకృష్ణ.

"ఈ ఉత్తరం ఇచ్చారు సార్ !" అన్నాడు డ్రైవరు.

కవరు మీద లలిత పేరుంది. రాధాకృష్ణ దాన్ని ఆమెకు అందించాడు. వణికే వేళ్ళతో కవర్ని చించి చదవ సాగింది ఆమె.

"లలితా !

'వివాహ బంధానికి కావల్సింది ఒకరిపై ఇంకొకరికి నమ్మకం. నా మీద ఎంత విశ్వాసం లేకపోతే నాతో తన ప్రేమ కథ గురించి చెపుతుంది ఆమె. అటువంటి నిష్కల్మష హృదయినిని ఎవరు ప్రేమించకుండ ఉండగలరు ?' అన్నారు రాధాకృష్ణ.

'ఆయన ఎంతో మంచివారు. ఆయన మన ప్రేమని ఎన్నటికీ కాదనరు' అన్నావు నువ్వు. కాని, ఆయనది కేవలం మంచితనం కాదు లలితా ! మహోన్నత వ్యక్తిత్వం ఎంత గొప్ప సంస్కారి కాకపోతే తన భార్య ప్రేమించిన వ్యక్తిని ఆమె దగ్గరకు తీసుకురావాలనుకుంటారు.

మనం చాలా చిన్నవాళ్ళం. మన ప్రేమ భావావేశ పూరితమేకాని దానికి పరిపూర్ణత లేదు. నీ నృత్యాన్ని చూస్తూ నేను, నా చిత్రాల్ని చూస్తూ నువ్వు ఉద్దీపన చెందుతాం. పరవశించి పోతాం. మన ప్రేమలో ఒకర్ని ఇంకొకరు పొందాలన్న కోరిక ఉంది. స్వార్థం ఉంది. మన ప్రపంచమంతా మన ప్రేమ చుట్టూనే తిరుగుతుంది.

కాని, ఆయన అలా కాదు. ఆయనది కళాహృదయమే కాదు, ప్రేమామృత హృదయం. ఆయన ప్రేమ అణువణువులోనూ ఉంది. ప్రేమించిన వ్యక్తి కోరిక తీర్చటం కోసం తన సర్వస్వం అర్పించే త్యాగ గుణముంది.

మనం ఒకరికొకరం తెలుసనన్న విషయం ఆయనకి తెలియదనుకున్నాం. మన సంగతి తెలుసుకున్నాకనే నన్నాయన వెదకి వెదకి పట్టుకున్నారు. మన ఎడబాటుకి కారణం ఆర్థిక అసమానత అని ఆయన గ్రహించారు. అందుకనే, ముందు నాకో అస్థిత్వం కలగజేయటానికి పాటు పడ్డారు. సొసైటీలో నాకో పేరు తెచ్చిపెట్టారు. ఒకసారి నేను ఆర్థికంగా నిలదొక్కుకున్నాక నిన్ను నా దగ్గరకి చేర్చాలనుకున్నారు.

నువ్వు గ్రహించలేదు కాని.... నా స్టూడియోకి నువ్వు రావాలనే, నన్ను కలవాలనే నేను వేసిన నీ చిత్రాన్ని ఆయన అడిగి తీసుకు వెళ్ళారు. ఆయన ఏం చేసినా మన ప్రేమ ఫలించాలనే !

కాని, అటువంటి మహోన్నత వ్యక్తి ప్రేమాధిక్యత ముందు నాదీ ఒక ప్రేమేనా అని నాకనిపిస్తోంది.

ఆయన ప్రేమ ముందు నా ప్రేమ కేవలం సూర్య కాంతి ముందు చిన్నదీపం వెలుగు !


నువ్వు ఏ జన్మలోనో బంగారు పూలతో దైవాన్ని పూజించావు. నీకు అలాంటి ప్రేమమూర్తి మనసులో స్థానం దొరికింది. మీది పవిత్ర వివాహబంధం కావాలని ఆ దేవతలే కాదు.... ఇప్పుడు నేను కూడా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఎందుకంటే, ప్రేమంటే ఏమిటో తెలుసుకున్నా కనుక.

తనకున్నది సర్వస్వం త్యాగం చేయగలగటంలోని పరిపక్వతే ప్రేమకి సార్థకత !

ఆ పరిపూర్ణ పురుషుని ప్రేమని స్వీకరించు. ఆస్వాదించు. ఆనందించు.

ఎల్లప్పుడూ
నీ శ్రేయోభిలాషి
– రవీంద్ర

☆



అమ్మో... టీచరమ్మ

గణ గణ బడిగంట మ్రోగింది. బిలబిలమంటూ పిల్లలందరూ లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్ తీసుకొని బయటకు వచ్చారు. స్కూల్ గ్రౌండ్‌లో అన్నీ పచ్చని చెట్లు... పెద్ద పెద్ద వృక్షాలు. ఆ బడిలో పిల్లలు ఆడుకోవడం అక్కడే. మధ్యాహ్నం భోజనాలు అక్కడే. పిల్లలంతా నవ్వుకుంటూ, అరుస్తూ, ఒకరి కొకరు పోటీపడుతూ చెట్ల కిందకు చేరారు. లంచ్ బాక్సులు, వాటర్ బాటిల్స్ ఎదురుగా పెట్టుకున్నారు. కొందరు వాటర్ బాటిల్స్‌లో నీళ్లతో అక్కడే చేతులు కడుక్కున్నారు.

'నీ లంచ్‌బాక్స్‌లో ఏం తెచ్చుకున్నావ్? మీ మమ్మీ ఏం చేసిందే? చూడు నేను ఇవాళ స్వీట్స్ కూడా తీసుకువచ్చాను' అని మాట్లాడుకుంటూ లంచ్ బాక్స్‌లన్నీ తెరుస్తూ వుంటే, చెట్లమీద వున్న పక్షులన్నీ కిలకిలా రావాలతో... పిల్లల చుట్టూ తిరగడం ప్రారంభించాయి. కొన్ని పక్షులు తమకు రోజూ అన్నం పెట్టే పిల్లల్ని వెతుక్కుంటూ వాళ్ళ దగ్గరకు చేరుకున్నాయి.

పిల్లలందరూ భోజనాలు చెయ్యడం ప్రారంభించారు. కానీ, లంచ్‌బాక్స్ తీసి, తినకుండా దాని ఎదురుగా కూర్చుంది... వెక్కి వెక్కి ఏడుస్తోంది... ఎవరికీ వినిపించకుండా ఎవరూ చూడకుండా వుండాలని ముఖం దాచుకుంటోంది – మూడో క్లాసు చదువుతున్న మల్లిక.

పిల్లలంతా సందడిగా వున్నారు. ఎవరి కబుర్లు వారివే! ఎవరి గోల వాళ్ళదే! కానీ ఆయా మాత్రం మల్లిక కళ్ళలో నీళ్లు చూసేసింది. మెల్లగా మల్లిక దగ్గరకు వచ్చి కూర్చుంది.

"ఏంటమ్మా, టీచర్ కొట్టిందా" అని మల్లికకు మాత్రమే వినిపించేలా అడిగింది.

మల్లిక "అవును" అని చెప్పింది.

"నేను టీచరమ్మని అడుగుతాలే! నువ్వు అన్నంతిను" అంది ఆయా.

మల్లిక అన్నం తినడానికి ప్రయత్నించింది! చెయ్యి వణికి పోతోంది. "మంటగా వుంది" అంటూ చెయ్యి చూపించింది..

'వామ్మో.. పాప అరచెయ్యి ఎర్రగా వాచిపోయింది' అది చూడగానే ఆయా మనసు గిలగిలలాడిపోయింది.

"కొత్త టీచరమ్మ కొట్టింది" అంటూ చెప్పింది మల్లిక.

'దాని చేతులు పడిపోనూ..' అని తనలో తనే గొణుక్కుంటూ "నేను తినిపిస్తామ్మా.. తిను" అంటూ మల్లికకు ఆయా అన్నం తినిపించింది.

అంతలో ఆయాకు మల్లిక అక్క గుర్తుకువచ్చింది. మల్లిక అక్క నాలుగో క్లాసు. అదే స్కూలు. రోజూ మల్లిక చెయ్యి పట్టుకొని నడిపిస్తూ... మల్లికను గారంగా చూసుకుంటుంది అక్క మంజరి.

"అక్క ఇవాళ బడికి రాలేదా?" అని అడిగింది ఆయా.

"వచ్చింది! అక్కని కూడా కొట్టి స్టోర్ రూమ్‌లో పెట్టితాళం వేసింది టీచరమ్మ" అని ఏడుస్తూ చెప్పింది మల్లిక.

"అయ్యో! నేను చూస్తాలే..." అని చెప్పింది ఆయా.

మల్లికకు అన్నం తినిపించి... మిగతా చిన్న పిల్లలందర్నీ ఓ సారి పలకరించి "లంచ్ చేసిన వాళ్ళు క్లాసులకు వెళ్లండి.. బాక్సులు, నేను కడిగి పెడతాను" అంటూ వెళ్ళిపోయింది ఆయా.

పిల్లలందరూ క్లాసు రూమ్‌లలోకి చేరుకున్నారు. అంతలో అంబులెన్స్ కూతలు.. ఆ వెనుక పోలీస్ జీప్ సైరన్‌లు వినిపించాయి. స్కూలు గేటు హడావుడిగా తీశాడు వాచ్‌మాన్. అంబులెన్స్, పోలీస్ జీప్ రయ్యిమంటూ లోపలికి దూసుకువచ్చాయి. స్కూల్లో వున్న వాళ్ళంతా భయపడిపోయారు. పిల్లలు, టీచర్లు, హెడ్‌మిస్‌తో సహా అందరూ బయటకు వచ్చేశారు.

పోలీసులు "మూడోక్లాస్ రూమ్... ఎక్కడ?" అని అడుగుతూ మూడోక్లాస్ రూమ్‌లోకి వెళ్ళి పిల్లలందర్నీ "మీమీ అరచేతులు చూపించండి" అన్నారు.

పిల్లలందరూ తమ అరచేతులు చూపించారు. క్లాసులో సగం మందికిపైగా పిల్లల అరచేతులు ఎర్రగా వాచిపోయివున్నాయి. పోలీసులు మూడో క్లాసు టీచరమ్మని "రండి మేడం... రండి.." అంటూ పిలుచుకువెళ్ళారు.

అంతలో హెడ్‌మిస్ గట్టిగా అరుస్తోంది. "ఎవరు మీరు? నా పర్మిషన్ లేకుండా ఎలా వచ్చారు? ఎవరు పిలిచారు మిమ్మల్ని..." అంటూ అరిచింది. ఆమె అరుపులకు పిల్లలు భయపడి పోతున్నారు కానీ – పోలీసులు కొంచెం కూడా భయపడలేదు.



అంతలో అంబులెన్స్ వాళ్ళు... స్టోర్ రూమ్ తలుపు పగలగొట్టి, తెలివితప్పి వున్న మల్లిక అక్కయ్యని ఎత్తుకొని తీసుకు వచ్చారు.

"మంజరి నా క్లాసు స్టూడెంట్. స్టోర్‌రూమ్‌కి ఎందుకు వెళ్ళింది" అంటోంది నాలుగో క్లాసు టీచరమ్మ. "మంజరీ... మంజరీ" అంటూ పిల్లలంతా ఏడుస్తూ వచ్చేశారు.

"పాపకి ఏం కాలేదు! స్టోర్‌రూంలో ఊపిరి ఆడక పడిపోయింది" అంటూ చెప్పారు అంబులెన్స్ వాళ్ళు.

ముఖం మీద నీళ్ళు జల్లి.. మంచి నీళ్ళు తాగించగానే మంజరికి తెలివివచ్చింది. అంబులెన్స్ వాళ్ళు హెడ్‌మిస్ దగ్గర కాగితాల మీద సంతకాలు చేయించుకుని వెళ్ళిపోయారు.

పోలీసులు మాత్రం మల్లిక వాళ్ళ టీచరమ్మని వదల్లేదు. జీప్‌లో ఎక్కించుకొని తీసుకుపోయారు. వెళ్తూ వెళ్తూ "మీరు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి.. సంతకం చెయ్యాలి" అంటూ హెడ్‌మిస్‌కు చెప్పి వెళ్ళారు.

"ఛీ...ఛీ... స్కూలు పరువు పోయింది. ఈ పోలీసులకి.. అంబులెన్స్ వాళ్ళకి రిపోర్టు ఎవరిచ్చారు? కనుక్కో! వాళ్లని అడ్డంగా నరికేస్తా..." అంటూ అరిచింది హెడ్ టీచరమ్మ.

'జీతాలు తక్కువ అని ఎవర్ని బడితే వాళ్ళకి టీచర్ ఉద్యోగాలు ఇస్తే ఇంతే మరి' అని తనలో తనే గొణుక్కున్నాడు వాచ్‌మన్.

ఆ తర్వాత–ఆయా మాత్రం స్కూలుకి రాలేదు. ఏమయిందో ఏమో, ఆయా కోసం.. మల్లిక మాత్రమే కాదు పిల్లలంతా ఎదురుచూసే వారు రోజూ...!

– గీతా సుబ్బారావు

ఉ౮



బ్రహ్మ ప్రకాష్

బ్రహ్మప్రకాష్‌ను మనదేశపు అణు పదార్థాలకు మూల పురుషుడిగా పరిగణించాలి. హోమీ జహంగీర్ భాభా ఆశించిన అణు భారతం సవ్యంగా సాకారం కావడానికి దోహదం చేసిన వ్యక్తి కూడా ఆయనే. అంతేకాదు, మన దేశంలో అంతరిక్ష పరిశోధన బాగా నెలకొనడానికి తోడ్పడిన వ్యక్తి! జిర్కోనియం, హాఫ్నియం వేరు చేయడంలో ఆయన సాధించిన సైన్స్ విజయం గొప్పది.

అందువల్లనే న్యూక్లియర్ ఇంధనాన్ని మనం సులువుగా తయారు చేసుకోగలిగాం. హైదరాబాదులో న్యూక్లియర్ కాంప్లెక్స్ నిర్మాణంలో ఆయన ప్రధాన సూత్రధారి, పాత్రధారి. యూరేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తొలి ఛైర్మన్. విక్రం సారాభాయి కలలు గన్న అంతరిక్ష భారతాన్ని సైతం సాకారం చేయడానికి దోహదపడిన వ్యక్తి కూడా ఆయనే . అంతకు మించి ఉపగ్రహాలను నిర్మించడంలో, ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించిందీ ఆయనే. అంతేకాదు మన దేశపు లోహ సంగ్రహణ శాస్త్రం, ఆ విద్య పెంపొందడానికి శ్రమించిన మేధావి... ఇలా చాలా చెప్పుకోవచ్చు బ్రహ్మ ప్రకాష్ గురించి. శాస్త్రవేత్తల లోకంలో గొప్పయోగివంటి బ్రహ్మప్రకాష్ అని అబ్దుల్ కలాం పేర్కొంటారు.

అణు పదార్థాల 'బ్రహ్మ' !

